Dwaraka

సోమవారం
22•1•2018
హైదరాబాద్
• వెల.5 రూ.
• సంపుటి 7 • సంచిక 225
• పేజీలు : 16 + (20/16)

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM HYDERABAD I KARIMNAGAR I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD

ఆప్ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు

లాభదాయక పదవుల్లోని 20 మందిపై.. ఈసీ సిఫార్సును ఆమోదించిన రాష్ట్రపతి

మా ప్రభుత్వాన్ని అన్నిరకాలుగా వేధిస్తున్నారు : ఢిల్లీ సీఎం కేజ్రీవాల్

ఆ ఎమ్మెల్యేల నుంచి ప్రజాధనాన్ని రికవరీ చేయాలి : బీజేపీ

న్యూఢిల్లీ, జనవరి 21: ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన 20మంది ఎమ్మెల్యేలు అనర్హుల య్యారు. లాభదాయక పదవుల వ్యవహారంలో వారిపై చర్యలు తీసుకోవాల్సిందిగా ఎన్నికల సంఘం చేసిన సిఫార్సును రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆదివారం ఆమోదించారు. ఈ మేరకు ఢిల్లీ రాష్ట్ర అసెంబ్లీలో 20మంది శాసనసభ్యులను అనర్హులుగా ప్రకటిస్తూ రాష్ట్రపతి అంగీకారంతో కూడిన నోటిఫికేషన్‌ను న్యాయశాఖ విడుదల చేసింది. దీంతో ఖాళీ అయిన 20 శాసనసభ స్థానాల్లో ఉపఎన్నికలు అనివార్యం కానున్నాయి. 70 స్థానాలున్న ఢిల్లీ అసెంబ్లీలో ఆప్‌కు 65మంది సభ్యుల బలం ఉండగా రాష్ట్రపతి నిర్ణయం తర్వాత

మిగతా 5వ పేజీలో


రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్


ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్

కొత్త సీఈసీగా రావత్

రేపటి నుంచి ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా బాధ్యతల్లోకి

ఎన్నికల కమిషనర్‌గా ఆర్థిక మంత్రిత్వశాఖ మాజీ కార్యదర్శి అశోక్ లావాసా నియామకం

5


ఓంప్రకాశ్ రావత్

• పట్నం కథల్లో పరవశం



సిద్దిపేట జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కొమురవెల్లి శ్రీమల్లికార్జున స్వామి క్షేత్రం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. పట్నం వారం ప్రారంభం కావడంతో హైదరాబాద్ నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. లక్ష మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారు. శనివారం సాయంత్రం నుంచే కొమురవెల్లికి చేరుకున్న భక్తులు ఆదివారం స్వామివారిని దర్శించుకోవడంతోపాటు అభిషేకాలు, అర్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

3

పరిశ్రమల కళ!

అద్భుత ఫలితాలను సాధిస్తున్న తెలంగాణ పారిశ్రామిక విధానం

తరలివస్తున్న పెట్టుబడులు.. ఊపందుకుంటున్న ఉపాధి

రెండున్నరేండ్లలోనే కానవస్తున్న ఫలితాలు

ఆన్‌లైన్‌లోనే అనుమతులన్నీ.. ప్రధాని ప్రశంసలు పొందిన పథకం


ఫలిస్తున్న సీఎం కేసీఆర్ కృషి.. మంత్రి కేటీఆర్ పర్యవేక్షణ

నెలకుర్తి శ్రీనివాస్‌రెడ్డి, హైదరాబాద్, నమస్తే తెలంగాణ ప్రతినిధి

టీఎస్ఐపాస్.. దేశ పారిశ్రామికరంగంలో ఒక విప్లవం. ప్రపంచ పారిశ్రామికవేత్తల ప్రశంసలు అందుకున్న నూతన పారిశ్రామిక విధానం. ఒకనాడు వందలు, వేల కోట్లు పెట్టుబడి పెడుదామని ముందుకొచ్చినా.. అనుమతుల కోసం కార్యాలయాల చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగాల్సిన పరిస్థితి. తెలంగాణ రాష్ట్రంలో అద్భుత మార్పు.. ఇప్పుడు ఇక్కడ ఏ ప్రభుత్వ కార్యాలయాన్నీ, ఏ అధికారినీ సంప్రదించాల్సిన అవసరం లేదు. అన్నీ సజావుగా ఉంటే 15 రోజుల్లోనే అనుమతులొచ్చేస్తున్నాయి. ఇంతటి సులభ విధానాన్ని చూసి ప్రపంచదేశాల్లోని పారిశ్రామికవేత్తలు ఆశ్చర్యపోతున్నారు. సాదరంగా స్వాగతిస్తున్న ప్రభుత్వ తీరుకు సానుకూలంగా స్పందిస్తున్నారు. టీఎస్ఐపాస్ (తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ ప్రాజెక్టు అప్రూవల్ అండ్ సెల్ఫ్ సర్టిఫికేషన్ సిస్టం) పేరు ప్రపంచ పారిశ్రామిక రంగంలో బెంచ్‌మార్క్‌గా నిలిచిపోనుంది. 2015 జూన్ 12న ఆవిష్కరించిన టీఎస్ఐపాస్ రాష్ట్ర పారిశ్రామికరంగంలో అద్భుతాలను సృష్టిస్తున్నది. పుట్టినరోజు సర్టిఫికెట్ సైతం ఇంత తక్కువ సమయంలో రాదని.. కానీ పరిశ్రమలకు

మిగతా 12వ పేజీలో

• జయహో.. ఐపాస్



గుడి భూములకూ రక్ష

సత్ఫలితాలిస్తున్న భూరికార్డుల ప్రక్షాళన కార్యక్రమం

ఖమ్మం జిల్లాలో రూ.28కోట్ల విలువజేసే 136 ఎకరాల ఆలయభూములు స్వాధీనం

బోనకల్లు:

భూరికార్డుల ప్రక్షాళన.. దశాబ్దాలుగా యథేచ్ఛగా సాగిన అక్రమాలకు అడ్డుకట్ట వేసి పకడ్బందీ నిర్వహణకు తలపెట్టిన మహా ప్రణాళిక. ఈ భారీ కార్యక్రమం అమలులో ఆశ్చర్యం కలిగించే రీతిలో సత్ఫలితాలను సాధిస్తున్నది. అక్రమార్కులకు దడ పుట్టిస్తూ బాధితులకు ఊరట కలిగిస్తున్నది. అందులో భాగంగానే.. పాపభీతి లేకుండా గుడినీ, గుడిలో లింగాలనూ మింగే అపర భూబకాసురుల ఆటకట్టిస్తున్నది. ఇందుకు ఓ దృష్టాంతం.. ఖమ్మం జిల్లాలో యాభయ్యేండ్లుగా ఆక్రమణకు గురయిన ఆలయ భూముల స్వాధీనం. రూ. 28కోట్ల విలువజేసే 136 ఎకరాల భూమి కబ్జాదారుల చెర వీడింది. ఖమ్మం జిల్లా బోనకల్లు మండలం ముష్టికుంట్ల గ్రామంలోని శ్రీ శంభులింగేశ్వర, కోదండరామ స్వామి దేవాలయాలకు 1956-57 నాటి రెవెన్యూ కాస్రా పహణీ ప్రకారం 136.26 ఎకరాల భూమి నమోదై ఉంది. కానీ, ఆ భూమి దశాబ్దాల కిందటే కబ్జాదారుల పాలయింది. యాభయ్యేండ్లుగా కబ్జాదారులు రకరకాల పంటలు సాగుచేసుకుంటూ ఫలసాయాన్ని పొందున్నారు. కనీసం స్వామివార్లకు దీప, ధూప, నైవేద్యాలకు కూడా నయాపైసా ఇవ్వడం లేదు. దేవాలయాలకు చెందిన ఈ భూముల విలువ సుమారు రూ.28కోట్ల వరకు ఉంటుందని అంచనా. ఆలయ అర్చకులు మాత్రమే స్వామివారి కోసం కానుకలు సేకరించి కార్యకలాపాలను చేపడుతున్నారు. గత ప్రభుత్వాలు స్వామివారికి చెందాల్సిన ఈ భూమిని బయటకు రప్పించేందుకు సాహసించలేదు. దేవాలయాన్ని అభివృద్ధిపరచడంలో కూడా ఏమాత్రం పట్టించుకోకపోవడంతో పరిస్థితి మరీ దయనీయంగా తయారయింది. తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత సీఎం కేసీఆర్ చేపట్టిన భూ రికార్డుల ప్రక్షాళన ద్వారా స్వామివారి భూములకు కబ్జాదారుల కోరల నుంచి విముక్తి కలిగింది. రెవెన్యూ అధికారులు కోట్లు విలువ చేసే భూమిపై స్వామివారికి పూర్తి హక్కులను కల్పించే విధంగా చర్యలు తీసుకున్నారు. ముఖ్యమంత్రి తీసుకున్న భూప్రక్షాళన నిర్ణయంతో ఆలయ భూములు తిరిగి ఆలయాలకే సొంతమయ్యాయని, ఇక కబ్జాదారుల ఆటలు సాగవని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.




ఖమ్మం జిల్లా బోనకల్లు మండలం ముష్టికుంట్ల గ్రామంలో కబ్జాకు గురైన దేవాలయ భూముల్లో సాగుచేస్తున్న మొక్కజొన్న. (ఇన్‌సెట్) కోదండ రామస్వామి, శంభులింగేశ్వరస్వామి దేవాలయం



కాంగ్రెస్‌వి నీచరాజకీయాలు

గవర్నర్‌పై చేసిన వ్యాఖ్యలను వెనుకకు తీసుకోవాలి

ఆ పార్టీ నాయకులు బేషరతుగా క్షమాపణలు చెప్పాలి

మంత్రి హరీశ్‌రావు డిమాండ్

2

'నిజాం ముకరంజా' గుర్తింపు రికార్డులేవి?

తమకు తెలియదన్న హోంశాఖను తప్పుపట్టిన కేంద్ర సమాచార కమిషన్



5



డిగ్రీ లెక్చరర్ల మెయిన్స్ అభ్యర్థుల జాబితా విడుదల

టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో అందుబాటు

ఫిబ్రవరి 19 నుంచి పరీక్షలు జరిగే అవకాశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పలు విభాగాల పోస్టులకు సంబంధించిన మెయిన్స్ పరీక్షకు అర్హులైన అభ్యర్థుల వివరాలను వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్టు టీఎస్‌పీఎస్సీ తెలిపింది. డిగ్రీ కాలేజీల్లోని లెక్చరర్లు, ఫిజికల్ డైరెక్టర్లు, లైబ్రేరియన్లు సహా జూనియర్ కాలేజీల్లోని ప్రిన్సిపాల్స్, ఫిజికల్ డైరెక్టర్లు, జూనియర్ లెక్చరర్లు, స్కూళ్లలోని ప్రిన్సిపాల్స్‌కు నిర్వహించిన ప్రిలిమినరీ పరీక్ష ఆధారంగా 1:15 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపికచేసినట్టు కమిషన్ కార్యదర్శి ఆదివారం ఒక ప్రకటనలో వివరించారు. ఫిబ్రవరి 19 నుంచి 24 వరకు ఈ పరీక్షలు జరిగే అవకాశం ఉన్నదని తెలిపారు.

ప్రయాణానికి గూగుల్ రక్ష

తరుచూ ప్రమాదాలు జరిగే 560 ప్రాంతాలు గుర్తింపు

ప్రమాదరహిత ప్రయాణానికి పోలీస్‌శాఖ కసరత్తు

2


ఉగ్రవాదుల దాడిలో కాబూల్‌లోని కాంటినెంటల్ హోటల్ నుంచి మంటలు వెలువడుతున్న దృశ్యం

కాబూల్ ఉగ్రదాడిలో 43 మంది మృతి

ఉగ్రవాదులు, భద్రతా బలగాల మధ్య కాంటినెంటల్ హోటల్‌లో..

13 గంటలకుపైగా సాగిన ఎదురు కాల్పులు

5

నేటినుంచి దావోస్ సదస్సు



మంచుదుప్పటి కింద దావోస్

- 130 మంది భారతీయ ప్రతినిధులతో దావోస్ చేరుకున్న ప్రధాని మోదీ
- 21 ఏండ్ల తర్వాత తొలిసారి ప్రపంచ ఆర్థికవేదిక సదస్సుకు భారత ప్రధాని
- డబ్ల్యూఈఎఫ్ ప్రతినిధులకు 'యోగా' శిక్షణ తరగతులు
- పర్యావరణం, సంపన్న దేశాల్లో విభేదాలు, ఆర్థిక అసమానతలే ప్రధాన ఎజెండా
- తెలంగాణ నుంచి ఐటీ, మున్సిపల్‌శాఖ మంత్రి కేటీఆర్ హాజరు

28న పల్స్‌పోలియో


విస్తృత ఏర్పాట్లు చేసిన రాష్ట్ర వైద్యారోగ్యశాఖ



హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: ఈ నెల 28న నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమానికి సర్వం సిద్ధమయింది. రాష్ట్ర వైద్యారోగ్యశాఖ సహా ఇతర ప్రభుత్వ విభాగాలు కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు చేశాయి. పోలియో వ్యాధి బారి నుంచి చిన్నారులను కాపాడేందుకు ఏటా వైద్యారోగ్యశాఖ వ్యాక్సిన్లు వేస్తున్న విషయం తెలిసిందే. దీంట్లో భాగంగానే ఈ నెల 28న రాష్ట్రవ్యాప్తంగా ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పల్స్‌పోలియో వ్యాక్సిన్లు వేస్తారు. హైదరాబాద్ జిల్లాలో 2888, మేడ్చల్ జిల్లాలో 1051 బూత్‌లను ఏర్పాటు చేశారు. హైదరాబాద్ జిల్లాలో 3.97 లక్షల మంది పిల్లలకు, మేడ్చల్ జిల్లాలో 3.40 లక్షల మంది పిల్లలకు వ్యాక్సిన్లు వేయనున్నారు. పోలింగ్‌బూత్‌లు, పట్టణ ఆరోగ్యకేంద్రాలు, నర్సింగ్‌హోంలు, అంగన్‌వాడీ సెంటర్లు, కమ్యూనిటీహాళ్లు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, ప్లేస్కూళ్లు, గార్డెన్లు, పార్కులు, ఫంక్షన్‌హాళ్లు, దేవాలయాలు, మసీదులు, చర్చి, గురుద్వారాలు, సమావేశ మందిరాలు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో కూడా చుక్కలు వేయించుకోవచ్చు. వ్యాక్సిన్ వేయించుకోని చిన్నారులకు ఈ నెల 29, 30, 31 తేదీల్లో ఇంటింటికీ తిరిగి వైద్యసిబ్బంది చుక్కలు వేస్తారు.

చిన్నారి వైద్యానికి మంత్రి కేటీఆర్ సాయం

- అనారోగ్యంతో బాధపడుతున్న వర్ణిక
- సమస్యను ట్వీట్ చేసిన బాధితురాలి తండ్రి.. స్పందించిన మంత్రి
- దవాఖాన ఖర్చులకు రూ.1.50 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ సాయం
- కృతజ్ఞతలు తెలిపిన చిన్నారి కుటుంబసభ్యులు




చిన్నారి తండ్రి చేసిన ట్వీట్‌కు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కే తారకరామారావు చేసిన రీ ట్వీట్



వైద్యఖర్చుల నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.1.50 లక్షలు మంజూరైనట్టు మంత్రి ట్వీట్

వేములవాడ రూరల్: తన బిడ్డ వింత వ్యాధితో బాధపడుతున్నదని ఆదుకోవాలని చిన్నారి తండ్రి చేసిన ట్వీట్‌కు విదేశీ పర్యటనలో ఉన్న రాష్ట్ర ఐటీ, పరిశ్రమ శాఖల మంత్రి కే తారకరామారావు స్పందించారు. సిరిసిల్లలోని తన కార్యాలయంలో సంప్రదించాలని రీ ట్వీట్ చేశారు. దవాఖాన ఖర్చుల కోసం సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.1.50 లక్షలు మంజూరుచేస్తున్నట్టు అనుమతి పత్రాలను దవాఖానకు అందజేశారు. వేములవాడ మండలం నూకలమర్రి గ్రామానికి చెందిన అడెపు శ్రీధర్ కూతురు వర్ణిక వింత వ్యాధితో బాధపడుతూ కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు దవాఖానలో చికిత్స పొందుతున్నది. నిరుపేద కుటుంబం కావడంతో శ్రీధర్ తన స్నేహితుల వద్ద ఆర్థిక పరిస్థితి గురించి వివరించారు. వారి సలహా మేరకు మంత్రి కేటీఆర్‌కు ట్విట్టర్ ద్వారా వర్ణిక ఆరోగ్య పరిస్థితిని వివరించారు. విదేశీ పర్యటనలో ఉన్నప్పటికీ మంత్రి కేటీఆర్ స్పందించారు. సిరిసిల్లలోని తన కార్యాలయంలో సంప్రదించాలని రీ ట్వీట్ చేశారు. వర్ణిక గురించి ట్వీట్ చేసి చిన్నారిని ఆదుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.1.50 లక్షలను మంజూరుచేశారు. ట్విట్టర్‌లో స్పందించి తన కూతురి వైద్య ఖర్చులకు సహకరించిన మంత్రి కేటీఆర్‌కు చిన్నారి తండ్రి శ్రీధర్ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

వరల్డ్ ఎకానమిక్ ఫోరంలో ప్రసంగించనున్న మంత్రి కేటీఆర్



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రపంచ ఆర్థికవేదిక సదస్సులో పాల్గొనడానికి రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కే తారక రామారావు స్విట్జర్లాండ్‌లోని దావోస్ నగరానికి చేరుకున్నారు. ఈ నెల 23 నుంచి జరిగే వరల్డ్ ఎకానమిక్ ఫోరం సదస్సులో రాష్ట్ర ప్రతినిధి బృందానికి కేటీఆర్ నాయకత్వం వహించనున్నారు. ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సు నిర్వాహకులు మంత్రి కేటీఆర్‌ను ఈ సదస్సుకు ప్రత్యేకంగా ఆహ్వానించారు. ప్రపంచంలో అగ్రశేణి పారిశ్రామికవేత్తలు పాల్గొనే ఈ సదస్సులో, రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను, ఇక్కడి వనరులను మంత్రి కేటీఆర్ వివరిస్తారు. మంత్రితోపాటు పరిశ్రమలశాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్ కూడా దావోస్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా ప్రముఖ కంపెనీల సీఈవోలతో మంత్రి కేటీఆర్ భేటీ అవుతారు.

ఏప్రిల్ 30లోగా గ్రావిటీ కెనాల్ పూర్తి



జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఆదివారం గ్రావిటీ కెనాల్‌ను పరిశీలిస్తున్న మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో మంథని ఎమ్మెల్యే పుట్ట మధు తదితరులు కూడా ఉన్నారు.

జయశంకర్ జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ:

- పనుల్లో వేగం పెంచాలని అధికారులకు మంత్రి హరీశ్‌రావు ఆదేశం
- జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో పర్యటన
- అన్నారం బరాజ్, కన్నెపల్లి పంప్‌హౌజ్ పనుల పరిశీలన
- 13.2 కి.మీ.గ్రావిటీ కెనాల్ వెంట మూడుగంటలపాటు అడవిలో ప్రయాణం

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా కన్నెపల్లి నుంచి అన్నారం వరకు నిర్మిస్తున్న గ్రావిటీ కెనాల్ పనులను ఏప్రిల్ 30వ తేదీలోగా పూర్తిచేయాలని రాష్ట్ర భారీ నీటిపారుదలశాఖ మంత్రి టీ హరీశ్‌రావు అధికారులను ఆదేశించారు. ఈ మేరకు పనులు వేగవంతం చేయాలని సూచించారు. ఆదివారం ఆయన జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో పర్యటించారు. మహదేవపూర్ మండలం అన్నారం వద్ద నిర్మిస్తున్న బరాజ్, కన్నెపల్లి వద్ద చేపట్టిన పంప్‌హౌస్‌ను సందర్శించారు. ఏప్రిల్‌లోగా పనులు పూర్తిచేయాలని సాగునీటి శాఖ అధికారులు, ఏజెన్సీల ప్రతినిధులకు మంత్రి డెడ్‌లైన్ విధించారు. తొలుత అన్నారం బరాజ్ వద్దకు చేరుకున్న మంత్రి హరీశ్‌రావు నిర్మాణ పనులపై అధికారులు, ఏజెన్సీ ప్రతినిధులతో సమీక్ష జరిపారు. తర్వాత అన్నారం నుంచి అధికారులతో కలిసి కన్నెపల్లికి చేరుకున్నారు. మేడిగడ్డ బరాజ్ నుంచి కన్నెపల్లి పంప్‌హౌస్ ద్వారా అన్నారం బరాజ్‌కు గోదావరి జలాలను తరలించడానికి 13.2 కిలోమీటర్ల గ్రావిటీ కెనాల్‌ను నిర్మిస్తున్నారు. ఈ పనులను పరిశీలించేందుకు మంత్రి హరీశ్‌రావు అడవిలో మూడు గంటలపాటు వాహనంలో ప్రయాణించారు. 13.2 కిలోమీటర్ల పొడవునా ఆరు చోట్ల ఆగి కెనాల్ నిర్మాణ పనుల పురోగతిని తెలుసుకున్నారు. కొన్నిచోట్ల పనులు మందకొడిగా సాగుతుండటంపై అసంతృప్తి వెలిబుచ్చారు. గ్రావిటీ కెనాల్ నిర్మాణం కోసం ఇంకా 1.30 కోట్ల క్యూబిక్ మీటర్ల మట్టి తీయాల్సి ఉన్నదని తెలిపారు. వంద రోజుల్లో మట్టి పని పూర్తిచేసేలా ప్రతీరోజు 1.30 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి తొలిగించాలని, ఏప్రిల్ 30వ తేదీ వరకు పనులు పూర్తి కావాలని ఆదేశించారు. 'అటవీశాఖ నుంచి కావాల్సిన అనుమతులన్నీ వచ్చాయి. అటవీశాఖ అధికారులు కూడా సహకరిస్తున్నారు. ఎలాంటి అడ్డంకులు లేవు. ఏం చేస్తారో నాకు తెలియదు. వందరోజుల్లో గ్రావిటీ కెనాల్ నిర్మాణ పనులను పూర్తిచేసి తీరాల్సిందే' అని స్పష్టం చేశారు. ఈ కెనాల్ నిర్మాణం పూర్తయితేనే కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి ఎత్తిపోతల ద్వారా గోదావరి జలాలను అన్నారం బరాజ్‌కు తరలించే అవకాశం ఉంటుందని అన్నారు. కెనాల్ నిర్మాణ పనులకు అన్నారం వద్ద అడ్డంకిగా ఉన్న రెండు ఇసుక క్వారీలను తొలిగించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. మంథని ఎమ్మెల్యే పుట్ట మధు, మాజీ ఎమ్మెల్సీ సుధాకర్‌రావు, నీటిపారుదలశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎస్కే జోషి, ఈఎన్సీ మురళీధర్ రావు, కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టు పర్యవేక్షక ఇంజినీర్ సుధాకర్‌రెడ్డి, జిల్లా అటవీ అధికారి రవి కిరణ్ మంత్రి హరీశ్‌రావు వెంట ఉన్నారు.

కాంగ్రెస్‌వి నీచరాజకీయాలు

- గవర్నర్‌పై చేసిన వ్యాఖ్యలను వెనుకకు తీసుకోవాలి
- బేషరతుగా క్షమాపణలు చెప్పాలి
- భారీ నీటిపారుదలశాఖ మంత్రి హరీశ్‌రావు

మంథని, నమస్తే తెలంగాణ: కాంగ్రెస్ నాయకులు నీచరాజకీయాలు మానుకోవాలని, గవర్నర్ నరసింహన్‌పై చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనుకకు తీసుకోవడంతోపాటుగా బేషరతుగా క్షమాపణ చెప్పాలని భారీ నీటిపారుదలశాఖ మంత్రి టీ హరీశ్‌రావు డిమాండ్‌చేశారు. ఆదివారం పెద్దపల్లి జిల్లా మంథని మండలం వద్ద నిర్మిస్తున్న సుందిళ్ల, జయశంకర్ భూపాలపల్లి జిల్లా మేడిగడ్డ, అన్నారం బరాజ్‌ల పనులను పరిశీలించిన ఆయన.. రాత్రి మంథనిలో మీడియాతో మాట్లాడారు. గవర్నర్‌పై కాంగ్రెస్ నాయకులు మల్లు భట్టివిక్రమార్క, శ్రీధర్‌బాబు తదితరులు చేసిన వ్యాఖ్యలపై ఘాటుగా స్పందించారు. గత కొంతకాలంగా కాంగ్రెస్ నాయకుల తీరు చూస్తుంటే వాళ్లకి ఏదో శాపం ఉన్నట్టు కనబడుతున్నదని చెప్పారు. 'మంచి చెయ్యొద్దు.. మంచి మాట్లాడొద్దు.. మంచి వినొద్దు'.. అన్న రీతిలో వారి ధోరణి ఉన్నదని ఆయన విమర్శించారు. పదేండ్లు అధికారంలో ఉండి మంచి చేయలేకపోయారని, టీఆర్‌ఎస్ వచ్చిన తర్వాత చేస్తున్న మంచి పనులను ఎవరైనా మెచ్చుకుంటే వినలేకపోతున్నారని ఎద్దేవాచేశారు. మంచిని మెచ్చుకునే కనీస సంస్కారం కాంగ్రెస్ నేతలకు లేదని.. కాళేశ్వరం అద్భుతమైన ప్రాజెక్టు అని గవర్నర్ నరసింహన్ చెప్పడాన్ని జీర్ణించుకోలేక టీఆర్‌ఎస్ ఏజెంటుగా అభివర్ణించడం నీచమైన విధానమని విమర్శించారు. సెంట్రల్ వాటర్ కమిషన్ (సీడబ్ల్యూసీ) ఇంజినీర్లు కాళేశ్వరం ప్రాజెక్టు పనితీరును మెచ్చుకొని వెళ్లారని, దేశంలో మరే ప్రాజెక్టు పనులు ఇంత వేగంగా జరుగలేదని చెప్పారని గుర్తుచేశారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన సమావేశంలోనూ కేంద్ర జలవనరులశాఖ మంత్రి నితిన్ గడ్కరీ సైతం కాళేశ్వరం పనితీరు, ప్రభుత్వ కృషిని మెచ్చుకున్నారని వివరించారు. గవర్నర్ పట్ల కాంగ్రెస్ నాయకుల విమర్శలు సంస్కారహీనమని, వ్యవస్థ పట్ల, రాజ్యాంగం పట్ల గౌరవం ఉంటే వ్యాఖ్యలను వెనుకకు తీసుకొని, క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. గతంలో వైఎస్ హయాంలో 108, ఆరోగ్య శ్రీ సేవలను ప్రభుత్వం ప్రవేశపెడితే తాము అసెంబ్లీలోనే ప్రశంసించామని తెలిపారు. 2007లో ప్రాణహిత-చేవెళ్లకు శంకుస్థాపన చేసి 2014 దాకా ప్రాజెక్టు కట్టకుండా ఏం చేశారని ప్రశ్నించారు. కాంగ్రెస్ హయాంలో తెలంగాణలో పూర్తి చేసిన ఒక్క ప్రాజెక్టు పేరు చెప్పాలని డిమాండ్ చేశారు. పర్యావరణ అనుమతుల విషయంలో మాజీ మంత్రి శ్రీధర్‌బాబు అడ్డంకులు సృష్టించే ప్రయత్నాలు చేశారని ఆరోపించారు. గొర్రెల పంపిణీ పథకం విషయంలో కర్ణాటక రవాణాశాఖ మంత్రి రేవన్న వచ్చి.. యాదవుడు ముఖ్యమంత్రిగా పనిచేసిన రాష్ట్రంలో కూడా ఇలాంటి పథకాలు లేవని సీఎం కేసీఆర్‌ను అభినందించినందుకు ఆయనపై కూడా కాంగ్రెస్ అధిష్ఠానానికి ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. సమావేశంలో మంథని ఎమ్మెల్యే పుట్ట మధు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్‌సింగ్, మంథని సర్పంచ్ పుట్ట శైలజ, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకు కిరణ్ పాల్గొన్నారు. శనివారం ఉదయం నుంచి సాయంత్రం దాకా గవర్నర్ నరసింహన్ వెంట ఉన్న మంత్రి హరీశ్‌రావు.. గవర్నర్ పర్యటన ముగిసిన తర్వాత కూడా రాత్రి ఒంటిగంట దాకా ప్రాజెక్టు పనులను పరిశీలించారు. మళ్లీ ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు అలుపెరుగకుండా ప్రాజెక్టు పరిశీలన చేపట్టారు.

అంతర్జాతీయ సేంద్రియ ఉత్పత్తుల ప్రదర్శనలో తెలంగాణ స్టాల్‌కు రెండోస్థానం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అంతర్జాతీయ సేంద్రియ ఉత్పత్తులు, చిరుధాన్యాల ప్రదర్శనలో తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటుచేసిన స్టాల్‌కు రెండో ఉత్తమ బహుమతి వరించింది. బెంగళూరులో ఈ నెల 19 నుంచి మూడురోజులపాటు కర్ణాటక ప్రభుత్వం ఈ ప్రదర్శన నిర్వహించింది. ఈ ఎగ్జిబిషన్‌లో దేశంలోని 20 రాష్ట్రాలు, 5 కేంద్రపాలిత ప్రాంతాల నుంచి స్టాళ్లు ఏర్పాటుచేశారు. తెలంగాణ రాష్ట్ర సేంద్రియ విత్తన ధ్రువీకరణ సంస్థ, రాష్ట్ర వ్యవసాయశాఖ, ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం సహకారంతో ఏర్పాటుచేసిన సేంద్రియ ఉత్పత్తులు, చిరుధాన్యాల స్టాల్‌ను మూడురోజుల్లో 2,800 మంది రైతులు సందర్శించారు. శనివారం ఎగ్జిబిషన్ ముగింపు సందర్భంగా స్టాళ్లకు కేంద్ర విత్తనధ్రువీకరణశాఖ జాయింట్ సెక్రటరీ బహుతులను అందజేశారు.

సేంద్రియసాగు వైపు దృష్టి సారించాలి

- కిసాన్ కాల్ సెంటర్ సేవలు వినియోగించుకోవాలి
- రైతు వేదికలతో కిసాన్ కాల్ సెంటర్ అనుసంధానం
- వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వ్యవసాయంలో రసాయనిక ఎరువుల వినియోగాన్ని తగ్గించి సేంద్రియ సాగు వైపు రైతులు అడుగులు వేయాలని, ఆ దిశగా అధికారులు రైతులను ప్రోత్సహించాలని వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి కోరారు. రసాయనిక ఎరువులను మోతాదుకు మించి వాడటం వల్ల పెట్టుబడి పెరిగి రైతులు అప్పుల బారిన పడుతున్నారని చెప్పారు. ఆదివారం రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ పరిశోధన సంస్థ (ఏఆర్ఐ) ఆవరణలో జరిగిన కిసాన్ కాల్‌సెంటర్ 15 వార్షికోత్సవంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కిసాన్ కాల్‌సెంటర్లు ఏర్పాటు తర్వాత వ్యవసాయరంగంలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకున్నాయని తెలిపారు. సామాన్య రైతులు కూడా శాస్త్రవేత్తల నుంచి విలువైన సమాచారం పొందే అవకాశాలున్నాయని చెప్పారు. దేశవ్యాప్తంగా వచ్చే ఫోన్‌కాల్స్‌కు ఆయా ప్రాంతీయ భాషల్లో సమాధానాలను ఇచ్చి రైతు వ్యవసాయ సమస్యలను తీర్చడంలో కిసాన్‌సెల్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. రాబోయే రోజుల్లో కిసాన్ కాల్ సెంటర్ సేవలను మరింత విస్తృతంగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నదని, త్వరలో రాష్ట్రవ్యాప్తంగా రూ.450 కోట్లతో రైతు వేదికలను నిర్మిస్తామని మంత్రి పోచారం చెప్పారు. రైతు వేదికలను కిసాన్ కాల్‌సెంటర్లతో అనుసంధానం చేస్తామన్నారు. రైతులకు ఎకరానికి రూ.4వేల పెట్టుబడి అందిస్తున్నామని, కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించని పంటలను రైతు సమన్వయ సమితుల ద్వారా సేకరించి, వాణిజ్య ఉత్పత్తులను ప్రారంభిస్తామని వెల్లడించారు. కేంద్ర వ్యవసాయశాఖ సంయుక్త కార్యదర్శి (విస్తరణ విభాగం) పీకే బోర్తాకూర్ మాట్లాడుతూ కిసాన్ కాల్ సెంటర్ల ఏర్పాటు వ్యవసాయరంగంలో విప్లవాన్ని సృష్టించిందని తెలిపారు. దేశవ్యాప్తంగా 2004 జనవరి 21న 14 ప్రాంతాల్లో ఈ సెంటర్లను ఏర్పాటుచేశామని, 22 భాషల్లో రైతులకు వ్యవసాయం, అనుబంధ రంగాలపై సలహాలు అందిస్తున్నామని చెప్పారు. 18001801551 నంబర్‌కు ఫోన్‌చేసిన 72 గంటల్లో సమస్యకు పరిష్కారం లభిస్తున్నదన్నారు. మేనేజ్ డైరెక్టర్ జనరల్ వీ ఉషారాణి మాట్లాడుతూ ఇక్రిసాట్, వ్యవసాయ విశ్వవిద్యాలయం సహకారంతో కిసాన్ కాల్ సెంటర్ నుంచి వీడియోకాల్‌ను ఏర్పా టు చేస్తున్నట్టు తెలిపారు. హైదరాబాద్ కాల్‌సెంటర్‌కు తెలంగాణ నుంచి 20.47 లక్షలు, ఏపీ నుంచి 15.07 లక్షల కాల్స్‌కు సమాధానాలిచ్చినట్టు చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ కమిషనర్ ఎం జగన్‌మోహన్, విస్తరణ సంచాలకుడు రాజిరెడ్డి, అదనపు సంచాలకుడు కే విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

16 మందితో హజ్ కమిటీ

- ఎక్స్‌అఫీషియో మెంబర్‌గా షుకూర్
- చైర్మన్ రేస్‌లో మసిఉల్లాఖాన్, అబ్దుల్ ఖాదర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ రాష్ట్ర హజ్ కమిటీ (టీఎస్‌హెచ్‌సీ) పాలకవర్గాన్ని ప్రభుత్వం ప్రకటించింది. మొత్తం 16 మంది సభ్యులతో కొత్త హజ్ కమిటీని ఏర్పాటుచేసింది. ఇందులో ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, పార్టీ నేతలతోపాటు, హజ్ యాత్రికులకు స్వచ్ఛందంగా సేవలు అందించే వారికి చోటు కల్పించింది. ఎక్స్ అఫీషియో సభ్యుడు మినహాయించి మిగిలిన 15 మంది సభ్యుల పదవీ కాలం మూడేండ్లు ఉంటుంది. రాష్ట్ర మైనారిటీ సంక్షేమశాఖ కార్యదర్శి ఎం దానకిషోర్ శనివారం అర్ధరాత్రి తరువాత జీవో జారీచేశారు. ఈ నెల 22 లేదా 23 తేదీల్లో కమిటీసభ్యులు సమావేశమై తమలో ఒకరిని తెలంగాణ హజ్ కమిటీ చైర్మన్‌గా ఎన్నుకోనున్నారు. ప్రస్తుతం టీఆర్‌ఎస్‌కు చెందిన పాటిగడ్డ నివాసి మసిఉల్లాఖాన్, సిద్దిపేటకు చెందిన అబ్దుల్ ఖాదర్‌ల పేర్లు చైర్మన్ పదవికి ప్రచారంలో ఉన్నాయి. సుమారు నాలుగేండ్లుగా హజ్ కమిటీకి పాలకవర్గం లేదు. ఇప్పటివరకు హజ్‌యాత్ర ప్రక్రియ అంతా తెలంగాణ హజ్ కమిటీ ప్రత్యేక అధికారి షుకూర్ పర్యవేక్షణలోనే కొనసాగింది. తెలంగాణ రాష్ట్రం వచ్చాక ఏర్పాటవుతున్న హజ్ కమిటీ తొలి పాలకవర్గం ఇదే. ఈ ఏడాది జూలైలో హజ్‌యాత్ర సీజన్ ప్రారంభమవుతుండటంతో ప్రభుత్వం ఏడునెలల ముందే పాలకవర్గాన్ని ప్రకటించింది. కాగా, తెలంగాణ హజ్ కమిటీ ప్రత్యేకాధికారి ఎస్‌ఏ షుకూర్‌ను ఎక్స్‌అఫీషియో సభ్యుడిగా, కన్వీనర్‌గా నియమించింది.



ఫారుఖ్‌హుస్సేన్, మహ్మద్ ఫరీదుద్దీన్, ఆమేర్ షకీల్

సభ్యుల వివరాలు.. ఫారుఖ్‌హుస్సేన్(ఎమ్మెల్సీ), మహ్మద్ ఫరీదుద్దీన్(ఎమ్మెల్సీ), మహ్మద్ ఆమేర్ షకీల్(ఎమ్మెల్యే, బోధన్), ఖాజా సిరాజుద్దీన్ (కార్పొరేటర్, వరంగల్), మహ్మద్ అబ్దుల్ షఫీ (కార్పొరేటర్, జీహెచ్‌ఎంసీ), ఆరిఫ్ అహ్మద్(కార్పొరేటర్, కరీంనగర్), అబ్దుల్ ఖాదర్(సిద్దిపేట), హఫీజ్ మహ్మద్ లయఖ్ ఖాన్ (నిజామాబాద్), డాక్టర్ అఖిల్ హష్మీ (ఓయూ ఉర్దూ విభాగం మాజీ హెచ్‌వోడీ), మసీఉల్లాఖాన్, సత్తార్ గుల్షానీ, మహ్మద్ అమ్జద్ అలీ, మహ్మద్ ఆరిపుద్దీన్(హైదరాబాద్), మహ్మద్ ఇంతియాజ్ ఖాన్(జైనూర్, ఆసిఫాబాద్ జిల్లా), మహ్మద్ సలీం (చైర్మన్, తెలంగాణ రాష్ట్ర వక్ఫ్‌బోర్డు).


ముహూర్తం

సూర్యోదయం: 6.53 గంటలకు

సూర్యాస్తమయం: 6.02 గంటలకు

హేవళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర రుతువు, మాఘమాసం, శుక్లపక్షం పంచమి సాయంత్రం 4.27 వరకు, తదుపరి షష్టి, నక్షత్రం: పూర్వాభాద్ర ఉదయం 7.07 వరకు తదుపరి ఉత్తరాభాద్ర, అమృతఘడియలు: లేవు, రాహుకాలం: ఉదయం 8.17 నుంచి 9.40 వరకు, దుర్ముహూర్తం: మధ్యాహ్నం 12.05 నుంచి 12.50 వరకు, తిరిగి మధ్యాహ్నం 3.04 నుంచి 3.48 వరకు, వర్జ్యం: రాత్రి 7.38 నుంచి 9.14 వరకు.

లోకం పోకడ



మరీ ఇంత పక్కాగా అవసరం లేదయ్యా!

ప్రయాణానికి గూగుల్ రక్ష..

- ప్రమాద రహిత ప్రయాణానికి పోలీస్‌శాఖ కసరత్తు
- తరుచూ ప్రమాదాలు జరిగే 560 ప్రాంతాల గుర్తింపు
- టెక్నాలజీతో అనుసంధానం చేసి ముందస్తు అప్రమత్తం
- వాహనదారుడికి వాయిస్ మెసేజ్‌లతో రహదారి సమాచారం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా ఏటేటా రోడ్డు ప్రమాదాలు పెరుగుతూనే ఉన్నాయి. ఎన్నో కుటుంబాల్లో విషాదాన్ని మిగులుస్తూనే ఉన్నాయి. ప్రమాదాలు జరుగడానికి అతివేగానికి ఎంత పాత్ర ఉందో.. చిన్నపాటి ఏమరుపాటు పాత్ర కూడా అంతే ఉందని చెప్పవచ్చు. ప్రయాణంలో వాహనదారుడిని అడుగడుగునా అప్రమత్తం చేయడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని రోడ్డు భద్రతా అధికారులు యోచిస్తున్నారు. నూతన టెక్నాలజీని వాడడం ద్వారా దానిని సాధించాలని చూస్తున్నారు. ఇందుకోసం తరుచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి ఆ సమాచారాన్ని వాహనదారులకు ఎప్పటికప్పుడు చేరవేసి అప్రమత్తం చేయడంపై దృష్టి సారించారు. ప్రమాద స్థలానికి చేరే ముందే వాహనదారులను అప్రమత్తం చేయడం ద్వారా రోడ్డు ప్రమాదాల అరికట్టేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నది. ప్రస్తుతం స్మార్ట్‌ఫోన్ల వినియోగం పెరుగడం, దారి తెలుసుకునేందుకు గూగుల్ మ్యాప్ వాడేవారి సంఖ్య పెరుగడాన్ని ఇందుకు అనుకూలంగా మార్చుకోనున్నారు. తరచూ ప్రమాదాలు జరిగే స్థలాలను గుర్తించి వాటిని గూగుల్ మ్యాప్‌తో అనుసంధానం చేయడం ద్వారా వాహనదారులను అప్రమత్తం చేయనున్నారు. రాష్ట్రంలోని జాతీయ రహదారులు, అంతర్గత రహదారులపై కలిపి ఇప్పటివరకు 560 ప్రాంతాల్లో బ్లాక్‌స్పాట్స్ (తరచూ రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలు) గుర్తించారు.



మూడు క్యాటగిరీల్లో బ్లాక్‌స్పాట్స్

రాష్ట్రంలోని జాతీయ రహదారులు, అంతర్గత రహదారులపై ఇప్పటివరకు గుర్తించిన 560 బ్లాక్‌స్పాట్స్‌ను ఏ, బీ, సీ క్యాటగిరీలుగా విభజించారు. ఏ-క్యాటగిరీలో 20 అంతకంటే ఎక్కువసార్లు ప్రమాదాలు జరిగిన ప్రాంతాలు, బీ-క్యాటగిరీలో 10 నుంచి 20 సార్లు మధ్య ప్రమాదాలు జరిగినవి, సీ-క్యాటగిరీలో ఐదు అంతకంటే ఎక్కువసార్లు ప్రమాదం జరిగిన ప్రాంతాలను గుర్తించారు. హైదరాబాద్ పరిధిలో 30 ప్రాంతాల్లో బ్లాక్‌స్పాట్స్ ఉన్నట్టు గుర్తించారు.

ఏ క్యాటగిరీ బ్లాక్ స్పాట్స్ ఇవి..

జాతీయ రహదారులపై గుర్తించిన ఏ క్యాటగిరీ బ్లాక్‌స్పాట్స్.. హైదరాబాద్‌లో అప్పర్ ట్యాంక్‌బండ్, సైబరాబాద్ కమిషనరేట్ చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాయల్ ఇండియా హోటల్ (గంగారాం హనుమాన్ టెంపుల్), వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆటోనగర్ చౌరస్తా, చింతల్‌కుంట రాఘవేంద్ర హోటల్ ఎదురుగా, సుష్మా ఎక్స్‌రోడ్, మెదక్ జిల్లాలో సిద్దాపూర్ ఎక్స్‌రోడ్, యాదగిరిగుట్టలోని పెద్దకందుకూరు, ఆలేరులోని సాయిబాబా టెంపుల్. రాష్ట్ర రహదారులపై కరీంనగర్ జిల్లా ఎల్‌ఎండీ కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలో అలుగునూరు వైజంక్షన్, కరీంనగర్ ట్రాఫిక్ పీఎస్ పరిధిలో బద్దం ఎల్లారెడ్డి విగ్రహం- పెద్దపల్లి బైపాస్‌రోడ్డు, కరీంనగర్ రూరల్ పీఎస్ పరిధిలో ఫోర్ ఆర్మ్స్ బైపాస్ రోడ్డు, ఖమ్మం జిల్లాలో ఖమ్మం ట్రాఫిక్ పీఎస్ పరిధిలో కరుణగిరి బ్రిడ్జి-శ్రీశ్రీ విగ్రహం, నయా బజార్-రోటరీనగర్‌ను గుర్తించారు.

ఎలా అప్రమత్తం చేస్తారు..

- అధికారులు గుర్తించిన బ్లాక్‌స్పాట్స్‌ను ముందుగా గూగుల్‌కు అనుసంధానం చేస్తారు.
- జీపీఎస్ ఆన్‌చేయగానే గూగుల్ మ్యాప్‌తోపాటు ఆ రూట్‌లో ఎక్కడెక్కడ ఏ క్యాటగిరీ బ్లాక్‌స్పాట్ ఉందో ముందుగానే అలర్ట్ వస్తుంది. ప్రయాణంలోనూ కిలోమీటర్ నుంచి అర కిలోమీటర్ దూరంలో బ్లాక్‌స్పాట్ ఉండగానే వాయిస్ మెసేజ్ వస్తుంది. మ్యాప్‌లో ఎర్రజెండా గుర్తు చూపుతుంది.
- ప్రయాణించే రూట్‌లో ఎక్కడెక్కడ బ్లాక్‌స్పాట్స్ ఉన్నాయో ఇంటివద్ద ముందుగానే తెలుసుకోవచ్చు. లేదా మధ్యమధ్యలో గూగుల్ మ్యాప్‌లో ఎర్ర జెండా గుర్తువస్తూ అప్రమత్తం చేస్తుంది.
- జీపీఎస్‌తో గూగుల్ మ్యాప్ చూసుకుని వెళ్లే ప్రయాణికులకు 200 మీటర్ల ముందే బ్లాక్‌స్పాట్ ఉన్నట్టు సందేశం పంపుతుంది. ప్రమాదకర మలుపు, ప్రమాదాలు జరిగే ప్రాంతం సందేశాలు ఇస్తూ వాహనదారులను అడుగడుగునా అప్రమత్తం చేస్తుంది.
- నగర, పట్టణ ప్రాంతవాసుల్లో చాలామంది తమ స్మార్ట్‌ఫోన్లలో జీపీఎస్ సదుపాయాన్ని వినియోగిస్తున్నందున గూగుల్ సంస్థకు వీటిని అనుసంధానించేందుకు పోలీస్‌శాఖ ప్రయత్నిస్తున్నది.
- రాష్ట్రవ్యాప్తంగా అన్ని వాహనాలకు జీపీఎస్ సదుపాయం తప్పనిసరి చేయడంపైనా కసరత్తు చేస్తున్నట్టు అధికారులు తెలిపారు.

పోలీస్‌శాఖ వార్షిక నివేదిక-2017 ప్రకారం తెలంగాణలో జరిగిన రోడ్డు ప్రమాదాలు
(ప్రతి ఏడాది నవంబర్ వరకు సమాచారం)

ఏడాది	రోడ్డు ప్రమాదాలు	మృతులు	క్షతగాత్రులు
2014	20,078	6,906	21,636
2015	21,252	7,110	22,948
2016	22,811	7,219	24,217
2017	20,378	5,963	21,697

చిన్న జాగ్రత్తలతో ప్రమాదాల నివారణ



రోడ్డు ప్రమాదాల్లో 75శాతం వరకు మానవ తప్పిదాల వల్లే జరుగుతున్నాయని వివిధ రిపోర్టులు చెప్తున్నాయి. వాహనం నడిపేవారు అప్రమత్తంగా ఉంటే వీటిని అరికట్టవచ్చు. దేశంలో ఏటా సుమారు ఐదు లక్షల రోడ్డు ప్రమాదాలు జరుగుతుండగా, లక్షా యాభైవేల మంది మృత్యువాతపడుతున్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఏటా 22వేల రోడ్డు ప్రమాదాలు జరుగుతుండగా, సుమారు ఏడు వేల మంది చనిపోతున్నారు. రోడ్డు ప్రమాదాలు అరికట్టేందుకు నూతన టెక్నాలజీ అందుబాటులోకి తేవడంపై దృష్టి పెట్టాం. దారి తెలుసుకునేందుకు మనం వాడే గూగుల్ మ్యాప్‌లో ఎక్కడ ప్రమాదం జరిగే ప్రాంతం ఉందో ముందే చెప్పి అప్రమత్తం చేస్తే ప్రాణాలు కాపాడవచ్చన్నది ప్రయత్నం.

- టీ కృష్ణప్రసాద్, రైల్వే, రోడ్డు భద్రత డీజీపీ

వనంలో జనసాగరం



జయశంకర్ భూపాలపల్లి జిల్లా తాడ్వాయి మండలం మేడారం ఆదివారం జనసంద్రమైంది. సుమారు పదిలక్షల మంది వనదేవతలను దర్శించుకున్నట్టు దేవాదాయశాఖ అధికారులు తెలిపారు. సమ్మక్క సారలమ్మ మహాజాతర సమీపిస్తుండటం, ఆదివారం సెలవు కావడంతో తెల్లవారు జాము నుంచే రాష్ట్రంలోని నలుమూలల నుంచి ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాల్లో భక్తులు తరలివచ్చారు. రద్దీ దృష్ట్యా అధికారులు తొలిసారి క్యూలైన్లు తెరిచి గద్దెల ప్రాంగణానికి పంపారు. మేడారంలోని గద్దెల ప్రాంగణానికి కిలోమీటరు దూరంలోనే వాహనాలు నిలిపివేశారు. మేడారం నుంచి తాడ్వాయి, పస్రా మార్గాల్లో సుమారు ఏడుకిలోమీటర్ల పొడవునా భక్తులు విడిది చేశారు. మేడారం పరిసరాల్లో పోలీసుశాఖ అమర్చిన సీసీ కెమెరాల ద్వారా కంట్రోల్ రూమ్ నుంచి జిల్లా ఎస్పీ ఆర్ భాస్కరన్ బందోబస్తును పరిశీలించి, ఎప్పటికప్పుడు పోలీసు అధికారులకు సూచనలు చేశారు. జిల్లా ఇంచార్జి కలెక్టర్ ఆర్వీ కర్ణన్, జాయింట్ కలెక్టర్ డీ అమయ్‌కుమార్, ఏటూరునాగారం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి చక్రధర్‌రావు, ములుగు సబ్‌కలెక్టర్ గౌతమ్‌కుమార్.. మేడారం పరిసరాల్లో ఏర్పాట్లను సమీక్షించారు. భక్తుల సంఖ్య పెరుగడంతో ఆర్టీసీ యాజమాన్యం మేడారానికి నడిపే బస్సుల సంఖ్యను పెంచింది.

- జయశంకర్ జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ



సిద్దిపేట జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కొమురవెల్లి శ్రీమల్లికార్జున స్వామి క్షేత్రం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. పట్నం వారం సందర్భంగా హైదరాబాద్ నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. లక్ష మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారు. శనివారం సాయంత్రం నుంచే కొమురవెల్లికి చేరుకున్న భక్తులు ఆదివారం స్వామివారిని దర్శించుకోవడంతోపాటు అభిషేకాలు, అర్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి సోదరి ఎల్లమ్మకు బోనం సమర్పించారు. ఆలయ డీసీ ఎం రామకృష్ణారావు, ఆలయ చైర్మన్ బద్దిపడిగె కృష్ణారెడ్డి తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. **- చేర్యాల, నమస్తే తెలంగాణ**



వరంగల్ అర్బన్ జిల్లా భీమదేవరపల్లి మడలంలో కొత్తకొండ వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 18వ తేదీతో ముగిసినప్పటికీ ఆదివారం ఆలయప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. భక్తులు స్వామి వారికి కోరమీసాలు సమర్పించారు. గండాలు తొలిగిపోవాలని గండ దీపం వద్ద నూనె పోశారు. ఆలయ చైర్మన్ మార్పాటి మహేందర్‌రెడ్డి, ఈవో దేవరాజు హరిప్రకాశ్‌రావు, ధర్మకర్తలు తాటికొండ వీరభద్రయ్య, మాడిశెట్టి కుమారస్వామి, గడ్డం మోహన్, కోంద్ర రజనాచారి, కిరణ్, తిరుపతిరావు, శ్రీనివాస్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. **- భీమదేవరపల్లి (వరంగల్)**



వరంగల్ అర్బన్ జిల్లా ఐనవోలు మండలం కేంద్రంలోని ఐలోని మల్లన్న ఆలయం ప్రాంగణం భక్త జనంతో ఆదివారం కిటకిటలాడింది. భక్తులు ఒగ్గు పూజారులతో ప్రత్యేక పూజలు, కథలు చెప్పించుకొన్నారు. అనంతరం ఎల్లమ్మకు బోనాలతో మొక్కులు సమర్పించుకున్నారు. కార్యక్రమంలో ఇంచార్జి ఈవో సదానందం, చైర్మన్ గజ్జెల్లి శ్రీరాములు, డైరెక్టర్లు చందర్‌రావు, యాకుబ్‌రెడ్డి, సోమేశ్వర్, సతీశ్, రఘు, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

-ఐనవోలు (వరంగల్)

మొరిగే కుక్కలను పట్టించుకోం!

దళితులను ఉద్దేశించి పరోక్షంగా వ్యాఖ్యానించిన కేంద్రమంత్రి హెగ్డే

మంత్రిని పదవి నుంచి తొలిగించాలి: ప్రకాశ్‌రాజ్




కేంద్రమంత్రి అనంత్‌కుమార్ హెగ్డే, నటుడు ప్రకాశ్‌రాజ్

బళ్లారి, జనవరి 21: రాజ్యాంగాన్ని మారుస్తామంటూ ఇటీవల వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి అనంత్‌కుమార్ హెగ్డే మళ్లీ నోరుజారారు. పరోక్షంగా దళితులను వీధి కుక్కలుగా అభివర్ణించారు. శనివారం కర్ణాటకలోని బళ్లారిలో ఓ కార్యక్రమంలో పాల్గొనడానికి వెళ్తున్న ఆయన కారును పలువురు దళితులు అడ్డుకున్నారు. రాజ్యాంగానికి వ్యతిరేకంగా చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ నినాదాలు చేశారు. పోలీసులు ఆందోళనకారులను చెదురగొట్టడంతో మంత్రి అక్కడి నుంచి వెళ్లిపోయారు. అనంతరం తాను పాల్గొన్న కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇవ్వడంతోపాటు ఉపాధి కల్పించడానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని చెప్పారు. రోడ్డుపై మొరిగే కుక్కలను తాము పట్టించుకోమని వ్యాఖ్యానించారు. మార్గమధ్యంలో దళితులు ఆయన కారును అడ్డుకోవడం, వెనువెంటనే మంత్రి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం వివాదాస్పదమైంది. దళితులను ఉద్దేశించే ఆయన ఈ వ్యాఖ్యలు చేశారని పలువురు విమర్శించారు. సినీనటుడు ప్రకాశ్‌రాజ్ ట్విట్టర్‌లో స్పందిస్తూ 'మంత్రి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నా. తనకు వ్యతిరేకంగా ఆందోళన చేసిన దళితులను మంత్రి కుక్కలుగా సంబోధించారు. ఆయనను పదవి నుంచి దిగిపోవాలని బీజేపీ అధిష్ఠానం ఆదేశించగలదా? మంత్రి తప్పు చేసినట్టు భావించగలదా?' అని ప్రశ్నించారు. మరోవైపు తన వ్యాఖ్యలపై దుమారం రేగడంతో అనంత్‌కుమార్ హెగ్డే స్పందించారు. తాను దళితులను ఉద్దేశించి ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదని చెప్పారు. తనపై వస్తున్న ఆరోపణలను ఖండిస్తున్నానని తెలిపారు. తన ప్రతిష్ఠను దెబ్బతీయడానికే ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు.

పాత పెన్షన్ విధానమే అమలుచేయండి

నేషనల్ మూవ్‌మెంట్ ఫర్ ఓల్డ్ పెన్షన్ స్కీం సంస్థ డిమాండ్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పాతపెన్షన్ విధానాన్ని అమలుచేయాలని, నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని నేషనల్ మూవ్‌మెంట్ ఫర్ ఓల్డ్ పెన్షన్ స్కీం (ఎన్‌ఎంవోపీఎస్) సంస్థ డిమాండ్ చేసింది. దీనిపై జాతీయస్థాయిలో ఉద్యమాలను నిర్వహించేందుకు సన్నద్ధమైంది. నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేస్తామని హామీ ఇచ్చే రాజకీయ పార్టీలకే వచ్చే సాధారణ ఎన్నికల్లో మద్దతు తెలియజేయాలని తీర్మానించింది. ఆదివారం బెంగళూరులో ఎన్‌ఎంవోపీఎస్ నేషనల్ ఎగ్జిక్యూటివ్ సమావేశం జరిగింది. రాజకీయపార్టీల పెద్దలతో సంప్రదింపులు జరిపి, వారి అభిప్రాయాలను తీసుకొనేందుకు ప్రయత్నాలను ప్రారంభించింది. ఎగ్జిక్యూటివ్ ప్రతినిధుల జాతీయ అధ్యక్షుడు విజయకుమార్ బంధు, ప్రధాన కార్యదర్శి స్థితప్రజ్ఞ నాయకత్వంలో తెలంగాణ యూనియన్ ప్రధానకార్యదర్శి కల్వల శ్రీకాంత్, ఇతర నాయకులు నరేశ్‌గౌడ్ తదితరుల ప్రతినిధుల బృందం మాజీ ప్రధాని దేవెగౌడను కలిసింది. న్యాయమైన డిమాండ్‌కు తమ పార్టీ ద్వారా మద్దతు ఇస్తామని, ఎన్నికల మ్యానిఫెస్టోలో ఈ అంశాన్ని కూడా చేరుస్తామని ఆయన హామీ ఇచ్చారు. దేశవ్యాప్తంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో 56 లక్షలమంది ఉద్యోగులు కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీంలో అంటే నూతన పెన్షన విధానంలో పనిచేస్తున్నారు. 2004 సెప్టెంబర్ నుంచి అమల్లోకి వచ్చిన కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం వల్ల ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారు. పాత పెన్షన్ విధానంలో రిటైరయ్యే ప్రతీ ఉద్యోగికి కాంట్రిబ్యూటరీ పెన్షన్, ఫ్యామిలీ పెన్షన్ వంటి అనేక సదుపాయాలు ఉంటాయి. నూతన పెన్షన్ స్కీం వల్ల ఉద్యోగులు గ్యారంటీగా లభించే పెన్షన్‌ను, ఆర్థిక భద్రతను కోల్పోతున్నారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా 6,228 మంది ఉద్యోగులు రిటైరయ్యారు. వీరికి ఎటువంటి పెన్షన్ లభించలేదు. ఈ నేపథ్యంలో ఉద్యమాలకు సంస్థ సారథ్యంలో సిద్ధమవుతున్నారు. న్యాయనిపుణులు, రిటైర్డ్ న్యాయమూర్తులు పాత పెన్షన్ విధానానికి సంఘీభావం తెలియజేస్తున్నట్టు సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు.

స్వచ్ఛ మేడారం-స్వచ్ఛ జాతర

- **మేడారం పరిశుభ్రతపై పీసీబీ దృష్టి**
- **జంపన్నవాగులో ప్రతిరోజు నీటినాణ్యతా పరీక్షలు**

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: సమక్క సారలమ్మ జాతర జరిగే మేడారంలో పరిశుభ్రత కోసం 'స్వచ్ఛ మేడారం-స్వచ్ఛ జాతర' కార్యక్రమాన్ని తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) చేపట్టబోతున్నది. జాతర జరిగే నాలుగు రోజుల్లో మేడారం పరిసర ప్రాంతాల్లో స్వచ్ఛతను పాటించడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి కాలుష్య నివారణకు చర్యలు తీసుకుంటుంది. జాతర సందర్భంగా 500 మంది నేషనల్ గ్రీన్ కార్ప్స్ (ఎన్జీసీ) వాలంటీర్లను అందుబాటులోఉంచి నీటి, వాయునాణ్యతా పరీక్షలను చేపట్టనుంది. జాతరకు భారీగా ప్రజలు తరలిరానుండటంతో మేడారం పరిసరాల్లో నీటి కాలుష్యం, వాయుకాలుష్యం పెరిగి చెత్త చెదారం భారీగా పేరుకుపోనున్నది. దీంతో అతిసార, అంటువ్యాధులు ప్రబలేందుకు ఆస్కారం ఉండటంతో ముందస్తుచర్యల్లో భాగంగా పీసీబీ అధికారులు రంగంలోకి దిగుతున్నారు. ఈ నెల 23 నుంచి ఫిబ్రవరి 4వ తేదీ వరకు పీసీబీ సిబ్బంది మేడారంలో మకాం వేయనున్నారు. వీరితోపాటు ఎన్జీసీ వాలంటీర్లు జాతరలో పరిశుభ్రతపై అవగాహన కల్పించనున్నారు. కళాజాతాలు పలు ప్రాంతాల్లో ప్రదర్శనలు ఇస్తాయి. జంపన్నవాగులో ప్రవహించే నీటి నాణ్యతను, కాలుష్య తీవ్రతను ఎప్పటికప్పుడు పరీక్షించేందుకు ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటున్నారు. వాగులో మూడుచోట్ల ప్రతీరోజు ఉదయం 11, సాయంత్రం 5 గంటలకు శాంపిళ్లను సేకరించి నాణ్యతా పరీక్షలు నిర్వహిస్తారు. ఇక ఎన్జీసీ వాలంటీర్లు వాగులోనే ఉంటూ సబ్బులు, షాంపులు వినియోగించడాన్ని నివారించనున్నారు. కాలుష్య తీవ్రత పెరిగితే మిగతా అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి కాలుష్య నివారణ చర్యలు చేపట్టనున్నారు. సబ్బులు, షాంపుల వాడకం, బట్టలు ఉతకడంతో వాగులోని నీరు కలుషితం కానుంది. నీటిలో పీహెచ్ స్థాయిని తగ్గించేందుకు, క్లోరిన్ పౌడర్‌ను కలపడం, చెత్త సేకరణ లాంటి కార్యక్రమాల్లో వీరంతా భాగస్వామ్యం కానున్నారు. జాతర ప్లాస్టిక్‌రహితంగా జరుపుకునేందుకు పీసీబీ ప్రత్యేక చొరవ చూపుతున్నది. జాతరలో పూజాసామగ్రి, బెల్లం, సహా ఇతర వస్తువుల, ఆట వస్తువులను ప్లాస్టిక్ కవర్లలో అమ్మడాన్ని నిషేధించారు. ఎన్జీసీ వాలంటీర్లు షాపుల్లో తిరుగుతూ ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని అరికట్టనున్నారు. ప్లాస్టిక్ కవర్ల వాడకంతో జరిగే అనర్థాలపై చిరువ్యాపారులు, భక్తులకు అవగాహన కల్పించనున్నారు.



అన్వేషణ ఆపకూడదు. అన్వేషణ కొలిక్కివచ్చే నాటికి మనం ఎక్కడ మొదలయ్యామో అక్కడికి చేరుకొని, ఆ స్థలాన్ని కొత్తగా కనుక్కుంటాం.

టి.ఎస్.ఇలియట్



మిలార్డ్!
అప్పుడప్పుడూ
ఇలా ప్రజలతో మాట్లాడుతూ వుండండి
వాళ్ళకి కొంత
జ్ఞానోదయం అవుతుంటుంది.

అప్పుడెప్పుడో
న్యాయమూర్తులకి కార్యనిర్వాహక వ్యవస్థకి వున్న
సామీప్యత గురించి
మీరు లేవనెత్తిన అంశం
ఆశ్చర్యానికి గురిచేసింది

మీరు రాస్తున్న ఉత్తరాల వల్ల
ప్రపంచానికి అంతో ఇంతో తెలుస్తూ వస్తుంది

ఇప్పుడు
మీ గురించి మీరు మాట్లాడటం
ఒకింత ఆనందాన్ని కలుగ చేసింది
ఎప్పుడూ
మీ గురించి మేం మాట్లాడుకోవడం తప్ప

మీ గురించి మీరు మాట్లాడటం
ఎప్పుడూ వినలేదు
చూడలేదు
అదీ ప్రజలందరితో,
మీరు మాట్లాడటం
చాలామందికి ఆశ్చర్యం కలుగ చేసింది
కొంతమందికి ఆందోళన కలిగించింది

మరికొంత మందిని విభ్రాంతికి గురిచేసింది

మాట్లాడటంలోని ఔచిత్యాలు
మీకు తెలియనిది కాదు
అన్నిదారులు మూసుకుపోయిన తరువాత
బహుశా
మీరు మాట్లాడి వుంటారు

మీరు చెప్పిన నిజాలు
చాలాకాలం నుంచి
రుజువులు లేక తల్లడిల్లుతూ వున్నాయి
ఇన్ని రోజులకి
ఆ బాధను కొంత విముక్తం చేశారు

అప్పుడెప్పుడో
చిన్నప్పుడు చదివిన కథలో
రాజుకు బట్టలు లేవని
ఓ చిన్న పిల్లవాడు చెబితే తప్ప
ఇతరులు మాట్లాడలేదు
వాళ్ళకి ధైర్యమూ రాలేదు

ఇప్పుడు
మీ నలుగురు
ఆ ధైర్యాన్నిచ్చారు
సంతోషం!

అందుకే మిలార్డ్!
అప్పుడప్పుడూ మాట్లాడుతూ వుండండి


అప్పుడెప్పుడో
ఓ కవి మిత్రుడన్నాడు-
'కుర్చీ మీద మూడు తలల రాజసింహం
నిఘా వేసుక్కూర్చుంటుంది' అని
అది అబద్ధమై పోవాలని
తరుచూ అన్పిస్తుంది
అది అబద్ధం చేయడానికైనా
అప్పుడప్పుడు.. మాట్లాడుతూ వుండండి

- రాజేందర్ జింబో, 94404 83001

(ఆ నలుగురు న్యాయమూర్తులకు, ముఖ్యంగా చలమేశ్వర్ గారికి)

మన తొలి నవల 'ఆశాదోషము'

తెలంగాణ సాహిత్యాన్ని పరిశోధిస్తున్న సాహితీవేత్తలు, పరిశోధకులు తెలంగాణ తన అస్తిత్వాన్ని చాటుతున్న సందర్భంలో రాత ప్రతులను వెలుగులోకి తెస్తున్నారు. అట్లా తెలుగు సాహిత్యంలో ఇప్పటికే ముద్రపడిపోయిన అనే ప్రక్రియలకు తెలంగాణ సాహిత్యం కేంద్ర బిందువు కావడం గమనించాల్సిన విషయం. ఎవరికివారు ఇదే తొలి రచన అంటూ పేర్కొంటూ వ్యాసాలు, వ్యాఖ్యానాలు రాస్తున్నారు. కానీ తెలంగాణ సాహిత్యాన్ని తవ్వుతున్నకొద్దీ వెలుగులోకి రాని ఎన్నో రచనలు వెలుగు చూస్తూనే ఉన్నాయి. అలాంటి వాటిలో తెలంగాణ నవల ప్రక్రియ ఒకటి. సాహిత్యాన్ని పరిశోధిస్తున్న వారందరూ తడకమళ్ల వారి 'కంబుకంధర చరిత్ర' రచననే పేర్కొంటున్నారు. అది అలభ్యము, అముద్రితము కూడా. అది యక్షగాన రచన శైలిలో ఉందని సాహితీవేత్తల అభిప్రాయం. (తడకమళ్లవారే స్వయంగా వచన ప్రబంధమని పేర్కొన్నారు) తెలంగాణ పరిశోధకులు మాత్రం కంబుకంధర చరిత్రనే తొలి నవలగా పేర్కొంటూ వస్తున్నారు. కానీ ఇది 8 అశ్వాసాల వచన ప్రబంధం. ఇందులో అక్కడక్కడ పద్యాలున్న ఇప్పటికిది అలభ్యంగా ఉందని పరిశోధకుడు సుంకిరెడ్డి నారాయణరెడ్డి తన ముంగిలి తెలంగాణ ప్రాచీన సాహిత్య చరిత్ర (పుట 652)లో ప్రస్తావించారనేది గమనించాల్సిన విషయం.



అయితే తెలంగాణలో తొలిపత్రిక హితబోధినిని వెలువరించిన బరారు శ్రీనివాస శర్మ 1910లోనే 'ఆశాదోషము' అనే నవలను రచించారు. ఇది నేటి వరకు అలభ్యంగానే, అముద్రితంగానే ఉన్నది. దీన్ని సేకరించి భద్రపరిచినవారు తాళపత్ర పరిశోధకుడైన నాగలింగ శివయోగి. వీరు దాదాపు 600 తాళపత్ర గ్రంథాలను అప్పట్లోనే సేకరించి తార్నాకలోని ప్రాచ్యలిఖిత భాండాగారానికి అప్పగించారు. నాగలింగ శివయోగి 60 ఏండ్లుగా ఆశాదోషము నవలను భద్రపరిచిండు. తెలంగాణ సాహిత్యంతో పాటు పాలమూరు సాహిత్యాన్ని తవ్వితీస్తున్న ప్రముఖ పాలమూరు పరిశోధకుడు భీంపల్లి శ్రీకాంత్ ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా తన సంపాదకత్వంలో ఈ నవలను వెలుగులోకి తీసుకువచ్చి వెలువరించడం అభినందించాల్సిన విషయం. వందేండ్ల కిందటనే రాయబడిన ఈ నవల తెలంగాణ తెలుగు ప్రపంచసభల సందర్భంగా వెలుగులోకి రావడం సంతోషించాల్సిన విషయం.

తెలంగాణ సాహిత్యాన్ని రాస్తున్న పెద్దలు కొందరు 'ఆశాదోషము' నవల పేరును ఎక్కడా కూడా పేర్కొనలేదు. మరికొందరు అలభ్యం, అముద్రితమని పేర్కొంటూ వస్తున్నారు. ఆంధ్రజ్యోతి సంపాదకులు కె.శ్రీనివాస్ కూడా తన పీహెచ్‌డీ సిద్ధాంత గ్రంథంలో ఆశాదోషము నవల అలభ్యమని, అముద్రితమని పేర్కొనడం గమనార్హం. సాహిత్య భీష్ముడు డాక్టర్ కపిలవాయి లింగమూర్తి ఆశాదోషం లిఖిత ప్రతిని తాను చూశానని, మహబూబ్‌నగర్ జిల్లా విజ్ఞాన సర్వస్వంలో 1993లోనే పేర్కొన్నారు. పరిశోధకుడు సంగిశెట్టి శ్రీనివాస్ కూడా ఆశాదోషము నవల కోసం విశ్వప్రయత్నం చేశాడు. ఆయనకు ఎక్కడా ఈ నవల లిఖితప్రతి దొరుకలేదు. ఈ ఆశాదోషము తొలి తెలంగాణ నవల ఇప్పటికైనా వెలుగుచూడటం కె.శ్రీనివాస్, సంగిశెట్టి శ్రీనివాస్ లాంటి వారికి ఆనందం కలిగించే విషయం. ఇలాంటి మరుగున పడి ఉన్న ఆణిముత్యాలను పరిశోధకులు వెలుగులోకి తీసుకురావాల్సిన అవసరం ఉన్నది. అప్పుడే సాహిత్యం సంపూర్ణంగా ఆవిష్కృతమవుతుంది. అప్పుడే తెలుగు సాహిత్యంలో తెలంగాణ సాహిత్యం జెండాలా రెపరెపలాడుతుంది.

తెలంగాణ తొలి తెలుగు పత్రికను వెలువరించిన బరారు శ్రీనివాసశర్మ పత్రికను వెలువరించకముందే 1910లో దీనిని రచించడం గొప్పవిషయం. ఈ నవల పూర్తిగా కోయిలకొండ దుర్గం చరిత్రను చాటి చెబుతుంది. ఇది సరళ గ్రాంథికంలో రచించబడిన నవల. నాటి కోయిలకొండ దుర్గాన్ని అసఫ్‌జాహీ వంశస్థులు ఎలా చేజిక్కించుకున్నారో ఈ నవల కళ్ళకు కడుతుంది. ఇది తెలంగాణ తొలి తెలుగు నవలనే కాదు తెలుగులో తొలి చారిత్రక నవల కూడా ఇదే కావ డం విశేషం. 20 ప్రకరణాలు గల ఈ నవల ఆద్యంతం ఉత్సుకతతో చదివిస్తుంది. ఇందులోని పాత్రలు, సన్నివేశాలు, సంఘటనలు అద్భుతంగా చిత్రీకరించబడ్డాయి. ఈ నవల పాఠకులను ఆగకుండా చదివిస్తుంది. తర్వాత ఏమవుతుందనే తాపత్రయాన్ని రచయిత కలిగించాడు. ఈ నవలను ఒక ప్రకరణం చదివి మూసివేయలేమని, తర్వాతి ప్రకరణంలో ఏం జరుగుతుందనే ఆతృతను రచయిత కల్పించాడని పుస్తక సంపాదకులు అభిప్రాయపడ్డారు. ఈ నవలలో యుద్ధాలే కాదు, ప్రేమలు ఉన్నాయి. మాయా పాత్రలున్నాయి, కపట వేషాధారణలున్నాయి. ఈ నవలను రాసిన శ్రీనివాస శర్మ దీన్ని ముద్రించే ప్రయత్నం చేయలేదు. హితబోధిని పత్రిక వ్యవహారంలో పడి ఈ నవలను పట్టించుకోలేదు.

> **వాస్తవానికి తడకమళ్ల వారి కంబుకంధర చరిత్ర తెలంగాణ తొలి నవల కాదు. అది యక్షగాన మూలాలున్న వచన ప్రబంధమే. బరారు శ్రీనివాసశర్మ రాసిన 'ఆశాదోషము' నవలనే తెలంగాణ తొలి నవలగా తెలంగాణ సాహిత్య నిర్మాతలు పేర్కొనవల్సిందే. శ్రీనివా సశర్మనే స్వయంగా దీన్ని నవల అని పేర్కొన్నాడు.**

వాస్తవానికి తడకమళ్ల వారి కంబుకంధర చరిత్ర తెలంగాణ తొలి నవల కాదు. అది యక్షగాన మూలాలున్న వచన ప్రబంధమే. బరారు శ్రీనివాసశర్మ రాసిన 'ఆశాదోషము' నవలనే తెలంగాణ తొలి నవలగా తెలంగాణ సాహిత్య నిర్మాతలు పేర్కొనవల్సిందే. శ్రీనివా సశర్మనే స్వయంగా దీన్ని నవల అని పేర్కొన్నాడు.

- డాక్టర్ గుంటి గోపి, 80198 08207



అలాంటి క్షణాలు

ఫ్యూరిఫికేషన్ ఏదో జరుగుతుంటుంది
తలమీది నుండి అరికాళ్ళ వరకూ.

గాలి పరిమళం కొద్దికొద్దిగా తాకి
ప్రాణస్పృహను తట్టిలేపుతుంటుంది.

ఒక ఆనందాశ్రువేదో రెడీ అవుతున్నట్లు
సంకేతం అందుతుంటుంది.

సుదీర్ఘ కాలంగా సుప్తావస్థలో వున్న రెక్కలు
టపటపా కొట్టుకుంటున్న చప్పుడు
వొంటి మీదుగా వలయాలుగా వ్యాపిస్తుంటుంది.

మెదడు స్తంభించడం అద్భుతమైన అనుభవమనీ,
అచేతనావస్థ ఒక అందివచ్చిన స్వర్గమనీ,
అర్థం అయ్యేలా మైకం కమ్మినప్పుడు...
లోకంలో ఇంకా ప్రేమ వుందేమోనని
అనుమానం పురి విప్పుతుంది.

సమాధానం దొరకాల్సిన అవసరం లేదు
ఒక్కొక్కప్పుడు సందేహం చాలు,
జీవితాన్ని మరికొంతకాలం పొడిగించుకోవడానికి.
మరికొంత గట్టిగా హత్తుకోవడానికి.

- మోహన్ రుషి, 83417 25452

కూల్ కుకుంబర్!

స్థితప్రజ్ఞత అన్నది చేతులు కట్టుకొని బుద్ధిగా
అతని వెనకాలే నడుస్తూ కాదు..
వెన్నంటే వుంటుంది!

ఎటువంటి చిన్నా-పెద్దా ఆగ్రహాన్నైనా అతడు
మర్యాద అనే సున్నితమైన కర (ర) చాలనంతో
దూరదూరం తొలగగొడుతూ వుంటాడు
అలసిపోని చిరునవ్వుల పెదాలకే హమేశా
పనిపెడుతూ సాగివస్తుంటాడు!

మాటకు కూడా మౌనాన్ని నేర్పే
హకీం కదా అతడు
మొదట పెట్టకముందే ఎవరిచేతనైనా సరే-
'అవున్నిజమే'ననిపించేందుకు
సిద్ధం చేస్తూ వస్తాడవతలివారిని!
ఉండవని కాదు అభిప్రాయభేదాలు
ఉండీ లేకుండానే పోతుంటామని ఎప్పటికప్పుడు-
తిరస్కరించలేని అతని తీర్మానాలను విని!!

మంత్రదండము వుండదు అతనివద్ద
మరే పరుషత్వాల దుడ్డుకర్రలూ వుండవుగాని-
అతడిని వినేవాటికల్లా ప్రతి వొక్కరూ
మరొక్కమారు
'అవున్నిజమే'నని తలాడిస్తూ వస్తుంటారు!

మంచికోపంగానో-ఫిర్యాదుతోనో-రుసా
అతనివద్దికి చేరేవారు 'చివరాఖరుకు'-
మనస్ఫూర్తిగా కరచాలనం చేసిమరీ
నిష్క్రమిస్తుంటారు..
ఇంపుగా అతని సముదాయింపులను విని
చాలినంత ప్రశాంతతను ముఖాలకు అద్దుకొని!

- వేణు సంకోజు, 99484 19881

పుస్తక ప్రదర్శన

మహానగరంలో మహావృక్షాలై
వెలసెను మహాగ్రంథాలు!
మహామహుల ఆశయాలై
ప్రతిబింబించెను పుస్తకాలు!
పొంగిపొర్లే ఆలోచనలకు.. నిలువెత్తు రూపాలు!
గుండెనిండే ఆవేదనలకు.. కలమెత్తు రూపాలు!
నిలువ నీడనివ్వడానికి
నిలువెల్లా విజ్ఞానం నింపడానికి,
కుంచించుకున్న మనసులను
మనోవికాసంతో పరిమళించటానికి,
దహించుకుపోయే దేహాలను
మనోస్థైర్యంతో నిలబెట్టేందుకు,
అగాథాలను అడ్డుగోడలను
అక్షరాలతో కూల్చేందుకు,
మేధావుల ప్రతిరూపాలైన.. నిత్య దీపాలు!
కలాల సేద్యంలో ఫలించిన.. అక్షరాల పంటలు!
రాసినవారంతా రాజులౌతారు
చదివినవారంతా మహారాజులౌతారు!
పుస్తకంతో పులకించుదాం
పుస్తకమై వెలిగించుదాం!

- పుట్టి గిరిధర్, 94914 93170



ఊరికి పోయిన యాళ్ల..

ఊరికి పోవడం అంటే .. 'ఊరికే' పోవడం కాదు
ఊపిరి కోసం పోవడం
తప్పని సరై తప్పకపోవడం కాదు.. గతి తప్పకుండా ఉండడం కోసం పోవడం
నగరం నదిలోనితెప్ప దారితప్పకుండా చూడడం కోసం పోవడం...

ఊరికి పోవడం అంటే.. చిరిగిన నెక్కర్‌లోని బాల్యాన్ని
గడీల బడి చూరులోంచి దిగిన సూర్యున్ని
పెద్దబడి బాదంచెట్టు నుండి రాలిన తరగతి పాఠాలని
ఒక్క సారి ఒడిసి పట్టుకోవడమే..
మంచి నీళ్ళ బాయిలోంచి సోపతిగాల్ల జ్ఞాపకాలని
బొక్కెనల కొద్దీ చేదుకోవడమే
మోదుగుచెట్టు ముదురుమట్టి ఎండుటాకుల్లోంచి
ఎండాకాలం సెలవుల వీరత్వాన్ని.. మరొక్క సారి తడిమిచూడటమే...
ఊరికి పోవడం అంటే..
మంగలి సమ్మయ్య కత్తెరనీ – మేర మదుసూదన్ మిషిన్ నీ
తమ్మల్ల లచ్మయ్య డోలునీ –బోయ కమ్లమ్మ బీడీలగంపనీ
కంచరి రాజయ్య నిప్పుల కొలిమినీ –కుమ్మరి ఓదెలు మట్టికుండలనీ
శాల నరసక్క ఆసుకొయ్యనీ–సదానందం మొగ్గంగుంటనీ
సుంకరి సారయ్య చాటింపునీ –కూనపెల్లి రామయ్య మార్కండేయపురాణాన్నీ
మాదిగ సాయిలు డప్పుసప్పుడునీ –పక్కీరు సాయెబు నెమలీకలకట్టనీ
తెనుగు శంకరి బొంబాయ్‌మిఠాయ్‌నీ –కాపు యాదగిరి గడ్డి వామునీ
తుర్క రబ్బానీ మామూఆటోనీ – గవుండ్ల రఘు బాబాయ్ జీపునీ
మడతలు పడ్డ మస్తిష్కంలోంచి మళ్ళీ వెలికి తీయడమే...

బాల సంత శంకరయ్య ఊదిన శంఖునాదాన్ని వింటూ
పంబాల రాజనర్సు జమిడీకసప్పుడుని తడుతూ
పట్వారి పాపిరెడ్డి పట్టా బుక్కులని చూస్తూ
మచ్చగిరి గుడిశిఖరం మీది మైకు లోంచి.. వేకువ జాము గాలుల్లో తేలి వచ్చే
పడవెల్లి పోతొందిరా.. ఓ మానవుడా.. పాటలని పాడుకుంటూ
దేవుని చెరువు కట్టను మళ్ళీ దాటడమే...

అడుగు పెట్టీ పెట్టగానే.. ఊరిమట్టిని దేహంనిండా పులుముకుని
ఆ మట్టిబురదని అత్తరులా అంగీపై చల్లుకొని
లుంగీని ఎగగట్టి ములుగర్రను చేతినబట్టి
దుక్కిదున్ని– మడులుగట్టి– మట్టిఅడుగున దాగిఉన్న
నా ఊరిజ్ఞాపకాలను తవ్విపోసి
వాటిలో వర్తమానం వరిమొక్కలను నాటుతాను...


నేనిప్పుడు నిలువుగా ఎదిగిన చెట్టుని
మబ్బులదాకా ధ్వనిస్తున్న ఆకు పాటని
చిటారు కొమ్మల్లో కూచుని ఉన్నా.. చెట్టు వేళ్ళలోకే ఒలికిపోతాను
మట్టిమూలాలలోనే ఒదిగిపోతాను
పెరిగి పెరిగి – తిరిగి తిరిగి – కరిగి కరిగి– జరిగి జరిగి
పాదాలతో కొలతలు మొదలెట్టిన నేలపైకే.. మళ్ళీ వస్తాను...
డాలర్ సునామీకి చెల్లా చెదురై
చెదిరి పోయిన ఇసుక గూడుని పదేపదే నిర్మిస్తాను
మళ్ళీ ఊరికే వస్తాను.. మళ్ళీ మళ్ళీ ఉరికురికి వస్తాను
ఊరికి రావడం అంటే.. 'ఊరికే ' రావడం కాదు–
బస్ పాస్, పాస్ పోర్ట్, వీసాలను రీన్యూ చేసుకున్నట్లు
నా ఐడెంటిటీని మళ్ళీ పొడిగించుకోవడం...!
పొగ చూరిన ఊపిరి తిత్తుల నిండా
తంగేడు పూల వాసనని మురిపెంగా నింపుకోవడం ...!

– మామిడి హరికృష్ణ, 99088 44222

కవితా బీజాక్షరాలు చల్లిన 'మిర్గం'

మండుటెండలతో అల్లాడుతున్న ప్రజలను చినుకై పలుకరించేది (మృగశిర)'**మిర్గం**'. నీటిచుక్కను అందించేంది మిర్గం. ఆహ్లాదపరిచేది మిర్గం. కొత్త రుతువుకు సూచిక మిర్గం. కొత్త పంటకు బీజం వేసేది మిర్గం. తెలంగాణ గడ్డ పై చల్లిన కవితా విత్తనాలకు అద్దంపట్టేది '**మిర్గం**' కవితా సంపుటి. వందకు పైగా కవుల సేద్యం 'మిర్గం'.

'**మిర్గం**' తెలంగాణ సంస్కృతికి జీవనాడి. ఆదినుంచి మిర్గాన్ని ఉత్సవంగా జరుపుతున్న చరిత్ర తెలంగాణలో ఉన్నది. సంప్రదాయాన్ని గౌరవించి, వసంతోత్సవాలను గొప్పగా నిర్వహించిన కుతుబ్‌షాహీ రాజులు '**మృగశిర**'ను కూడా ఘనంగా నిర్వహించేవారని చరిత్ర చెబుతున్నది.



'తెలంగాణ సాహిత్య కళావేదిక' రెండేండ్ల కిందట 2015 ఫిబ్రవరి 22న ప్రముఖ దర్శకులు బి.నర్సింగరావు ఆధ్వర్యంలో ప్రారంభమైంది. అదేరోజు '**తెలంగాణ కవిత**' పేరుతో డాక్టర్ నాళేశ్వరం శంకరం, డాక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి, డాక్టర్ గంటా జలంధర్‌రెడ్డి ఆధ్వర్యంలో బృహత్ కవి సమ్మేళనాన్ని నిర్వహించింది. ఆ రోజు 76 మంది కవులు కవితాగానం చేశారు. అనంతరం మరో 26 మంది కవులు తమ కవితలను అందజేశారు. ఆ కవితల సంకలనమే '**మిర్గం**'.

'**తెలంగాణలో కవి సమ్మేళనాలు**' పేరుతో ప్రముఖ కవి, కాళోజీ అవార్డు గ్రహీత డాక్టర్ అమ్మంగి వేణుగోపాల్ ఈ కవితా సంపుటికి రాసిన ముందుమాట తెలంగాణలో కవి సమ్మేళనాల చరిత్రను వివరిస్తుంది. 1947 స్వాతంత్ర్య దినోత్సవం, 1948 నిజాం రాజ్యపతనం, 1953 హైదరాబాదు రాష్ట్రావతరణ ఈ మూడు సందర్భాల్లోనూ జరిగిన కవి సమ్మేళనాలు తెలంగాణలోని బహుభాషా వాతావరణానికి అద్దంపడుతాయి. ఆయా సందర్భాల్లో మరాఠీ, కన్నడ, బెంగాలీ, ఉర్దూ భాషల్లో కవి సమ్మేళనాలు జరిగిన విషయాన్ని వివరిస్తూ దాశరథి వ్యాసాలు రాశారని అమ్మంగి పేర్కొన్నారు. 1948కి పూర్వం కూడా మొజాంజాహీ కొలువులో రాత్రి పొద్దుపోయే దాకా ముషాయిరాలు జరిగేవి.

కాళోజీ రచించిన '**నా గొడవ**'ను ఆలంపూర్‌లో జరిగిన సాహిత్య సభల్లో శ్రీశ్రీ ఆవిష్కరించడం తెలంగాణ సాహిత్య చరిత్రలో ముఖ్యమైన ఘటన. అప్పటి విషయాలను పేర్కొన్న సమగ్రమైన ముందుమాట 'తెలంగాణలో కవి సమ్మేళనాలు'. తెలంగాణలో కవి సమ్మేళనాలకు సంబంధించి అనేక ఆసక్తికరమైన విషయాలను ఈ ముందుమాటలో అమ్మంగి వేణుగోపాల్ వివరించారు. రెండువేల ఏండ్ల క్రితమే తెలంగాణలో కవి సమ్మేళనాలు జరిగి ఉంటాయని పరిశోధనాత్మకంగా నిరూపించారు. హాలుని కాలంలో కరీంనగర్ జిల్లాలోని కోటి లింగాలలో గానీ, మెదక్ జిల్లా (ప్రస్తుతం సంగారెడ్డి జిల్లా) కొండాపూర్‌లో గానీ తొలి కవి సమ్మేళనాలు జరిగి ఉంటాయని ఆయన అభిప్రాయపడ్డారు. 1953లోనే వివిధ రాష్ట్రాల్లో తెలంగాణ కవులు ప్రతిభ చూపిన విషయాన్ని తెలిపారు. హైదరాబాదులో '**గీత్ చాందినీ**' పేరుతో ప్రతి పున్నమి రాత్రి వెన్నెలలో కవి సమ్మేళనాలు జరిగేవన్న విషయం ఆసక్తికరం. రాష్ట్ర అవతరణ తర్వాత కవిత్వ రంగానికి భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ చేసిన సేవలను సంపాదకులు ప్రస్తావించడం సముచితంగా ఉన్నది.

కాళోజీ మిత్రమండలి, ఆర్ట్ లవర్స్, నెలనెలా వెన్నెల, కవి సంగమం, ఫోరం ఫర్ ఫ్రీడమ్ ఆఫ్ ఎక్స్‌ప్రెషన్, మంజీరా రచయితల సంఘం, ఎన్నీల ముచ్చట్లు, హైదరాబాద్ కవుల వేదిక తదితర బ్యానర్లపై కవి సమ్మేళనాల వివరాలను అమ్మంగి తెలిపారు. తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమాల్లో వెలువడిన కవిత్వాన్ని కూడా అమ్మంగి ప్రస్తావించారు. ఈ ముందుమాట తెలంగాణ కవిత్వ సంక్షిప్త చరిత్ర అనడం అతిశయోక్తి కాదు.

తెలంగాణ కవుల భావోద్వేగపూరిత కవిత్వం '**మిర్గం**'లో కనబడుతుంది. 'స్వార్థబీజాల్ని తవ్వి పారేసిన మాగాణిలో / సంక్షేమపు పాదుల్ని నాటండే / వికాసపు పైరులు వర్ధిల్లవు' అంటూ 'అరుదైన క్షణం' అనే కవితలో తెలంగాణ పునర్నిర్మాణానికి సూచనలందజేస్తారు ఎలనాగ. అమరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకోవాలనే సందేశం ఇస్తుంది బన్న అయిలయ్య కవిత 'కొత్త సూర్యోదయం'. ఏం చేసినా చేనేత కార్మికుల బతుకులు బాగుపడలేదనే బాధతో డాక్టర్ పులిపాటి గురుస్వామి రాసిన 'పోగుల గూడు' కవితలో దేవుడిని ఆక్షేపించడం కనబడుతుంది.

తెలంగాణ ఏర్పడ్డ ప్రస్తుత తరుణంలో ప్రభుత్వం 'తెలంగాణ అభివృద్ధికి తెగుల్లేమి పట్టకుండ/ రాజకీయ చీడలకు తగిన మందెయ్యాలని' బలంగా చెప్తారు 'తెలంగాణ సంబరం' అనే కవితలో డాక్టర్ బండారి సుజాత. 'ప్రజల మనసును డీకోడ్ చేసే విద్య నీకు తెలుసు /అందుకే ప్రజల మనిషివి అయ్యావు' అని వట్టికోట ఆళ్వారు స్వామిపై స్మృతి కవిత 'సూర్యుని వెలిగించిన వీరుడు' అనే శీర్షికతో రాశారు అయినంపూడి శ్రీలక్ష్మి. ప్రముఖ సినీ దర్శకులు బి.నరసింగరావు 'వేపచెట్టు' కవితలో 'రెండు చేతులా / విసనకర్రల్తో / గాలి విసిరే వేపచెట్టే / నా జ్ఞాపకం' అంటారు. రైతు విలువ తెలియజేసే గొప్ప కవిత డాక్టర్ తూర్పు మల్లారెడ్డి రాసిన 'సేద్య శిల్పి'.

> **తెలంగాణ కవులు రాస్తున్న కవిత్వంలో పెరిగిన వస్తు ప్రాధాన్యానికి ఒక సూచికగా 'మిర్గం' నిలుస్తుంది. కేవలం వచన కవిత్వ రూపంలోనే కాకుండా పద్య రూపంలోనూ, పాట రూపంలోనూ కూడా తెలంగాణ కవుల సామర్థ్యానికి 'మిర్గం' చిత్రిక పడుతుంది.**

తెలంగాణ కవులు రాస్తున్న కవిత్వంలో పెరిగిన వస్తు ప్రాధాన్యానికి ఒక సూచికగా 'మిర్గం' నిలుస్తుంది. కేవలం వచన కవిత్వ రూపంలోనే కాకుండా పద్య రూపంలోనూ, పాట రూపంలోనూ కూడా తెలంగాణ కవుల సామర్థ్యానికి 'మిర్గం' చిత్రిక పడుతుంది.

– డాక్టర్ రాయారావు సూర్యప్రకాశ్‌రావు
94410 46839



'జలగీతం' కావ్యానికి జైని సాహితీ పురస్కారం

జైని ఇంటర్నేషనల్ ఫౌండేషన్ వారి లక్ష్మీనారాయణ జైని జాతీయ సాహితీ పురస్కారం-2018ని డాక్టర్ ఎన్.గోపి 'జలగీతం' కావ్యానికి ప్రకటించటం జరిగింది. పురస్కార పదానోత్సవం జనవరి 29 సాయంత్రం 6గంటలకు హైదరాబాద్ రవీంద్రభారతిలో జరుగుతుంది. అందరికి ఆహ్వానం.

-ప్రభాకర్ జైని, జైని ఇంటర్నేషనల్ ఫౌండేషన్ జాతీయ చైర్మన్,
బిక్కి కృష్ణ, జైని ఇంటర్నేషనల్ ఫౌండేషన్ జతీయ ప్రధానకార్యదర్శి

జీవితం కలకాలం

నిన్న రేపటి తీగల వారధి మీద
ఒడుపుగా పయనించటం
జీవితం..

కాలం
విధి కాదు
ఆకాశమల్లెలా
రాలే చుక్క లాగుండదు
ఎక్కేపొద్దు మంటోలే
ముప్పిరిగొన్న దప్పిలాగుంటది

కల తామరాకుమీద జారే
నీటిబొట్టా?
ఆత్మ సొంచాలో అద్దిన
పాలకోవా బిళ్ళ

ఆశయం
మనసు చెవిలో గూడుకట్టుకున్న
శబ్దశ్వాశ ప్రకంపన
నిండుగర్భిణి ఒడిలో
పొద్దులమల్లె

కల, కాలం..
రెమ్మలిచ్చిన విత్తనం మట్టిస్నేహికలు..
అపురూపంగా దిద్దుకునే
కాలంకారీ చిత్రీకలు.

– బెల్లంకొండ సంపత్‌కుమార్
99085 19151

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.437, Near Velama Kalyana Mandapam, Devara Yamjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078,
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.



కాబూల్ కాంటినెంటల్ హోటల్ వెలుపల మోహరించిన భద్రతా బలగాలు

కాబూల్ ఉగ్రదాడిలో 43 మంది మృతి

కాంటినెంటల్ హోటల్‌లో ఉగ్రవాదులు, భద్రతా బలగాల మధ్య 13 గంటలకుపైగా సాగిన ఎదురు కాల్పులు

కాబూల్: ఆఫ్ఘనిస్థాన్ రాజధాని కాబుల్ నగరంలోని ఇంటర్ కాంటినెంటల్ హోటల్‌పై మరోసారి ఉగ్రదాడి జరిగింది. దాడిలో 43 మంది మృతి చెందగా, పలువురు గాయ పడ్డారు. శనివారం రాత్రి హోటల్‌లోకి ప్రవేశించిన నలుగురు సాయుధ ముష్కరులు బీభత్సం సృష్టించారు. తామే ఈ దాడి చేశామని తాలిబన్ అధికార ప్రతినిధి జాబిహుల్లా ముజాహిద్ ప్రకటించారు. హోటల్‌లోకి ప్రవేశించిన ఉగ్రవాదులు గదుల్లో బస చేసిన వారిపై విచక్షణారహితంగా కాల్పులు జరుపుతూ గ్రనేడ్ దాడులకు పాల్పడ్డారు. మృతుల్లో 14 మంది విదేశీయులు, ఒక మహిళ ఉన్నారని ఆఫ్ఘన్ అంతరంగిక వ్యవహారాలశాఖ అధికార ప్రతినిధి నజీబ్ దానిష్ ఆదివారం చెప్పారు. మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉన్నది. ముష్కరులను మట్టుబెట్టేందుకు ఆఫ్ఘన్ భద్రతా దళాల జవాన్లు హెలికాప్టర్ సాయంతో హోటల్ భవనం పైనుంచి లోపలకు ప్రవేశించారు. ఒకవైపు 150 మంది సందర్శకులను సురక్షితంగా బయటకు పంపేసిన భద్రతా బలగాలు.. 13 గంటలకు పైగా శ్రమించి ముష్కరులను మట్టుబెట్టాయి. కాగా, ఉగ్రవాదుల దాడి నుంచి తప్పించుకోవడానికి పర్యాటకులు బెడ్ షీట్ల సాయంతో బెడ్ల కిందకు దూరారు. మరికొందరు బెడ్‌షీట్ల సాయంతో కిందకు దూకి తప్పించుకున్న దృశ్యాలను స్థానిక మీడియా ప్రసారం చేసింది. కాహీరాత్ రాష్ట్రంలో రోడ్డు వెంట ఆదివారం తెల్లవారుజామున బాంబు పేలిన ఘటనలో 12 మంది పౌరులు చనిపోయారు. మరో 13 మంది గాయపడ్డారు. గుల్‌రాన్ జిల్లాలో రోడ్డుపై పాతిన మందుపాతరపై వాహనం వెళ్లడంతో పేలుడు సంభవించిందని పోలీస్ ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. ఈ దాడికి ఎవరూ బాధ్యత వహించలేదన్నారు.

2019 ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తుకు సీపీఎం నో

ఏచూరిపై ఆధిక్యం సాధించిన ప్రకాశ్‌కరత్



ప్రకాశ్ కరత్ — సీతారాం ఏచూరీ

న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీతో 2019 లోక్‌సభ ఎన్నికల్లో పొత్తు పెట్టుకోరాదని సీపీఎం నిర్ణయించింది. కోల్‌కతాలో జరిగిన సీపీఎం కేంద్ర కమిటీ సమావేశాల్లో ఈ మేరకు ఆదివారం ఒక తీర్మానాన్ని ఆమోదించింది. కాంగ్రెస్ పార్టీతో ఎటువంటి పొత్తు పెట్టుకోరాదని సీపీఎం మాజీ ప్రధాన కార్యదర్శి ప్రకాశ్‌కరత్ వర్గం వాదించినట్లు సమాచారం. ప్రస్తుత పార్టీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరీ ఆధ్వర్యంలోని మరో గ్రూప్.. బీజేపీని వ్యూహాత్మకంగా ఎదుర్కొనేందుకు కాంగ్రెస్ పార్టీతో మెతక వైఖరి ప్రదర్శించాలని ప్రతిపాదించినట్లు తెలిసింది. దీంతో ఇరు వర్గాలు ప్రవేశ పెట్టిన తీర్మానాల్లో కరత్ గ్రూప్ ప్రవేశపెట్టిన తీర్మానం 55 – 31 తేడాతో ఆమోదించినట్లు సమాచారం. ఏప్రిల్‌లో హైదరాబాద్‌లో జరిగే సీపీఎం అఖిల భారత సదస్సులో పార్టీ వ్యూహాత్మక వైఖరిని ప్రతిబింబిస్తూ ఇదే తీర్మానాన్ని ఆమోదిస్తారని తెలియ వచ్చింది. మూడు రోజులుగా జరిగిన కేంద్ర కమిటీ సమావేశాల్లో కరత్, ఏచూరీ వర్గాల మధ్య విభేదాలు బహిర్గతమైనట్లు సమాచారం. 2014 నుంచి ఈ అంశాన్ని పరిష్కరించుకునేందుకు పలు దఫాలుగా జరిగిన సీపీఎం పొలిట్‌బ్యూరో, కేంద్ర కమిటీ సమావేశాల్లో చర్చ జరిగినట్లు వినికిడి. అధికార బీజేపీ నయా ఉదారవాద విధానాలను ఎదుర్కొనేందుకు కాంగ్రెస్ పార్టీతోపాటు ఇతర లౌకిక పార్టీలను కలుపుకుని ముందుకు సాగాలన్న వైఖరిని పార్టీ సిద్ధాంత వ్యూహకర్తలు గట్టిగా ప్రతిఘటించారని తెలుస్తున్నది. ఏచూరీ ప్రతిపాదించిన తీర్మానంలో అన్ని లౌకిక శక్తులతో కలిసి వామపక్ష ప్రజాతంత్ర కూటమి ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. దీనిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం కావడంతో పాలక పార్టీలను కూటమిలో కలుపుకోరాదని అంగీకరించినా.. పొత్తు పెట్టుకోవాలన్న ప్రతిపాదన తెచ్చారు. కానీ ఏ రకంగానూ కాంగ్రెస్ పార్టీతో పొత్తు ఉండరాదని కరత్ వర్గం వాదిస్తున్నది.

మహారాష్ట్రలో స్వల్ప భూకంపం

పుణె: మహారాష్ట్రలోని కొయనా డ్యాం సమీపంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం స్వల్ప భూకంపం సంభవించినట్టు వాతావరణశాఖ అధికారులు తెలిపారు. భూకంప ప్రభావం రిక్టర్ స్కేల్‌పై 3.6గా నమోదైందన్నారు. భూకంపం వల్ల ఎటువంటి ప్రాణ, ఆస్తినష్టం సంభవించలేదని తెలిపారు. ఉదయం 11:36 గంటల ప్రాంతంలో ప్రకంపనలు చోటుచేసుకున్నాయని వివరించారు. భూకంప కేంద్రం భూ ఉపరితలం నుంచి 10 కిలోమీటర్ల లోతున ఉన్నట్టు వెల్లడించారు.

పటాకుల కర్మాగారం యజమాని అరెస్ట్

మృతుల కుటుంబాలను పరామర్శించిన లెఫ్టినెంట్ గవర్నర్




దవాఖానా వద్ద రోదిస్తున్న మృతుని భార్య

న్యూఢిల్లీ: ఢిల్లీలోని బావన పారిశ్రామిక ప్రాంతంలో శనివారం జరిగిన అగ్ని ప్రమాదానికి సంబంధించి పటాకుల కర్మాగారం యజమాని మనో జ్ జైన్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘట నలో 17 మంది సజీవదహనమైన విషయం తెలిసిందే. తక్కువ తీవ్రత కల పటాకులను తయారు చేసే లైసెన్స్‌ను కర్మాగారం కలిగి ఉన్నదని పోలీసులు చెప్పారు. ప్రమాద స్థలాన్ని పరిశీలించగా ప్యాకింగ్ చేసిన పటాకులు దొరికాయన్నారు. కర్మాగారాన్ని మనోజ్ జైన్ ఈనెలలోనే కిరాయికి ఇచ్చాడన్నారు. భవనం గ్రౌండ్ ఫ్లోర్‌లోని స్టోరేజీ యూనిట్‌లో మంటలు చెలరేగాయని, నిమిషాల వ్యవధిలో భవనమంతా వ్యాపించాయని వివరించారు. 17 మంది మృతుల్లో 10 మంది మహిళలేనన్నారు. మరోవైపు ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబసభ్యులను ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ అనిల్ బైజల్ పరామర్శించారు. ఆయన వెంట ఉన్న రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యేంద్ర జైన్ మీడియాతో మాట్లాడుతూ నిందితులు ఎంతటివారైనా వదిలిపెట్టేది లేదని చెప్పారు. ఈ ప్రమాదంలో ఐదు నెలల గర్భిణి మృతి చెందారు. 21 ఏండ్ల వయస్సున్న సోని కర్మాగారంలో కార్మికురాలిగా పనిచేస్తున్నారు. ఆమె తన మొదటి బిడ్డకు మరికొన్ని నెలల్లో జన్మనిచ్చేవారు. కానీ, దురదృష్టవశాత్తు ప్రమాదంలో ప్రాణాలుకోల్పోయారు.

'నిజాం ముకరం జా' గుర్తింపు రికార్డులేవి?

హోంశాఖను ప్రశ్నించిన కేంద్ర సమాచార కమిషన్.. వెతికిపట్టుకుని అప్పగించాలని ఆదేశం



ముకరం జా

న్యూఢిల్లీ, జనవరి 21: హైదరాబాద్ సంస్థాన పాలకుడిగా మీర్ బర్కత్‌అలీఖాన్ (నవాబ్ ముకరం జా బహద్దూర్)ను గుర్తించిన ప్రభుత్వ రికార్డులు ఎక్కడున్నాయని కేంద్ర సమాచార కమిషన్ (సీఐసీ) కేంద్ర హోంశాఖను ప్రశ్నించింది. 50ఏండ్లక్రితం నాటి కీలకమైన ఆ దస్త్రాల గురించి తమకు తెలియదన్న హోంశాఖ సమాధానాన్ని సీఐసీ తప్పుపట్టింది. చారిత్రక ప్రాధాన్యమున్న కీలకమైన ఫైళ్లను గుర్తించి వాటిని నేషనల్ ఆర్కైవ్స్‌కు అప్పగించాలని, అందుకోసం ఓ కమిటీని వేయాలని సమాచార కమిషనర్ యశోవర్ధన్ ఆజాద్ సూచించారు. ఈ మేరకు ఆయన హోంశాఖ కార్యదర్శికి ఉత్తర్వులు జారీ చేశారు. హైదరాబాద్ సంస్థానానికి చివరి రాజైన మీర్ ఉస్మాన్ అలీఖాన్.. తన వారసుడిగా మనుమడు ముకరంజాహ్‌ను గుర్తించాలంటూ భారత ప్రభుత్వాన్ని కోరారు. ఈమేరకు ప్రిన్స్ మీర్ బర్కత్‌అలీఖాన్ (ముకరం జా బహద్దూర్)ను 'నిజాం ఆఫ్ హైదరాబాద్'గా గుర్తిస్తూ నిజాం మరణించిన రోజు (1967 ఫిబ్రవరి 24) నుంచీ ఆ హోదాలో కొనసాగేందుకు వీలుగా కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఉస్మాన్ అలీఖాన్ మరణం తర్వాత నిజాం వారసుల్లో గొడవలు మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో ఆర్టికల్ 366(22) కింద 1967లో జారీ అయిన సర్టిఫికెట్ కాపీని పొందిన సయ్యద్ ఖాలిక్ అనే వ్యక్తి దానికి సంబంధించిన ప్రభుత్వ దస్త్రాల కాపీలను కోరుతూ సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేసుకున్నాడు. అయితే ఆ రికార్డులేవీ కనబడటం లేదని కేంద్ర హోంశాఖ సమాధానమివ్వగా, ఆ ఫైళ్లు తమ వద్దకు రాలేవంటూ నేషనల్ ఆర్కైవ్స్ తెలిపింది. దీనిపై ఆయన కేంద్ర సమాచార కమిషన్‌ను ఆశ్రయించాడు. ముకరంజాహ్‌కు ఆ హోదాతో సర్టిఫికెట్ అందజేసినట్లు రికార్డుల్లో ఉన్నందున అది కచ్చితంగా హోంశాఖ వద్దే ఉండి ఉండాలని సమాచార కమిషనర్ యశోవర్ధన్ ఆజాద్ అభిప్రాయపడ్డారు. ఆ పత్రాలను వెతికిపట్టుకోవాలని హోంశాఖను ఆయన ఆదేశించారు.

నూతన సీఈసీగా ఓంప్రకాశ్ రావత్

23నుంచి బాధ్యతల్లోకి ● ఎన్నికల కమిషనర్‌గా అశోక్ లవాసా



ఓంప్రకాశ్ రావత్



అశోక్ లవాసా

న్యూఢిల్లీ: ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ)గా ఓంప్రకాశ్ రావత్ నియమితులయ్యారు. మంగళవారం ఆయన సీఈసీగా బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈమేరకు న్యాయమంత్రిత్వశాఖ ఆదివారం నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రస్తుతం ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా ఉన్న అచల్ కుమార్ జోతి పదవీకాలం సోమవారంతో ముగియనున్న నేపథ్యంలో తదుపరి సీఈసీగా రావత్‌ను నియమించారు. 64 ఏండ్ల రావత్ 1977 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి.ఆయన 1993లో భారత రక్షణశాఖలో డైరెక్టర్‌గా, 1994లో దక్షిణాఫ్రికా ఎన్నికల్లో ఐరాస తరఫు పరిశీలకుడిగా విధులు నిర్వర్తించారు. 2004–2006 మధ్య మధ్యప్రదేశ్ సీఎం గా బాబూలాల్ గౌర్ ఉన్నప్పుడు రావత్ ఆ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. ముగ్గురు సభ్యుల ఎన్నికల కమిషన్ నుంచి ఓంప్రకాశ్ రావత్ ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా పదోన్నతి పొందడంతో ఆ స్థానంలో ఆర్థిక మంత్రిత్వశాఖ మాజీ కార్యదర్శి అశోక్ లవాసాను ప్రభుత్వం నియమించింది. ఆయన కూడా ఈనెల 23న ఈసీగా బాధ్యతలు స్వీకరిస్తారు.

నేటి నుంచి దావోస్ సదస్సు

ప్రధాని మోదీ సారథ్యంలో 130 మంది భారతీయ ప్రతినిధులు

21 ఏండ్ల తర్వాత తొలిసారి డబ్ల్యూఈఎఫ్‌కు భారత ప్రధాని

డబ్ల్యూఈఎఫ్ ప్రతినిధులకు 'యోగా'లో శిక్షణా తరగతులు

పర్యావరణం, సంపన్న దేశాల్లో ఆర్థిక అసమానతలే ప్రధాన ఎజెండా

తెలంగాణ నుంచి ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ హాజరు



న్యూఢిల్లీ, జనవరి 21:

స్విట్జర్లాండ్‌లోని దావోస్ నగరంలో సోమవారం నుంచి ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) 48వ వార్షిక సదస్సు ప్రారంభం కానున్నది. ఐదు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో ప్రపంచం నలు మూలల నుంచి విభిన్న సంస్కృతులకు ప్రాతినిధ్యం వహిస్తున్న దేశాల నుంచి వివిధ వర్గాల ప్రతినిధులు 3000 మందికి పైగా పాల్గొననున్నారు. ఈ సందర్భంగా విడుదల చేసే సర్వేతోపాటు పారిశ్రామిక, ఆర్థిక ప్రగతి సాధనలో పర్యావరణం, ఆర్థిక, అంతర్జాతీయ సంబంధాల్లో తలెత్తే సమస్యలు, సంపన్న దేశాల మధ్య రాజకీయ, ఆర్థిక విభేదాలపైనా సదస్సులో సవివరంగా చర్చిస్తారు. 130 మంది ప్రతినిధి బృందంతో ఆదివారం ప్రధాని నరేంద్రమోదీ దావోస్‌కు చేరుకున్నారు. అంతకుముందు ఆయన ఒక ప్రకటన చేస్తూ ఈ సదస్సులో ప్రస్తుతం ప్రపంచ దేశాలు ఎదుర్కొంటున్న, ఎదురు కానున్న సవాళ్లు, వాటికి పరిష్కారాలపై సీరియస్‌గానే దృష్టి సారిస్తామని తెలిపారు. ప్రస్తుతం జపాన్ పర్యటనలో ఉన్న తెలంగాణ ఐటీ, మున్సిపల్ శాఖల మంత్రి కే తారక రామారావు కూడా సదస్సులో పాల్గొనేందుకు దావోస్ బయలుదేరి వెళ్లారు.

డబ్ల్యూఈఎఫ్ చైర్మన్ స్వాగతంతో ప్రారంభం

సోమవారం డబ్ల్యూఈఎఫ్ చైర్మన్ క్లాజ్ స్క్వాబ్ స్వాగతోపన్యాసంతో సదస్సు ప్రారంభమవుతుంది. ఆయన తన సందేశంలో సదస్సు ఉద్దేశాన్ని తెలియజేస్తారు. తర్వాత బాలీవుడ్ సూపర్ స్టార్ షా రూఖ్‌ఖాన్, ఆస్ట్రేలియా సినీ నటి కేట్ బ్లాం చెట్, ప్రముఖ సంగీత దర్శకుడు ఎల్టన్ జాన్‌లకు ఆయా రంగాల్లో విశేష సేవలందించినందుకు 'క్రిస్టల్ అవార్డులు' ప్రదానం చేస్తారు. సోమవారం సాయంత్రం సంగీత నృత్యరూపకం ఉంటుంది. మరోవైపు భారత్.. సదస్సుకు హాజరైన అతిథులకు ఆతి థ్యమివ్వనున్నది. మంగళవారం జరిగే ప్లీనరీ సదస్సులో ప్రధాని మోదీ తన ప్రారంభోపన్యాసంలో అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ పురోభివృద్ధికి భారత్ చోదక శక్తిగా ఉంటుందని పేర్కొంటూ విదేశాల నుంచి పెట్టుబడులను ఆహ్వానిస్తారు.ఆర్బీఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ 21వ శతాబ్దిలో ఎదురయ్యే సవాళ్ల పరిష్కారాలు సూచిస్తారు.

పాక్ ప్రధాని అబ్బాసీతో భేటీ షెడ్యూల్ లేనట్లే!

డబ్ల్యూఈఎఫ్ సదస్సు ముగింపు సమావేశంలో పాల్గొనే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ప్రధాని మోదీ భేటీ అయ్యే అవకాశాలు లేవు. పాక్ ప్రధాని షాహిద్ ఖఖాన్ అబ్బాసీ కూడా హాజరైనా ఆయనతో మోదీ భేటీకి ప్రణాళికేమీ ఖరారు కాలేదని భారత్ అధికారులు స్పష్టం చేశారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. తన 'అమెరికన్ ఫస్ట్' పాలసీపై జర్మనీ, ఫ్రాన్స్, బ్రిటన్‌లతోపాటు ప్రపంచ దేశాల అధినేతలు ఎలా ప్రతిస్పందిస్తారన్న అంశంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

ప్రధాన ఆకర్షణ కానున్న మోదీ సందేశం

స్వీయాభివృద్ధితోపాటు ప్రపంచ దేశాల ఆర్థిక పురోగతికి భారత్ చోదక శక్తిగా నిలుస్తుందన్న ప్రధాని మోదీ సందేశమే ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందని కేంద్ర ప్రభుత్వ అధికారులు చెప్తున్నారు. 1997లో అప్పటి ప్రధాని హెచ్‌డీ దేవెగౌడ తర్వాత డబ్ల్యూఈఎఫ్ సదస్సుకు హాజరవుతున్న తొలి ప్రధానిగా మోదీ మరో రికార్డు నెలకొల్పనున్నారు. ప్రపంచంలోని 60 కార్పొరేట్ సంస్థల సీఈవోలకు ప్రధాని మోదీ విందునిస్తారు. 120 మంది వ్యాపార, వాణి జ్య ప్రతినిధులతోనూ ఇష్టాగోష్ఠిగా భేటీ కానున్నారు. ప్రధాని మోదీ వెంట కేంద్ర మంత్రులు అరుణ్ జైట్లీ, సురేశ్ ప్రభు, పీయూష్ గోయల్, ధర్మేంద్ర ప్రధాన్, ఎంజే అక్బర్, జితేంద్ర సింగ్, కార్పొరేట్ సంస్థల అధినేతలు ముఖేశ్ అంబానీ, గౌతం ఆదానీ, అజీం ప్రేమ్‌జీ, రాహుల్ బజాజ్, చంద్రశేఖరన్, వివిధ సంస్థల సీఈవోలు చందాకొచ్చర్, ఉదయ్ కొటక్, అజయ్ సింగ్ ఉన్నారు. స్విట్జర్లాండ్ అధ్యక్షుడు అలైన్ బెర్సెట్, తదితర దేశాధినేతలతోనూ ద్వైపాక్షిక అంశాలపై మోదీ చర్చిస్తారు.

డబ్ల్యూఈఎఫ్ సదస్సుకు హాజరైన ప్రతినిధులకు తొలిసారి యోగాలో శిక్షణ ఇవ్వనున్నారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం శిక్షణ ఉంటుంది. యోగాలో శిక్షణ ఇచ్చేందుకు పతంజలి యోగా గురువులు ఆచార్య భరద్వాజ్, ఆచార్య స్మిత్ ఇప్పటికే దావోస్‌కు చేరుకున్నారని యోగా గురువు రాందేవ్ బాబా ట్వీట్ చేశారు. కాగా,

తొలిసారి యోగాపై శిక్షణ

స్విట్జర్లాండ్ ప్రభుత్వం.. డబ్ల్యూటీవో సభ్యదేశాల మంత్రులతో నిర్వహించే ఇష్టాగోష్ఠి సమావేశానికి కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి సురేశ్ ప్రభు హాజరవుతారు. రైల్వే, బొగ్గు గనుల శాఖ మంత్రి పీయూష్ గోయల్.. జపాన్ బ్యాంక్ ఆఫ్ ఇంటర్నేషనల్ కో ఆపరేషన్ (జేబీఐసీ) సీఈవో తడాషీ మైడా, బీజింగ్‌లోని ఆషియాన్ మౌలిక వసతుల పెట్టుబడి బ్యాంక్ అధ్యక్షుడు జిన్ లికున్‌తోపాటు కూడా పలు బహుళ జాతి సంస్థల అధినేతలతో సమావేశమవుతారు.

సరిహద్దు గ్రామాలు ఖాళీ

❑ రెచ్చిపోతున్న పాక్ దళాలు.. ఆర్నియాలో పౌరుని మృతి



జమ్ము: సరిహద్దు జనం బెంబేలెత్తేలా పాకిస్థాన్ కాల్పులకు తెగబడుతున్నది. కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తూ సరిహద్దు గ్రామాలే లక్ష్యంగా బుల్లెట్ల వర్షం కురిపిస్తున్నది. అంతర్జాతీయ సరిహద్దు, నియంత్రణ రేఖ వెంబడి ఉన్న గ్రామాలు బుల్లెట్లు, మోర్టర్ బాంబుల శబ్దాలతో దదరిల్లుతున్నాయి. గ్రామాల్లో రక్తపు మరకలు, తలుపులు విరిగి, పశువులు గాయపడి, గోడలకు రంధ్రాలు పడిన దృశ్యాలే కనిపిస్తున్నాయి. నాలుగోరోజు ఆదివారం కూడా నియంత్రణ రేఖ వెంట పాక్.. నౌషెర, రాజౌరి, అక్నూర్ సెక్టార్లపై పాక్ సైన్యం భారీగా కాల్పులకు పాల్పడింది. ఈ కాల్పుల్లో ఒకపౌరుడు మృతి చెందాడు. పూంచ్ జిల్లా మన్‌కోటె సెక్టార్‌లో గాయపడ్డ సైనికుడు సీకే రాయ్ చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందారు. దీంతో గురువారం నుంచి ఆదివారం వరకు మృతిచెందిన వారి సంఖ్య 11కు చేరిందని పోలీసులు తెలిపారు. ఆర్నియా పట్టణంతోపాటు సరిహద్దున ఉన్న కుగ్రామాలకు చెందిన 40 వేల మందికి పైగా స్థానికులను భారత సైన్యం సురక్షిత ప్రాంతాలకు తరలించింది. దీంతో సరిహద్దు గ్రామాలు నిర్మానుష్యమ య్యాయి. ఆర్నియా పట్టణం ఖాళీ అయింది. పాక్ సైనికులను దీటు గా ఎదుర్కొనేందుకు సరిహద్దు భద్రత దళాలు గ్రామాల్లో మోహరించాయి. 'తీవ్రంగా కాల్పుల శబ్దాలు వినిపిస్తుండటంతో కు టుంబసభ్యులమంతా కలిసి ఒక గదిలో మంచం కింద దాక్కున్నాం' అని సరిహద్దు గ్రామ వాసి యశ్‌పాల్ (80) చెప్పారు. ఇండ్లను వదిలిపోవద్దని భావించినా, రెండురోజులుగా కాల్పులు ఎక్కువయ్యాయని.. ఇండ్లు వదలడమే మంచిదని భావించామన్నారు. ఆర్నియాతోపాటు సరిహద్దు గ్రామాల ప్రజలను ఖాళీ చేయించి ఇతర ప్రాంతాలకు తరలించామని ఆర్‌ఎస్ పురా సబ్ డివిజనల్ పోలీస్ అధికారి సురేందర్ చౌదరి తెలిపారు. జమ్ములోని ఆర్నియా, సుచెత్‌గఢ్ సెక్టార్లలోని 58 గ్రామాలపై ప్రభావం పడిందని డిప్యూటీ కమిషనర్ కుమార్ రాజీవ్ రంజన్ తెలిపారు. ప్రభుత్వం పాఠశాలల్లో ఏర్పాటుచేసిన శిబిరాల్లో వెయ్యిమంది వరకు ఆశ్రయం పొందుతుండగా, ఎక్కువమంది వారి బంధువుల ఇండ్లకు వెళిపోయారని పేర్కొన్నారు. సాంబా, రామ్‌గఢ్ సెక్టార్ల నుంచి 5000మందికి పైగా, హీరానగర్ సెక్టార్ నుంచి 3000 మందికి పైగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారన్నారు. జివోరా గ్రామంలో వందల పశువులు చనిపోయాయి. ఐబీతోపాటు నియంత్రణ రేఖ వెంట ఉన్న 300లకు పైగా విద్యాసంస్థలను మరో మూడు రోజుల పాటు మూసివేస్తున్నామని అధికారులు తెలిపారు.

బడ్జెట్‌లో 'జనాకర్షణ' ఉండదు

ప్రజలు తాయిలాలు, ఉచితాలు కోరుకోరు

ఉపాధి రహిత అభివృద్ధి అన్నది అబద్ధం

న్యాయవ్యవస్థ సంక్షోభంలో రాజకీయ పార్టీలు జోక్యం చేసుకోరాదు

జీఎస్టీలో మార్పులకు సిద్ధం.. రైతుల్లో అసంతృప్తి నిజమే

టౌమ్స్ నౌ ఇంటర్వ్యూలో ప్రధాని మోదీ



న్యూఢిల్లీ: వచ్చే బడ్జెట్ ప్రజాకర్షణీయంగా ఉండబోదని ప్రధాని నరేంద్ర మోదీ సంకేతాలిచ్చారు. సామాన్యులు ప్రభుత్వం నుంచి 'ఉచితాలు, తాయిలాలు' ఆశిస్తారని అనుకోవడం కల్పితగాథ అని అన్నారు. తమ ప్రభుత్వం సంస్కరణలను కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ప్రధాని మోదీ ఆదివారం టైమ్స్ నౌ చానెల్‌కు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. తమ ప్రభుత్వ ఆర్థిక విధానాలను సమర్థించుకున్న మోదీ నోట్ల రద్దు నిర్ణయాన్ని 'గొప్ప విజయగాథ'గా అభివర్ణించారు. వస్తు, సేవల పన్ను (జీఎస్టీ)లో లోపాలను సరిదిద్దడానికి అందులో మార్పులకు సిద్ధమని చెప్పారు. ఉపాధిరహిత అభివృద్ధిపై వ్యక్తమవుతున్న విమర్శలను ప్రధాని తిరస్కరించారు. నిజానికి తమ ప్రభుత్వ విధానాలన్నీ ఉపాధి సృష్టించడంవైపే కేంద్రీకృతమై ఉన్నాయన్నారు. రైతుల్లో అసంతృప్తి ఉన్న మాట వాస్తవమేనని ప్రధాని అంగీకరించారు. వచ్చే సార్వత్రిక ఎన్నికలకు ముందు ప్రవేశపెట్టబోయే చివరి పూర్తిస్థాయి బడ్జెట్ జనాకర్షణీయంగా ఉంటుందా అన్న ప్రశ్నకు, ఆర్థికమంత్రి పరిధిలోని అంశంపై తాను జోక్యం చేసుకోబోనన్నారు. సామాన్యులు నిజాయితీగల పాలనను కోరుకుంటారని చెప్పారు. 'దేశం అభివృద్ధి చెంది, మరింత పటిష్ఠం కావాలో లేదో నిర్ణయించాలి, కాంగ్రెస్ అనుసరించిన రాజకీయ సంస్కృతిని కొనసాగించాలో లేదో కూడా తేల్చుకోవాలి' అని అన్నారు.

ఉపాధి కల్పనపై అసత్య ప్రచారాలు

గత ఒక్క ఏడాదిలోనే కొత్తగా 70 లక్షల రిటైర్మెంట్ ఫండ్/ ఈపీఎఫ్ ఖాతాలు ప్రారంభమయ్యాయని, ఇది ఉపాధి అవకాశాలను సూచించడం లేదా అని ప్రశ్నించారు. తాము సృష్టించిన అవకాశాలతో సంఘటిత రంగంలో పది శాతం, అసంఘటిత రంగం లో 90 శాతం ఉపాధి పొందారన్నారు. రోడ్ల నిర్మాణం, కొత్త రైల్వే ట్రాక్‌లు, విద్యుదీకరణ, నౌకాశ్రయాల్లో, టెక్స్‌టైల్స్, తోళ్ల పరిశ్రమల్లో ఎక్కువ ఉపాధి లభిస్తున్నదన్నారు. తమ ప్రభుత్వం ఇప్పటివరకూ ఏ కుంభకోణాలలో భాగస్వామి కాలేదన్నారు. ప్రధానిగా తన పనితీరుపై ఇంతవరకూ అంచనా వేసుకోలేదని, ప్రజలే నిర్ణయించాలని అన్నారు.

ఆర్థిక విధానాలను ప్రపంచ సంస్థలు ప్రశంసిస్తున్నాయి

ప్రపంచ దేశాలు ఇప్పుడు భారత్‌ను ఒక ఆశాకిరణంగా చూస్తున్నాయని, దేశ ఆర్థికాభివృద్ధి సంతృప్తికరంగా ఉందని, ఇవి తనకు సంతోషాన్నిస్తున్నాయని చెప్పారు. కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ పదేండ్ల పాలనతో తన మూడున్నరేండ్ల పాలనను పోల్చి చూస్తే జరిగిన మార్పు ఏమిటో తెలుస్తుందన్నారు. 2014లో తాము అధికారానికి వచ్చినప్పుడు భారత్ ఐదు బలహీన దేశాల్లో ఒకటిగా ఉన్నదని, తాము ఆ స్థితిని మార్చి మన సత్తా ఏమిటో ప్రపంచానికి చూపామని చెప్పారు. తన ప్రభుత్వం ద్రవ్యోల్బణాన్ని 10శాతం నుంచి మూడు శాతానికి తగ్గించిందన్నారు. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను మూడువేల కోట్ల డాలర్ల నుంచి 6,200 కోట్ల డాలర్లకు పెంచామని అన్నారు. ఆర్థిక లోటును 4.5% నుంచి 3.5 శాతానికి తగ్గించామని చెప్పారు. తమ విధానాలను ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంక్, మూడీస్ వంటి సంస్థలు ప్రశంసిస్తున్నాయన్నారు. దాదాపు ఏడేండ్ల పాటు చర్చించాక పార్లమెంట్.. వస్తు సేవల పన్ను (జీఎస్టీ)ని ఆమోదించిందని ప్రధాని మోదీ అన్నారు. అన్ని పార్టీల ఆమోదంతో జీఎస్టీ అమలులోకి వచ్చిందని చెప్పారు. సులభ వాణిజ్య విధానంలో భారత్ 42 స్థానాలు మెరుగైందని అన్నారు. భారత్ పురోగతి సాధిస్తున్నందునే దావోస్‌లో జరుగనున్న ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో ప్రసంగించే అవకాశం తనకు లభించిందని ప్రధాని మోదీ చెప్పారు. సుప్రీంకోర్టులో న్యాయమూర్తుల మధ్య నెలకొన్న సంక్షోభంపై ప్రధాని మాట్లాడుతూ, రాజకీయ పార్టీలు ఆ వివాదానికి దూరంగా ఉండాలని చెప్పారు. 'కాంగ్రెస్ రహిత భారత్' అన్న తన నినాదం కాంగ్రెస్ సంస్కృతి నుంచి భారత్‌ను విమోచించడమేనని చెప్పారు. దేశ రాజకీయాల్లో మూలస్తంభంగా ఉన్న కాంగ్రెస్ అన్ని పార్టీలకు తన సంస్కృతిని విస్తరించిందని విమర్శించారు. మిగిలిన తన ఏడాదిన్నర పాలనలో నాలుగు కోట్ల మంది విద్యుత్ అందించాల్సి ఉందని చెప్పారు. సామాన్యుల కోసం ప్రారంభించిన పథకాలు, కార్యక్రమాలను పూర్తి చేయాల్సి ఉందని అన్నారు.

ఆప్ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు

మొదటిపేజీ తరువాయి...

ఆప్ ఎమ్మెల్యేల సంఖ్య 45కు తగ్గింది. అయినప్పటికీ ఆప్ సర్కార్‌కు ఇప్పటికిప్పుడు వచ్చిన ముప్పేమీలేదు. అరవింద్ కేజ్రీవాల్ నేతృత్వంలోని ఆప్ ప్రభుత్వానికి ఏడుగురు మంత్రుల్ని నియమించుకునే అవకాశం ఉండగా, ప్రభుత్వం 2015లో అదనంగా 21మంది ఎమ్మెల్యేలను పార్లమెంటరీ కార్యదర్శులుగా నియమించడం వివాదాస్పదమైంది. ఇది లాభదాయక పదవుల కిందకే వస్తుందంటూ ప్రశాంత్ పటేల్ అనే న్యాయవాది అప్పటి రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీకి ఫిర్యాదు చేశారు. 2016లోఆప్ ప్రభుత్వం వారిని పదవుల్లోంచి తొలిగించింది. అయితే ఆ అంశంపై వివరణ కోరిన రాష్ట్రపతికి ఎన్నికల సంఘం (ఈసీ) పార్లమెంటరీ కార్యదర్శి పదవులు లాభదాయక పదవుల కిందకే వస్తాయని శుక్రవారం స్పష్టంచేసింది. ఇప్పటికే ఒక ఎమ్మెల్యే తన శాసనసభ్యత్వానికి రాజీనామా చేయగా, మిగిలిన 20మందిని అనర్హులుగా ప్రకటిస్తూ.. ఈసీ చేసిన సిఫార్సులను రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆదివారం ఆమోదించారు. అయితే తమపై అనర్హత చర్యలు తీసుకోకుండా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని కోరుతూ 20 మంది ఎమ్మెల్యేలు శనివారమే ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. సోమవారం పిటిషన్ విచారణకు రానున్నది. రాష్ట్రపతి చర్యలను ఆప్ తప్పుపట్టింది. తమ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయడం రాజ్యాంగ విరుద్ధమని, ప్రజాస్వామ్యానికి మంచిదికాదని ఆప్ నేత అశుతోష్ పేర్కొన్నారు. తుది నిర్ణయానికి ముందు రాష్ట్రపతి తమ వాదన వింటే బాగుండేదని అనర్హత వేటు పడిన ఎమ్మెల్యే అల్కాలాంబా అన్నారు. పార్లమెంటరీ కార్యదర్శుల హోదాలో వారు ప్రభుత్వం నుంచి ఒక్క పైసా కూడా తీసుకోలేదని, అలాంటప్పుడు అది లాభదాయక పదవుల కిందకు ఎలా వస్తుందని ఢిల్లీ ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా, ఆప్ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు గోపాల్‌రాయ్ ప్రశ్నించారు. తాము ఎన్నికలకు భయపడడం లేదని, బలిపశువులను చేసేందుకు జరుగుతున్న ప్రయత్నాన్ని మాత్రమే తాము సవాల్ చేస్తున్నామని వారు పేర్కొన్నారు. ఆప్ ఎమ్మెల్యేలపై అనర్హత వేటును బీజేపీ రాష్ట్రశాఖ అధ్యక్షుడు మనోజ్ తివారీ స్వాగతించారు. కేవలం చర్యలతోనే కాకుండా వారినుంచి ప్రజాధనాన్ని రికవరీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మరోవైపు ఢిల్లీ ఉప ఎన్నికలకు తాము సిద్ధమేనని కాంగ్రెస్ ప్రకటించింది.

అందుకే దేవుడు 67మంది ఎమ్మెల్యేలనిచ్చాడు: కేజ్రీవాల్

సత్యం, నిజాయితీతో కూడిన మార్గంలో ప్రయాణిస్తున్నప్పుడు అనేక అడ్డంకులు ఎదురవుతాయని, చివరకు సత్యమే గెలుస్తుందని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ చెప్పారు. ఆప్‌కు చెందిన 20మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటుపై ఆయన తొలిసారి స్పందించారు. ఆదివారం నజఫ్‌గఢ్‌లో జరిగిన ఓ ర్యాలీలో పాల్గొన్న కేజ్రీవాల్ తాత్వికంగా మాట్లాడారు. 'మూడేండ్ల తర్వాత మా 20మంది ఎమ్మెల్యేలపై వేటు పడుతుందని ముందే రాసిపెట్టుందేమో.. అందుకే భగవంతుడు బాగా ఆలోచించాకే మాకు 67మంది ఎమ్మెల్యేలను గెలిపించి ఇచ్చినట్లున్నాడు' అని పేర్కొన్నారు. తమ ప్రభుత్వాన్ని అన్నిరకాలుగా వేధిస్తున్నారంటూ బీజేపీపై కేజ్రీవాల్ పరోక్ష విమర్శలు చేశారు. 'వాళ్లు (కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం) నా కార్యాలయంపై సీబీఐతో దాడులు చేయించారు. 24గంటల సోదాల తర్వాత వారికి నాలుగు మఫ్లర్లు తప్ప ఏమీ దొరుకలేదు. గడిచిన రెండేండ్లలో ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ 400 ప్రభుత్వ ఫైళ్లను తెప్పించుకుని చూశారు. ఆయనకూ ఏమీ దొరుకలేదు' అని కేజ్రీవాల్ చెప్పారు.

'పద్మావత్' సినిమాకు నిరసన సెగ

- ఉత్తర గుజరాత్‌లో రాజ్‌పుత్‌ల ఆందోళన
- బస్సులను నిలిపివేసిన ఆర్టీసీ



దాడిలో ధ్వంసమైన బస్సు

అహ్మదాబాద్, జనవరి 21: అనేక ఆటంకాల మధ్య విడుదలకు సిద్ధమైన 'పద్మావత్' సినిమాకు నిరసనలు ఎదురవుతూనే ఉన్నాయి. సినిమా విడుదల తేదీ దగ్గరపడుతున్న కొద్దీ ఆందోళనలు పెరుగుతున్నాయి. గుజరాత్‌లో రాజ్‌పుత్‌లు ప్రభుత్వ బస్సులు లక్ష్యంగా దాడులు చేస్తున్నారు. దీంతో ఉత్తర గుజరాత్‌కు అహ్మదాబాద్ నుంచి వెళ్లే బస్సులను నిలిపివేస్తున్నట్టు అధికారులు ప్రకటించారు. శనివారం రాత్రి మెహసానా జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో బస్సులపై రాజ్‌పుత్‌లు ద్విచక్రవాహనాలపై వచ్చి పెట్రో బాంబులతో దాడి చేశారు. అహ్మదాబాద్‌లో ఓ థియేటర్ కౌంటర్‌పై దుండగులు దాడిచేసినట్టు తెలుస్తున్నది. సీనియర్ సంగీత దర్శకుడు పండిత్ విశ్వమోహన్ 'పద్మావత్' సినిమాకు పన్ను నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు.

Dwaraka

జూబ్లీహిల్స్‌లో కారు బీభత్సం



జూబ్లీహిల్స్ రోడ్ నంబర్-45 చౌరస్తావద్ద ప్రమాదానికి గురయిన కారు



కారు ఢీకొనడంతో విరిగిన సీసీ కెమెరాల కోసం ఏర్పాటు చేసిన స్తంభం

డివైడర్‌ను ఢీకొని పల్టీలుకొట్టిన క్యాబ్.. తప్పిన ప్రాణనష్టం

బంజారాహిల్స్, నమస్తే తెలంగాణ: మితిమీరిన వేగంతో దూసుకొచ్చిన ఓ కారు హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో శనివారం అర్ధరాత్రి బీభత్సం సృష్టించింది. వేగంగా వచ్చి డివైడర్‌ను ఢీకొట్టడంతో గాల్లోకి లేచి పల్టీలు కొట్టింది. అదృష్టవశాత్తూ ఆ సమయంలో రోడ్డుపై ట్రాఫిక్ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. వివరాలు ఇలా ఉన్నాయి. శనివారం అర్ధరాత్రి 1:40 గంటల ప్రాంతంలో కారు జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు వైపునుంచి రోడ్ నంబర్-1 మీదుగా వెళ్తున్నది. రోడ్ నంబర్-45 చౌరస్తా దాటగానే అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో గాల్లోకి ఎగిరిన కారు పల్టీలు కొడుతూ వెళ్లి డివైడర్ మధ్యలో సీసీ కెమెరాల కోసం ఏర్పాటు చేసిన స్తంభాన్ని తాకడంతో అది కుప్పకూలింది. అదే సమయంలో ఇద్దరు యువకులు బైక్‌పై వెళ్తుండగా కారు వారి మీద పడకుండా తృటిలో తప్పించుకున్నారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ అక్కడినుంచి పారిపోయాడు. అర్ధరాత్రి కావడంతో రోడ్డుపై ట్రాఫిక్ లేక పెనుప్రమాదం తప్పింది. ఈ ఘటనకు కారణమైన డ్రైవర్ మద్యం సేవించాడా? లేక నిద్రమత్తులో కారు నడిపాడా? అన్న విషయం తేలాల్సి ఉన్నది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



హైదరాబాద్ టు అంటార్కిటికా

మంచుఖండంపై అధ్యయనానికి ఎంపికైన ప్రత్యూష

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: రేడియోలో తియ్యని గొంతుతో పలుకరించే యువతి మంచుఖండంపై పరిశోధనలకు ఎంపికైంది. బడిలో ఆమె పెంచుకున్న పర్యావరణ పరిరక్షణ బాధ్యత ఇప్పుడు ఏకంగా అంతర్జాతీయ స్థాయి పరిశోధకులతో కలిసి అంటార్కిటికాకు వెళ్లేలా చేసింది. 2041 ఫౌండేషన్ 'లీడర్‌షిప్ ఆన్ ది ఎడ్జ్' పేరుతో అంటార్కిటికా ఖండంపై నిర్వహించే పర్యావరణ అధ్యయనానికి హైదరాబాద్‌కు చెందిన ప్రత్యూష ఎంపికయ్యారు. ఈ సందర్భంగా తన ప్రయాణాన్ని 'నమస్తే తెలంగాణ'తో పంచుకున్నారు.

అమ్మానాన్నే స్ఫూర్తి

సైదాబాద్‌లో మేం నివాసం ఉండే ఇంద్రప్రస్థ కాలనీలో బాగా చెట్లుండేవి. ఆకులు రాలుతున్నాయని వాటిని నరికేవాళ్లు. కానీ మేము వాటిని కాపాడుకున్నాం. ఇప్పుడు మా ఇంటి చుట్టూ 25 ఏండ్లకు పైబడిన చెట్లు ఎన్నో ఉన్నాయి. నాన్న రమేశ్‌బాబు బీహెచ్‌ఈఎల్‌లో పనిచేశారు. అమ్మ అనురాధ ఉద్యోగం చేస్తూనే ఇంట్లో మొక్కలు పెంచారు. అమ్మ మా చిన్నప్పుడు మేడపై వందకుపైగా పూల మొక్కలు పెంచారు. రెండు అంతస్తులు ఎక్కి నీళ్లు పోసేవారు. అమ్మానాన్నలను చూసి పర్యావరణాన్ని కాపాడుకోవాలనే స్పృహ పెరిగింది.

బడిలో ప్రకృతి పాఠం

కింగ్ కోఠీలోని సెయింట్ జోసఫ్ పబ్లిక్ స్కూల్‌లో చదువుతున్నప్పుడు ఎన్విరాన్‌మెంట్ క్లబ్‌లో చేరా. జీవ వ్యర్థాల వినియోగం, వ్యర్థాల నిర్వహణ, రీసైక్లింగ్, పర్యావరణ పరిరక్షణ గురించి స్కూల్లో చెప్పిన విషయాలను మా కాలనీలోని పిల్లలకు, పెద్దలకు తెలియజేశా. 2000 సంవత్సరంలో మా కాలనీలోని పిల్లలకు పేపర్‌తో బ్యాగులు తయారు చేయడం నేర్పించా. తర్వాత వీఐటీ వెల్లూరులో ఇంజినీరింగ్‌లో చేరా. అక్కడా ఎన్విరాన్‌మెంట్ క్లబ్‌లో చేరి అనేక అవగాహన కార్యక్రమాలు చేపట్టా.

ఐటీ జాబ్ కాదని టీచర్‌గా..

ఇంజినీరింగ్ చదువుతున్నపుడే క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో జాబ్ ఆఫర్ వచ్చింది. కానీ టీచ్ ఫర్ ఇండియాలో చేరి టీచర్‌గా పనిచేయాలనిపించింది. అమ్మానాన్నలు ముందు వద్దన్నా నా ఇష్టాన్ని గుర్తించి సరేనన్నారు. టీచ్ ఫర్ ఇండియాలో చేరి 2012లో పుణెలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో పనిచేశా. ఆంగ్లం, గణితం, సామాన్యశాస్త్రాలు బోధించా. ఇప్పుడు హైదరాబాద్‌లో రేడియో జాకీగా పని చేస్తూ సివిల్స్‌కు సిద్ధమవుతున్నా.

ప్రపంచవ్యాప్తంగా 80 మందిమి ఎంపికయ్యాం..

పుణెలో పనిచేస్తుండగా 2012లో సంప్రదాయేతర ఇంధన వనరుల గురించి ఓ కార్యక్రమం జరిగింది. సర్ రాబర్ట్ స్వాన్ ఆ లీడర్‌షిప్ ప్రోగామ్‌కు వచ్చారు. ఉత్తర, దక్షిణ ధృవాలకు నడుచుకుంటూ ప్రయాణం చేసిన ఏకైక వ్యక్తి ఆయన. అంటార్కిటికా వద్ద జరుగుతున్న వాతావరణ మార్పులపై అంతర్జాతీయ కార్యక్రమం చేపడుతున్నామని, ఇంధన వినియోగం, పర్యావరణ మార్పులపై అధ్యయనం చేయడానికి ఒక అవకాశం ఉందని తెలుసుకున్నా. వెంటనే నా ఆసక్తి తెలియజేస్తూ దరఖాస్తు చేశా. వాళ్లకు నచ్చడంతో ఎంపిక చేశారు. ప్రపంచవ్యాప్తంగా 80 మందిని ఎంపిక చేశారు. అంటార్కిటికా వెళ్లనున్న బృందంలో పర్యావరణ శాస్త్రవేత్తలు, మంచు ఖండంపై పరిశోధన చేసేవాళ్లు, ఇంధన సంబంధ శాస్త్రవేత్తలు మొదలైనవారు ఉంటారు. మా బృందం రెండు వారాలపాటు అంటార్కిటికాలో ఉండి వాతావరణాన్ని అధ్యయనం చేయనున్నది.

మహిళలపై అనీమియా పంజా

దేశవ్యాప్తంగా పీడిస్తున్న రక్తహీనత

- సగం మంది గర్భిణుల్లో హిమోగ్లోబిన్ లోపం
- మధుమేహ బాధితుల్లోనూ మహిళలే అధికం
- ఎన్‌ఎఫ్‌హెచ్‌ఎస్ సర్వే, ఎన్‌ఐఎన్ న్యూట్రిషన్ అట్లాస్‌లో వెల్లడి
- రాష్ట్రంలో ప్రత్యేక చర్యలు చేపట్టిన ప్రభుత్వం

హైదరాబాద్/సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: పేదరికం, అవగాహనారాహిత్యం, పౌష్టికాహార లోపం కారణంగా దేశవ్యాప్తంగా మహిళల్లో రక్తహీనత (అనీమియా) సమస్య పట్టి పీడిస్తున్నది. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (ఎన్‌ఎఫ్‌హెచ్‌ఎస్) విభాగం 2015-16 ఆర్థిక సంవత్సరంలో సర్వే నిర్వహించి వెల్లడించిన కఠోర సత్యమిది. తాజాగా విడుదల చేసిన నివేదిక ప్రకారం దేశవ్యాప్తంగా 15-49 ఏండ్ల మధ్య వయసున్న మహిళల్లో ఏకంగా 53 శాతం మంది రక్తహీనత సమస్యతో బాధపడుతున్నారంటే పరిస్థితి తీవ్రత అర్థం చేసుకోవచ్చు. ఫలితంగా మహిళల్లో ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయి. మరోవైపు 15-49 ఏండ్ల మధ్య వయసున్న గర్భిణుల్లో 50.3 శాతం మంది రక్తహీనతతో బాధపడుతుండటం ఆందోళన కలిగిస్తున్నది. దీని కారణంగానే దేశంలో మాతాశిశు మరణాల సంఖ్య అదుపులోకి రావడం లేదని నిపుణులు పేర్కొంటున్నారు. ఎన్‌ఎఫ్‌హెచ్‌ఎస్ సర్వే ప్రకారం 2015-16లో రాష్ట్రంలో రక్తహీనత బారినపడిన మహిళల సంఖ్య దేశ సగటు కన్నా ఎక్కువగా ఉన్నది. రాష్ట్రంలోని 15-49 ఏండ్ల మధ్యవయసున్న 56.7 శాతం మహిళలు అనీమియాతో బాధపడుతున్నారు. అయితే గర్భిణుల పరిస్థితి కాస్త మెరుగ్గా 49.8 శాతంగా ఉన్నది. సర్వేలో భాగంగా రాష్ట్రంలోని 7,786 కుటుంబాల్లో 7,567 మంది మహిళలు, 1,054 మంది పురుషులను కలిశారు.

రక్తహీనత బాధితుల శాతం (పాత జిల్లాల వారీగా)

జిల్లా	బాధితులు
ఖమ్మం	71.2
ఆదిలాబాద్	63.7
మెదక్	57.3
వరంగల్	56.9
నల్లగొండ	56.2
నిజామాబాద్	56
రంగారెడ్డి	54.9
హైదరాబాద్	54
కరీంనగర్	52.3
మహబూబ్‌నగర్	50.6

మహిళల్లో రక్తహీనత బాధితులు

వయసు	శాతం
6-59 నెలల చిన్నారులు	60.7
15-49 ఏండ్లు(మహిళలందరూ)	56.7
15-49 ఏండ్లు(గర్భిణులు)	49.8
15-49 ఏండ్లు(గర్భిణులు కానివారు)	56.9

బాధితుల సంఖ్య తగ్గుముఖం

ఏడాదిన్నర నుంచి రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న ప్రత్యేక చర్యలతో బాధితుల సంఖ్య తగ్గుముఖం పడుతున్నట్టు అధికారులు చెప్తున్నారు. రక్తహీనత సమస్యను దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం గర్భిణుల కోసం అమ్మ ఒడి, కేసీఆర్ కిట్లు పథకాల ద్వారా పోషకాహారం, నగదు ప్రోత్సాహకాలు అందిస్తున్నది. మహిళలు గర్భందాల్చినప్పటి నుంచి ప్రభుత్వం విడుతల వారీగా రూ.12వేలు ప్రోత్సాహకం అందిస్తుండడంతో గర్భిణులు, బాలింతలు పనులకు వెళ్లకుండా ఇంటి పట్టునే ఉంటూ విశ్రాంతి తీసుకుంటున్నారు. నగదుతో పౌష్టికాహారం తీసుకునే వెసులుబాటు కలిగింది. మరోవైపు అమ్మ ఒడి పథకం కింద నేరుగా పోషకాహారం అందిస్తున్నారు. అంతేకాకుండా వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సిబ్బంది మహిళలకు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్నారు.

22 లక్షల మందికి పౌష్టికాహారం

ఆరోగ్యలక్ష్మి పథకం ద్వారా రాష్ట్రంలోని గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు పౌష్టికాహారం అందిస్తున్నారు. 22,28,150 మందికి రోజు పాలు, గుడ్లు, మధ్యాహ్నం అన్నం, పప్పు అందిస్తున్నారు. ఈ పథకం కింద 5,31,310 మంది బాలింతలు/గర్భిణులు, 10,42,675 మంది 7 నెలల నుంచి 3 ఏండ్ల వయసున్న చిన్నారులు, 6,54,165 మంది 3-6 ఏండ్ల వయసున్న బాలికలకు పౌష్టికాహారం అందుతున్నది. ఇందుకోసం ప్రభుత్వం రోజుకు రూ.2.46కోట్లు ఖర్చు చేస్తున్నది. శరీరంలో ఐరన్ లోపం, విటమిన్ బీ12, ఫోలిక్ ఆసిడ్ సమృద్ధిగా లేకపోవడం రక్తహీనతకు కారణమవుతున్నది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలల్లోని బాలికలకు ఐరన్, ఫోలిక్ ఆసిడ్ మాత్రలను అందజేస్తున్నారు. రక్తహీనత కలిగిన మహిళలకు ఒక్కొక్కరికీ 200 వరకు ఐరన్ మాత్రలు అందజేస్తున్నారు.

మహిళల్లోనే మధుమేహం ఎక్కువ

- న్యూట్రిషన్ అట్లాస్‌లో వెల్లడించిన ఎన్‌ఐఎన్
- గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సర్వే

ప్రపంచాన్ని వణికిస్తున్న మధుమేహం బారిన మహిళలే ఎక్కువ పడుతున్నారని హైదరాబాద్‌లోని ఎన్‌ఐఎన్ పేర్కొన్నది. మహిళల్లో సగటున 10.7శాతం మంది డయాబెటిస్ బాధితులు ఉండగా, పురుషుల్లో 10.1 శాతం ఉన్నారు. పట్టణాల్లో 11.9 శాతం మంది పురుషులు మధుమేహం బారిన పడుతుండగా, మహిళల్లో 13.3శాతంగా ఉన్నది. డయాబెటిస్‌పై అన్ని రాష్ట్రాల్లో జిల్లాస్థాయి హౌస్‌హోల్డ్ (డీఎల్‌హెచ్‌ఎస్)సర్వే నిర్వహించారు. నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే(ఎన్‌ఎఫ్‌హెచ్‌ఎస్)తోపాటు ఏటా నిర్వహించే హెల్త్ సర్వే(ఏహెచ్‌ఎస్)ను క్రోడీకరించి ఎన్‌ఐఎన్ 'న్యూట్రిషన్ అట్లాస్'ను విడుదల చేసింది. ఎన్‌ఎఫ్‌హెచ్‌ఎస్, డీఎల్‌హెచ్‌ఎస్ ప్రకారం రక్తంలో చక్కెర శాతం 140 ఎంజీ/డీఎల్ లోపు ఉంటే సాధారణంగా, మించితే (బ్లడ్ షుగర్ లెవల్ హై) మధుమేహం వచ్చినట్టు, 160 ఎంజీ/డీఎల్‌కు మించితే చక్కెర శాతం అత్యధికంగా(వెరీ హై) ఉన్నట్టు పరిగణించారు. ఏహెచ్‌ఎస్ సర్వేలో 130ఎంజీ/డీఎల్ ఉంటేనే ఎక్కువగా (హై) ఉన్నట్టు పేర్కొన్నారు. ఎన్‌ఎఫ్‌హెచ్‌ఎస్ 15-49 ఏండ్ల మధ్య వారిని, ఏహెచ్‌ఎస్, డీఎల్‌హెచ్‌ఎస్ 18 ఏండ్లకు పైబడినవారిని సంప్రదించాయి.



2015-16లో మధుమేహ బాధితుల శాతం

బ్లడ్‌షుగర్‌లెవెల్	పురుషులు			మహిళలు		
	గ్రామాలు	పట్టణాలు	సగటు	గ్రామాలు	పట్టణాలు	సగటు
హై	5.4	6.8	6	5.6	8.2	6.8
వెరీ హై	3.3	5.1	4.1	2.8	5.1	3.9
మొత్తం	8.7	11.9	10.1	8.4	13.3	10.7

పశువుల ఎముకలతో నూనె తయారీ

రంగారెడ్డి జిల్లా పసుమాములలో నలుగురి అరెస్ట్

భారీగా జంతు కళేబరాలు లభ్యం, డీసీఎం స్వాధీనం





పసుమాములలోని అతన్ భాయ్ పొలంలో లభ్యమైన జంతు కళేబరాలు, (ఇన్‌సెట్) స్వాధీనం చేసుకున్న డీసీఎం

హయత్‌నగర్: హైదరాబాద్ శివారులో జంతు కళేబరాలతో నూనె తయారు చేస్తున్న కేంద్రంపై రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్ పోలీసులు దాడి చేసి నలుగురిని అరెస్ట్ చేశారు. డీసీఎంను స్వాధీనం చేసుకున్నారు. పెద్ద అంబర్‌పేట నగర పంచాయతీ పరిధిలోని పసుమాములలో అతన్ భాయ్ వ్యవసాయ భూమిలో కొన్ని నెలలుగా కభేళాల నుంచి జంతు కళేబరాలను తీసుకొచ్చి నూనె తయారు చేస్తున్నారు. తయారు చేసిన నూనెను నగరంలోని పలు ప్రాంతాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. సమాచారం అందుకున్న హయత్‌నగర్ పోలీసులు నిఘా పెట్టారు. ఆదివారం సదరు ప్రాంతానికి డీసీ ఎం లోడుతో వచ్చిందని పక్కా సమాచారం అందుకున్న పోలీసులు నూనె తయారీ కేంద్రంపై దాడి చేశారు. ఆ ప్రాంతంలో ఆరబెట్టిన జంతు కళేబరాలు, ఎముకలు భారీగా లభ్యమయ్యాయి. ఎటు చూసినా జంతు కళేబరాలు, ఎముకలే దర్శనమిచ్చాయి. నూనె తయారీ కేంద్రంలో పని చేస్తున్న నలుగురి అరెస్ట్ చేసిన పోలీసులు, కొన్ని నూనె డబ్బాలను, డీసీఎంను స్వాధీనం చేసుకున్నారు. జంతు కళేబరాలు, ఎముకలు ఎక్కడి నుంచి తీసుకువస్తున్నారు? వాటితో తయారు చేసిన నూనెను ఎక్కడికి తరలిస్తున్నారు? దీని నిర్వాహకులు ఎవరు? అనే విషయాలు పోలీసుల దర్యాప్తులో తేలనున్నది.



చర్చిలో ప్రార్థనలు చేస్తున్న పవన్‌కల్యాణ్ దంపతులు

చర్చిలో సినీనటుడు పవన్‌కల్యాణ్ ప్రార్థనలు

మారేడ్‌పల్లి: సికింద్రాబాద్‌లోని సెయింట్ మేరీస్ చర్చిలో సినీనటుడు, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ఆదివారం ఉదయం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పవన్‌తోపాటు ఆయన సతీమణి అన్నా లెజ్నేవ ప్రార్థనల్లో పాల్గొన్నారు. వ్యక్తిగత పనుల నిమిత్తం హైదరాబాద్‌కు వచ్చిన పోలాండ్ అంబాసిడర్ ఆడమ్ బురాకో వస్కీకి పవన్‌కల్యాణ్ కుటుంబంతో వ్యక్తిగత పరిచయం ఉండటంతో వారితో కలిసి చర్చికి వచ్చారు.

మాజీ డీజీపీ ఆర్‌కే రాగాల మృతి



ఉప్పల్, నమస్తే తెలంగాణ: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ డీజీపీ ఆర్కే రాగాల(86) ఆదివారం అనారోగ్యంతో కన్నుమూశారు. ఆయన 33 ఏండ్లపాటు పోలీస్‌శాఖలోని పలు విభాగాల్లో సేవలు అందించారు. 1994-1995 సంవత్సరాల మధ్యకాలంలో ఉమ్మడి ఏపీ డీజీపీగా పనిచేశారు. హైదరాబాద్ హబ్సిగూడలోని కాకతీయనగర్‌లో నివాసం ఉంటున్న రాగాల కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. రాగాల పేరుతో యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలంలో ఓ రిసార్ట్స్‌ను కూడా స్థాపించారు.

బీజేపీ ఎమ్మెల్సీకి సైబర్ చీటర్ల టోకరా

క్రెడిట్ కార్డు అప్‌డేట్ చేయాలంటూ రూ.58 వేలు స్వాహా

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: ఆయనో బీజేపీ ప్రజాప్రతినిధి.. పట్టభద్రుల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీగా ఎన్నికయిన ఆయనను సైబర్‌చీటర్లు బోల్తా కొట్టించారు. క్రెడిట్‌కార్డును అప్‌డేట్ చేయాలంటూ నమ్మించి ఆయన డెబిట్‌కార్డు వివరాలు తీసుకొని రెండు బ్యాంకు ఖాతాల నుంచి రూ.58 వేలు స్వాహా చేశారు. బీజేపీ ఎమ్మెల్సీ ఎన్ రాంచందర్‌రావుకు గత నెల 31వ తేదీన తన పేరు రవి అని చెప్తూ ఓ గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేశాడు. తాను ఆర్‌బీఎల్ బ్యాంకు ఎగ్జిక్యూటివ్‌నని, మీ క్రెడిట్ కార్డు గడువు కొద్దిరోజుల్లో ముగుస్తుందని, అప్‌డేట్ చేసుకోవాలంటూ సూచించాడు. ఆ మాటలను నమ్మిన ఎమ్మెల్సీ ఆర్‌బీఎల్ క్రెడిట్ కార్డు వివరాలతోపాటు తన వద్ద ఉన్న ఆంధ్రాబ్యాంకు, ఎస్‌బీఐ డెబిట్ కార్డుల నంబర్లు, వాటి గడువు తేదీ, సీవీ నంబర్లను చెప్పేశారు. మరుసటి రోజు తన ఎస్‌బీఐ ఖాతా నుంచి రూ.48 వేలు, ఆంధ్రా బ్యాంకు ఖాతా నుంచి రూ.10 వేలు డ్రా చేసినట్టు ఫోన్‌కు మెసేజ్‌లు వచ్చాయి. మరో పక్క బ్యాంకు ఎగ్జిక్యూటివ్‌గా ఫోన్ చేసిన రవి అనే వ్యక్తి సెల్‌ఫోన్ నుంచి రాంచందర్‌రావు సెల్‌ఫోన్‌కు మీ ఆర్‌బీఎల్ కార్డును బ్లూ డార్ట్ కొరియర్ నుంచి పంపిస్తున్నామంటూ ఒక మెసేజ్ కూడా వచ్చింది. అనుమానం వచ్చిన ఎమ్మెల్సీ రాంచందర్‌రావు ఇదంతా మోసమని గుర్తించి సీసీఎస్ సైబర్‌క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన ఇన్‌స్పెక్టర్ తివారీ బృందం దర్యాప్తు చేపట్టింది.

యాదాద్రిలో భక్తుల సందడి

యాదాద్రి భువనగిరి ప్రతినిధి, నమస్తే తెలంగాణ : యాదాద్రి భక్తులతో పోటెత్తింది. ఆదివారం సెలవు కావడంతో తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వేలాది మంది భక్తులతో క్యూలైన్లు కిటకిటలాడాయి. శ్రీ లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి బారులు తీరిన భక్తులతో సముదాయాలు. మొక్కు పూజల నిర్వహణతో మండపాలు కిక్కిరిసిపోయాయి. శ్రీసత్యనారాయణస్వామి వ్రతపూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పేద నేరస్థులకు వరం.. జైల్ అదాలత్

రెండు జైళ్లలో 116 కేసులకు మోక్షం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కేసుల పరిష్కారంలో వేగం పెంచేందుకు మెట్రోపాలిటన్ లీగల్‌సెల్ అథారిటీ జైళ్లలో చేపట్టిన జైల్ అదాలత్ పేద నేరస్థులకు వరంగా మారింది. ప్రతినెల నిర్వహిస్తున్న జైల్ అదాలత్‌తో చంచల్‌గూడ, చర్లపల్లి జైలులో వందకుపైగా కేసులు పరిష్కారమవుతున్నాయి. నెల రోజుల్లో ఈ రెండు జైళ్లలో నిర్వహించిన అదాలత్‌లో 116 మంది విడుదలైనట్టు జైలు అధికారులు చెప్పారు. చిన్ననేరాల్లో జైలుకు వెళ్లి, బెయిల్ మంజూరై, జమానతు చెల్లించలేని స్థితిలో ఉన్న పేదలు, లీగల్‌సెల్ అథారిటీని ఆశ్రయించాలని న్యాయవాదులు చెప్తున్నారు. చర్లపల్లి జైలులో నిర్వహించిన అదాలత్‌లో 230 కేసులను ఇలా విచారించగా108 కేసులు పరిష్కారమయ్యాయని తెలిపారు. చంచల్‌గూడ జైలులో 21 కేసులు విచారించగా ఎనిమిది కేసులు పరిష్కారమైనట్టు అధికారులు వివరించారు.

అక్కను వేధిస్తున్నాడని..

అత్త, బావను చంపేశాడు

పుల్కల్ : అక్కను వేధిస్తున్నారనే కోపంతో బావను, అత్తను హతమార్చిన ఘటన సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలం శివ్వంపేటలో ఆదివారం రాత్రి చోటు చేసుకున్నది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మిర్యాల పద్మమ్మను అదే గ్రామంలో మిర్యాల మల్లేశంకు ఇచ్చి పన్నెండేండ్ల కిందట పెండ్లి చేశారు. వీరికి ముగ్గురు ఆడపిల్లలున్నారు. కొంతకాలంగా పద్మమ్మ, మల్లేశంకు మధ్య చిన్నచిన్న గొడవలు జరుగుతున్నాయి. తనను అత్త పెంటమ్మ, భర్త మల్లేశం వేధిస్తుండటంతో విసిగివేసారిన పద్మమ్మ తల్లిగారింటికి వెళ్లింది. విషయం తెలుసుకున్న పద్మమ్మ సోదరుడు శ్రీశైలం ఆదివారం రాత్రి కల్లు దుకాణం వద్ద మల్లేశం తలపై రాడ్‌తో దాడి చేయగా, అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం మల్లేశం ఇంటికి వెళ్లి అత్త పెంటమ్మను కూడా అదే ఇనుపరాడ్‌తో కొట్టి హతమార్చాడు. ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు మృతి చెందడంతో శివంపేట గ్రామంలో విషాదం అలుముకున్నది.



తెలంగాణ కళా భారతి ప్రాంగణం పుస్తక ప్రియులతో నిండిపోయింది. ఆదివారం ఒక్కరోజే 20 వేల మందికి పైగా పుస్తక ప్రదర్శనను సందర్శించారు. విద్యార్థులు, యువత భారీగా తరలివచ్చారు. హైదరాబాద్ బుక్ ఫేర్‌లో కొలువుదీరిన లక్షల పుస్తకాల్లో తమకు నచ్చిన దాన్ని కొనుగోలు చేశారు. ఈ జాతీయ పుస్తక ప్రదర్శనలో ఆదివారం పలు పుస్తకావిష్కరణలు జరిగాయి. పలువురు సాహితీవేత్తలు, రచయితలు, రాజకీయ ప్రముఖులు పుస్తక ప్రదర్శనలో సందడి చేశారు. తెలంగాణ సాహిత్యంతోపాటు, పోటీ పరీక్షల పుస్తకాలు, చరిత్ర, బాల సాహిత్యం సందర్శకులను ఆకట్టుకుంటున్నది.

జిందగీ పేజీ పై మీ అభిప్రాయాలు, సలహాలు తెలియజేయండి.
zindagi@ntdaily.news
www.ntzindagi.com
/nt.zindagi

హైదరాబాద్
సోమవారం 22 జనవరి 2018
WWW.NTNEWS.COM





జాతీయ స్థాయి పత్రికను విజయవంతంగా నడిపించడం అంత సులువైన పనికాదు. అందులోనూ భారత్‌లో టాప్ ఆంగ్ల పత్రికల్లో ఒకటిగా నిలుపడం, అనుబంధంగా మరిన్ని మ్యాగజైన్లు, ప్రాంతీయ భాషల్లో వెబ్‌సైట్లు.. ఇలా అతి పెద్ద సమాచార వ్యవస్థని అనుసంధానపరుచడం చాలా కష్టంతో కూడుకున్న పని. అలాంటిది ఒక మహిళ దానిని సులువుగా సాధించారు.

ప్రపంచంలో మొదటి అయిదు స్థానాల్లో ఉండేలా పత్రికను నడిపించడం ఆమె కృషికి నిదర్శనం. అత్యంత ధనిక మహిళల్లో ఒకరిగా ఫోర్బ్స్ జాబితాలోనూ చోటు సంపాదించారు. వేల కోట్ల టర్నోవర్ గల సంస్థను నడుపడంలో తలమునకలై ఉన్నప్పటికీ సేవను, మానవతను ఆమె వదిలిపెట్టలేదు. భారత్‌లో అతి పెద్ద మీడియా సంస్థలలో ఒకటైన 'ద టైమ్స్ గ్రూప్' అధినేత్రి ఇందూ జైన్ సక్సెస్‌మంత్ర.

భారత మీడియా రంగంలో నంబర్ వన్

ఇందూ జైన్

సక్సెస్ మంత్ర

పత్రికను నడిపించడం అంటే ఎంతో శ్రమ, ఆర్థికాంశాలతో కూడుకున్న పని. అలాంటిది ఒకటి కాదు పత్రికలు, మ్యాగజైన్లు అన్నీ కలిపి 15 వరకు ప్రచురితం చేస్తున్నారు ఇందూ జైన్. ఐదు భాషల్లో వివిధ రకాలుగా వీటిని అందిస్తున్నారు. ఇవన్నీ కూడా టైమ్స్ గ్రూప్ కింద నడుస్తున్నాయి. వేల కోట్లతో ఇంత పెద్ద మొత్తంలో సడుస్తున్న సంస్థను ఆమె సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. మీడియా రంగాన్ని తలలు పండిన హేమాహేమీలే నిర్వహించలేక సతమతమవుతుంటారు. అలాంటిది ఓ మహిళ ప్రపంచంలోనే మొదటి ఐదు స్థానాల్లో ఉండేలా పత్రికను నడిపించడం ఆమె కృషికి, కార్యదక్షతకు నిదర్శనం. ఆమె వయస్సు ఇప్పుడు 82 ఏళ్లు.

అతిపెద్ద మీడియా సంస్థ

భారతదేశంలో ఉన్న బిలియనీర్లలో ఇందూ జైన్ ఒకరు. ఆమె ప్రస్తుతం దేశంలోని అతిపెద్ద మీడియా గ్రూప్ 'బెన్నెట్, కాలమన్ అండ్ కో.లిమిటెడ్' సంస్థకు చైర్‌పర్సన్‌గా బాధ్యతలను నిర్వహిస్తున్నారు.ఆమె బాధ్యతలను స్వీకరించిన తరువాత 'ది టైమ్స్ గ్రూప్' భారతదేశంలో అతిపెద్ద మీడియా సంస్థగా అవతరించింది. ఆ సంస్థ సంపద విలువ 3 బిలియన్ డాలర్లు. ఆమె ఆర్థికవేత్త, ఆధ్యాత్మిక సేవా చింతన గల వ్యక్తి కూడా. మానవతా వాదానికి ప్రాధాన్యతనిస్తారు.

సేవలోనూ మిన్న

మీడియాతో పాటు టైమ్స్ ఫౌండేషన్, టైమ్స్ రిలీఫ్ ఫండ్‌నుకూడా ఇందూ జైన్ స్థాపించారు. ఈ ఫౌండేషన్ సామాజిక సేవను, వరదలు, తుఫాను వంటి విపత్కర సమయాల్లో అన్ని విధాలుగా ఆదుకోవడం వంటి కార్యకలాపాలను నిర్వహిస్తుంటుంది. అనేక అభివృద్ధి కార్యక్రమాల్లోనూ పాలు పంచుకుంటున్నది. దాని ద్వారా ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు విరాళాలు సేకరించి అందిస్తున్నారు. కష్టాల్లో ఉన్న వారిని ఆదుకుంటే వచ్చే ఆనందం అంతా ఇంతా కాదని ఆమె చెబుతారు. మహిళా సాధికారతను సాధించడంపై కూడా ఆమె దృష్టి సారించారు. ఫిక్కీ మహిళా వింగ్‌కు ఇందూ జైన్ ప్రెసిడెంట్‌గా వ్యవహరిస్తున్నారు. ఉత్తర భారతదేశంలో బెన్నెట్ యూనివర్సిటీ పెట్టి విద్యా రంగంలోనూ సేవ కూడా చేస్తున్నారు ఇందూ జైన్.

సాహిత్యంలోనూ ప్రవేశం

సాహిత్యరంగంలో జైన్‌కు ఆసక్తి ఎక్కువ. భారత్‌లో సాహిత్య రంగంలో ఇచ్చే ప్రతిష్ఠాత్మక అవార్డు జ్ఞాన్ పీఠ్ ఇచ్చే ట్రస్టుకు ఇందూ జైన్ చైర్‌పర్సన్‌గా ఉన్నారు. ఇందూ జైన్ వ్యక్తిగతంగా కూడా మంచి సాహితీవేత్త. పలు రచనలు చేయడంతో పాటూ కొన్ని సినిమాలకు పాటలూ రాశారు. ఛష్మే బద్దూర్, స్పర్శ్, కథ వంటి సినిమాలకు పాటలు రాయడంతో పాటూ కొన్నాళ్ల పాటూ దూరదర్శన్ లో టాక్ షోస్ కూడా నిర్వహించారు. 2003లో అప్పటి రాష్ట్రపతి అబ్దుల్ కలాం చేతుల మీదు ప్రారంభించిన 'ద వన్ నెస్ ఫోరం' (ప్రపంచంలో ఏకత్వాన్ని పెంపొందించడానికి స్థాపించారు)కు ఆమె దిశా నిర్దేశం చేస్తుంటారు. ఈమె నేతృత్వంలో భారతీయ జన్ పీఠ్ ట్రస్ట్ వివిధ భాషల్లో సాహిత్య రంగంలో సేవలందించిన ప్రముఖులను అవార్డులతో సత్కరిస్తున్నారు. 2000 సంవత్సరంలో ఐక్య రాజ్యసమితి ఆధ్వర్యంలో నిర్వహించిన మిలీనియం వరల్డ్ పీస్ సమ్మిట్ ఆఫ్ రిలీజియస్ అండ్ స్పిరిచ్యువల్ లీడర్స్ సమ్మిట్‌లో టుగెదర్ నెస్ ఎమాంగ్ ఫెయిత్ అనే అంశంపై ఈమె చేసిన ప్రసంగం చాలామంది ప్రశంసలు అందుకున్నది.

అత్యంత ధనవంతురాలు

ఇందూ జైన్ 3.1 బిలియన్ డాలర్లతో దేశంలోని మహిళా ఐశ్వర్యవంతుల జాబితాలో రెండో స్థానంలో ఉన్నారు . ఈమె ప్రతి ఏడాది తన ఆస్తికి సుమారు 600 మిలియన్ డాలర్లను అదనంగా చేర్చుతున్నారు. ఫోర్బ్స్ అత్యంత ధనవంతుల జాబితాలో ఇండియాలో 51వ స్థానం సాధించారు జైన్. గతేడాది ప్రపంచ బిలియనీర్ల జాబితాలో 549వ స్థానంలో నిలిచారు. ఫోర్బ్స్ గతేడాది విడుదల చేసిన అత్యంత ప్రభావశీలురైన మహిళల జాబితాలో 20వ స్థానంలో నిలిచారీమె.

కీలక పదవులు, అవార్డులు

కొడుకులు సమీర్, వినీత్ నడిపిస్తున్న టైమ్స్ ఆఫ్ ఇండియా, బిజినెస్ డైలీ, ది ఎకనామిక్స్ టైమ్స్, టైమ్స్ నౌ లాంటి మీడియా సంస్థలకు చైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తున్నారు. ఇందూ జైన్ మహిళ వింగ్ ఎఫ్ఐసీసీ (ఎఫ్ఎల్ఓ)కు అధ్యక్షురాలిగా వ్యవహరించేవారు. పాత్రికేయరంగంలో చేసిన కృషికిగానూ 'ఇందూ జైన్'కు పద్మభూషణ్ అవార్డు దక్కింది. హయ్యెస్ట్ సివిలియన్ అవార్డు కూడా అందుకున్నారీమె.

తల్లిబాటలో తనయులు

1954లో సమీర్ జన్మించారు. ది టైమ్స్ ఆఫ్ ఇండియా మాతృ సంస్థ అయిన బెన్నెట్, కోలిమన్ అండ్ కో లిమిటెడ్కు ఉపాధ్యక్షుడిగా ఆయన బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆయన ఆధ్యాత్మికవేత్త, విద్యావేత్త, మానవతావాది, కళలు, సంస్కృతి పోషకుడు. ఉపాధ్యక్షుడిగా ది టైమ్స్ గ్రూపును ప్రపంచ ఖ్యాతి పొందేలా చేయడం వెనుక ఈయన కృషి ఎంతో ఉంది. 1975లో బెన్నట్, కోలిమన్ అండ్ కో లిమిటెడ్‌లో జూనియర్ ఎగ్జిక్యూటివ్‌గా బాధ్యతలు స్వీకరించి ఉపాధ్యక్షుడి స్థాయికి ఎదిగారు. 1986లో వినీత్ జైన్ కూడా కంపెనీ బాధ్యతలు చేపట్టారు. మేనేజింగ్ డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు.

భారత దేశంలో శక్తివంతమైన మీడియాల్లో ఒకటిగా ఉంటున్న టైమ్స్ గ్రూప్ సీఈఓగా వ్యవహరించడం అంటే ఎంతో కార్యదీక్ష, దక్షత ఉంటేగాని సాధ్యం కానిది. ఇందూ జైన్ టైమ్స్ గ్రూప్ స్థాపించే సమయంలో భవిష్యత్తును అంచనా వేసి ఎన్నో జాగ్రత్తలు తీసుకున్నారు. చిరకాలంలోనే జాతీయస్థాయితో పాటు అంతర్జాతీయ స్థాయిలోనూ టైమ్స్ పలువురి ప్రశంసలు అందుకుని ఖ్యాతి పొందారు.



భర్త మరణంతో బాధ్యతల్లోకి..

ఇందూ జైన్ ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఫరిదాబాద్‌లో సెప్టెంబర్ 8, 1936లో జన్మించారు. భర్త అశోక్‌కుమార్ జైన్. సాహు జైన్ కుటుంబానికి చెందిన ఆమెకు ఇద్దరు కుమారులు సమీర్ జైన్, వినీత్ జైన్‌లతో పాటు ఒక కూతురు ఉంది. అశోక్‌కుమార్ ఫిబ్రవరి 4,1999లో గుండెసంబంధిత వ్యాధితో మరణించారు. అప్పటి నుంచి టైమ్స్‌ను నడిపించే బాధ్యతను తనపై వేసుకున్నారు ఇందూ జైన్. చంటిపిల్లాడిని చేయి పట్టుకుని నడిపించినట్టు, టైమ్స్ ప్రస్థానాన్ని మెట్టు మెట్టుగా అందలం ఎక్కించారు.

టైమ్స్ గ్రూపు పత్రికలు

ది టైమ్స్ ఆఫ్ ఇండియా : ఇది ప్రపంచ ఆంగ్ల పత్రికల్లో అత్యంత సర్క్యులేషన్ ఉన్న పత్రికగా పేరుపొందింది.

ది ఎకానమిక్ టైమ్స్ : మన దేశంలో అత్యధిక సర్క్యులేషన్ ఉన్న ఫైనాన్షియల్ దిన పత్రిక, ప్రపంచంలో ఇది రెండో స్థానంలో ఉంది.

మహారాష్ట్ర టైమ్స్ : ఇది మహారాష్ట్ర రాష్ట్రం వరకు వస్తుంది. స్థానిక భాషలోనే ప్రచురితం అవుతున్నది.

నవ భారత్ టైమ్స్ : ఇది మన దేశ రాజభాష అయిన హిందీలో వస్తుంది. ఢిల్లీ, ముంబైలో ప్రచురణ కార్యాలయాలున్నాయి.

ముంబై మిర్రర్ : ఇది మన దేశంలో అత్యధిక సర్క్యులేషన్ ఉన్న కంపాక్ట్ దినపత్రిక.

కోల్‌కతా మిర్రర్, పుణే మిర్రర్, అహ్మదాబాద్ మిర్రర్, బెంగలూర్ మిర్రర్ : ఇవి ఆయా ప్రాంతాల్లో అక్కడి భాషల్లో ప్రచురితం అవుతున్నాయి.

విజయ్ కర్నాటక : కర్నాటకలో రెండవ దిన పత్రికగా ఆవిష్కరించబడింది.

ఈటి వెల్త్ : భారత దేశంలో అత్యధిక ఆదరణ ఉన్న ఫైనాన్షియల్ వార పత్రిక

ఫిల్మ్ ఫేర్ : మన దేశంలో అత్యధిక సర్క్యులేషన్ ఉన్న మ్యాగజైన్.

ఫెమినా :



ఇది మహిళలు, అందం, లైఫ్ స్టయిల్ కోసం రూపొందించిన మ్యాగజైన్ ఈ పత్రికలు, మ్యాగజైన్లు అన్నీ టైమ్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తుంటారు. మన దేశంలోని అన్ని రాష్ట్రాలోనూ ఈ పత్రికలు, మ్యాగజైన్లు అందుబాటులో ఉంటాయి. అంతేకాదు ఓ మూవీ చానల్ కూడా ఈ గ్రూప్ నడుపుతున్నది అది మూవీ నవ్. ఎఫ్ఎం రంగంలోనూ అడుగుపెట్టింది. రేడియో మిర్చి పేరుతో ఎంతో మంది శ్రోతలకు పలు ఆసక్తికర విషయాలను అందిస్తున్నది.



లక్ష్యాన్ని మార్చుకొని..

తల్లిదండ్రులు తమ పిల్లల్ని ఐఏఎస్, ఐపీఎస్ వంటి ప్రజలకు సేవ చేసే పెద్ద ఉద్యోగాలకు సిద్ధం చేస్తుంటారు. ఈమె కూడా చిన్నప్పటి నుంచి ఐఏఎస్ అవ్వాలని కలలు కన్నది. ఆ దిశగా సివిల్స్‌కు ప్రిపేర్ అవుతూ.. ఉన్నపళంగా తన లక్ష్యాన్ని మార్చుకొని.. చివరికి సాధించింది.

గుజరాత్ రాష్ట్రంలోని శంఖల్పూర్ గ్రామానికి చెందిన మిట్టల్ పటేల్ చిన్నప్పటి నుంచి ఐఏఎస్ కావాలని లక్ష్యంగా పెట్టుకున్నది. ఉన్నత చదువులు పూర్తి చేసి అహ్మదాబాద్‌లో సివిల్స్‌కు శిక్షణ తీసుకుంటుండగా అనూహ్యంగా తన లక్ష్యాన్ని మార్చుకొని గిరిజనులకు సేవ చేస్తున్నది. శిక్షణ తీసుకుంటున్న సమయంలో చర్ఖా అనే ప్రాంతంలో చెరుకు కార్మికులను చూసేందుకు వెళ్లింది. వారంతా గిరిజన తెగకు చెందినవారు కావడం, చదువు లేకపోవడంతో కాంట్రాక్టర్లు వారిని దోపిడీ చేస్తున్న తీరు, నేరాలకు అలవాటుపడి అనారోగ్యంతో బాధపడుతున్నవారిని చూసి చలించింది. వారి కోసం జనపథ్ అనే స్వచ్ఛంద సంస్థను ప్రారంభించి పిల్లలకు, మహిళలకు చదువు చెప్పించింది. వారిని చైతన్యపరుస్తూ 1871 క్రిమినల్ ట్రైబల్ చట్టాన్ని రద్దు చేయాలని పోరాటం చేస్తున్నది. గిరిజన తెగలు వలసపోకుండా స్వయం ఉపాధి కార్యక్రమాలు చేపట్టింది. అందరికీ రేషన్‌కార్డులు, గుర్తింపు కార్డులు వచ్చేలా పోరాడింది. మొత్తంగా నేరస్తులుగా ఉన్న గిరిజనుల జీవిన విధానంలో మార్పులు తీసుకొచ్చి.. ప్రజలకు సేవ చేయాలనే తన లక్ష్యాన్ని నెరవేర్చుకొన్నది మిట్టల్ పటేల్.

అడుగండి చెబుతా

ఐసీయూలో జరిగే చికిత్సలేమిటి?



నా మిత్రుడి వయసు 38 సంవత్సరాలు. ఇటీవల అతడికి శ్వాసకోశ సమస్యల కారణంగా అతన్ని హాస్పిటల్‌లో చేర్పించాం. నాలుగు రోజుల దాకా క్రమంగా కోలుకుంటున్నట్టు అనిపించింది. డాక్టర్లు ఐసీయూలో ఉంచాలని చెప్పినప్పటికీ కోలుకుంటున్నాడు కదా అని మేం ఒప్పుకోలేదు. అయితే ఒకరోజు అర్ధరాత్రి హఠాత్తుగా పరిస్థితి విషమించింది. ఆ తర్వాత కొద్ది నిమిషాలకే అతడు చనిపోయాడు. ఐసీయూలో ఉంచి ఉంటే ఇలా జరిగేది కాదని డాక్టర్లు అన్నారు. అసలు ఐసీయూలో జరిగే ప్రత్యేక చికిత్సలు ఏమిటి? పూర్తి వివరాలు తెలియజేయగలరు.


- ప్రసాద్, మేడిపల్లి

శరీరం చాలా రకాల జీవరసాయనాల ఆధారంగా పని చేస్తుంది. ఏదైనా అనారోగ్యం కలిగినపుడు ఈ రసాయన ప్రక్రియల్లో తేడాలు జరుగుతాయి. శరీరంలోని వివిధ భాగాలు ఈ తేడాల సమతుల్యత వల్ల దెబ్బతింటాయి. ఐసీయూలో ఉంచినపుడు ఎప్పటికప్పుడు గమనిస్తూ వాటిని క్రమబద్ధీకరించేందుకు ఏర్పాట్లు ఉంటాయి. తిరిగి కోలుకునేందుకు అవసరమైన వైద్య చికిత్సలు ఐసీయూలో అందుబాటులో ఉంటాయి. శరీరానికి ఒక నిర్ణీత సమయంలో కోలుకునే శక్తి సహజంగానే ఉంటుంది. కీలక భాగాలైన మెదడు, గుండె, శ్వాసకోశాలు, కాలేయం, కిడ్నీల్లో ఏర్పడే తేడాల వల్ల రక్తంలో కలిగే మార్పుల మీద రోగి పరిస్థితి ఆధారపడి ఉంటుంది. హఠాత్తుగా గుండెకు సంబంధించిన రక్తనాళాల్లో రక్తం గడ్డకట్టడం, ఊపిరితిత్తుల్లో ఇన్‌ఫెక్షన్లు రావడం, కడుపులో లేదా మెదడులో రక్తస్రావం కావడం వంటి సమస్యల్లో ఒక్కోసారి శరీరానికి తిరిగి కోలుకునేంత సమయం దొరకకపోవచ్చు. ఇలాంటి సందర్భాల్లోనే ప్రాణాలకు ప్రమాదం ఏర్పడుతుంది. ఇలాంటి పరిణామాలు మామూలుగా అయితే మనం ముందుగా ఊహించలేం. ఇలాంటి పరిస్థితి ఏర్పడే ఆస్కారం ఉందేమో అన్న అనుమానం ఉన్నపుడు ఐసీయూలో ఉంటే తక్షణ చికిత్స అందించడం సాధ్యమవుతుంది. ప్రమాదాన్ని ఎదుర్కొనేందుకు అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఐసీయూలో వెంటిలేటర్లు, డయాలసిస్ యంత్రాల వంటివన్నీ అందుబాటులో ఉంటాయి. గుండె పనితీరులో తేడాలను వెంటనే గుర్తించి పరిస్థితిని నియంత్రించేందుకు డిఫిబ్రిలేటర్లు అందుబాటులో ఉంటాయి. కిడ్నీలు పనిచేయనపుడు ఉపయోగించే రీనల్ రీప్లేస్మెంట్ థెరపీ, కాలేయం పనిచేయనపుడు ఉపయోగించే మార్స్ అందుబాటులో ఉంటాయి. అలాగే మందులను అనుకున్నంత సూక్ష్మ స్థాయిలో ఇచ్చే ఇన్‌ఫ్యూజన్ పంపులు కూడా ఉంటాయి. వీటితో పాటు నాడీ లోపలి నుంచి ప్రతి స్పందనను కొలిచేందుకు వీలుంటుంది. ఏ కొంచెం తేడా కనిపించినా తక్షణమే చికిత్సలు ప్రారంభించేందుకు అనువుగా ఉంటుంది. అలాంటి సందర్భాల్లో ఉన్నవారిని మాత్రమే ఐసీయూలో ఉంచాల్సిందిగా డాక్టర్లు సూచిస్తారు. కాబట్టి డాక్టర్ల సలహా పాటించడమే మంచిది.



డాక్టర్ నిఖిల్ మాథుర్
కన్సల్టెంట్ అండ్ హెడ్
ఎమర్జెన్సీ మెడిసిన్
కేర్ హాస్పిటల్స్, హైదరాబాద్

నున్నటి జుట్టుకోసం..



కొంతమందికి జుట్టు తరుచూ రేగిపోతూ ఉంటుంది. ఎంత దువ్వినా కుదురుగా ఉండదు. ఏం చేస్తే నున్నటి జుట్టు సొంతమవుతుందో తెలుసా? అయితే తెలుసుకోండి..

- అలోవెరా జెల్‌లో సహజసిద్ధమైన మాయిశ్చరైజింగ్ గుణాలు ఉంటాయి. కాబట్టి అలోవెరా జెల్‌ని జుట్టుకు రాయడం వల్ల జుట్టు రేగడం తగ్గిపోయి కుదురుగా ఉంచుతుంది.
- ఎక్కువ నూనె కాకుండా.. కొద్దిగా ఆల్మండ్ నూనెను జుట్టుకు రాస్తే మంచి ఫలితం ఉంటుంది. ఇది రేగిన జుట్టును సరిచేయడమే కాదు.. శిరోజాల సౌందర్యాన్ని పరిరక్షిస్తుంది.
- అన్ని రకాల జుట్టు సమస్యలకు ఆపిల్ సైడర్ వెనిగర్‌తో చక్కటి పరిష్కారం. ఇందులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు జుట్టు రేగడాన్ని అరికడుతాయి. వారానికొకసారి ఈ ప్యాక్ వేస్తూ ఉండండి.
- పెరుగు ద్వారా శిరోజాలకు తగినంత తేమ లభిస్తుంది. జుట్టు మూలాల నుంచి పోషణ లభిస్తుంది.
- కోడిగుడ్డులోని తెల్లసొనను వాడడం ద్వారా జుట్టు మృదువుగా మారుతుంది. ఇందులో నిమ్మరసం కలిపి తీసుకుంటే మంచి ఫలితం ఉంటుంది.



లేనిది ఉన్నట్టు.. ఉన్నది లేనట్టు!

కొన్ని సంవత్సరాల నుంచి సోషల్‌మీడియాలో మనిషి శరీరానికి సంబంధించిన చిత్రాలు విచిత్రమవుతున్నాయి. రకరకాల యాప్‌లు వచ్చాయి. అవి మనిషి శరీర ఆకృతులను, ఆకారాలను మార్చేశాయి. లేనిది ఉన్నట్టు.. ఉన్నది లేనట్టు చేసే మాయా ప్రపంచంలోకి తీసుకెళ్తున్నాయి. వీటన్నింటికీ కారణం టెక్నాలజీ. ఈ టెక్నాలజీని వాడుకుంటూ శరీర ఆకృతులను ఎలా మార్చుకోవాలి? వాటికి ఏమేం అవసరం అవుతాయి అనే అంశాల్ని సారా వివిధ శైలిల్లో, వేర్వేరు కోణాల్లో తీసుకున్న తన చిత్రాలను సోషల్‌మీడియా ద్వారా విడుదల చేసింది. కొందరు బ్లాగర్లు లావుగా ఉన్నా.. సన్నగా ఉన్నట్టు ఎడిట్ చేసి జనాలను మోసం చేస్తున్నారని చెప్తుంది సారా. ఫొటోల ఎడిటింగ్ వరకు అయితే టెక్నాలజీ సరిపోతుందని, బాడీ షేప్ చేయాలంటే మాత్రం వర్కవుట్స్ తప్పనిసరి అని అంటున్నది. పొట్టి డ్రెస్సుల్లో, బికినీల్లో ఉన్న చిత్రాలను ఎడిట్‌కి ముందు, ఎడిట్ తర్వాత అని అభ్యంతరకర చిత్రాలను విడుదల చేసింది. ఎవరిదీ పరిపూర్ణ ఆకృతిగల శరీరం ఉండదని, కచ్చితంగా దాన్ని మనమే ఆకృతి చేయాలని రాసింది.

నమస్తే తెలంగాణ
నిపుణ
[హైదరాబాద్]
సోమవారం 22 జనవరి 2018

ఇగ్నోలో ఎస్సీ, ఎస్టీలకు ఫీజు లేని కోర్సులు

ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ (ఇగ్నో) జాతీయ స్థాయిలో దూరవిద్యను అందిస్తున్న సంస్థ. ఎంతో మందిని గ్రాడ్యుయేట్లను చేసిన ఇగ్నో.. ఎస్సీ, ఎస్టీల కోసం ఓ కీలక నిర్ణయం తీసుకున్నది. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు కోర్సుల్లో పూర్తి ఫీజు రాయితీ కల్పించనున్నది. 2018, జనవరి సెషన్‌లో సర్టిఫికెట్, డిగ్రీ, డిప్లొమా కోర్సుల్లో ప్రవేశం పొందేవారికి మాత్రమే ఈ సదుపాయం వర్తిస్తుంది. ఫీజు రాయితీ పొందాలనుకునే ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు ఇగ్నో ప్రాంతీయ కేంద్రాలు, అధ్యయన కేంద్రాల్లో దరఖాస్తును స్వయంగా అందజేయవచ్చు. దరఖాస్తులను పూర్తిగా నింపి, అవసరమైన ధ్రువపత్రాలతోపాటు కుల ధ్రువీకరణ సర్టిఫికెట్‌ను కూడా తప్పనిసరిగా జతచేయాలి. నేరుగా దరఖాస్తును సమర్పించే వారు ఎలాంటి ఫీజును చెల్లించాల్సిన అవసరం లేదు. ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకొనే వారు మొదట ఫీజును చెల్లించాలి. ప్రవేశ ప్రక్రియ పూర్తయిన తర్వాత ఫీజును తిరిగిస్తారు. ఇగ్నో ప్రస్తుతం సర్టిఫికెట్, డిప్లొమా, డిగ్రీ, డాక్టోరల్ తదితరాలకు సంబంధించి 228 రకాల కోర్సులను ఆఫర్ చేస్తున్నది. జనవరి సెషన్ అడ్మిషన్లకు చివరితేదీ 2018, జనవరి 31తో ముగియనున్నది.



ఆన్‌లైన్‌లో ఎంట్రెన్స్‌లు.. అంతా మంచికే!

కాలం మారుతున్నది. సాంకేతికత వేగంగా అభివృద్ధి చెందుతున్నది. విద్యారంగంలో సాంకేతికత గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. పట్టణ ప్రాంతాల్లో నర్సరీ డిజిటల్ బోధన కొనసాగుతున్నది. ఉద్యోగ భర్తీ, కళాశాలల్లో సీట్ల భర్తీకి కూడా పేపర్ పెన్సిల్ పరీక్షల స్థానంలో ఆన్‌లైన్ పరీక్షల పద్ధతి ఈమధ్య కాలంలో బాగా పెరిగింది. లక్షల మంది విద్యార్థులు రాసే ఎంట్రెన్స్‌లు సైతం ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తున్నారు. తెలంగాణలో పలు కోర్సుల్లో ప్రవేశాల కోసం ఏటా నిర్వహించే కామన్ ఎంట్రెన్స్ టెస్ట్‌లు ఈసారి ఆన్‌లైన్‌లో నిర్వహించాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో ఆన్‌లైన్ టెస్ట్‌లు మంచిచెడుల గురించి సంక్షిప్తంగా నిపుణ పాఠకుల కోసం...



ఆన్‌లైన్ విధానంలో పరీక్ష నిర్వహణకు ప్రాథమికంగా కావల్సింది తగినంత మౌలిక సదుపాయాలు ఉండాలి. ముఖ్యంగా ఆధునిక కంప్యూటర్ వ్యవస్థ ప్రధానం. దీని కోసం ప్రధాన పట్టణాల్లోని కంప్యూటర్ సర్వీస్ సెంటర్లు, ఇంజినీరింగ్ కాలేజీలను ఉపయోగించుకుంటారు. రోజుకు రెండు నుంచి నాలుగు స్లాట్స్ ద్వారా దీన్ని నిర్వహిస్తారు.

- ఈ విధానంలో ప్రశ్నపత్రాన్ని రూపొందిచేవారికి మంచి అవకాశం. ఈ పరీక్షల్లో వివిధ రకాలైన ప్రశ్నలను రూపొందించి అభ్యర్థులను పలు రకాలుగా పరీక్షించవచ్చు.
- ప్రశ్నపత్రం లీక్ కావడం, ఆన్సర్ షీట్స్ మారడం వంటి అనుమానాలకు ఈ విధానంలో తావులేదు.
- అభ్యర్థి మాత్రమే లాగిన్ అయి, పరీక్షరాసి, ఫైనల్‌గా జవాబులను సబ్‌మిట్ చేయడం ఈ విధానంలో కీలకం. మాస్‌కాపీయింగ్, ఇన్విజిలేటర్ల పొరపాట్లు, బబ్లింగ్‌లో పొరపాట్లు తదితరాలు ఉండవు.

ఆన్‌లైన్ విధానంలో లాభాలు

- **త్వరగా ఫలితాలు:** సాధారణ పద్ధతి అంటే పెన్, పేపర్ విధానంలో పరీక్షల మూల్యాంకనం, డాటాఎంట్రీ, ర్యాంకుల గణన ఇలా పలు అంశాల కోసం ఎక్కువ సమయం కావాలి. కానీ ఆన్‌లైన్ విధానంలో పరీక్ష నిర్వహిస్తే చాలా సులభంగా పై పనులన్నింటిని చేయవచ్చు. పరీక్ష రాసినవారు కూడా ఎక్కువ కాలం ఫలితాల కోసం నిరీక్షించాల్సిన అవసరం లేదు.
- **ముద్రణ దోషాలు తక్కువ:** చాలా ఎంట్రెన్స్‌లలో ప్రశ్నల ముద్రణలో పొరపాట్లు సాధారణంగా మారాయి. దీనికి కారణం ఆయా సింబల్స్ లేకపోవడం, భాషాపరమైన తర్జుమా (ట్రాన్స్‌లేషన్) సమస్యలతో తప్పులు ఉంటాయి. కానీ ఆన్‌లైన్ విధానంలో ముద్రణ దోషాలకు అవకాశం చాలా తక్కువ. ఉదాహరణకు జేఈఈ అడ్వాన్స్‌డ్ 2017లో సైతం ప్రశ్నల్లో తప్పులు దొర్లాయి. అదే ఆన్‌లైన్ విధానంలో అయితే ఈ దోషాలు రావడానికి అవకాశాలు చాలా తక్కువ.
- **సమయం ఆదా:** కేవలం మౌజ్ క్లిక్, కీబోర్డుతో టెస్ట్ నిర్వహణ ప్రారంభం చేయవచ్చు. అదే ఓఎంఆర్ విధానంలో అయితే ఎగ్జామినర్ జాగ్రత్తగా అందరికీ ఓఎంఆర్‌లు ఇవ్వాలి. వాటిలో అభ్యర్థులు పెన్సిల్/పెన్‌తో బబ్లింగ్ చేయాలి. దీనికోసం చాలా సమయం వృథా అవుతుంది. ఆన్‌లైన్ విధానంలో అయితే ప్రతి అభ్యర్థికి ఒక కంప్యూటర్ ఇస్తారు. పాస్‌వర్డ్ ఎంటర్ చేసి పరీక్షను సులభంగా పూర్తిచేయవచ్చు.
- **కచ్చితమైన మూల్యాంకనం:** ఓఎంఆర్ షీట్స్ విధానంలో జవాబులను మెషిన్స్ మూల్యాంకనం చేస్తాయి. ఈ పద్ధతిలో ఓఎంఆర్ షీట్‌లో ఏ చిన్న పొరపాటు చేసినా మెషిన్ మూల్యాంకనం చేయదు. దీంతో అభ్యర్థులు చాలా కోల్పోవాల్సి వస్తుంది. కానీ ఆన్‌లైన్‌లో కేవలం మౌజ్ క్లిక్‌తో సరైన పద్ధతిలో జవాబులను గుర్తించవచ్చు. ఏదైనా తప్పుచేస్తే వెంటనే తెలిసిపోతుంది. అభ్యర్థి సరిదిద్దుకొని మిగిలిన ప్రశ్నలకు జవాబులు గుర్తించవచ్చు.
- **జవాబులను ఎడిట్ చేసుకోవచ్చు:** ఓఎంఆర్ విధానంలో ఒక్కసారి జవాబు గుర్తిస్తే మార్చడం చాలా కష్టం. కానీ ఆన్‌లైన్ విధానంలో జవాబులను ఎన్నిసార్లయినా మార్చుకోవచ్చు. మొదట తప్పు జవాబు గుర్తిస్తే, కొంతసేపటి తర్వాత సరైన జవాబు గుర్తువస్తే వెంటనే సంబంధిత ప్రశ్న వద్దకు వెళ్లి జవాబును మార్చుకోవచ్చు. ముఖ్యంగా ఇది పీహెచ్‌సీ అభ్యర్థులకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. వీరు ఓఎంఆర్‌లో బబ్లింగ్ చేసేటప్పుడు కొన్ని ఇబ్బందులు పడుతుంటారు. దగ్గరి దగ్గరిగా ఉన్న సర్కిల్స్‌లో బబ్లింగ్ వీరికి కష్టమైన ప్రక్రియ. కానీ ఆన్‌లైన్‌లో వీరు కేవలం ఒక్క క్లిక్‌తో జవాబులు గుర్తించవచ్చు.
- **రంగుల్లో ప్రశ్నలు:** ఆఫ్‌లైన్ విధానంలో అభ్యర్థులు ప్రశ్నలకు జవాబులు ఓఎంఆర్‌లో బబ్లింగ్ చేసుకొంటూ వెళ్లిపోవాలి. కానీ ఆన్‌లైన్ విధానంలో జవాబులు రాసిన ప్రశ్నలకు ఒక రంగు, జవాబులు గుర్తించని వాటికి ఒక రంగు, రివ్యూ చేసుకోవాలనుకొనే వాటికి ఒక రంగు (కలర్), జవాబు ఫైనల్ సబ్‌మిట్ చేయనివి ఒక కలర్‌లో ఉంటాయి.
- దీనివల్ల అభ్యర్థులు సులభంగా ఆయా ప్రశ్నలకు జవాబులు గుర్తించడం, ఫైనల్ సబ్‌మిషన్ చేయడం సులువుగా పూర్తిచేయవచ్చు.

విజయం సాధించాలంటే...?

- ఆన్‌లైన్ విధానంలో ఎంట్రెన్స్‌లు నిర్వహిస్తున్నారు అనే భయాన్ని మొదట వీడాలి.
- ముఖ్యంగా గ్రామీణ ప్రాంత అభ్యర్థులు ఆన్‌లైన్ ఫోబియాను వీడాలి. స్మార్ట్‌ఫోన్లు వాడుతున్న నేటి విద్యార్థులకు ఆన్‌లైన్ మరింత ఈజీ అనే భావన పెంపొందించుకోవాలి.
- ఆఫ్‌లైన్‌లో లేని అవకాశాలు ఆన్‌లైన్‌లో ఉన్నాయన్న విషయాన్ని గుర్తుంచుకొంటే చాలా ధైర్యం వస్తుంది.
- బబ్లింగ్ కంటే ఆన్‌లైన్‌లో మౌజ్ క్లిక్ సులభం అన్నది గ్రహించాలి
- ఇప్పటివరకు ఆన్‌లైన్ టెస్ట్‌లు రాయనివారు చేయాల్సింది ఒక్కటే ఇంట్లో/నెట్ సెంటర్స్‌లోకి వెళ్లి వీలైనన్ని మాక్‌టెస్ట్‌లను రాయాలి.
- పరీక్షలో ఇచ్చే సూచనలను పాటించాలి. పరీక్ష హాల్‌లో ఆందోళన/కంగారు పడకుంటే ఆన్‌లైన్‌లో మీరు ముందుంటారు.
- ఎంట్రెన్స్‌ల్లో పరీక్షించేది మీరు చదువుకొన్న సిలబస్/తరగతుల సబ్జెక్టు అనే విషయాన్ని మరువకండి. పరీక్ష ఎక్కడ రాస్తే ఏమిటి? నేను రాయగలను.. సాధించగలను అనే విశ్వాసాన్ని పెంపొందించుకొంటే విజయం మీ సొంతం.

ఆన్‌లైన్ విధానంలో సమస్యలు

- Technical snags: ఈ విధానంలో ప్రధాన సమస్యలు పరిశీలిస్తే.. పవర్ ఫెయిల్యూర్, మెషిన్, కంప్యూటర్లు మొరాయించడం ఎక్కువగా జరుగుతుంటాయి. పరీక్షరాసే సమయంలో ఇటువంటి ఘటనలు జరిగితే అభ్యర్థుల మానసిక స్థితిలో ఆటంకం ఏర్పడి తర్వాత పరీక్షను సరిగ్గా రాయలేకపోవచ్చు.
- **సూచనలు తప్పక పాటించకపోవడం:** ఆన్‌లైన్ విధానం చాలా సులువుగా కనిపిస్తున్నప్పటికీ పరీక్ష సమయంలో కంప్యూటర్‌లో వచ్చే సూచనలను తప్పక పాటించాల్సి ఉంటుంది. అనేక సందర్భాల్లో అభ్యర్థులు వారి స్పందనలను, రివ్యూస్‌ను సేవ్ చేయకపోవచ్చు. దీంతో వారు ఆయా ప్రశ్నలకు మార్కులను కోల్పోతారు.
- **ఆన్‌లైన్ అంటే భయం:** ఇప్పటికి ముఖ్యంగా గ్రామీణ ప్రాంత అభ్యర్థులు సాంకేతిక విషయాల్లో కొంత వెనకబడటం అందరికీ తెలిసిందే. పెన్ పేపర్‌తో పరీక్ష రాసిన అలవాటుతో వారు ఒక్కసారిగా ఆన్‌లైన్ విధానంలో రావడంతో కొంత ఇబ్బంది ఉంటుంది. ముఖ్యంగా మానసికంగా వారు సిద్ధం కావాలి. ఆన్‌లైన్ విధానంలో ప్రాక్టీస్ టెస్ట్‌లను ఎక్కువగా చేయాలి.
- **ప్రశ్నపత్రం ఇవ్వరు:** ఆఫ్‌లైన్ విధానంలో ప్రశ్నపత్రాన్ని పరీక్ష ముగియగానే అభ్యర్థి వెంట తీసుకుపోవచ్చు. కానీ ఆన్‌లైన్ విధానంలో ప్రశ్నపత్రం ఇవ్వరు. వెంటనే ప్రశ్నపత్రం ఇవ్వడం వల్ల అభ్యర్థులు ఇంటికి వెళ్లి ఎన్ని ప్రశ్నలకు సరైన జవాబులు రాశాం, ఏ తప్పులు చేశారో వెంటనే తెలుసుకొంటారు. అదేవిధంగా ప్రశ్నపత్రంలో ఏవైనా పొరపాట్లు వచ్చాయా? వాటికి సరైన సమాధానాలు ఏవి అనే విషయాలను తెలుసుకొనే ప్రయత్నం చేస్తారు. ఎంట్రెన్స్‌లో ఎన్ని మార్కులు రావచ్చు? ఎంత ర్యాంక్ రావచ్చు అనే అంశాలను సుమారుగా అంచనా వేసుకోవచ్చు.

... కేశవపంతుల వేంకటేశ్వరశర్మ

అపోహలు వద్దు



– తుమ్మల పాపిరెడ్డి,
టీఎస్‌సీహెచ్ఈ చైర్మన్

రాష్ట్రంలో అన్ని ఎంట్రెన్స్‌లను ఆన్‌లైన్ విధానంలో నిర్వహించనున్నారు. వీటికి సంబంధించి ప్రక్రియ కూడా ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో అభ్యర్థుల్లో ఉన్న ఆందోళనలను తొలగించడానికి రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ తుమ్మల పాపిరెడ్డి 'నిపుణ'కు చెప్పిన విషయాలు ఆయన మాటల్లో....

- జాతీయస్థాయిలో ఎంట్రెన్స్‌లన్నీ ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తున్న నేపథ్యం, సాంకేతికత గ్రామీణ ప్రాంతాలకు చేరువైన ఈరోజుల్లో ఆన్‌లైన్ పరీక్షలు అనివార్యం. ఆన్‌లైన్ విధానం కష్టమైనది కాదు. స్మార్ట్‌ఫోన్లను ఎక్కువగా ఉపయోగిస్తున్న నేటి తరుణంలో ఆన్‌లైన్ పరీక్ష రాయడం కష్టమేమికాదు. ఐఐటీ జేఈఈ/అడ్వాన్స్‌డ్, గేట్, క్యాట్ వంటి ప్రతిష్ఠాత్మక పరీక్షలన్నీ ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తున్నారు. రాష్ట్ర అభ్యర్థులు దాదాపు అన్ని పరీక్షలను రాస్తున్నారు. సాంకేతికత కూడా అందుబాటులోకి వచ్చింది. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకొని రాష్ట్రంలో అన్ని కామన్ ఎంట్రెన్స్ టెస్ట్‌లను (సెట్స్) ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తున్నాం. గతేడాది ఈసెట్ ప్రయోగాత్మకంగా ఆన్‌లైన్‌లో నిర్వహించాం. చిన్నచిన్న లోపాలు దృష్టికి వచ్చాయి. వాటన్నింటిని ఈసారి సరిదిద్దుతాం.
- రాష్ట్ర ఐటీ శాఖ పరిధిలోని టీఎస్‌టీఎస్, టీసీఎస్ ఆన్‌లైన్ పరీక్ష నిర్వహణ కోసం ఒప్పందం చేసుకొన్నాయి. టీసీఎస్‌కు ఉన్న విస్తృత నెట్‌వర్క్‌తో ఈసారి అన్ని ఎంట్రెన్స్‌లను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నాం. హైదరాబాద్‌తోపాటు పాత పదిజిల్లా కేంద్రాలు, మరి కొన్ని పట్టణాల్లో కూడా సెంటర్లను ఏర్పాటు చేస్తాం. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా సెంటర్లు ఏర్పాటు చేస్తాం. రాష్ట్ర ఐటీశాఖ సహకారంతో పూర్తిస్థాయిలో ఆన్‌లైన్ విధానంలో ఎంట్రెన్స్‌లను నిర్వహిస్తాం. ఒక్కశాతం కూడా సమస్య రాకుండా ముందస్తు కసరత్తు చేస్తున్నాం. టీసీఎస్ కంపెనీ గతేడాది ఏపీలో ఆన్‌లైన్ విధానంలో ఎంట్రెన్స్‌లను నిర్వహించింది. ఎటువంటి సమస్యలు రాలేదు. ఇక్కడ కూడా అదే పద్ధతిలో ఎర్రర్ ఫ్రీగా ఎంట్రెన్స్‌లు నిర్వహిస్తాం.
- గ్రామీణ, చిన్న పట్టణాల్లో ఉన్న అభ్యర్థులు ఆన్‌లైన్ విధానం గురించి ఎటువంటి ఆందోళన చెందాల్సిన పనిలేదు. స్మార్ట్‌ఫోన్ వాడకం కంటే ఆన్‌లైన్ టెస్ట్ ఈజీ. అభ్యర్థుల్లో ఆందోళనలను దూరం చేయడానికి ఫిబ్రవరి మొదటి వారం నుంచి ఉచిత మాక్‌టెస్ట్‌లను అందుబాటులోకి తెస్తాం. గత ప్రశ్నపత్రాలను అందుబాటులో ఉంచుతాం. ప్రశ్నపత్రాలు ఇంగ్లిష్/తెలుగులో ఉంటాయి.
- ఎంసెట్, ఎడ్‌సెట్, ఈసెట్, ఐసెట్ తదితర ఎంట్రెన్స్‌లకు కన్వీనర్లను నియమించాం. వారు వాటికి సంబంధించిన కసరత్తు ప్రారంభించారు. హెల్ప్‌లైన్ ద్వారా సందేహాలను నివృత్తి చేస్తారు.
- టీసీఎస్ కంపెనీ నెట్‌వర్క్ ద్వారా సెషన్‌కు 25 వేలమందికి సులువుగా పరీక్ష నిర్వహిస్తాం. అంటే ఎంసెట్‌కు సుమారు లక్షన్నర మంది దరఖాస్తు చేసుకొంటే సెషన్‌కు 25వేల మంది చొప్పున ఆరు సెషన్స్‌లో అంటే మూడురోజుల్లో ఎంట్రెన్స్‌ను పూర్తిచేస్తాం. ఇక ఈసెట్, ఎడ్‌సెట్ వంటి వాటికైతే తక్కువ సెషన్స్‌లోనే పరీక్షలు పూర్తవుతాయి. దరఖాస్తు చేసుకొన్న అభ్యర్థులను బట్టి ఎన్ని రోజుల్లో ఎంట్రెన్స్ పూర్తవుతుందనేది నిర్ణయమవుతుంది.
- ఎంట్రెన్స్‌లో ప్రశ్నలు నార్మలైజేషన్ విధానంలో పూర్తి సైంటిఫిక్ అప్రోచ్‌లో ఉంటాయి. అంటే ఒకరికి కష్టం, మరొకరికి సులభంగా ఉండవు. అందరికి దాదాపు ఒకేస్థాయిలో (ఈజీ, డిఫికల్టీ, యావరేజ్) ప్రశ్నలు ఇస్తారు. ఎటువంటి అపోహలకు తావులేదు.
- ఆన్‌లైన్‌లో ఎంట్రెన్స్‌లు నిర్వహిస్తే ప్రశ్నపత్రం, ఆన్సర్ షీట్ ఎలా అన్న సందేహం చాలా మందికి ఉంది. ఎంట్రెన్స్ పూర్తయిన తర్వాత రోజు (అంటే అన్ని సెషన్లు పూర్తయిన తర్వాత) అభ్యర్థులు ప్రశ్నపత్రాన్ని, ఆన్సర్‌షీట్స్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.
- మొదట ప్రాథమిక కీ తర్వాత అభ్యంతరాలు స్వీకరించి ఫైనల్ కీ, ఫలితాలను సాధ్యమైనంత త్వరగా వెల్లడిస్తాం.
- పూర్తిస్థాయిలో పారదర్శకత, వేగం, కచ్చితత్వంతో ఎంట్రెన్స్‌లు నిర్వహిస్తాం.
- ఇప్పటివరకు ఆన్‌లైన్ పరీక్షలు రాయని అభ్యర్థులు ఫిబ్రవరి నుంచి అందుబాటులోకి వచ్చే మాక్‌టెస్ట్‌లను ప్రాక్టీస్ చేయండి. ఆందోళన చెందకుండా ఆత్మవిశ్వాసంతో ఎంట్రెన్స్‌లకు సిద్ధమవ్వండి.

ఎస్‌బీఐలో 8301 కొలువులు

దేశంలో బ్యాంకింగ్ రంగం నిరుద్యోగులపాలిట కల్పతరువుగా మారింది. ఏటా వేలసంఖ్యలో ఉద్యోగాలు కల్పిస్తూ అభ్యర్థుల్లో కొత్త ఆశలను చిగురింపచేస్తున్నది. బ్యాంకుల అవసరాల దృష్ట్యా భారీగా ఉద్యోగులను నియమించుకొంటున్నాయి. ఈ పరిస్థితి నిరుద్యోగులకు సువర్ణావకాశంగా మారింది. డిగ్రీ ఉత్తీర్ణులై ఉండి బ్యాంకింగ్ రంగంలో స్థిరపడాలనే కోరిక ఉన్నవారు తక్కువ సమయంలో ఉద్యోగాన్ని సంపాదించవచ్చు. ఉద్యోగాల కల్పనలో దేశంలోనే అతిపెద్ద ప్రభుత్వరంగ బ్యాంకు అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇతర బ్యాంకుల కంటే ముందుంది. తాజాగా 8301 ఉద్యోగాలతో ఎస్‌బీఐ నోటిఫికేషన్ జారీ చేసింది. తెలంగాణ సర్కిల్‌లో 255 పోస్టులు ఉన్నాయి. ఆ నోటిఫికేషన్ వివరాలు నిపుణ పాఠకులకోసం.



స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో క్లరికల్ క్యాడర్ విభాగంలో ఖాళీగా ఉన్న జూనియర్ అసోసియేట్ (కస్టమర్ సపోర్ట్ అండ్ సేల్స్) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

- **అర్హత:** ఏదైనా బ్యాచిలర్ డిగ్రీ లేదా కేంద్ర ప్రభుత్వం గుర్తించిన తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణత. 2018 జనవరి 1 నాటికి ఇంటిగ్రేటెడ్ డ్యూయల్ డిగ్రీ పూర్తిచేసిన అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- అభ్యర్థులు ఏ సర్కిల్ పరిధి పోస్టులకైనా దరఖాస్తు చేసుకోవచ్చు. ఆ సర్కిల్‌కు కేటాయించిన ప్రాంతీయ భాష/స్థానిక భాషలో ప్రావీణ్యం ఉండాలి.
- అయితే అభ్యర్థి ఏదో ఒక రాష్ట్రాన్ని మాత్రమే ఎంచుకోవాలి.
- **వయస్సు:** 2018 జనవరి 1 నాటికి 20 నుంచి 28 ఏండ్ల మధ్య ఉండాలి. (1990 జనవరి 2 నుంచి 1998 జనపవరి 1 మధ్యన జన్మించి ఉండాలి). ఎస్సీ, ఎస్టీలకు ఐదేండ్లు, ఓబీసీలకు మూడేండ్లు, పీహెచ్‌సీలకు పదేండ్లు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- **పే స్కేల్:** రూ. 11765-31450/-. ముంబైవంటి మెట్రో నగరాల్లో రూ. 23, 600 (డీఏతో కలిపి), బ్యాంక్ నిబంధనల ప్రకారం కొత్త పెన్షన్ మెడికల్, లీవ్ చార్జీలు ఇతర సౌకర్యాలు ఉంటాయి.
- **అప్లికేషన్ ఫీజు:** జనరల్/ఓబీసీ అభ్యర్థులు రూ. 600/-, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ/ఎక్స్ సర్వీస్‌మెన్ అభ్యర్థులు రూ. 100/-
- **ప్రొబేషనరీ పీరియడ్:** 6 నెలలు
- **పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, వరంగల్.

దరఖాస్తు: ఆన్‌లైన్ ద్వారా
చివరితేదీ: ఫిబ్రవరి 10
ప్రిలిమినరీ ఎగ్జామ్: మార్చి/ఏప్రిల్
మెయిన్ ఎగ్జామ్: మే 12
వెబ్‌సైట్: www.statebankofindia.com

మొత్తం పోస్టుల సంఖ్య: 8301

రెగ్యులర్ ఖాళీలు-7200 (జనరల్-3788, ఎస్సీ-1111, ఎస్టీ-711, ఓబీసీ-1590)
బ్యాక్‌లాగ్ ఖాళీలు-1101(ఎస్సీ-569, ఎస్టీ-303, ఓబీసీ-229)
బ్యాక్‌లాగ్ పోస్టులు ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ అభ్యర్థులకు మాత్రమే
హైదరాబాద్ సర్కిల్ పరిధిలో 255 ఖాళీలు. వీటిలో రెగ్యులర్-110 (జనరల్-57, ఎస్సీ-17, ఎస్టీ-7, ఓబీసీ-29), బ్యాక్‌లాగ్-145 (ఎస్సీ అభ్యర్థులకు మాత్రమే) ఖాళీలు ఉన్నాయి.
ఏపీ సర్కిల్ పరిధిలో రెగ్యులర్-400 (జనరల్-200, ఎస్సీ-35, ఎస్టీ-75, ఓబీసీ-135) ఖాళీలు ఉన్నాయి.

ఎంపిక: ఆన్‌లైన్ ప్రిలిమినరీ, మెయిన్స్ ఎగ్జామ్ ద్వారా

ప్రిలిమినరీ పరీక్ష విధానం

సబ్జెక్టు	ప్రశ్నలు	మార్కులు	సమయం
ఇంగ్లిష్ లాంగ్వేజ్	30	30	20
న్యూమరికల్ ఎబిలిటీ	35	35	20
రీజనింగ్ ఎబిలిటీ	35	35	20

మెయిన్స్ పరీక్ష విధానం

సబ్జెక్టు	ప్రశ్నలు	మార్కులు	సమయం
జనరల్/ఫైనాన్షియల్ అవేర్‌నెస్	50	50	35
జనరల్ ఇంగ్లిష్	40	40	35
క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్	50	50	45
రీజనింగ్ ఎబిలిటీ & కంప్యూటర్ ఆప్టిట్యూడ్	50	60	45

- ప్రతి సెక్షన్‌ను నిర్ణీత సమయంలోగా పూర్తిచేయాల్సి ఉంటుంది.
- నెగెటివ్ మార్కింగ్‌లో భాగంగా (ప్రిలిమినరీ, మెయిన్స్) ప్రతి తప్పు సమాధానానికి 1/4 మార్కులను తగ్గిస్తారు.
- ప్రిలిమినరీ రాతపరీక్షలో నిర్దేశిత మార్కులను సాధించిన వారికి మెయిన్ ఎగ్జామ్ రాయడానికి ప్రకటించిన ఖాళీలకు 1:10 నిష్పత్తిలో ఎంపికచేస్తారు.
- మెయిన్ ఎగ్జామ్‌లో కటాఫ్ మార్కులను సాధించినవారు చివరగా ప్రాంతీయ/స్థానిక భాషలో పరీక్ష రాయాల్సి ఉంటుంది. అంటే రాష్ట్ర అధికార భాషలో రాయడం, చదవడం, మాట్లాడటంలో నైపుణ్యాన్ని పరీక్షిస్తారు. పదోతరగతి /ఇంటర్‌లో తెలుగు సబ్జెక్టును చదివినవారికి ఎలాంటి భాషా ప్రావీణ్య పరీక్షలు లేకుండానే ఎంపిక చేస్తారు.
- కేవలం మెయిన్ పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగానే ఎంపికచేస్తారు.

... తన్నీరు వెంకటేశ్వర్లు

నమస్తే తెలంగాణ
నిపుణ
[హైదరాబాద్]
సోమవారం 22 జనవరి 2018

Dwaraka

ఇఫ్లూలో ప్రవేశాలు

2018 సంవత్సరానికిగాను గ్రాడ్యుయేషన్‌లో ప్రవేశాల కోసం ఇంగ్లిష్, ఫారిన్ లాంగ్వేజ్ యూనివర్సిటీ (ఇఫ్లూ) నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దరఖాస్తుదారుల నుంచి బీఏ (ఆనర్స్) ఇంగ్లిష్, ఫారెన్ లాంగ్వేజ్‌లలో ఆన్‌లైన్ పద్ధతిలో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది. ఇఫ్లూ-2018కి దరఖాస్తు చేసుకోవాలనుకునే వారు మొదట పేరు, ఈ-మెయిల్ ఐడీ, మొబైల్ నంబరు తదితర వివరాలతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఈ-మెయిల్ ఐడీ, మొబైల్ ఫోన్‌కు లాగిన్ ఐడీ, పాస్‌వర్డ్ వస్తుంది. లాగిన్ ఐడీ, పాస్‌వర్డ్ ద్వారా అప్లికేషన్‌ను పూర్తిచేయాలి. పరీక్ష ఫీజు జనరల్ అభ్యర్థులకు రూ. 500, ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీ అభ్యర్థులకు రూ. 250లుగా నిర్ణయించారు. దరఖాస్తులకు ఇంటర్మీడియట్/10+2 లేదా తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులైన వారు అర్హులు. దరఖాస్తుల సమర్పణకు ఆఖరు తేదీ 2018, ఫిబ్రవరి 7. అడ్మిట్‌కార్డులను 2018, ఫిబ్రవరి 16న ఇఫ్లూ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. బీఏ (ఆనర్స్) ఇంగ్లిష్ ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 24, బీఏ (ఆనర్స్) ఫారెన్ లాంగ్వేజ్‌లకు ఫిబ్రవరి 25న పరీక్ష జరుగుతుంది. 2018, మేలో ప్రవేశ పరీక్షల ఫలితాలను విడుదల చేస్తారు.



సివిల్స్ ఇంటర్వ్యూ

ఒక్క అడుగు... దేశంలోనే అత్యున్నత ప్రభుత్వ ఉద్యోగం సాధించేందుకు ఒకే ఒక్క అడుగు దూరం.. సివిల్ సర్వీసెస్ 2017 మెయిన్స్‌లో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు మరో నెలలో ఇంటర్వ్యూలు మొదలుకానున్నాయి. సంవత్సరాల కృషి, పట్టుదలతో మెయిన్స్ వరకు వచ్చిన అభ్యర్థులు లక్ష్యసాధనకు ఇంటర్వ్యూ రూపంలో ఒక్క అడుగు దూరంలో ఉన్నారు. ఎంతో కీలకమైన ఇంటర్వ్యూలకు అభ్యర్థులు ఎలా సన్నద్ధం కావాలన్న అంశంపై సివిల్స్ ర్యాంకర్ మల్లవరపు బాలలత అందిస్తున్న విలువైన సమాచారం నిపుణ పాఠకుల కోసం..



సివిల్ సర్వీసెస్ పరీక్షా విధానం మూడు అంచెలుగా ఉంటుంది. మొదటిది ప్రిలిమ్స్. దాదాపు 9 లక్షలకు పైగా సివిల్ సర్వీసెస్ పరీక్షకు దరఖాస్తు చేస్తారు. ఇందులో 50 శాతం మంది మాత్రమే పరీక్షకు హాజరవుతారు. వారిలో 1:12 నిష్పత్తిలో మెయిన్స్‌కు అర్హత పొందుతారు. మెయిన్స్ పరీక్ష డిస్క్రిప్టివ్ రూపంలో 9 పేపర్లు ఉంటాయి. వీటి మార్కుల ఆధారంగా వ్యక్తిత్వ పరీక్షకు అర్హత పొందుతారు. ఈ ఏడాది 980 పోస్టులకుగాను 2568 మందితో అర్హుల జాబితాను మౌఖిక పరీక్షకు ఎంపిక చేసి యూపీఎస్సీ గత వారం ప్రకటించింది. దీని ఆధారంగా ఫిబ్రవరి 19 నుంచి మౌఖిక పరీక్షలు ఢిల్లీలో ప్రారంభం కానున్నాయి. తెలంగాణ, ఏపీ నుంచి 150 మందికిపైగా అభ్యర్థులు ఈ ఏడాది మౌఖిక పరీక్షకు హాజరవుతున్నారు.

ఇంటర్వ్యూకి వెళ్లేవారు పాటించాల్సినవి

- ఇంటర్వ్యూ అనేది విషయ పరిజ్ఞానం కంటే వ్యక్తిత్వాన్ని పరీక్షించే అంశం కాబట్టి తెలుగు అభ్యర్థులందరికీ దాదాపు నెలన్నరకుపైగా సమయం ఉండటంవల్ల వారు తమ బాడీ లాంగ్వేజీని ఒక అద్దం ద్వారా గానీ, వీడియో రికార్డింగ్ ద్వారా గానీ పరీక్షించుకొని కావాల్సిన మార్పులు చేసుకోవాలి. ముఖ కవలికలు, కాళ్లు, చేతులు అతిగా ఊపడం ఇలాంటి వాటిలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.
- ఇంటర్వ్యూ రోజు ధరించే దుస్తుల్లో కూడా మన వ్యక్తిత్వం బయటపడుతుంది. కాబట్టి అతి ఆర్భాటం లేకుండా హుందాగా ఉండాలి.
- ఇంటర్వ్యూ బోర్డు సభ్యులతో తరుచూ వాదనలకు దిగకూడదు. అలా అని ప్రతి అంశంలో వారు చెప్పిన వాటికి తలూపాల్సిన అవసరం లేదు. వినమ్రతతో మీ సదుద్దేశాలను వారికి తెలుపవచ్చు. బోర్డు సభ్యులు మాట్లాడుతున్నప్పుడు మధ్యలో వారిని ఆటంకపర్చకూడదు. వారు అడిగిన ప్రశ్న మనకు సరిగా అర్థం కానప్పుడు తిరిగి అడగడంలో తప్పు లేదు. అలాంటి సందర్భంలో మర్యాదపూర్వకంగా అడగాలి.
- ఇంటర్వ్యూ గదిలోకి అడుగుపెట్టినప్పుడు పర్మిషన్ తీసుకొని లోపలికి వెళ్లాలి. అందరికీ విడివిడిగా అభివాదం చేయకూడదు. బోర్డు సభ్యుల్లో స్త్రీ గనుక ఉంటే వారికి ప్రత్యేకంగా అభివాదం చేయాల్సి ఉంటుంది. అతి నమస్కారాలు చేయకూడదు. అతివినయం ప్రదర్శించకూడదు. మనం వెలిబుచ్చే అభిప్రాయాలు ఎప్పుడూ మధ్యస్థంగా (తటస్థంగా) ఉండాలి. విపరీత ప్రవర్తన చూపించకూడదు.
- మన సమాధానాలు కొంత వరకు ప్రాక్టికల్‌గా ఉంటే మంచిది. అలాగని నిరాశవాదం కనిపించకూడదు. ఇంటర్వ్యూ నెగ్గితే ఆఫీసర్ అవ్వొచ్చు. ఓడిపోతే వైకుంఠపాళిలోని పాము నోట్లో పడి మొదటి నుంచి మళ్లీ ప్రయాణం సాగించాల్సి ఉంటుంది.
- ఇంటర్వ్యూలో కొన్ని ప్రశ్నలకు సమాధానాలు రాకపోతే తప్పేమీ లేదు. వారిని మభ్యపెట్టడానికి ప్రయత్నించరాదు.
- చివరగా ఇంటర్వ్యూ ముగిసిన తర్వాత గది నుంచి బయటకు వచ్చేటప్పుడు అందరివైపు ఒకసారి చూసి అభివాదం చేసి చిరునవ్వుతో మనం కూర్చున్న కుర్చీని లోపలికి సర్ది బయటకు రావాలి.

అభ్యర్థులు కచ్చితంగా తర్ఫీదు చేసుకోవాల్సిన ప్రశ్నలు, సమాధానాలు

నువ్వెందుకు సివిల్ సర్వెంట్ కావాలనుకుంటున్నావు?

- ఈ ప్రశ్న కోసం అభ్యర్థి తన బ్యాగ్రౌండ్‌కు అనుగుణంగా సమాధానాన్ని మలుచుకోవాల్సి ఉంటుంది. ఉదాహరణకు నిజంగా సేవ చేయాలని ఉన్నా ఎందుకు సేవ చేయాలనే కోరిక మీకు కలిగింది అనే అంశాన్ని వెలిబుచ్చుతూ చివరగా సేవ గురించి తెలిపితే మన ప్రత్యేకత, విశిష్టత బహిర్గతమవుతుంది. కొన్ని సందర్భాల్లో మన నిర్ణయాల ద్వారా మన వ్యక్తిత్వాన్ని అంచనా వేస్తారు. కొన్ని సందర్భాలను ఇచ్చి మనల్ని విశ్లేషించమని అన్నప్పుడు మధ్యస్థమైన భావనలు కలిగి ఉంటే కొంత మేర మనకు అనుకూలంగా మార్కులు పడుతాయి.

మీ విద్యార్హతలను గురించి తెలుపండి? మీరు ఒక ఇంజినీరు గాని, డాక్టర్ గాని అయి ఉండి మళ్లీ ఎందుకు సివిల్ సర్వీసెస్ వైపు రావాలనుకుంటున్నారు?

- నా గ్రాడ్యుయేషన్‌లో నాకు మంచి అనుభవం ఉన్నది. నేను నా వృత్తి ద్వారా నా కుటుంబం, నా వరకు మాత్రమే సేవ చేయగలను. ఒక సివిల్ సర్వెంట్‌గా అయితే అనేక మందికి సేవ చేయవచ్చనే ఉద్దేశంతో రావాలనుకుంటున్నాను.

మీ గ్రాడ్యుయేషన్ సబ్జెక్ట్ సివిల్ సర్వీసెస్‌లో ఎలా ఉపయోగపడుతుంది?

ఇంజినీర్

- ఇంజినీర్ అంటే తన పరిధిలో ఉన్న వనరులని ఉపయోగించి ప్రజాక్షేమం కోసం వాటిని పరికరంగా మార్చడం. ఇందులో నేను నేర్చుకున్న Technological Advancements ప్రజలకు పరిపాలన చేరువ చేయడంలో ఉపయోగపడుతుంది.

మీ ఆప్షనల్ సబ్జెక్టు సివిల్ సర్వీసెస్‌లో ఎలా ఉపయోగపడుతుంది?

తెలుగు లిటరేచర్

- మనిషికి అనుభవం, పరిజ్ఞానం.. జనంలో మమేకమవడం ద్వారా లేదా పుస్తక పఠనం ద్వారా పెరుగుతుంది. తెలుగు లిటరేచర్‌లోని సిలబస్ ద్వారా అనేక మనస్తత్వాలు అర్థమవుతాయి. విషయ పరిపుష్టి, అడ్మినిస్ట్రేషన్‌లోని మెలకువలు, సమాజంలోని సున్నితత్వం, మనం మెలగవలసిన విధానం మొదలైన వాటిపై అవగాహన పెరిగి పాలనలో సహకారిగా ఉంటుందని చెప్పవచ్చు.

పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్

- దీనిలో రకరకాల పరిపాలనా సిద్ధాంతాలు చదవడం వల్ల ఎలా మేనేజ్ చేయాలో అర్థమవుతుంది. ప్లానింగ్, పరిపాలన సిద్ధాంతం వంటివి తెలియడంవల్ల ప్రజలకు సులభంగా పరిపాలన అందించవచ్చు.

గ్రాడ్యుయేషన్ ఒకటి చేసి, సివిల్ సర్వీసెస్‌లో వేరే ఆప్షనల్ ఎందుకు తీసుకున్నారు?

- ఆ ఆప్షనల్ సబ్జెక్టు పరిపాలనలో ఉపయోపడే అవకాశం అధికంగా ఉండటం, ఆ ఆప్షనల్‌పై ఇంట్రస్ట్ ఉండటం కారణంగా చెప్పవచ్చు. కానీ మార్కుల కోసమని, మెటీరియల్ అందుబాటులో ఉంటుందని చెప్పొద్దు.

మీ హాబీ గురించి తెల్పండి?

- అభ్యర్థులకు రకరకాల హాబీలు ఉంటాయి. ఉదాహరణకు పుస్తక పఠనం, మ్యూజిక్, యోగా&మెడిటేషన్, స్పోర్ట్స్, సినిమాలు చూడటం మొదలైనవి. హాబీపై చాలా ఎక్కువ సమాచారం సేకరించుకోవాలి. మనం చెప్పే పద్ధతి కూడా సరిగా ఉండాలి.
- **మీ పేరుకు అర్థం? మీ జిల్లా? మీరు పుట్టిన స్థలం? మొదలైనవి.**
- **మీ తల్లిదండ్రుల వృత్తి?**
- **పుట్టిన తేదీ ప్రసిద్ధత?**
- **సర్వీస్ ప్రిఫరెన్స్ ఇవ్వడంపై ప్రశ్న.**
- **జాబ్ ఎక్స్‌పీరియన్స్‌పై ప్రశ్నలు. జాబ్ ఏదీ చేయకపోతే గ్యాప్ ఎందుకు వచ్చింది? అని అడుగుతారు. మార్క్స్ పర్సంటేజీలో ఎక్కువ తేడాలున్నా అడగవచ్చు.**
- మొదట అడిగే ప్రశ్నలు బయోడేటాపైనే అడుగుతారు.



- ఇంటర్వ్యూకు వెళ్లేరోజు, అన్ని సమకాలీన అంశాలపై అవగాహన తెచ్చుకోవాలి.

అంశాలు

- ట్రిపుల్ తలాక్
- రైట్ టు ప్రైవసీ (వ్యక్తిగత గోప్యత)
- ప్రస్తుత న్యాయవ్యవస్థలో ఉన్న సంక్లిష్టతలు?
- బిట్‌కాయిన్, క్రిప్టో కరెన్సీ, బ్లాక్ చెయిన్ టెక్నాలజీ
- ఫారిన్ రిలేషన్స్, డబ్ల్యూటీవో
- నిరర్థక ఆస్తులు
- బాల్‌ఫోర్ డిక్లరేషన్ (ఇండియా-ఇజ్రాయెల్)
- దక్షిణ చైనా సముద్రం
- ఏషియన్ - 50 ఏండ్లు
- కోల్డ్‌వార్
- సిరియా సంక్షోభం
- ట్రంప్ పాలసీ
- సార్క్ ఎందుకు ఫెయిల్యూర్?
- బిమ్స్‌టెక్
- క్వార్డ్
- జీఎస్టీ
- ఎఫ్ఆర్‌డీఏ
- డీమానిటైజేషన్
- ఎంఎస్ఎంఈ
- బడ్జెట్, ఎకనామిక్ సర్వే
- మహిళా సాధికారత
- వ్యవసాయం, రైతుల ఆత్మహత్యలు



M. Balalatha
Civils Faculty

చరిత్ర సాక్ష్యాలు

రాజులు పోయారు. రాజ్యాలు పోయాయి. అయినా ఆనాటి గుర్తులు ఇంకా ఉన్నాయి. అవి తరతరాలకు స్ఫూర్తినిస్తున్నాయి. ఎందరినో ఆశ్చర్యపరుస్తున్నాయి. ఆనాటి రాజులు నిర్మించిన ఎన్నో సుందరమైన నిర్మాణాలు ఆనాటి చరిత్రను కళ్లకుకట్టినట్లు చూపిస్తున్నాయి. అప్పటి నిర్మాణ కౌశలం అద్భుతం. రాయిని సుందరమైన శిల్పాలుగా మలిచిన కళ మహాద్భుతం. ప్రతి నిర్మాణానికో ప్రత్యేకత ఉంది. ఓ శైలి ఉంది. అందులో కొన్ని నిర్మాణాలు, వాటిని నిర్మించిన వ్యక్తులు తదితర వివరాలు ఈ వారం ప్రత్యేకం..

ఆగ్రా ఫోర్ట్

- ఇది ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ఆగ్రాలో ఉండటంవల్ల ఆగ్రా ఫోర్ట్ అంటారు.
- దీనిని ఎరుపు ఇసుకరాయితో 1565లో అక్బర్ నిర్మింపజేశారు. 1573లో నిర్మాణం పూర్తయింది.
- దీనిని ఇస్లాం నిర్మాణశైలిలో నిర్మించారు.
- ఈ ఫోర్టుకు ఆర్కిటెక్చర్‌లో 2004 ఆగాఖాన్ అవార్డు లభించింది.

ఎర్రకోట

- ఇది దేశ రాజధాని ఢిల్లీలో ఉంది.
- దీనిని మొఘల్ చక్రవర్తి షాజహాన్ నిర్మింపజేశారు. 1639లో దీని నిర్మాణం ప్రారంభం కాగా 1648లో పూర్తయ్యింది.
- దీని ఆర్కిటెక్ట్ ఉస్తాద్ అహ్మద్ లహోరి.
- దీనిని ఇండో-ఇస్లామిక్, మొఘల్ నిర్మాణశైలిలో నిర్మించారు.

హవా మహల్

- ఇది రాజస్థాన్‌లోని జైపూర్‌లో ఉంది.
- దీనిని 1799లో మహరాజా సవాయ్ ప్రతాప్‌సింగ్ నిర్మింపజేశాడు.
- లాల్‌చంద్ ఉస్తాద్ దీనిని డిజైన్ చేశాడు.
- దీనిని రాజ్‌పుత్ నిర్మాణశైలిలో నిర్మించారు.
- శ్రీకృష్ణుని కిరీటం ఆకారంలో దీనిని నిర్మించారు.
- దీనికి ఉన్న 953 కిటికీల ద్వారా గాలి మహలంతా వీస్తుంది. అందుకే దీనిని హవా మహల్ అంటారు.



కుతుబ్ మినార్

- ఇది ఢిల్లీలోని మెహ్రౌలి ప్రాంతంలో ఉన్నది.
- దీని ఎత్తు 73 మీటర్లు (239.5 అడుగులు) ఉంది.
- దీని మొదటి అంతస్తును కుతుబుద్దీన్ ఐబక్ 1192లో నిర్మింపజేశాడు.
- మరో మూడు అంతస్తులను ఐబక్ వారసుడు, అల్లుడు అయిన ఇల్‌టుట్‌మిష్ 1220లో నిర్మింపజేశాడు.
- 1369లో పిడుగువల్ల మొదటి అంతస్తు నాశనం కాగా ఫిరోజ్ షా తుగ్లక్ దీనిని పునర్నిర్మింపజేశాడు.
- దీని నిర్మాణ శైలి: ఇండో-ఇస్లామిక్

హుమాయున్ టూంబ్ (సమాధి)

- ఇది ఢిల్లీలో ఉంది. దీనిని హుమాయున్ మొదటి భార్య బెగా బేగం (హమీదా బాను బేగం) 1569-70లో నిర్మింపజేసింది.
- ఇది మొఘల్ ఆర్కిటెక్చర్ నిర్మాణ శైలిలో ఉంది.
- మిరాక్ మీర్జా ఘియత్ దీని ఆర్కిటెక్ట్ ఇంజినీర్.

స్వయం ఉపాధి@ ఎంఎస్ఎంఈ

1956లో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధి సంస్థ (ఎంఎస్ఎంఈ-డీఐ)ను బాలానగర్‌లో ఏర్పాటు చేశారు. ఈ సంస్థ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తున్నది. ఇది నిరుద్యోగులైన యువతీ యువకులు ఆర్థిక స్వావలంబన సాధించడం, స్వయం ఉపాధి కోసం శిక్షణ ఇస్తుంది. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు పరిశ్రమల స్థాపనకు సంబంధించి ప్రాజెక్టు రిపోర్టు తయారీ నుంచి మార్కెటింగ్ వరకు సలహాలు సూచనలు అందజేస్తుంది. ఇప్పటికే స్థాపించిన ఎంఎస్ఈలకు రుణ సౌకర్యాల గురించి తెలుపుతుంది. ఇక్కడ స్వయం ఉపాధి కోసం శిక్షణ పొందాలంటే కనీసం ఎనిమిదో తరగతి ఉత్తీర్ణులై, 18 ఏండ్లు నిండి ఉండాలి. సంస్థ ఆధ్వర్యంలో కెమికల్, మెకానికల్, లెదర్, ఫుట్‌వేర్, మెటలర్జి తదితర విభాగాల్లో పలు కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారు. ఒక రోజు నుంచి 6 నెలల వరకు వ్యవధిగల కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఫీజు నామమాత్రంగా ఉంటుంది.

శిక్షణ ఇచ్చే అంశాలు

- ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, నిరుద్యోగులైన విద్యాధికులు, యువతీయువకులు, మహిళలకు సాధారణ, నిర్దిష్టమైన వస్తువు ఉత్పాదనలో శిక్షణ ఇస్తారు. పలు రంగాల్లో స్వయం ఉపాధి యూనిట్లు నెలకొల్పే విధంగా ఈ శిక్షణ ఉంటుంది. జ్యూట్ బ్యాగుల తయారీ, ఫుడ్ ప్రాసెసింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, మోటార్ రివైండింగ్, లెదర్/ రెగ్జిన్ వస్తువుల తయారీ, కెమికల్ సంబంధిత వస్తువులు, ద్విచక్రవాహనాల రిపేర్, సర్వీసింగ్, మొబైల్‌ఫోన్లు, కంప్యూటర్ హార్డ్‌వేర్ రిపేరింగ్, కంప్యూటర్ అకౌంటెన్సీ, ట్యాలీ, ఆన్‌లైన్ మార్కెటింగ్, జీఎస్టీ, అకౌంటింగ్ ప్యాకేజీ, సీఏడీ-సీఏఎం రంగాల్లో ఆరు వారాలు శిక్షణ ఇస్తారు.
- ఎంచుకున్న స్వయం ఉపాధి గురించి సాధారణ, సంబంధిత విషయాలతోపాటు ఎంట్రప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్స్, బిజినెస్ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్స్‌ను నిర్వహిస్తున్నారు. ఇందులో వ్యాపారాభివృద్ధిపై శిక్షణ ఇస్తారు.
- చిన్న, సూక్ష్మ, మధ్యతరహా యూనిట్ల యజమానులు, సూపర్‌వైజర్ల కోసం మార్కెటింగ్, ఫైనాన్షియల్, ఇండస్ట్రియల్, ఉత్పత్తి, మెటీరియల్, టోటల్‌కాస్ట్, టోటల్ క్వాలిటీ, ఐఎస్ఓ-9000 తదితర మేనేజ్‌మెంట్ అంశాల్లో శిక్షణ ఇస్తారు.
- నైపుణ్యాభివృద్ధి కింద సైంటిఫిక్ గ్లాస్ బ్లోయింగ్, మెషీన్‌షిప్ ప్రాక్టీస్, ఫ్యాబ్రికేషన్ తదితర రంగాల్లో మూడు నెలల నుంచి 6 నెలలపాటు శిక్షణ ఇస్తారు.
- డిటర్జంట్ పౌడర్, లిక్విడ్ సోప్, రూమ్ ఫ్రెషనర్, షూ పాలిష్ తదితర కెమికల్ వస్తువుల తయారీలో ఒకరోజు శిక్షణ ఇస్తారు.

శిక్షణ తీరు..

- మొదట సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల స్థాపన, నిర్వహణ తదితర అంశాలపై అవగాహన కల్పిస్తారు. అభ్యర్థి ఎంచుకున్న రంగంలో ఎలాంటి అవకాశాలు ఉంటాయి. వ్యాపార ఆలోచనను ఆచరణలో పెట్టడానికి కావాల్సిన సాధనాలను ఎలా సమకూర్చుకోవాలి. పరిశ్రమ స్థాపన, నిర్వహణకు సంబంధించి నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవడం, పుస్తక నిర్వహణ, అకౌంటింగ్ తదితర అంశాలు క్షుణ్ణంగా వివరిస్తారు.
- వస్తువులను ఉత్పత్తి చేయడమే కాదు వాటిని విక్రయించినప్పుడే ఆ పరిశ్రమ మనుగడ సాధించగలుగుతుంది. దీన్ని దృష్టిలోపెట్టుకొని మార్కెటింగ్ మెలకువలపై కూడా అవగాహన కల్పిస్తారు. పరిశ్రమ నెలకొల్పడానికి పెట్టుబడి కావాలి. ఒక్కోసారి పూర్తిస్థాయిలో నగదు అందుబాటులో ఉండకపోవచ్చు. కాబట్టి పెట్టబోయే పరిశ్రమకు ఏయే బ్యాంకుల్లో ఎలాంటి రుణ అవకాశాలు ఉంటాయి. ఇందుకోసం బ్యాంకులను ఎలా సంప్రందించాలి. ఎవరిని కలవాలి తదితర అంశాలపై అవగాహన కల్పిస్తారు. బ్యాంకు రుణంతోపాటు కేంద్ర, రాష్ట్ర పథకాలైన ప్రధానమంత్రి ముద్ర యోజన, స్టార్టప్ మిత్ర, స్టార్టప్ ఇండియా, పీఎంఈజీపీ, జిల్లా పరిశ్రమల కేంద్రం, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పారిశ్రామిక పాలసీ, గ్రాంట్లు, రాయితీలు తదితర అవకాశాలపై అవగాహన కల్పిస్తారు.



అభ్యర్థి స్వయం ఉపాధి పొందాలి. వీలైతే పరిశ్రమను స్థాపించాలి. మరి కొంతమందికి ఉపాధి చూపించగలగాలి. ఇక్కడ శిక్షణ కూడా అలాగే కొనసాగుతుంది. సాంకేతిక నిష్ణాతులతో తరగతులు ఉంటాయి. తొలుత సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల స్థాపన, నిర్వహణ తదితర అంశాలపై అవగాహన కల్పిస్తారు.

పరిశ్రమ స్థాపకుల కోసం

- ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు పరిశ్రమ స్థాపనకు అవసరమైన సహాయ సహకారాలను ఎంఎస్ఎంఈ అందిస్తున్నది. వస్తువు ఉత్పత్తి, తయారీ యంత్రాలు, ప్లాంట్ లే అవుట్, ముడిసరుకు, ఆధునికీకరణ, నాణ్యమైన ఉత్పత్తుల అభివృద్ధి, ఇంధన ఆదా, కాలుష్య నియంత్రణ రంగాల్లో కావాల్సిన సహాయ సహకారాలను ఎంఎస్ఎంఈ అందిస్తున్నది. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు సులువుగా రుణాలు పొందడం కోసం ప్రాజెక్టు రిపోర్టులు, వాటి సాధ్యాసాధ్యాల నివేదికలు రూపొందిస్తుంది.

ఎంఎస్ఎంఈ - డీఐ పథకాలు

క్రెడిట్ గ్యారంటీ ఫండ్ ట్రస్ట్

- ఈ పథకం కింద ఏర్పాటుచేసే యూనిట్లకు కోల్లాటరల్ గ్యారంటీ లేని రుణాలు ఇస్తారు. అర్హతగల సంస్థ నుంచి ఇచ్చే కోల్లాటరల్/థర్డ్ పార్టీ గ్యారంటీ ఫ్రీ రుణాలను తీసుకొని కొత్తగా లేదా అప్పటికే స్థాపించిన ఎంఎస్ఈలకు గరిష్ఠంగా రూ. కోటి వరకు క్రెడిట్ కవరేజీ ఉంటుంది.

క్రెడిట్ లింక్‌డ్ క్యాపిటల్ సబ్సిడీ స్కీమ్

- సూక్ష్మ, లఘు పరిశ్రమల్లో సాంకేతికాభివృద్ధి కోసం ఆర్థికపరమైన సహాయం అందించడం దీని ప్రధాన లక్ష్యం. అనుమతి పొందిన కొన్ని విభాగాల్లో సాంకేతికాభివృద్ధి చేయడంతో ఎంస్ఈలకు 15 శాతం క్యాపిటల్ సబ్సిడీ లభిస్తుంది.

క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్

- ఎంఎస్ఈల ఉత్పాదనను, మంచి పోటీతత్వాన్ని, నిర్మాణ శక్తిని పెంచడానికి ప్రభుత్వం క్లస్టర్ డెవలప్‌మెంట్ పద్ధతిని కీలకమైన అంశంగా ప్రవేశపెట్టింది. డయాగ్నస్టిక్ స్టడీ రిపోర్టులకు ఒక్కొక్క క్లస్టర్‌కు రూ. 2.5 లక్షలతోపాటు 75 శాతం, 90 శాతం సాఫ్ట్ ఇంటర్వెన్షన్స్‌కు అత్యధిక రుణం రూ. 25 లక్షలు ఇస్తుంది.

మార్కెట్ అభివృద్ధి సహాయం

- రిజిస్టర్ చేయించుకున్న ఎంఎస్ఈలకు ప్రపంచ వాణిజ్య ప్రదర్శనల్లో పాల్గొనే అవకాశాలు కల్పిస్తుంది. ఎన్నికైన ఎంఎస్ఈలకు స్టాల్ కిరాయిలో 50 శాతం, విమాన టికెట్లలో 75 శాతం, ఎస్సీ, ఎస్టీ, మహిళా పారిశ్రామికవేత్తలకు 100 శాతం రాయితీ ఇస్తుంది.

... సాయికిరణ్ వేముల

సుడోకు

డైలీ సుడోకు 106 సమాధానం

4	8	7	1	6	9	5	3	2
6	2	9	4	3	5	8	7	1
5	3	1	8	7	2	6	9	4
7	5	4	2	8	6	3	1	9
8	9	3	5	1	7	2	4	6
1	6	2	3	9	4	7	8	5
2	7	5	9	4	8	1	6	3
9	1	8	6	5	3	4	2	7
3	4	6	7	2	1	9	5	8

1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

డైలీ సుడోకు -107

6					2		9	
	9			3		1	2	5
			9			7		
	4				1		8	
5								1
	2		6				4	
		2			8			
4	6	3		1			7	
	8		7					3

నమస్తే తెలంగాణ

చిత్రం

[హైదరాబాద్]

సోమవారం 22 జనవరి 2018



విక్రమ్

కొందరు నటనను ప్రేమిస్తారు, మరికొందరు నటనే ప్రాణప్రదంగా భావిస్తారు. రెండో కోవకు చెందిన వ్యక్తి విక్రమ్. వినూత్న కథాంశాల్ని ఎంచుకుంటూ దక్షిణాదిన విలక్షణ నటుడిగా పేరు తెచ్చుకున్నారు. నిరంతరం ప్రయోగాత్మక పాత్రలతో నటుడిగా తనను తాను కొత్త పంథాలో ఆవిష్కరించుకోవాలని తపిస్తారాయన. 'విజయాల్ని తలకెక్కించుకోకూడదు. అపజయాలు మన హృదయాల్ని తాకేలా వుండకూడదు'.. ఈ సిద్ధాంతాన్ని తాను బలంగా విశ్వసిస్తానని చెబుతున్నారు విక్రమ్. ఆయన కథానాయకుడిగా తమిళ చిత్రం 'స్కెచ్' అదే పేరుతో తెలుగులో విడుదలవుతున్నది. విజయ్‌చందర్ దర్శకుడు. త్వరలో ప్రేక్షకులముందుకురానుంది. ఈ సందర్భంగా విక్రమ్ పాత్రికేయులతో సంభాషించారు.

ప్రతి సినిమా ప్రయోగమే!

'స్కెచ్' ఎవరి మీద వేస్తున్నారు? ఇంతకి కథాంశమేమిటి?

• వాహన లోన్స్ తీసుకొని ఎగ్గొట్టే వారిని చాకచక్యంగా పట్టుకునే బృందం నేపథ్యంలో కథ సాగుతుంది. పూర్తి వాణిజ్య అంశాలతో సాగే స్టైలిష్ మాస్ ఎంటర్‌టైనర్ ఇది. కథాగమనంలోని మలుపులు ఆసక్తికరంగా వుంటాయి. ఈ సినిమాలో నాలోని కొత్త తరహా హీరోయిజాన్ని చూస్తారు. పతాకఘట్టాలు ఎవరూ ఊహించని విధంగా వుంటూ థ్రిల్‌ని కలిగిస్తాయి. చాలా విరామం తర్వాత నేను చేసిన మాస్ సినిమా ఇది. ఈ సంక్రాంతికి తమిళంలో విడుదలై చక్కటి విజయాన్ని సొంతం చేసుకుంది.

ప్రతి సినిమాలో మీరు పాత్రల పరంగా కొత్తగా కనిపించాలని తపిస్తారు. ఇందులో మీ క్యారెక్టర్ ఎలా సాగుతుంది?

• అపరిచితుడు, 'ఐ' (తెలుగులో 'మనోహరుడు') తరహాలో అభినయపరంగా ఈ సినిమాలో ఎలాంటి ప్రయోగానికి అవకాశం లేదు. నా పాత్ర మామూలుగానే వుంటుంది. అయితే ఈ క్యారెక్టర్‌లో కూడా నా నటన కొత్తగా వుందని ప్రశంసలొస్తున్నాయి. సాధారణంగా 'శివపుత్రుడు' 'నాన్న' వంటి ప్రయోగాత్మక పాత్రలకు అవార్డులు వస్తుంటాయి. నా దృష్టిలో మాస్ పాత్రలకు కూడా అవార్డులు దక్కితే మరిన్ని కొత్త కథాంశాల్ని ఎంచుకోవడానికి స్ఫూర్తిగా నిలుస్తాయి.

ప్రయోగాత్మక పాత్రలు, మాస్ క్యారెక్టర్స్...ఈ రెండింటిలో మీరు దేనిని ఎక్కువగా ఇష్టపడతారు?

• అవి నాకు రెండు కళ్లలాంటివి. 'శివపుత్రుడు' 'నాన్న' లాంటి సినిమాలు చేసినప్పుడు నటుడిగా ఎక్కువ సంతృప్తి దొరుకుతుంది. ఆ పాత్రలను ఓ సవాలుగా తీసుకొని నన్ను నేను కొత్తగా ఆవిష్కరించుకోవాలని శ్రమించాను. 'స్కెచ్' వంటి చిత్రాలు నటుడిగా నాలోని మరో కోణాన్ని ప్రదర్శించడానికి ఆస్కారం కలిగిస్తాయి. కాబట్టి రెండు పాత్రలను నేను సమానంగా గౌరవిస్తాను. అంతిమంగా ప్రతి పాత్రను నేను ప్రయోగమనే భావిస్తాను. కథతో పాటు నా పాత్రలో కొత్తదనం లేకపోతే సినిమాలు చేయను.

కెరీర్ ఆరంభంలో మీరు తెలుగు సినిమాలు చేశారు. స్టార్‌డమ్ వచ్చిన తర్వాత స్ట్రెయిట్ తెలుగు సినిమా ఎందుకు చేయలేకపోయారు?

• కథ నచ్చితే ఏ భాషలోనైనా నటించడానికి నాకు అభ్యంతరం లేదు. తెలుగులో నా మనసుకు నచ్చిన కథ దొరికితే తప్పకుండా నటిస్తాను. తమిళ్, తెలుగు రెండింటిని నా మాతృభాషలుగానే భావిస్తాను.

మహాభారతం నేపథ్యంలో 'మహావీర్ కర్ణ' పేరుతో తెరకెక్కనున్న భారీ ప్రాజెక్ట్‌లో మీరు నటిస్తున్నారని తెలిసింది?

• ఈ సినిమాలో నేను కర్ణుడి పాత్రను పోషించబోతున్నాను. తమిళ, తెలుగు, మలయాళ, హిందీ భాషల్లో ఈ చిత్రాన్ని నిర్మిస్తారు. దాదాపు 300కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేస్తున్నారు. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో ఈ సినిమాకు సన్నాహాలు చేస్తున్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఈ చిత్రం సెట్స్‌మీదకు వెళ్లే అవకాశం వుంది.

ఇటీవలకాలంలో వివిధ కారణాల వల్ల సినిమాలు వివాదాస్పదమవుతున్నాయి. ముఖ్యంగా మతపరమైన అంశాల్ని పైకి తీసుకొస్తూ సినిమాల్ని అడ్డుకునే ధోరణి పెరిగిపోయింది. దీనిపై మీరేమంటారు?

• సినిమాలు వివాదాస్పదమవడం ఇప్పుడు కామన్ అయిపోయింది. ఏ కథ తీసుకున్నా ఎవరో ఒకరు తమ మనోభావాలు దెబ్బతిన్నాయంటూ నిరసనకు దిగుతున్నారు. వ్యవస్థనే అలా వున్నప్పుడు మనం ఏం చేయగలం?.

• సినిమాలే నాకు జీవితం. రాజకీయాల గురించి అస్సలు ఆలోచించను. రజనీకాంత్, కమల్‌హాసన్ పొలిటికల్ ఎంట్రీ గురించి నేను మాట్లాడాల్సింది ఏమీ లేదనుకుంటున్నాను.

• పాత్రలపరంగా నేను ఎలాంటి పరిమితుల్ని విధించుకోలేదు. కాలేజీ అబ్బాయి పాత్ర ఇచ్చినా నటించడానికి సిద్ధంగా వున్నాను. 'అర్జున్‌రెడ్డి' తమిళ రీమేక్‌లో ఒకవేళ మా అబ్బాయి నటించకపోయివుంటే నేను నటించేవాణ్ణి. వయసుతో నిమిత్తం లేకుండా ఏ పాత్రలోనైనా నటించే విషయంలో నేను అమితాబ్‌ను ఆదర్శంగా తీసుకుంటాను.



మీ అబ్బాయి ధ్రువ్ 'అర్జున్‌రెడ్డి' తమిళ రీమేక్‌లో నటిస్తున్నాడు. ఈ సినిమా గురించి...?

• మూడేళ్ల తర్వాత వాడిని హీరోగా పరిచయం చేద్దామనుకున్నాను. అయితే 'అర్జున్‌రెడ్డి' కథ బాగా నచ్చింది. నా దృష్టిలో అదొక కల్ట్ మూవీ. కథలో నవ్యతతో పాటు పర్‌ఫార్మెన్స్‌కు ఎంతో స్కోప్ వుంది. మా అబ్బాయికి మంచి అరంగేట్రం అవుతుందన్న నమ్మకం ఉంది.



వంశీ, విక్కీ, అశోక్, అనుష్క, మది, అల్లు అరవింద్, నాని

ఈ ఏడాది అవార్డులన్నీ అనుష్కకే!

అనుష్క ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'భాగమతి'. అశోక్ దర్శకుడు. వంశీ, ప్రమోద్ నిర్మాతలు. ఈ నెల 26న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ చిత్ర ప్రీరిలీజ్ వేడుకను ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా 'మందార..మందార..' అంటూ సాగే వీడియో టీజర్‌ను దర్శకులు మారుతి, మేర్లపాక గాంధీ, రాధాకృష్ణ విడుదల చేశారు. అనంతరం ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న అల్లు అరవింద్ మాట్లాడుతూ 'స్క్రీన్‌మీద 'భాగమతి' ట్రైలర్ చూసి భయమేసింది. ట్రైలర్ చూశాక ఇదేదో పెద్ద సినిమా అవుతుంది అనిపించింది. ఏడాదిగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అనుష్కకు వున్న ఏకైక లక్షణం ఏంటంటే ఆమెకు ఓపిక ఎక్కువ. ఇండస్ట్రీలో ఎవ్వరికీ లేని ఓపిక అనుష్కకు వుంది. కొన్నేళ్ల క్రితం ఆ విషయాన్ని 'అరుంధతి' సినిమాతో నిరూపించింది. 'అరుంధతి' చేసిన తరువాత ఇవన్నీ తక్కువే. ఆ సినిమా ఎంత పెద్ద హిట్ అయిందో 'భాగమతి' కూడా అంత హిట్ కావాలి. బొమ్మాళీగా ఎంతపేరొచ్చిందో ఈ సినిమాతోనూ అదే స్థాయి పేరు ఆమెకు రావాలని కోరుకుంటున్నాను' అన్నారు. నాని మాట్లాడుతూ 'సాధారణంగా కుటుంబంలో ఒక సూపర్‌స్టార్ వుంటే ఆ భావన ఎలా వుంటుందో నాకు తెలియదు. కానీ నాకు కూడా ఆ ఫీలింగ్ అంటే ఏంటో ఇప్పుడిప్పుడే తెలుస్తున్నది. ఇన్నేళ్ల స్నేహం తరువాత స్వీటీ (అనుష్క) నాకు ఫ్యామిలీ ఫ్రెండ్ అయిపోయింది. 'భాగమతి' రీరికార్డింగ్ జరుగుతున్నప్పుడు నాకు తెలిసిన ఓ వ్యక్తి ఇంటర్వెల్ ఎపిసోడ్ చూసి ఫోన్ చేశాడు. 'ఇంటర్వెల్ బ్యాంగ్ చూస్తుంటే రోమాంచితంగా వుందని, రేపు తెరపై ప్రేక్షకులు చూస్తే ఆశ్చర్యపోతారు' అని చెప్పాడు. ఈ సినిమాలోని నటనకు గాను ఈ ఏడాది అవార్డులన్నీ అనుష్కకే అన్నాడు. అది విని చాలా గర్వంగా ఫీలయ్యాను. ఈ సినిమా ఎప్పుడెప్పుడు చూస్తానా అని ఎదురుచూస్తున్నాను' అన్నారు. అశోక్ మాట్లాడుతూ 'గెలవాలనుకున్నప్పుడు కష్టం మొదలవుతుంది. కానీ ఎలాగైనా గెలావాలనుకున్నప్పుడు మాత్రమే మోసం మొదలవుతుంది. ఈ రెండూ సమాజంలో సమాంతరంగా నడుస్తూనే వుంటాయి. తను గెలుస్తూ తన చుట్టూ వున్న వాళ్లను గెలిపిద్దామని ఎవరైనా ఒక వ్యక్తికి ఆలోచన వస్తే అతను మనిషి కాదు దైవత్వం అతనిలో ప్రవేశించినట్లు. అలాంటి ఒక దేవుడు ఈ కథ విన్నాడు. ఆ దేవుడే ప్రభాస్. ఈ కథ ఇక్కడిదాకా రావడానికి ఆయనే కారణం. ప్రభాస్ కథ విని ఇక్కడదాకా నడిపించారు. దీన్ని సృష్టించడానికి ముగ్గురు త్రిమూర్తులు కారణం అయ్యారు. వాళ్లే వంశీ, ప్రమోద్, విక్కీ. ఈ ముగ్గురికి సినిమా అంటే ప్రాణం. 'మిర్చి' సినిమా నుంచి నేను వీళ్లతో కలిసి ప్రయాణిస్తున్నాను. గత చిత్రాలకు మించిన బడ్జెట్‌తో పాటు శ్రమించి ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ సినిమాకు శక్తి స్వీటీ(అనుష్క). స్వీటి అంటే అనుభూతి. అనుష్క ఈ సినిమా కోసం ఎంత కష్టపడ్డారో నాకు తెలుసు. అరుంధతి, రుద్రమదేవిలా ఆకట్టుకున్న ఆమె 'భాగమతి'గా కూడా అదే స్థాయిలో అలరిస్తారు. ఈ నెల 26న తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో ప్రపంచ వ్యాప్తంగా ఈ చిత్రం విడుదల కానుంది' అని తెలిపారు. అనుష్క మాట్లాడుతూ '2012లో ఈ కథ విన్నాను. డేట్స్ లేకపోవడం వల్ల సినిమా ఆలస్యమైంది. నా కోసం చాలా రోజులు ఎదురుచూసినందుకు యు.వి.క్రియేషన్స్ నిర్మాతలకు, దర్శకుడు అశోక్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు. నా హృదయానికి చాలా దగ్గరైన సినిమా ఇది. ఇది కేవలం నా సినిమా మాత్రమే అని చెప్పను. నాతో పాటు ఉన్ని ముకుందన్, ఆశాశరత్, మురళీశర్మ వంటి తదితర నటులు చాలా మంది నటించారు. ప్రతీ ఒక్కరివి కీలక పాత్రలే. ఈ చిత్రం ఈ స్థాయిలో రావడానికి కారణమైన ప్రతీ ఒక్కరికీ ధన్యవాదాలు. సినిమా అందరికి నచ్చుతుందనుకుంటున్నాను' అన్నారు. వంశీ, విక్కీ, ప్రొడక్షన్ డిజైనర్ రవీందర్, ప్రభాస్ శ్రీను, ధన్‌రాజ్, ఛాయాగ్రహకుడు మది తదితరులు పాల్గొన్నారు.

మనసుకు దగ్గరైన సినిమా ఇది!



తమన్, బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్, రాశీఖన్నా, వరుణ్‌తేజ్, వెంకీ, అల్లు అరవింద్, దిల్‌రాజు

'సినిమాకు ఏ పేరు పెడదామని ఆలోచిస్తున్న క్రమంలో దర్శకుడు వెంకీ 'తొలి ప్రేమ' టైటిల్ బాగుంటుందని అన్నారు. నాకు ఈ పేరు నచ్చినా బాబాయ్ కెరీర్‌లో మైలురాయిలా నిలిచిన ఆ సినిమా టైటిల్ కావడంతో భయపడ్డాను. ఏదైనా తేడా వస్తే బాగోదని అనిపించింది. టైటిల్‌కు చెడ్డ పేరు రాకుండా పూర్తిగా న్యాయం చేశామనే నమ్మకముంది' అని తెలిపారు వరుణ్‌తేజ్. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'తొలి ప్రేమ'. శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర ఎల్.ఎల్.పి పతాకంపై బి.వి.ఎస్.ఎన్ ప్రసాద్ నిర్మిస్తున్నారు. వెంకీ అట్లూరి దర్శకుడిగా పరిచయమవుతున్నారు. రాశీఖన్నా కథానాయిక. ఎస్.ఎస్. తమన్ స్వరాలను సమకూర్చిన ఈ చిత్రగీతాలు శనివారం హైదరాబాద్‌లో విడుదలయ్యాయి. ఆడియో సీడీలను నిర్మాత అల్లు అరవింద్ ఆవిష్కరించారు. తొలి ప్రతిని దిల్‌రాజు స్వీకరించారు. వరుణ్‌తేజ్ మాట్లాడుతూ ''ఫిదా' సినిమాకు ముందు ఈ కథ విన్నాను. నా మనసుకు బాగా దగ్గరైన చిత్రమిది. ఎవరిని నిరుత్సాహ పరచదు. దర్శకుడు వెంకీ నా కోసం చాలా రోజులు ఆగాడు. అందరూ ప్రేమతో సినిమా చేశారు. నా సినిమాల్లో హీరోయిన్‌లను ఎంపిక చేయడానికి దర్శకనిర్మాతలు చాలా ఇబ్బందులు పడుతుంటారు. తొలిసారి నేను తలదించకుండా ఈ సినిమాలో నటించాను(నవ్వుతూ)' అని అన్నారు. చిత్ర పరిశ్రమలో అడుగుపెట్టిన తొలినాళ్లలో తనను నమ్మిన వ్యక్తి, తనలోని ప్రతిభను అందరికి తెలియజెప్పిన వ్యక్తి దిల్‌రాజు అని, ఆ నమ్మకానికి ఊపిరి పోసి తనతో ఈ సినిమా చేసిన బాపినీడులకు రుణపడి ఉంటానని, ఫిబ్రవరి 9న సినిమాను విడుదలచేయనున్నామని దర్శకుడు వెంకీ అట్లూరి తెలిపారు. దిల్‌రాజు మాట్లాడుతూ '1998లో వచ్చిన 'తొలి ప్రేమ' పవన్‌కల్యాణ్‌కు ఎంత పేరును తెచ్చిపెట్టిందో 2018లో వస్తున్న ఈ సినిమా వరుణ్‌తేజ్‌కు అదే స్థాయిలో గుర్తింపును తీసుకువస్తుందనే విశ్వాసముంది. వెంకీ ఈ సినిమాను మా బ్యానర్‌లోనే చేయాల్సింది. 'ఫిదా' కారణంగా కుదరలేదు. నిర్మాత బాపినీడుకు నచ్చడంతో తన బ్యానర్‌లో సినిమా చేశారు. అందమైన ప్రేమకథతో తెరకెక్కిన సినిమా ఇది. వరుణ్‌తేజ్, రాశీఖన్నా కెమిస్ట్రీ అద్భుతంగా కుదిరింది' అని అన్నారు. 'తొలి ప్రేమ' తన కెరీర్‌లో గుర్తిండిపోయే, గర్వపడే సినిమా అవుతుందని, వర్ష అనే ఆధునిక భావాలున్న అమ్మాయిగా కనిపిస్తానని రాశీఖన్నా చెప్పింది. ఈ కార్యక్రమంలో అల్లు అరవింద్, తమన్ తదితరులు పాల్గొన్నారు.

నంబర్ వన్ ఆశలు లేవు



రకుల్‌ప్రీత్

అగ్రనాయిక హోదాను సొంతం చేసుకోవాలని, నంబర్‌వన్ స్థానంలో నిలవాలని తాను ఏనాడు కోరుకోలేదని చెబుతున్నది రకుల్‌ప్రీత్‌సింగ్. ఆ రేసులో తాను ఎప్పుడూలేనని తెలిపింది. ప్రస్తుతం ఈ అమ్మడు హిందీ సినిమాలపై దృష్టి సారిస్తున్నది. అయితే తనకు అవకాశాలు తగ్గాయనేది అవాస్తవమని చెబుతున్నది రకుల్‌ప్రీత్ సింగ్. పోటీతత్వానికి తాను వ్యతిరేకమని, చిత్రసీమలో తాను ఎవరికి పోటీకాదని చెబుతున్నది. ఆమె మాట్లాడుతూ 'కథాబలం కలిగిన, అభినయానికి ప్రాధాన్యమున్న పాత్రల్లో నన్ను చూడాలని ప్రేక్షకులు కోరుకుంటున్నారు. భాషాభేదాలను పక్కనపెట్టి అలాంటి పాత్రలను ఎంచుకుంటూ నా ప్రయాణాన్ని సాగిస్తున్నాను. గ్లామర్, పాటలకే పరిమితయ్యే పాత్రల్లో కనిపించకూడదని నిర్ణయించుకున్నాను. అలాగే సక్సెస్‌లు, నంబర్ గేమ్స్ గురించి నేను ఎక్కువగా ఆలోచించను. ఫలానా కథానాయిక నంబర్‌వన్ అని చెప్పడానికి ప్రత్యేకమైన ప్రామాణికాలేవి చిత్రసీమలో లేవు. అలాంటప్పుడు ఒకరిని నంబర్‌వన్‌గా ఎలా నిర్ణయిస్తారో అర్థంకాదు. ఆ హోదా వల్ల వచ్చే ఉపయోగాలు లేవు' అని తెలిపింది. రకుల్‌ప్రీత్‌సింగ్ నటించిన హిందీ చిత్రం 'అయ్యారీ' ఫిబ్రవరి 9న ప్రేక్షకుల ముందుకురానున్నది. అజయ్‌దేవ్‌గణ్‌తో ఈ సుందరి మరో సినిమాను అంగీకరించింది.

మెహందీ హంగామా

తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో మంచి గుర్తింపును సొంతం చేసుకుంది భావన. ఒంటరి, మహాత్మ చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు చేరువైన ఈ మలయాళీ సోయగం తన స్నేహితుడు, నిర్మాత నవీన్‌ను వివాహం చేసుకుంటున్న విషయం తెలిసిందే. కాగా సోమవారం వీరి వివాహం కేరళ త్రిసూర్‌లోని ఓ కన్వెన్షన్ సెంటర్‌లో నిరాడంబరంగా జరగనుంది. ఈ వేడుకలో ఇరు కుటుంబాల సభ్యులు, బంధువులు హాజరు కానున్నారని తెలిసింది. 2012లో వచ్చిన మలయాళ చిత్రం 'రోమియో' చిత్రీకరణ సమయంలోనే భావన, నవీన్‌ల జంట ప్రేమలోపడింది. ఆదివారం మెహందీ వేడుకను నిర్వహించారు. ఈ వేడుకలో భావన పసుపు వర్ణం దుస్తుల్లో మెరిసిపోయింది. కుటుంబ సభ్యులతో పాటు అత్యంత సన్నిహితులు, కొంత మంది సినీతారలు సందడి చేశారు. వివాహాన్ని సింపుల్‌గా చేస్తున్నామని భావన సోదరుడు జయదేవ్ తెలిపారు.



స్నేహితురాళ్లతో భావన



తమన్నా

తమన్నా టాంగో కష్టాలు

తమన్నా మంచి డ్యాన్సర్... ఆమెతో పనిచేసిన హీరోలంతా చెప్పేమాట ఇది. తెలుగు చిత్రసీమలోని కథానాయికల్లో నృత్యాల పరంగా ప్రతిభను చాటే కథానాయికల్లో ఆమె ఒకరు. అలాంటి తమన్నాకు కొత్తగా డ్యాన్సు కష్టాలు వచ్చిపడ్డాయి. తెలుగులో ఆమె కథానాయికగా నటిస్తున్న తాజా చిత్రం 'నా నువ్వే'. ఈ సినిమా కోసం టాంగో అనే విదేశీ నృత్యకళలో ప్రస్తుతం శిక్షణ తీసుకుంటున్నది తమన్నా. యువతీయువకులు జంటగా చేసే నృత్యమిది. సినిమాలో కీలక సందర్భంలో వచ్చే గీతం కోసం టాంగో నృత్యాన్ని నేర్చుకుంటున్నట్లు తెలిపింది తమన్నా. ఆమె మాట్లాడుతూ 'చాలా క్లిష్టమైన నృత్య ప్రక్రియ ఇది. టాంగో డ్యాన్సు చేయడం నేను ఇదే తొలిసారి. దాంతో శిక్షణ సమయంలో చాలా సార్లు గాయాలయ్యాయి. కానీ ఛాలెంజింగ్ భావించి కొనసాగిస్తున్నాను. నా కష్టానికి తగిన ప్రతిఫలం దొరుకుతుందని అనుకుంటున్నారు. తెరపై ఈ టాంగో బ్యాక్‌డ్రాప్‌లో వచ్చే గీతం ప్రేక్షకుల్ని అలరిస్తుందనే నమ్మకముంది' అని తెలిపింది. ఈ సినిమాలో తమన్నా రేడియోజాకీ పాత్రలో కనిపిస్తున్నది.

రెండు రోజుల్లో 100 కోట్లు



అమీర్‌ఖాన్

అమీర్‌ఖాన్ ప్రధాన పాత్రలో నటిస్తూ నిర్మించిన 'సీక్రెట్ సూపర్‌స్టార్' చిత్రం చైనాలో రెండు రోజుల్లోనే నూటపది కోట్ల వసూళ్లను సాధించింది. గత ఏడాది ఆక్టోబర్ భారత్‌లో విడుదలైన ఈ చిత్రం విమర్శకుల ప్రశంసలను సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. 'దంగల్' తర్వాత చైనాలో అమీర్‌ఖాన్ సినిమాలకు ఆదరణ పెరగడంతో ఇటీవలే ఈ సినిమాను అక్కడ విడుదలచేశారు. రెండు రోజుల్లోనే వంద కోట్ల క్లబ్‌ను దాటినట్లు ప్రముఖ సినీ విశ్లేషకుడు తరణ్ ఆదర్శ్‌పేర్కొన్నారు. గాయనిగా గుర్తింపును తెచ్చుకునే క్రమంలో ఓ యువతి ఎదుర్కొన్న సంఘర్షణ నేపథ్యంలో తెరకెక్కిన ఈ చిత్రానికి అద్వైత్ చందన్ దర్శకత్వం వహించారు.



వైశాలి, సురేష్‌కమల్

దివ్యమణి కోసం

సురేష్ కమల్, వైశాలి, కిమయా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'దివ్యమణి'. గిరిధర్ గోపాల్ స్వీయ దర్శకత్వంలో రూపొందిస్తున్నారు. ఈ చిత్ర గీతాలు శనివారం హైదరాబాద్‌లో విడుదలయ్యాయి. ప్రముఖ నృత్యకారిణి, పద్మవిభూషణ్ అవార్డు గ్రహీత యామిని కృష్ణమూర్తి చిత్ర ఆడియో సీడీలను విడుదలచేశారు. దర్శకుడు మాట్లాడుతూ 'వినూత్న కథ, కథనాలతో తెరకెక్కుతున్న చిత్రమిది. దివ్యమణి నేపథ్యమేమిటి? ఆ మణి కోసం ధైర్యవంతుడైన ఓ యువకుడు ఎలాంటి పోరాటాన్ని సాగించాడనేది ఆసక్తికరంగా ఉంటుంది. యాక్షన్ అంశాలకు ప్రాధాన్యముంటుంది. ఈ సినిమా తర్వాత యామిని కృష్ణమూర్తి జీవితం ఆధారంగా మరో చిత్రం చేయబోతున్నాం' అని తెలిపారు. నటుడిగా తన తొలి చిత్రమిదని, ఇందులోని యాక్షన్ సన్నివేశాల్లో డూప్ లేకుండా నటించానని సురేష్ కమల్ చెప్పారు. ఈ కార్యక్రమంలో సాయికుమార్, బలభద్రపాత్రుని రమణి, రామ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

Dwaraka



తెలంగాణ ఉర్దూ ఫోరం 2018 క్యాలెండర్‌ను డిప్యూటీ సీఎం మహమూద్ అలీ బంజారాహిల్స్‌లోని మినిస్టర్ క్వార్టర్‌లో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉర్దూ భాష అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని తెలిపారు. ఉర్దూ భాషను ప్రోత్సహించే కార్యక్రమాలు చేపడుతున్నట్టు వివరించారు. సీఎం కేసీఆర్ హయాంలో ఉర్దూకు మంచిరోజులు వస్తున్నాయని చెప్పారు. కార్యక్రమంలో తెలంగాణ ఉర్దూ ఫోరం అధ్యక్షుడు గజఫర్ అలీఖాన్, ఉపాధ్యక్షుడు మహమ్మద్ ఇబ్రహీం, టీఆర్‌ఎస్ మైనారిటీ నేతలు సత్తార్, భద్రొద్దీన్, మునీరాబేగం తదితరులు పాల్గొన్నారు. - హైదరాబాద్, నమస్తే తెలంగాణ

నేరస్థుల సర్వే 75 శాతం పూర్తి

- ఇతర రాష్ట్రాల్లో 15 శాతం నేరస్థులు
- రిపీటెడ్ నేరస్థులపై ప్రత్యేక దృష్టి
- ఎప్పటికప్పుడు వివరాల కంప్యూటరీకరణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా రాష్ట్ర పోలీస్‌శాఖ ఈ నెల 18న రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన పాత నేరస్థుల సమగ్ర సర్వే 75 శాతం పూర్తయింది. ఇందులో 60 శాతం మంది అందుబాటులో ఉండగా, 15 శాతానికి పైగా నేరస్థులు ఇతర రాష్ట్రాలు, దేశాలకు చెందిన వారున్నట్టు పోలీసులు గుర్తించారు. ఈ విషయాన్ని సర్వే బృందాలు జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళ్లాయి. రాష్ట్రంలో సర్వే పూర్తయిన వెంటనే ఇతర రాష్ట్రాల నేరస్థులపై దృష్టి పెట్టాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఇతర రాష్ట్రాల నేరస్థుల చిట్టాను విడిగా రూపొందించాలని డీజీపీ కూడా అన్నిజిల్లాల అధికారులను ఆదేశించినట్టు తెలిసింది. ఈ సర్వేలో రిపీటెడ్ నేరస్థులపై ప్రత్యేకంగా దృష్టి పెడుతున్నారు. రెండు మించి నేరాలు చేసిన వారి వివరాలను ప్రత్యేకంగా నమోదు చేస్తున్నారు. ఈ తరహా గ్యాంగ్‌ల వివరాలు సేకరించి, ఫింగర్ ప్రింట్స్, కుటుంబ వివరాలు కూడా నమోదు చేసుకుంటున్నారు. నేరం చేసి జైలుకెళ్లివచ్చాక ఇంటివద్దే ఉంటూ పనులు చేసుకుంటూ జీవిస్తున్న వారి వివరాలను కూడా సేకరిస్తున్నారు. ఈ తరహా నేరస్థుల వివరాలను ప్రత్యేకంగా నమోదు చేసుకోవడంతోపాటు కుటుంబసభ్యులు, స్థానికులతో మాట్లాడి అతడి ప్రవర్తనను తెలుసుకుంటున్నారు. పాత నేరస్థుల సమగ్ర సర్వే ద్వారా సేకరించిన వివరాలను టీఎస్ కాప్ మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. ఈ యాప్ ఉన్న ట్యాబ్‌లను బందోబస్తు పోలీసులకు ఇస్తున్నారు. దీంతో పెట్రోలింగ్ పోలీసులు 24 గంటలూ నేరగాళ్లపై నిఘా పెట్టనున్నారు. ఈ టెక్నాలజీని ఉపయోగించుకొని శాంతిభద్రతలను పరిరక్షించడంతోపాటు ఏడాది పొడవునా నేరస్థులపై నిఘా పెట్టేందుకు అవకాశం ఉంటుందని సీనియర్ పోలీసు అధికారులు చెప్తున్నారు.

పట్టుదల ఉంటే ఏదైనా సాధించగలం

దివ్యాంగుడు హరిని అభినందించిన డిప్యూటీ సీఎం మహమూద్ అలీ


హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పట్టుదల ఉంటే దివ్యాంగులు కూడా ఏదైనా సాధించగలరని డిప్యూటీ సీఎం మహమూద్ అలీ అన్నారు. ఇందుకు పాతబస్తీకి చెందిన హరి నిదర్శనమని చెప్పారు. దివ్యాంగుడైన హరికి మహమూద్‌అలీ రెండేండ్ల క్రితం హీరో మెస్ట్రో వాహనాన్ని కొనిచ్చారు. దానిపై అతను తినుబండారాలు విక్రయిస్తూ రోజుకు రూ.300 వరకు సంపాదించుకుంటున్నాడు. హరి తన వాహనంతో ఆదివారం మినిస్టర్స్ క్వార్టర్స్‌లో మహమూద్ అలీ నివాసానికి వచ్చాడు. తనకు ఇచ్చిన వాహనంపై తినుబండారాలు విక్రయించి పొట్టగడుపుకున్నానని తెలిపారు. వేసవి వస్తుండటంతో మజ్జిగ అమ్మడం ప్రారంభించినట్టు చెప్పారు. ఇందుకు మహమూద్ అలీ అభినందిస్తూ రూ.500 ఇచ్చి అతని వద్ద నుంచి మజ్జిగ ప్యాకెట్లు కొనుగోలుచేశారు. మిగతా వికలాంగులు హరిని ఆదర్శంగా తీసుకుని స్వయం ఉపాధి కల్పించుకోవాలని డిప్యూటీ సీఎం సూచించారు.



హరి వద్ద మజ్జిగ కొనుగోలు చేస్తున్న డిప్యూటీ సీఎం మహమూద్ అలీ

రాజ్‌భవన్ కాదు.. ప్రజాభవన్‌లోనే ఉంటా

వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తా: దత్తాత్రేయ



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గవర్నర్ పదవి చేపట్టి రాజ్‌భవన్‌లో ఉండటంపై తనకు ఆసక్తి లేదని ఎంపీ బండారు దత్తాత్రేయ అన్నారు. ప్రజాభవన్‌లోనే ఉంటూ.. వచ్చే ఎన్నికల్లో పోటీచేస్తానని స్పష్టంచేశారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం మీడియాతో మాట్లాడారు. గత ఏడాది కేంద్రమంత్రి పదవి నుంచి తొలిగించిన నేపథ్యంలో త్వరలో గవర్నర్‌గా నియమించే అవకాశాలున్నాయని, ఎన్నికలకు దూరంగా ఉంటారనే ప్రచారం జరుగుతున్నదనే విషయాన్ని విలేకరులు ఆయన దృష్టికి తీసుకువెళ్లగా పై విధంగా స్పందించారు. రాష్ట్రంలో బీజేపీ బలపడుతున్నదని వ్యాఖ్యానించిన దత్తాత్రేయ, పలువురు ముఖ్యనేతలు ఎందుకు పార్టీని వీడుతున్నారనే విషయంలో స్పందించేందుకు నిరాకరించారు.

మోత్కుపల్లికి క్రమశిక్షణ నోటీసులు!

- విలీన వ్యాఖ్యలపై టీడీపీ అధిష్ఠానం సీరియస్



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత మోత్కుపల్లి నర్సింహులుపై పార్టీ అధిష్ఠానం క్రమశిక్షణ చర్యల కింద వేటు వేసే అవకాశం ఉన్నది. ఇటీవల టీటీడీపీని అధికార టీఆర్‌ఎస్ పార్టీలో విలీనం చేద్దాం అంటూ సంచలన వ్యాఖ్యలు చేసిన మోత్కుపల్లిపై చర్యలు తీసుకోవాలని పార్టీ నాయకులు అంతర్గతంగా అధిష్ఠానంపై ఒత్తిడి తెస్తున్నట్టు సమాచారం. విమర్శలు చేసినవారిపై చర్యలు తీసుకోవడంలో ఆలస్యం చేస్తే కార్యకర్తల మనోధైర్యం దెబ్బతింటుందని వారు టీటీడీపీ అధ్యక్షుడు ఎల్ రమణకు చెప్పినట్టు సమాచారం. దీంతో జరిగిన ఘటనపై ఆయన పార్టీ అధిష్ఠానానికి నివేదిక పంపించినట్టు తెలిసింది. పార్టీ అధినేత చంద్రబాబు మోత్కుపల్లి నర్సింహులుకు నోటీసులు జారీచేసినట్టు సమాచారం. విదేశీ పర్యటనకు వెళ్లిన పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు ఈ నెల 25న తిరిగి అమరావతికి వస్తారు. నోటీసులకు మోత్కుపల్లి ఇచ్చే సమాధానం, పార్టీలో మిగతా సీనియర్ నేతల అభిప్రాయాలను తీసుకుని చర్యలు తీసుకునే అవకాశం ఉన్నదని పార్టీలోని సీనియర్లు అభిప్రాయపడుతున్నారు.

31లోగా తొలివాయిదా చెల్లించాలి

- హజ్ యాత్రికులకు సూచించిన ఎంఏ షకూర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ నుంచి హజ్‌యాత్రకు ఎంపికైన యాత్రికులు హజ్ కమిటీకి చెల్లించాల్సిన ఖర్చుల్లో తొలి వాయిదా రూ.81వేలు ఈ నెల 31లోగా చెల్లించాలని తెలంగాణ హజ్ కమిటీ ప్రత్యేక అధికారి ప్రొఫెసర్ ఎస్ ఏ షకూర్ సూచించారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) లేదా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(యూబీఐ)లో కేంద్ర హజ్ కమిటీ అకౌంట్‌లో లేదా ఆన్‌లైన్‌లో చెల్లించి చలాన్ రశీదు లేదా ఆన్‌లైన్ చెల్లింపు రశీదుతో పాటు ఒరిజినల్ పాస్‌పోర్ట్, మెడికల్ సర్టిఫికెట్‌ను తెలంగాణ హజ్ కమిటీ కార్యాలయంలో జనవరి 31లోగా అందజేయాలని యాత్రికులను కోరారు. లేనిపక్షంలో ఎంపికైన యాత్రికుల సీటు రద్దవుతుందని పేర్కొన్నారు.

నేడు కొండగట్టు నుంచి పవన్‌కల్యాణ్ యాత్ర

ప్రజా సమస్యల అధ్యయనం కోసమే యాత్రని స్పష్టీకరణ



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రజా సమస్యల అధ్యయనం కోసమే రాజకీయ యాత్ర ప్రాంభిస్తున్నట్టు జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ అన్నారు. సోమవారం కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకొని యాత్రను ప్రారంభిస్తామని వెల్లడించారు. మొత్తం మూడు జిల్లాల్లో పర్యటించనున్నట్టు చెప్పారు. ఆదివారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఆంజనేయస్వామి దర్శనానంతరం యాత్ర వివరాలు వెల్లడిస్తానని తెలిపారు. కార్యకర్తలతో సమావేశమయ్యాక తెలంగాణలో చేయబోయే పర్యటన వివరాలు కొండగట్టు వేదికగా ప్రకటిస్తానని వెల్లడించారు. అంతకుముందు సికింద్రాబాద్‌లోని సెయింట్ మేరీస్ చర్చిలో భార్య అన్నా, పోలండ్ అంబాసిడర్ ఆడమ్‌తో కలిసి ప్రార్థనలు చేశారు. అనంతరం అక్కడ ఉన్న జనసేన కార్యాలయంలో పోలండ్ ప్రతినిధులతో పవన్‌కల్యాణ్ సమావేశమయ్యారు.

అత్యున్నత ప్రమాణాలతో 'ధరణి' వెబ్‌సైట్

- పాస్‌పుస్తకం ముద్రణలో ఎన్నెన్నో జాగ్రత్తలు
- వంద డిగ్రీల వేడిలో అరగంట కాల్చినా కాలదు
- నీళ్లలో తడిపినా పాడైపోదు
- యాభై ఏండ్లైనా చెక్కుచెదురదు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

భూరికార్డుల డిజిటలైజేషన్, ఆన్‌లైన్ నిర్వహణ అంతా పకడ్బందీగా ఉండేలా 'ధరణి' వెబ్‌సైట్‌ను రాష్ట్ర ప్రభుత్వం రూపొందిస్తున్నది. ఇందుకు ప్రపంచంలో ఉన్న అత్యున్నత బ్లాక్‌చైన్ టెక్నాలజీని వినియోగిస్తున్నారు. వెబ్‌సైట్ నిర్వహణ, స్కానింగ్, డిజిటలైజేషన్ చేయటానికి అనుభవజ్ఞులైన బిడ్డర్లను ప్రభుత్వం ఆహ్వానించింది. పక్కాగా రూపొందించే ధరణి వెబ్‌సైట్ మార్చి 12నుంచి అమల్లోకి వస్తుంది. మార్చి మొదటివారం కల్లా వెబ్‌సైట్ రూపకల్పన పూర్తిచేయాలని బిడ్డర్లకు ప్రభుత్వం స్పష్టం చేసినట్టు సమాచారం. ఈ వెబ్‌సైట్ అందుబాటులోకి వచ్చినరోజు నుంచే రెవెన్యూశాఖ కోర్ బ్యాంకింగ్ విధానాన్ని అమలుచేస్తుంది.

పాసు పుస్తకం యాభై ఏండ్లయినా భద్రంగా..

పాస్‌పోర్ట్ కంటే భద్రంగా, 50 ఏండ్లైనా చెక్కుచెదరకుండా పట్టాదార్ పాస్ పుస్తకాలను తెలంగాణ ప్రభుత్వం ముద్రిస్తున్నది. దీనిని మైనస్ 30 డిగ్రీల సెల్సియస్ నుంచి 100 డిగ్రీల వేడిని తట్టుకునే విధంగా రూపొందిస్తున్నారు. అరగంటపాటు వంద డిగ్రీల వేడిలో కాల్చినా కాలదు. 220 డిగ్రీల వేడిని ఒక నిమిషంపాటు తట్టుకుంటుంది. రెండు గంటలపాటు నీళ్లలో నానబెట్టినా చెక్కుచెదరదు. నీళ్లలో తడిసిన తర్వాత ఎండబెడితే ఒక్క అక్షరంకూడా చెడిపోకుండా ఉంటుంది. పాస్‌పుస్తకంలో వాడే కాగితం 50 ఏండ్ల వరకు చినిగిపోదు. ఇంకు పడినా పీల్చుకుంటుంది. కాగితాలు చింపినా చినగవు. పాస్ పుస్తకం ముందు, వెనుక కవర్ పేపర్లకు రెండువైపులా సెక్యూరిటీ లేయర్‌గా సిలికాన్ పేపర్ ఉంటుంది. పారదర్శకమైన బార్‌కోడ్ సెక్యూరిటీ లేయర్‌గా ఉంటుంది.కవర్‌పేజీలో రెండు లేయర్ల లామినేటింగ్ ఉంటుంది. కింది లేయర్‌లో చినిగిపోని పేపర్ ఉంటుంది. పైలేయర్ కాటన్ బేస్డ్‌గా ఉంటుంది. దీని మందం 0.7 మిల్లీమీటర్లు. పాస్‌పుస్తకం 13.2 సెంటీమీటర్ల పొడవు, 18.8 సెంటీమీటర్ల వెడల్పు ఉంటుంది. ఒక్కొక్క పాస్‌పుస్తకానికి యూనిక్ ఐడీనంబర్ 13డిజిట్లతో ఉంటుంది. ఈ ఐడీనంబర్ పాస్‌పుస్తకంలోని ప్రతి పేపర్ మీద ఉంటుంది. ఈకోడ్‌లో మొదటి రెండు అక్షరాలు జిల్లాకోడ్‌తో ఉంటాయి. 3వ అక్షరంగా టీ ఉంటుంది.4,5అక్షరాలు మండల కోడ్‌లో ఉంటాయి. 6వ అక్షరం జిల్లా అల్ఫాబెటిక్‌లో, 7, 8, 9 అక్షరాలు గ్రామకోడ్‌లో ఉంటాయి. ఈ మూడు అక్షరాలు అత్యంత రహస్యంగా ఉంటాయి. ఇవి పాస్‌పుస్తకం చూడగానే కనిపించవు. వెతికినా దొరకవు. చివరి నాలుగు అక్షరాలు గ్రామ పాస్‌పుస్తకం సీరియల్‌నంబర్‌లో ఉంటాయి.





ప్రభుత్వం త్వరలో రైతులకు అందజేయనున్న పట్టాదార్ పాసుపుస్తకం కవర్‌పేజీ నమూనా, లోపలి భాగం

మరిన్ని భద్రతా ఫీచర్లు ..

పాస్‌బుక్ కమ్ టైటిల్‌డీడ్‌కు రసాయనాలు, నీరు, ఇతర ద్రావకాల కారణంగా చెరిగిపోనటువంటి కాగితాలు, కవర్‌ను ఉపయోగిస్తారు. కాగితం ప్రతి చదరపు మీటరుకు 130 గ్రాముల బరువు 140 మైక్రాన్ల మందం ఉంటుంది. ప్రతి పేజీలో గెలాచీ ప్యాట్రన్‌తో (చిన్నచిన్న అక్షరాలతో జిగ్‌జాగ్) కూడిన ప్రింటింగ్ చేస్తారు. ప్రత్యేకమైన ఫాంట్‌ను, ఫ్లోరోసెంట్ ఇంకును ఉపయోగిస్తారు. సెక్యూరిటీ ఫాంట్ నల్లరంగులో కనిపించినప్పటికీ అతినీలలోహిత కిరణాల వద్ద పెట్టినప్పుడు ఆకుపచ్చ రంగులో కనిపిస్తుంది. ముందు పేజీ కవర్ కోసం చినిగిపోని అట్టను ప్రత్యేకమైన ఇండస్ట్రీయల్ గుడ్డతో మిశ్రమం చేస్తారు. రాష్ట్ర రాజముద్రను నిర్ధిష్టమైన రంగు (మెరూన్, బ్లూ)లలో ముద్రించి దానికి బంగారు వర్ణంతో కూడిన ఫాయిల్ ఏర్పాటుచేస్తారు. రాజముద్రను 4.3 సెంటీమీటర్ల వ్యాసార్థంతో తెలుగులో ముద్రిస్తారు. లోపలి 16 పేజీల్లో హై రెజల్యూషన్ మైక్రోటెస్ట్ ప్రింటింగ్ ఉంటుంది. పాస్‌పుస్తకంపై ముద్రించే తెలంగాణ రాష్ట్ర పటంలోని బోర్డర్ అతినీలలోహిత కిరణాల ఎదుట పెట్టినప్పుడు రాష్ట్ర రాజముద్రలా కనిపిస్తుంది. పాస్‌బుక్‌లను కాపీ చేయడానికి వీలుండదు. పట్టాదారు వివరాలు తెలియచేసే మొదటి మూడు పేజీలు ఎవరైనా కాపీ చేయటానికి ప్రయత్నిస్తే 'కాపీ' అనే అక్షరాలు వస్తాయి. ప్రతి పేజీలో కంటికి కనిపించని విధంగా అతినీలలోహిత కిరణాలకు మాత్రమే సాధ్యమయ్యే ఫైబర్‌ను ఉపయోగిస్తారు. అతినీలలోహిత కిరణాల ఎదుట ప్రదర్శించిన సమయంలో ఫైబర్ మెరుస్తూ ఉండాలి. కరెన్సీనోట్లపై ఉండే సెక్యూరిటీ దారం తరహాలోనే అతినీలలోహిత కిరణాల దారాన్ని ఉపయోగిస్తారు. డాటాను నింపిన తర్వాత లేబుల్ అతికించేలా చర్యలు చేపట్టారు.మొదటిపేజీలో సెక్యూరిటీగా వినియోగించే దారంపై టీఎస్ అనే అక్షరాలు ఉంటాయి. ప్రతి పాస్‌బుక్‌కు క్యూ ఆర్ కోడ్ ఉంటుంది. క్యూ ఆర్ కోడ్ రీడర్ సహాయంతో అధికారులు పట్టాదారు వివరాలను చదువుతారు. ప్రత్యేక బార్‌కోడ్ ఉంటుంది. పట్టాదారుకు చెందిన ఆధార్ నంబర్‌ను ముద్రిస్తారు. పుస్తకంలోని వివరాలపై ఓవర్ రైటింగ్ చేయకుండా చర్యలు చేపట్టారు. ప్రతిపాస్ పుస్తకానికి అతినీలలోహిత కిరణాల పరిజ్ఞానంతో కూడిన సన్నని ఫిల్మ్‌లను జోడిస్తున్నారు. ఆప్టికల్ వేరియబుల్ ఇంక్‌తో కూడిన రాష్ట్రముద్రను ముద్రిస్తారు. రసాయనాలతో మిళితం చేసిన పేపర్‌ను ఉపయోగిస్తున్నారు. ప్రత్యేకమైన కలంను ఉపయోగించినప్పుడు రసాయనాలతో మిళితమైన పేపర్ బ్లూరంగులోకి మారుతుంది. ప్రతి పాస్‌పుస్తకంపై పైకి ఉబ్బినట్టుగా, చెక్కినట్టుగా ఉండే అక్షరాలు కనిపిస్తాయి. 'ఒరిజినల్ పట్టాదారు పాస్‌బుక్' అనే వాక్యం ఫిల్మ్‌లో నుంచి చూసినప్పుడు మాత్రమే కనిపించేలా మ్యాజిక్ టెక్స్ట్ ఉపయోగిస్తారు. ప్రత్యేకమైన గుర్తింపు సంఖ్యపై చిన్నచిన్న రంధ్రాలతో ప్రత్యేకమైన గుర్తింపు సంఖ్య(పాస్‌పోర్ట్ తరహాలో) ఉంటుంది. పాస్‌పుస్తకాన్ని ఒక్కోకోణం నుంచి చూస్తే .. ప్రత్యకమైన ఇమేజ్ కనిపిస్తుంది.

సమాచారం క్షణాల్లో నిక్షిప్తం

- డాష్‌బోర్డులతో కలెక్టర్ల ముందు సమగ్ర సమాచారం
- ప్రభుత్వ పథకాల అమలుతీరుపై రోజువారీ పర్యవేక్షణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ ప్రభుత్వం ప్రజాసంక్షేమం కోసం ఏర్పాటు చేసిన పథకాల అమలుపై సమగ్ర సమాచారం జిల్లా కలెక్టర్ల ఎదుట క్షణాల్లో నిక్షిప్తమవుతున్నది. పథకాలు కిందిస్థాయిలో ఏవిధంగా అమలవుతున్నాయి..? రోజువారీగా పథకాల తీరు ఏవిధంగా ఉంది? అనే విషయాలను ఎప్పటికప్పుడు పరిశీలించి ఏవైనా లోటుపాట్లు ఉంటే వెంటనే కిందిస్థాయి అధికారులకు ఆదేశాలు జారీచేస్తున్నారు. ఇందుకు అవకాశం కల్పిస్తున్నది డాష్‌బోర్డు విధానం. ఆధునిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ప్రజలకు స్వచ్ఛమైన పాలనను అందిస్తున్న ప్రభుత్వం.. రాష్ట్రంలోనే మొదటిసారి జిల్లా కలెక్టర్ల కోసం ప్రత్యేకంగా డాష్‌బోర్డును ఏర్పాటు చేసింది. రాష్ట్ర ప్రణాళికా విభాగం సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్‌తో కలిసి తెలంగాణ రాష్ట్ర జిల్లా పర్యవేక్షణ వ్యవస్థ (టీఎస్ డిస్ట్రిక్ట్ మానిటరింగ్ సిస్టమ్-టీఎస్‌డీఎంఎస్)కు రూపకల్పన చేసింది.

నాలుగు జిల్లాల్లో పైలట్ ప్రాజెక్ట్..

ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఎప్పటికప్పుడు పరిశీలించి ప్రజాసమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చేపట్టిన డాష్‌బోర్డుల విధానాన్ని ముందుగా నాలుగు జిల్లాల్లో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించింది. ఇందులో రంగారెడ్డి, మహబూబ్‌నగర్, వరంగల్ అర్బన్, మంచిర్యాల జిల్లా కలెక్టరేట్లు ఉన్నాయి. ఇక్కడ డాష్‌బోర్డు పనితీరును పరిశీలించి అనంతరం రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టరేట్లలో ప్రవేశపెట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది.

20 ప్రధాన శాఖలకు చెందిన 90 అంశాలు..

డీఎంఎస్ అప్లికేషన్లు అన్ని జిల్లాల కార్యాలయాల్లో అందుబాటులో ఉంటాయి. ఈ డాష్‌బోర్డులను ఎలా ఉపయోగించాలనే దానిపై కిందిస్థాయి అధికారులకు సైతం శిక్షణ కార్యక్రమాలను పూర్తిచేసింది. దీంతో ఒక్కో సంక్షేమ పథకం అమలును రోజువారీగా డాష్‌బోర్డులో పొందుపరుస్తారు. దీనిని పరిశీలించిన అనంతరం కలెక్టర్ పథకం అమలులో మార్పులు, చేర్పులు ఏమైనా ఉంటే వెంటనే కిందిస్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేస్తారు. ఇప్పటికే 20 ప్రధానశాఖలకు చెందిన 90 అంశాలను ఆన్‌లైన్‌లో 95 శాతం పూర్తిచేసింది, మిగతా 5 శాతం పనులకు సంబంధించి మాన్యువల్‌గా చేయనున్నది. దీనిని కూడా పూర్తిస్థాయిలో ఆన్‌లైన్‌లోకి తీసుకువచ్చేందుకు కసరత్తు కొనసాగుతున్నది.

గుర్తించిన శాఖలు, అందులోని అంశాలు ఇలా ఉన్నాయి

శాఖపేరు	గుర్తించిన అంశాలు	శాఖపేరు	గుర్తించిన అంశాలు
వ్యవసాయం	5	పరిశ్రమలు	3
హార్టికల్చర్	4	మున్సిపల్	6
పశుసంవర్ధకశాఖ	4	మైనార్టీ సంక్షేమం	2
వెనుకబడిన తరగతుల సంక్షేమం	7	గ్రామీణాభివృద్ధి	7
అటవీశాఖ	3	గ్రామీణ నీటి సరఫరా	3
పాఠశాల విద్య	2	రెవెన్యూశాఖ	12
ఆరోగ్య, కుటుంబ సంక్షేమం	3	ఎస్సీ సంక్షేమశాఖ	4
పేదవర్గాలకు గృహనిర్మాణం	3	గిరిజనాభివృద్ధి సంక్షేమం	4
చిన్నతరహా నీటి పారుదల	1	మహిళాభివృద్ధి, శిశుసంక్షేమం	10
		ఎస్సీ కార్పొరేషన్	3
		ప్రణాళికావిభాగం	4
		మొత్తం	90

గ్రామీణ ఆవిష్కరణలకు ఊతం

27న నిజామాబాద్‌లో చర్చాగోష్ఠి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సృజనకు పదునుపెట్టడం ద్వారా కొంగొత్త ఆవిష్కరణలను వెలుగులోకి తీసుకొచ్చేందుకు ఉద్దేశించిన రాష్ట్ర ఇన్నోవేషన్ సెల్ కార్యాచరణ మొదలుపెట్టింది. ఇప్పటికే హైదరాబాద్ కేంద్రంగా టీహబ్ పనిచేస్తుండగా.. ఈ కేంద్రానికి చేరువ కాలేని వారికోసం జిల్లాల్లో డెవలప్‌మెంట్ డైలాగ్ పేరుతో చర్చాగోష్ఠి నిర్వహిస్తున్నది. రాష్ట్ర చీఫ్ ఇన్నోవేషన్ ఆఫీసర్‌గా నియమితులైన ఔత్సాహిక పారిశ్రామికవేత్త సామ ఫణీంద్ర.. ఈ నెల 27న నిజామాబాద్ కేంద్రంగా డెవలప్‌మెంట్ డైలాగ్‌ను నిర్వహించనున్నారు. ఆయనతోపాటు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్, హైదరాబాద్‌లోని అమెరికన్ కాన్సులేట్‌లోని చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ హన్స్‌ఒలివర్ గాబ్రియెల్, టై హైదరాబాద్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీదేవిరెడ్డి, దేశ్‌పాండే ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గురురాజ్ దేశ్‌పాండే, రూరల్‌షోర్స్ బిజినెస్ ప్రెసిడెంట్ కేజీ మోహన్ తదితరులు పాల్గొంటారు. http://www.kakatiyasandbox. in/registration-form/ నుంచి ట్విటర్ లేదా ఫేస్‌బుక్ ఖాతా ద్వారా పేరు నమోదు చేసుకోవచ్చు.

మోసపోతే.. భరోసా

బాధితులకు పౌరసరఫరాలశాఖ బాసట ■ వినియోగదారుల వివాదాలకు ప్రత్యామ్నాయ పరిష్కార కేంద్రం

సకాలంలో అందుతున్న పరిహారం ■ మూడేండ్లలో 543 కేసుల పరిష్కారం

అందుబాటులో టోల్‌ఫ్రీ నంబర్ 1800-42500333

బోనరాబాద్, నమస్తే తెలంగాణ:

ఆన్‌లైన్ కొనుగోలు వల్ల మోసపోయారా?.. దవాఖానలో నాణ్యమైన వైద్యసేవలు పొందలేకపోయారా? బ్యాంకులు అదనంగా డబ్బు చెల్లించాలని చిరాకు తెప్పిస్తున్నాయా? ఇలాంటి సమస్యలతో సతమతమయ్యే ప్రజలకు తెలంగాణ పౌరసరఫరాలశాఖ ఏర్పాటుచేసిన ప్రత్యామ్నాయ వినియోగదారుల వివాదాల పరిష్కార కేంద్రం అండగా నిలుస్తున్నది. పరిహారాలిప్పిస్తూ బాధితులకు ఊరట కల్పిస్తున్నది. కోర్టుల చుట్టూ తిరుగలేక, ఫీజులు కూడా చెల్లించలేక, కాలయాపనను భరించలేక మనోవేదనకు గురవుతున్నవారికి ఈ కేంద్రం అందివచ్చిన ఆయుధంగా మారుతున్నది.

- గడిచిన మూడేండ్లలో 600 కేసులు రాగా, ఈ కేంద్రం 543 వివాదాలను పరిష్కరించి బాధితులకు న్యాయం చేసింది. తక్కువ సమయంలోనే నష్టపరిహారం అందుతుండటంతో కేంద్రాన్ని ఆశ్రయిస్తున్నవారి సంఖ్య రోజురోజుకు పెరిగిపోతున్నది.
- వినియోగదారుల రక్షణ చట్టం-1986 ప్రకారం ఏర్పాటుచేసిన ఈ కేంద్రాన్ని ఎర్రమంజిల్‌లోని పౌరసరఫరాలశాఖలో భాగంగా నిర్వహిస్తున్నారు. ఫిర్యాదుల స్వీకరణకు ప్రత్యేకంగా టోల్‌ఫ్రీ నంబర్ .. 1800 – 42500333 ఉంది. అవగాహనలేక మోసపోతున్నవారికి దిశానిర్దేశం చేస్తూ, మోసపోయినవారికి తక్కువ సమయంలోనే నష్టపరిహారాన్ని అందేలా చూస్తున్నది.
- ఆన్‌లైన్ షాపింగ్, ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్స్ సర్వీసెస్, రియల్ ఎస్టేట్, బ్యాంకులు, టెలికాం, ఇన్సూరెన్స్, వైద్యశాలల వల్ల నష్టపోతున్నవారు ఈ కేంద్రానికి ఎక్కువగా వస్తున్నారు. మూడేండ్లలో పౌరసరఫరాలశాఖ టోల్ ఫ్రీ నంబర్‌కు వచ్చిన ఫిర్యాదుల్లో 2928 వివాదాలు రిజిస్టర్ కాగా అందులో వినియోగదారుల మోసాలకు సంబంధించి 600 ఉన్నాయి. అందులో సరాసరి మూడునెలల వ్యవధిలోనే కేంద్రం 543 వివాదాలను పరిష్కరించింది.
- ఇటీవలే స్కానింగ్ సెంటర్ నిర్లక్ష్యానికి బిడ్డను కోల్పోయిన కామారెడ్డికి చెందిన తల్లిదండ్రులకు రెండునెలల్లోనే రూ.3.11 లక్షల నష్టపరిహారాన్ని ఆ స్కానింగ్ సెంటర్ నుంచి ఇప్పించి న్యాయం చేసింది. డబ్బు చెల్లించి వస్తు, సేవలు కొనుగోలు చేసిన ప్రతి ఒక్కరూ వినియోగదారులే అని.. వస్తు, సేవల్లోలోపం జరిగితే తమ టోల్ ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలని ఈ కేంద్రం ప్రచారం చేస్తున్నది.



వివాదాల పరిష్కారం ఇలా..

బాధితులు వినియోగదారుల కేంద్రాన్ని ఆశ్రయించినపుడు రెండు వర్గాల మధ్యవివాదాన్ని పరిష్కరించేందుకు ఈ కేంద్రం ప్రయత్నిస్తుంది. న్యాయాన్యాయాలు చర్చించి పరిష్కారం చూపిస్తుంది. ఒకవేళ అది ఇరువర్గాల్లో ఎవరికి నచ్చకపోయినా ఈ వివాదాన్ని జిల్లా వినియోగదారుల ఫోరానికి సిఫారసు చేస్తుంది. అయితే ఇక్కడికి వస్తున్న వివాదాల్లో 70శాతం పరిష్కారమవుతున్నట్టు చెప్తున్నారు. టోల్ ఫ్రీ ద్వారా వస్తున్న కేసులను పరిష్కరించేందుకు ప్రతి శనివారం ప్రత్యేకంగా కోర్టును నిర్వహిస్తున్నారు.

తాజాగా పరిష్కారానికి వచ్చిన కేసుల్లో కొన్ని..

- మహబూబ్‌నగర్‌కు చెందిన పాండు ఒక ట్రాక్టర్ కొనుగోలు చేశాడు. ఆరునెలల్లో అనేకసార్లు ఇబ్బంది పెట్టింది. పలుమార్లు ఆ ట్రాక్టర్ కంపెనీవాళ్లు రిపేర్ చేసినప్పటికీ సంతృప్తి కలుగకపోవడంతో చివరకు వినియోగదారుల కేంద్రాన్ని ఆశ్రయించాడు. కేంద్రం జోక్యంతో కంపెనీ.. కేవలం రెండునెలల్లో రూ.40వేల నష్టపరిహారాన్ని అందించడంతోపాటు, అన్ని రకాలుగా ట్రాక్టర్‌కు అయ్యే రిపేర్లు ఉచితంగా చేసేందుకు అంగీకరించింది.
- పాతబస్తీకి చెందిన అఫ్రీన్ 2017 డిసెంబర్‌లో తన ఏడేండ్ల కొడుకు అస్వస్థతకు గురికాగా ఓ ప్రైవేటు దవాఖానకు తీసుకెళ్లింది. చికిత్స చేస్తున్నామంటూ వారంపాటు కాలయాపన చేశారు. లక్ష రూపాయల ఫీజు వసూలు చేశారు. చివరకు వాంతులు, విరేచనాలతో అఫ్రీన్ కొడుకు మృతిచెందాడు. దీంతో ఆ తల్లి వైద్యశాల నిర్లక్ష్యంపై వినియోగదారుల కేంద్రాన్ని ఆశ్రయించింది. ప్రస్తుతం కేసు విచారణలో ఉంది.
- సికింద్రాబాద్‌కు చెందిన రమ్య ప్రముఖ కంపెనీకి చెందిన మొబైల్‌ను ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసింది. నాణ్యత లేనిది రావడంతో మొబైల్ కంపెనీకి ఫిర్యాదు చేయగా, మరోసారి ఆర్డర్ ఇవ్వాల్సిందిగా సూచించారు. రెండోసారి కూడా అలాంటిదే రావడంతో వినియోగదారుల కేంద్రాన్ని సంప్రదించగా.. నష్టపరిహారం, కాలయాపన కింద రూ.60వేలు చెల్లించేందుకు ఆ సంస్థ అంగీకరించింది.
- హైదరాబాద్‌లో నివసించే కిరణ్‌దత్తా తన నూతనగృహంలో ఇంటీరియర్ ఏర్పాటు కోసం ఓసంస్థకు కొంత సొమ్ము చెల్లించారు. నెలలు గడుస్తున్నా పనిమాత్రం కాకపోవడంతో ఆమె కేంద్రాన్ని సంప్రదించారు. ఆలస్యం అయినందుకు కిరణ్‌దత్తా కోరుకున్నట్లుగా ఆ సంస్థ రూ.50వేలు చెల్లించి వివాదం పరిష్కరించుకుంది.

మరింత పటిష్ఠపరుస్తాం



వినియోగదారులు మోసపోకుండా చట్టం వారికి అనేక హక్కులను ఇచ్చింది. అయితే చాలామంది దాన్ని సద్వినియోగం చేసుకోవడంలో ఆసక్తి కనబరచడంలేదు. మా వినియోగదారుల కేంద్రం పనితీరు బాగుంది. ఎంతో మంది న్యాయం పొందుతున్నారు. మరింత పటిష్ఠపరిచి సేవలు విస్తరించేందుకు కృషిచేస్తాం.

- సీవీ ఆనంద్, పౌరసరఫరాలశాఖ కమిషనర్

ప్రజల్లో అవగాహన పెరిగింది



ఫిర్యాదుల సంఖ్య పెరుగుతున్నది. మోసాలపై ప్రశ్నించేందుకు వినియోగదారులు ముందుకు వస్తున్నారు. ఇది శుభ పరిణామం. డబ్బు చెల్లించి కొన్న ప్రతి వస్తు, సేవల్లో నాణ్యత ఉండాలి. లేకుంటే ఊరుకోవద్దు. ఫిర్యాదు చేయాలి. ఒకరు సాధించిన విజయం మరొకరికి స్ఫూర్తిగా నిలుస్తుంది.

- డాక్టర్ నాగలక్ష్మి, వినియోగదారుల ఫోరం ఇంచార్జి

వినియోగదారులకు న్యాయంచేస్తాం



పట్టణ, గ్రామీణ ప్రాంతాల వినియోగదారులు ప్రతిరోజు ఏదో విధంగా మోసపోతుంటారు. నిర్లక్ష్యం చేయకుండా మా టోల్‌ఫ్రీ నంబర్ ద్వారా ఫిర్యాదు చేయండి. ఎక్కువ సమయం తీసుకోకుండా కేవలం రెండు మూడు నెలల్లోనే న్యాయం జరిగేలా ప్రయత్నిస్తున్నాం. కోర్టులకు వెళ్లే స్థోమత లేనివారికి మా కేంద్రం ఎంతో సహాయంగా ఉంటున్నది.

- అర్జున్‌మాలిక్, అసిస్టెంట్ కమిషనర్, వినియోగదారుల ఫోరం

నా పోరాటం రూ.25 కోసం కాదు..



ఆన్‌లైన్‌లో ఒక వస్తువును ఆర్డర్ చేశాను. ఎమ్మార్పీ కంటే ఎక్కువకు విక్రయించారని తెలిసింది. దీనిపై ఆ ఆన్‌లైన్ వస్తువుల విక్రయాల కంపెనీకి ఫిర్యాదు చేస్తే నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారు. పత్రికల ద్వారా తెలుసుకొని వినియోగదారుల కేంద్రాన్ని ఆశ్రయించాను. నేను ఎక్కువగా చెల్లించింది కేవలం రూ.25 మాత్రమే. కాని డబ్బుకోసం కాదు నా పోరాటం.. జరిగిన అవినీతికి వ్యతిరేకంగా.

- కొల్లి శ్రీకాంత్, ప్రైవేటు ఉద్యోగి

Dwaraka

పండుగలతో సామాజిక విలువలు

- ప్రధానమంత్రి నరేంద్రమోదీ
- ఢిల్లీలోని ఉపరాష్ట్రపతి ఇంట్లో సంక్రాంతి మిలన్

న్యూఢిల్లీ, జనవరి 21: భారతీయ పండుగలు జాతీయ, సామాజిక విలువలను పెంపొందిస్తాయని ప్రధానమంత్రి నరేంద్రమోదీ చెప్పారు. వీటిని ప్రజలు వచ్చే తరాలకు అందించేందుకు దోహదపడుతాయని పేర్కొన్నారు. ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్యనాయుడు ఢిల్లీలోని ఆయన నివాసంలో ఆదివారం నిర్వహించిన 'సంక్రాంతి మిలన్' కార్యక్రమానికి మోదీతోపాటు మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్, మాజీ ఉపరాష్ట్రపతి హమీద్ అన్సారీ, బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా, కేంద్రమంత్రులు అరుణ్‌జైట్లీ, సుష్మాస్వరాజ్, ఎంపీ కే కేశవరావు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. పండుగలు గ్రామీణ సంస్కృతి, రైతుల జీవితాలతో ముడిపడి ఉంటాయని చెప్పారు. సూర్యుడు ఉత్తరదిశవైపు ప్రయాణం ప్రారంభించడాన్ని మకర సంక్రాంతి సూచిస్తుందని, దేశంలోని వివిధ ప్రాంతాల్లో వివిధ పేర్లతో దీన్ని జరుపుకొంటారని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు చెప్పారు. పంట ఇంటికి రావడం, సంతోషాలకు గుర్తుగా సంక్రాంతి, పొంగల్ నిర్వహించుకుంటారని పేర్కొన్నారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.




ఆదివారం ఢిల్లీలోని ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్యనాయుడు నివాసంలో నిర్వహించిన 'సంక్రాంతి మిలన్' కార్యక్రమంలో పాల్గొన్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ. వెంకయ్యనాయుడును శాలువాతో సత్కరిస్తున్న కేంద్ర మంత్రి సుష్మాస్వరాజ్

క్షయ నివారణకు చర్యలు

- సీఎంలకు ప్రధాని మోదీ లేఖ
- మూడు నెలలకోసారి సమీక్షించాలి

న్యూఢిల్లీ, జనవరి 21: క్షయ వ్యాధి నివారణకు తీసుకుంటున్న చర్యలపై ప్రతి మూడు నెలలకోసారి సమీక్షించాలని వివిధ రాష్ట్రాల సీఎంలను ప్రధాని నరేంద్ర మోదీ కోరారు. ఈ మేరకు ఆయన వారికి ఆదివారం లేఖ రాశారు. సవరించిన జాతీయ క్షయ నియంత్రణ కార్యక్రమం (ఆర్ఎన్‌టీసీపీ) కింద ప్రభుత్వ, ప్రైవేట్ దవాఖానాల్లో క్షయ వ్యాధి నివారణకు తీసుకుంటున్న చర్యలపై ఎప్పటికప్పుడు సమీక్షించాలని కోరారు. ఏటా వివిధ అంటువ్యాధులతో 29 లక్షల మంది మరణిస్తుండగా, క్షయ వల్ల 4.9 లక్షల మంది మృతి చెందుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల లక్షల మంది బాలలు అనాథలుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భారత్‌లో క్షయ వ్యాధి వల్ల ఏటా రూ.20 వేల కోట్ల ఆర్థిక నష్టం వాటిల్లుతున్నదని పేర్కొన్నారు.

మోదీ అహంకారి

అన్నా హజారే విమర్శ



ముంబై, జనవరి 21: ప్రధానమంత్రి నరేంద్రమోదీ తాను రాసిన లేఖలకు ఎందుకు ప్రతిస్పందించడం లేదని అవినీతి వ్యతిరేక ఉద్యమ నాయకుడు అన్నా హజారే ప్రశ్నించారు. శనివారం మహారాష్ట్రలోని సంగ్లీ జిల్లా అట్పాడీ తహసీల్ పరిధిలో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ మోదీకి తాను ప్రధానిగాన్న అహంకారం ఉన్నదని మండిపడ్డారు. గత మూడేండ్లలో ఆయనకు 30కి పైగా లేఖలు రాసినా ప్రతిస్పందించకపోవడానికి కారణం ఆయనకు గల అహంకారమేనని చెప్పారు. మార్చి 23 నుంచి మరోసారి ఢిల్లీలో ఆందోళన చేపడుతానని ఇంతకుముందు ఆయన ప్రకటించారు. దానికి మద్దతు కూడగట్టేందుకు అట్పాడీ తహసీల్ పరిధిలో జరిగిన మూడు బహిరంగ సభల్లో హజారే పాల్గొన్నారు.

రికార్డుల డిజిటలీకరణతో భూ సమస్యలకు చెక్

దేశంలో భూమి వివాదాల పరిష్కారం దిశగా అడుగులు

నివేదిక ఇచ్చిన నీతి ఆయోగ్ టాస్క్‌ఫోర్స్ కమిటీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: దేశంలో భూవివాదాల పరిష్కారం దిశగా అడుగులు పడుతున్నాయి. భూమిని వివాదంలోకి లాగుతున్న భూ మాఫియాను నిరోధించడానికి ఏం చేయాలన్న దానిపై నీతి ఆయోగ్ ప్రత్యేకంగా టాస్క్‌ఫోర్స్ కమిటీని ఏర్పాటుచేసింది. భూ యాజమాన్య నిర్వహణలో అపార అనుభవం ఉన్న డాక్టర్ తేజేందర్ హక్ నీతి ఆయోగ్ భూ వివాదాల విభాగానికి చైర్మన్‌గా నియమించింది. హక్ నేతృత్వంలో అధ్యయనం చేసిన టాస్క్‌ఫోర్స్ కమిటీ పలు సిఫారసులు చేస్తూ నివేదికను ఇచ్చింది. దీన్ని నీతిఆయోగ్ 2017 డిసెంబర్ 28న ప్రధానమంత్రి ముఖ్యకార్యదర్శి అధ్యక్షతన జరిగిన ఒక సమావేశంలో అందజేసింది. భూ మాఫియాకు చెక్ పెట్టాలంటే ప్రాథమికంగా భూ రికార్డులను డిజిటలీకరణ చేయాలని చెప్పినట్టు తెలిసింది. 2019 మార్చి నాటికి డిజిటలీకరణను పూర్తిచేయాలని నిర్ణయించినట్టు సమాచారం. భూ యాజమాన్య హక్కులపై కూడా కేంద్రం రాష్ట్రాలతో కలిసి పనిచేయాలని నిర్ణయించినట్టు తెలిసింది. నూతన చట్టాన్ని పకడ్బందీగా తీసుకొస్తే భూ సమస్యలు, వివాదాలు, ఆక్రమణల నుంచి విముక్తి దొరుకుతుందని కమిటీ నివేదించింది.

టాస్క్‌ఫోర్స్ కమిటీ చేసిన సూచనల్లో ముఖ్యమైనవి..

- భూమి రాష్ట్రాల పరిధిలోని అంశమైనందున జాతీయ భూ రికార్డుల ఆధునీకరణ కార్యక్రమంలో పురోగతి సాధించిన రాష్ట్రాలు పటిష్ఠమైన ల్యాండ్ టైటిలింగ్ కోసం చట్టం చేసుకోవచ్చు. ఇది ఇండియన్ రిజిస్ట్రేషన్ చట్టం-1908, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ తదితర చట్టాలకు లోబడి ఉండాలి. ఈ చట్టానికి రాష్ట్రపతి అంగీకారం తీసుకోవాలి. దీనికి బదులుగా కనీసం రెండుమూడు రాష్ట్రాలు టైటిల్ గ్యారెంటీ చట్టం కోసం సూచనలు చేస్తే కేంద్రమే చట్టం తీసుకొచ్చే అవకాశం ఉంటుంది. అప్పుడు పార్లమెంట్ ఆర్టికల్ 252(1) కింద ఆయా రాష్ట్రాలు చట్టసభల్లో తీర్మానాలు చేసి, అమలుచేసుకునే అవకాశం ఉంది.
- ఏ ఆస్తి అయినా రిజిస్ట్రేషన్ చేస్తేనే చెల్లుబాటు అయ్యేలా, రిజిస్ట్రేషన్ కాగానే రికార్డుల్లో అప్‌డేట్ అయ్యేలా చట్టాలు ఉండాలి. ఆస్తి బదిలీ కూడా టైటిల్ రిజిస్ట్రేషన్‌లో నమోదయ్యేలా 1882 ట్రాన్స్‌ఫర్ ఆఫ్ ప్రాపర్టీ యాక్ట్‌లో సెక్షన్ 123ను సవరించాలి.
- చాలా రాష్ట్రాల్లో ఆస్తి రికార్డుల నిర్వహణకు ప్రత్యేక సంస్థలు లేవు. రెవెన్యూశాఖ, సర్వే, సెటిల్‌మెంట్‌శాఖ, రిజిస్ట్రేషన్లశాఖ, ఇతర స్థానికసంస్థల మధ్య భూ రికార్డుల విలీనం, అనుసంధానం చేయడం తప్పనిసరిగా ఉండాలి.
- టైటిల్ గ్యారెంటీ కోసం తీసుకొచ్చే కొత్త చట్టం ద్వారా కేంద్ర, రాష్ట్రస్థాయిల్లో ల్యాండ్ టైటిలింగ్ అథారిటీలను ఏర్పాటుచేయాలి. జాతీయ అథారిటీ రాష్ట్రస్థాయి అథారిటీలకు సాంకేతిక, విధానపరమైన సహకారం అందించాలి.
- జాతీయ టైటిల్ గ్యారెంటీ వ్యవస్థకోసం జాతీయ ల్యాండ్ టైటిలింగ్ అథారిటీ దేశంలోని అన్ని రాష్ట్రాల్లో ఒక మిషన్‌లాంటి కార్యక్రమాన్ని చేపట్టాలి. భూమితో సంబంధం ఉన్న అందరూ ఇందులో పాలుపంచుకునేలా అవకాశం కలిగించాలి.
- టైటిలింగ్‌కు ముందే సర్వే, రీసర్వే చేయాల్సిన అవసరం లేదు. రెండు పనులు ఒకేసారి చేయవచ్చు.
- పట్టణ ప్రాంతాల్లో అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీల ద్వారా కేటాయించిన ఆస్తులకు సంబంధించి ఎక్కువ సమస్యలు ఉండవు. కాబట్టి న్యాయ, పరిపాలనాపరమైన వ్యవస్థ రూపొందించడం ద్వారా వీటి టైటిలింగ్‌కు ప్రాధాన్యం ఇచ్చి ముందుగా చేపట్టాలి.
- అన్నిరాష్ట్రాల్లో నిధులు, సిబ్బంది కొరత ఉన్నందున కేంద్రం పూర్తిస్థాయిలో సహకరించాలి.
- అన్నిరాష్ట్రాలు స్టేట్ ల్యాండ్ గ్యారెంటీ ఫండ్‌ను ఏర్పాటు చేసుకోవాలి. ల్యాండ్ టైటిలింగ్‌లో జరిగిన లోపాలు, ఎవరైనా మోసం చేయడం వల్ల నష్టపోతే అలాంటి వారికి ఫండ్ నుంచి పరిహారం చెల్లించాలి. మోసం చేసినవారిపై న్యాయపరమైన చర్యలు తీసుకొని, నష్టాన్ని తిరిగి రాబట్టి.. నష్టపోయిన వ్యక్తికి చెల్లించేలా స్టేట్ ల్యాండ్ టైటిలింగ్ అథారిటీకి అధికారాలు ఉండాలి. టైటిల్ రిజిస్ట్రేషన్ చేసిన ప్రతి ఆస్తిపై 0.5 శాతం సెస్ లేదా సర్‌చార్జీని స్పెషల్ ఇన్సూరెన్స్ కోసం తీసుకోవచ్చు.
- వారసత్వ ఆస్తులు, భాగాల టైటిల్ రిజిస్ట్రేషన్ల సందర్భంగా హిందూ సక్సెషన్ యాక్ట్‌లను పరిగణనలోకి తీసుకోవాలి.



అర్ధరాత్రి నిఖా కుదరదు

రాత్రి 12 దాటితే ఫంక్షన్‌హాళ్లకు తాళం

ముస్లిం ప్రముఖులు, ఖాజీలు, పోలీసు అధికారులు, ఫంక్షన్‌హాళ్ల నిర్వాహకులతో రేపు వక్ఫ్‌బోర్డు చైర్మన్ ప్రత్యేక సమావేశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఫంక్షన్ హాళ్లలో అర్ధరాత్రి వరకు ముస్లింల వివాహాలు, విందులను నివారించడంతోపాటు వాటిని త్వరగా ముగించేలా చర్యలు తీసుకోవడానికి తెలంగాణ రాష్ట్ర వక్ఫ్‌బోర్డు సాహసోపేతమైన చర్యలకు సిద్ధమవుతున్నది. తగు కారణం లేకుండా ఆలస్యంగా జరిగే వివాహాల కార్యక్రమాన్ని ఖాజీలు బహిష్కరించే విధంగా బోర్డు కఠిన నిర్ణయం తీసుకోనున్నది. అర్ధరాత్రి 12 దాటగానే ఫంక్షన్‌హాళ్లకు తాళాలు వేయాలని పిలుపునిచ్చింది. ఈ మేరకు ఖాజీలు (వివాహాలు జరిపించే పండితులు), ఫంక్షన్‌హాళ్ల యాజమాన్యాలు, పోలీసు అధికారులు, ముస్లిం ప్రముఖులతో మంగళవారం వక్ఫ్‌బోర్డు ప్రధాన కార్యాలయంలో బోర్డు చైర్మన్ మహ్మద్ సలీం అధ్యక్షతన ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేశారు. ముస్లిం సమాజంలో అర్ధరాత్రి వరకు జరిగే వివాహాది కార్యాలు, పెండ్లికొడుకు ఊరేగింపులు, విందులు అనర్థాలకు దారితీస్తుండటంతో ఆందోళన వ్యక్తమవుతున్నది. రాత్రి రెండుగంటల వరకు ఫంక్షన్‌హాళ్లలో కొనసాగుతున్న డిన్నర్లతో ముస్లిం సమాజంలో దుష్ప్రభావం చూపుతున్నది. ఇలాంటి పరిణామాలకు అడ్డుకట్ట వేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించేందుకు ముస్లిం ప్రముఖులు, ఖాజీలు, ఫంక్షన్‌హాళ్ల నిర్వాహకులు, పోలీసు అధికారులతో ఈ నెల 23న ప్రత్యేక సమావేశాన్ని వక్ఫ్‌బోర్డు ఏర్పాటుచేసింది. పెండ్లి పత్రికలో పొందుపర్చిన సమయం కంటే ఆలస్యం జరిగే నిఖాల కార్యక్రమానికి ఖాజీలు వెళ్లకూడదని, బహిష్కరించాలని వక్ఫ్‌బోర్డు కఠిన నిర్ణయం తీసుకోబోతున్నది.

అడ్డం తిరుగుతున్న ఏపీ

- తొమ్మిదో షెడ్యూల్ సంస్థల విభజనలోనూ పేచీ
- షీలాబీడే కమిటీ ఎదుట అంగీకారం
- అమరావతికి వెళ్లగానే తిరస్కారం
- ఏపీ తొండి వైఖరిపై తెలంగాణ ఉద్యోగ సంఘాల మండిపాటు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తొమ్మిదో షెడ్యూల్ సంస్థల విభజనలోనూ ఏపీ సర్కార్ పేచీ పెడుతున్నది. కేంద్ర ప్రభుత్వం ఏర్పరిచిన షీలాబీడే కమిటీ ముందు ఆ సంస్థల ఉద్యోగులు, ఆస్తుల విభజనకు అంగీకరిస్తూనే అమరావతికి వెళ్లాక పూర్తిగా అడ్డం తిరుగుతున్నది. తాజాగా శనివారం షీలాబీడే కమిటీ ఎదుట జరిగిన సమావేశంలో తెలంగాణ పబ్లిక్ సెక్టార్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకులు కేంద్ర డీవోపీటీ ఇచ్చిన నిబంధనలు, రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టం-2013లోని సెక్షన్ 82 ప్రకారం తొమ్మిదో షెడ్యూల్ సంస్థల ఉద్యోగుల విభజన జరుగాలని వాదనలు వినిపించారు. ఆస్తుల విషయంలో ఏ ప్రాంతంలో ఉన్న ఆస్తులు ఆ ప్రాంతానికే చెందుతాయన్న చట్టం నిబంధనలను కూడా ఏపీ సర్కార్ పెద్దలు ఉల్లంఘిస్తున్నారు. విద్యుత్ మండలి, ఉన్నత విద్యామండలివంటి అనేక సంస్థల విషయంలో న్యాయ సమ్మతమైన తీర్పులను అంగీకరించకుండా పేచీలు పెడుతున్నారు. గవర్నర్ సమక్షంలో జరిగిన సమన్వయ కమిటీ సమావేశాల్లో 40కిపైగా సంస్థల్లో విభజనకు ఇరు రాష్ట్రాల మధ్య సానుకూలమైన అంశాలన్నింటిపై సూత్రప్రాయ అంగీకారాలు వచ్చినప్పటికీ ఏపీ మాత్రం అమలులోకి తేవడం లేదు.

ఉద్దేశపూర్వకంగా వాయిదా వేస్తున్న ఏపీ

తొమ్మిదో షెడ్యూల్ సంస్థల ఉద్యోగుల విభజనను ఉద్దేశపూర్వకంగా ఏపీ వాయిదా వేస్తున్నదని తెలంగాణ పబ్లిక్ సెక్టార్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ చైర్మన్ బీ రాజేశం, సెక్రటరీ జనరల్ జీటీ జీవన్, గౌరవ సలహాదారు సింగం విజయమోహన్ విమర్శించారు. ఈ సంస్థల ఉద్యోగులను స్థానికత నిబంధనల ప్రకారం విభజించాలనే ప్రాథమిక అంశాలను కూడా ఏపీ అధికారులు తొక్కి పెడుతున్నారని మండిపడ్డారు.

విద్యార్థుల భద్రతకు సీఐఎస్ఎఫ్ పాఠాలు

- సెక్యూరిటీ కన్సల్టెన్సీని ప్రారంభించిన సీఐఎస్ఎఫ్

న్యూఢిల్లీ, జనవరి 21: గుర్గావ్‌లోని రయాన్ ఇంటర్నేషనల్ పాఠశాలలో రెండో తరగతి విద్యార్థినిని అదే పాఠశాలలో చదువుతున్న మరో విద్యార్థి హత్య చేయడంతో స్కూళ్లలో భద్రత అంశం తెరపైకి వచ్చింది. ఈ విషయంపై కేంద్ర పారిశ్రామిక భద్రత దళం(సీఐఎస్ఎఫ్) దృష్టిసారించింది. విద్యార్థుల భద్రతకు సంబంధించిన మెళకువలను తెలియజేయడానికి 'సెక్యూరిటీ కన్సల్టెన్సీ'ని ప్రారంభించింది. ఈ కన్సల్టెన్సీలో పలువురు నిపుణులు ఉంటారు. పాఠశాలలో ఎక్కడెక్కడ సీసీటీవీ కెమెరాలను అమర్చాలి. సెక్యూరిటీ సిబ్బందికి ఎలాంటి శిక్షణ ఇవ్వాలి. వారిని పాఠశాల పరిధిలో ఎక్కడెక్కడ మొహరించాలి. ఏదైనా అనుకోని సంఘటన జరిగితే ఎలాంటి అత్యవసర సేవలు చేపట్టాలి.. ఇలా పలు అంశాలపై నిపుణులు సలహాలు, సూచనలు అందజేస్తారు. ఇందుకుగాను ప్రతి పాఠశాల కొంత మొత్తం సొమ్మును ఫీజుగా కన్సల్టెన్సీకి చెల్లించాలి. సీఐఎస్ఎఫ్ అధికార వర్గాలు మాట్లాడుతూ ఇప్పటికే తమ సేవలను ప్రారంభించామని, పలు పాఠశాల నుంచి దరఖాస్తులు కూడా వస్తున్నాయని తెలిపాయి. దేశవ్యాప్తంగా ఏ పాఠశాలకైనా సేవలు అందించడానికి తాము సిద్ధమేనని పేర్కొన్నాయి. విద్యార్థుల భద్రత, సమాజ సేవను దృష్టిలో ఉంచుకొని సెక్యూరిటీ కన్సల్టెన్సీని ప్రారంభించామని వివరించాయి.

పరిశ్రమల కళ

మొదటిపేజీ తరువాయి...

అనుమతి వస్తుందని ఆశ్చర్యపోయిన పారిశ్రామిక ప్రతినిధులు ఎందరో ఉన్నారు. పరిశ్రమలకు అనుమతులు ఇచ్చే సులభమైన విధానాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోదీ సైతం అభినందించారు. ప్రపంచవ్యాప్తంగా ప్రముఖ పారిశ్రామికవేత్తలు ఈ విధానానికి ప్రశంసలు తెలుపుతున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లకు తమ సంతోషాన్ని, సంతృప్తిని వ్యక్తం చేస్తూ లేఖలు రాస్తున్నారు. తెలంగాణలో నిరుద్యోగ యువతకు ప్రభుత్వ ఉద్యోగాలే కాకుండా ఉపాధి అవకాశాలను పెద్దఎత్తున కల్పించడానికి పారిశ్రామికరంగం ప్రధానమైనదని గుర్తెరిగిన ప్రభుత్వం ఆ రంగాన్ని ప్రోత్సహించేందుకు భారీ చర్యలు చేపట్టింది. ప్రధానంగా అనుమతులకు అనవసర జాప్యాలు, ఆటంకాలు లేకుండా చేసింది. దీంతో సత్ఫలితాలొస్తున్నాయి.

గ్రామీణ జిల్లాల్లోనూ..

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు, టీఎస్ఐపాస్ ద్వారా పరిశ్రమలు హైదరాబాద్, దానిచుట్టూనే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లోనూ ఏర్పాటయ్యాయి. గ్రామీణ జిల్లాల్లోనూ పరిశ్రమలు ఏర్పాటు చేసే విధంగా ప్రభుత్వం పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తున్నది. గ్రామీణ జిల్లాల్లో అవసరమైన విధంగా మిషన్ భగీరథ ద్వారా నీరు, టీఎస్ఐఐసీ ద్వారా భూముల్లో మౌలిక సదుపాయాలు, ప్రోత్సాహకాలు అందిస్తున్నారు. రవాణా సదుపాయాలు మెరుగుకావడం, శాంతిభద్రతల సమస్యలు లేకపోవడంతో పారిశ్రామికవేత్తలు గ్రామీణ జిల్లాల వైపు మొగ్గుచూపుతున్నారు. ఒకప్పుడు పరిశ్రమలు అంటే హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలనే ఎంచుకునేవారు. ఇప్పుడు ఇతర జిల్లాలవైపు చూస్తున్నారు. టీఎస్ఐపాస్ పారిశ్రామిక విధానాన్ని తెలుసుకున్న ఇతర రాష్ట్రాలు ఇక్కడి విధానంపై ఆసక్తి చూపిస్తున్నాయి. తమ రాష్ట్రాల్లో అమలుపరిచేందుకు ఇతర రాష్ట్రాల పరిశ్రమల శాఖ అధికారులు ఇక్కడికి వచ్చి పరిశీలిస్తున్నారు.

ప్రత్యేక పారిశ్రామికపార్కులు

పరిశ్రమలను స్థాపించడానికి అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించే బృహత్తర బాధ్యతను టీఎస్ఐఐసీ పెద్ద ఎత్తున చేపట్టింది. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కే తారకరామారావు ఆదేశాలకు అనుగుణంగా వివిధ అనుబంధ రంగ పరిశ్రమలకు ప్రత్యేకమైన పారిశ్రామిక పార్కులను నెలకొల్పాలని నిర్ణయించారు. వరంగల్‌లో మెగా టెక్స్‌టైల్ పార్కు, ముచ్చర్లలో ఫార్మాసిటీని ఏర్పాటుచేస్తున్నారు. వీటికి అవసరమైన భూసేకరణ దాదాపుగా పూర్తికావొచ్చింది. ముఖ్యమంత్రి కేసీఆర్ శంకుస్థాపన చేసిన అనంతరం టెక్స్‌టైల్ పార్కు మొదటి దశ పనులు చురుకుగా సాగుతున్నాయి. హైదరాబాద్ నగర శివారులో పెద్ద ఎత్తున ప్రత్యేక పారిశ్రామిక పార్కులను ఏర్పాటు చేస్తున్నారు. దండుమల్కాపురంలో గ్రీన్ ఇండస్ట్రియల్ పార్కుకోసం ఇప్పటికే 400 ఎకరాలకుపైగా భూమి కేటాయించారు. మౌలిక సదుపాయాల పనులు చురుకుగా సాగుతున్నాయి. దాదాపు 250 ఎకరాల్లో సుల్తాన్‌పూర్‌లో మెడికల్ డివైజెస్ పార్కు, మరో 200 ఎకరాల్లో ఇతర రంగాల పరిశ్రమలకు పార్కును ఏర్పాటు చేస్తున్నారు. తూప్రాన్‌లో ఫుడ్‌పార్క్, రాకంచర్ల, బూచినేల్లి, సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం శివనగర్‌లో ఎల్ఈడీ పార్కును ఏర్పాటు చేయనున్నారు. పాశమైలారం సమీపం ఇంద్రకరణ్‌లో మరో పార్కు ఏర్పాటు చేస్తున్నారు. మహిళల కోసం ప్రత్యేక పారిశ్రామిక పార్కులను నెలకొల్పుతున్నారు. ఫిక్కి లేడీస్ ఆర్గనైజేషన్‌కు సుల్తాన్‌పూర్‌లో 50 ఎకరాలు కేటాయించారు. నందిగామలో ఎలిప్‌కు ప్రత్యేక పార్కు ఏర్పాటు చేశారు. ఇలా ప్రత్యేకంగా పారిశ్రామిక పార్కులు ఏర్పాటుచేయడంతో ఆయా రంగాల్లో పరిశ్రమలు పెట్టడానికి పెద్ద ఎత్తున ముందుకొస్తున్నారు.



సులభ వాణిజ్యంలో దూసుకుపోతూ..

సులభ వాణిజ్య విధానం (ఈవోడీబీ)లో తెలంగాణ 2016లో దేశంలో మొదటిస్థానంలో నిలిచింది. కొత్త రాష్ట్రమైనా 98.78 స్కోరు సాధించింది. మొత్తం 340 సంస్కరణలు అమలు చేయాల్సి ఉండగా 324 అమలుపరిచారు. 2015లో 13వ స్థానంలో ఉన్న తెలంగాణ.. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కే తారకరామారావు నిత్యపర్యవేక్షణతో మొదటిస్థానాన్ని చేరుకుంది. 2017లోనూ మొదటిస్థానంలో కొనసాగడానికి రాష్ట్రప్రభుత్వం కసరత్తు పూర్తి చేసింది. సంస్కరణలను అన్నింటిని డీఐపీపీ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఈవోడీబీ సంస్కరణల అమలు తీరును ప్రశంసించిన కేంద్రం మన రాష్ట్ర అధికారులతో త్రిపుర రాష్ట్ర అధికారులకు శిక్షణ ఇప్పించింది. ఈవోడీబీలో తీసుకొచ్చిన సంస్కరణలు టీఎస్ఐపాస్‌ను మరింత సులభతరం చేస్తున్నాయి. అన్ని రకాల అనుమతులు ఒకే వెబ్‌సైట్‌లో లభ్యమయ్యే విధంగా ఏర్పాట్లు చేశారు. అనుమతుల విధానంలో తీసుకొచ్చే మార్పుల ప్రతిపాదనలను ముందుగా వెబ్‌సైట్‌లో పెట్టి అభిప్రాయాలను తీసుకుంటున్నారు. పారిశ్రామికవేత్తలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగాల్సిన అవసరం లేకుండా వారి కార్యాలయంలోనే ఉండి దరఖాస్తు చేసుకునే విధంగా మార్పులు తీసుకొచ్చారు. దరఖాస్తు చేసుకోగానే పారిశ్రామికవేత్తలకు అధికారులు ఫోన్లుచేస్తూ అవసరమైన సమాచారాన్ని తీసుకుంటున్నారు. తనిఖీలకు తేదీలను ఖరారు చేసుకుంటున్నారు. గతంలో అధికారులకు ఫోన్ చేసినా స్పందించని సందర్భాలుండగా ఇప్పుడు స్వయంగా అధికారులే ఫోన్లు చేస్తుండటంతో పారిశ్రామికవేత్తలు ఆనందపడిపోతున్నారు. పరిశ్రమల అనుమతులపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయడానికి సీఎంవో కార్యాలయంలో సీనియర్ ఐఏఎస్ అధికారి శాంతికుమారిని ప్రత్యేకంగా నియమించారు. అనుమతులు, భూకేటాయింపులు, పారిశ్రామికవేత్తల అనుమానాలు, సందేహాలను నివృత్తి చేయడానికి నిత్యం పనిచేస్తున్నారు. రాష్ట్రస్థాయి అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తూ.. అప్రమత్తం చేస్తున్నారు. ఇలా కింది నుంచి పైస్థాయి వరకు అప్రమత్తతతో వ్యవహరించడంతో టీఎస్ఐపాస్ విజయవంతంగా కొనసాగుతున్నది.

ఇప్పటికే 1.57లక్షల మందికి ఉపాధి

పరిశ్రమల స్థాపన ద్వారా రాష్ట్ర యువతకు ఉపాధి అవకాశాలు లభించడంతోపాటు రాష్ట్రానికి ఆదాయం కూడా పెరుగనుంది. రెండింటి లక్ష్యంగా రూపొందించిన టీఎస్ఐపాస్ ఫలితాలు ఇప్పటికే కానవస్తున్నాయి. అనుమతులు తీసుకున్న మొత్తం పరిశ్రమల్లో 3537 (59 శాతం) ఇప్పటికే ఉత్పత్తులను ప్రారంభించాయి. వీటిలో 1,57,816 మంది ఉపాధి అవకాశాలు పొందారు. వీటిలో పెట్టిన పెట్టుబడుల విలువ రూ.32,220కోట్లు. మరో 481 పరిశ్రమలు ప్రారంభానికి సిద్ధమయ్యాయి. వీటిద్వారా 79,457 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఇలా మొత్తంగా ఇప్పటివరకు అనుమతులు తీసుకున్న పరిశ్రమలు ప్రారంభమైతే 4,40,863 మందికి ఉపాధి అవకాశాలు రానున్నాయి. ప్రారంభదశలో ఉన్న 517 పరిశ్రమల ద్వారా 83,992 మందికి, నిర్మాణాలను ప్రారంభించాల్సి ఉన్న మరో 1504 పరిశ్రమల ద్వారా మరో 1,19,598 మందికి ఉపాధి లభిస్తుంది.

75 పరిశ్రమల్లో రూ.200కోట్లకు మించి పెట్టుబడులు

పరిశ్రమలను పెట్టుబడి ఆధారంగా ఆరు క్యాటగిరీలుగా విభజించారు. వెయ్యిమందికి ఉపాధి కల్పించడం లేదా రూ.200 కోట్ల పైబడి పెట్టుబడి పెడితే మెగా ఇండస్ట్రీగా పరిగణిస్తారు. ఇప్పటికి 75 పరిశ్రమల్లో రూ.200కోట్ల పైబడే పెట్టుబడులు పెట్టారు. ఇలా గత మూడున్నర సంవత్సరాల్లో మెగా పరిశ్రమల ద్వారా రాష్ట్రంలో రూ.86,679కోట్ల పెట్టుబడులు పెట్టడానికి పారిశ్రామికవేత్తలు ముందుకొచ్చారు. వీటికి ఇప్పటికే అనుమతులు పొందారు. వీటిద్వారా 1,47,278 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. 3663 పరిశ్రమల్లో కోటి రూపాయల వరకు పెట్టుబడి పెట్టారు.

పరిశ్రమలకు అనుమతిపొందినవాటి వివరాలు...

	2014-15	2015-16	2016-17	2017-18	మొత్తం
అనుమతి పొందిన పరిశ్రమలు	179	1,579	1,817	2,464	6,039
పెట్టుబడులు (రూ.కోట్లలో)	1833	30,293	34,956	50,811	1,17,893
ఉపాధి అవకాశాలు	5,125	1,09,287	1,24,007	2,02,444	4,40,863
ప్రారంభమైన పరిశ్రమలు	158	1,349	1,375	655	3,537
ప్రారంభానికి సిద్ధమైనవి	3	95	135	248	481
తొలి దశలో ఉన్నవి	18	132	131	236	517
ఇంకా నిర్మాణం ప్రారంభంకానివి	0	3	176	1,325	1,504

రాష్ట్రానికి వచ్చిన పరిశ్రమలు (పెట్టుబడుల క్యాటగిరీల వారీగా..)

పెట్టుబడి పరిధి (రూ.కోట్లు)	మొత్తం పరిశ్రమలు	పెట్టుబడులు (రూ.కోట్లలో)	ఉపాధి అవకాశాలు
0-రూ.కోటి వరకు	3663	1,055.71	53,508
1-5	1495	3,652.33	46,381
5-10	305	2,097.33	18,418
10-100	437	15,810.05	1,21,733
100-200	64	8,598.78	53,545
200కోట్ల కంటే ఎక్కువ	75	86,679.63	1,47,278
మొత్తం	6,039	1,17,893.83	4,40,863

ఉపాధి అవకాశాలు పెరిగాయి



పరిశ్రమల స్థాపనకు అవసరమైన అనుకూల చర్యలను ప్రభుత్వాలు చేపట్టినప్పుడు సహజంగానే సత్ఫలితాలొస్తాయి. తద్వారా ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయి. ఇప్పుడు తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్నది అదే. ఉపాధి అవకాశాలు కల్పించడానికి ప్రధామైనది పారిశ్రామికరంగం. దీనిని గుర్తించిన ముఖ్యమంత్రి కేసీఆర్ పరిశ్రమల అనుమతులకు ఇబ్బందులు లేకుండా పలు చర్యలు తీసుకున్నారు. కార్యాలయాల చుట్టూ తిరుగకుండా ఉండటానికి ఆన్‌లైన్‌లో అనుమతులు పొందే విధంగా టీఎస్ఐపాస్‌ను తీసుకొచ్చారు. 15 రోజుల్లోనే అనుమతి ఇచ్చేలా చూస్తున్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించేవారిపై చర్యలు తీసుకుంటుండటంతో జవాబుదారీతనం పెరిగింది. ఈ విధానంతో దేశంతోపాటుగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న పారిశ్రామికవేత్తలు మన రాష్ట్రంవైపు చూస్తున్నారు. గతంలో పరిశ్రమల అనుమతులకే నెలల తరబడి కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. దీనికి తోడుగా పరిశ్రమలకు ప్రధానమైన కరంటు సమస్యను ముఖ్యమంత్రి కేసీఆర్ పరిష్కరించారు. ఇలా పరిశ్రమలకు ప్రధానమైన సమస్యలు పరిష్కారం కావడంతో పెద్ద ఎత్తున పెట్టుబడులు పెడుతున్నారు. ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయి.

– సుధీర్‌రెడ్డి, అధ్యక్షుడు, తెలంగాణ పారిశ్రామికవేత్తల సమాఖ్య

ఉత్పత్తులు ప్రారంభమవుతున్నాయి



టీఎస్ఐపాస్‌తో పారిశ్రామికవేత్తలు పూర్తి సంతోషంగా, సంతృప్తిగా ఉన్నారు. అనుమతులు అతి తక్కువ సమయంలో రావడం వారిని మరింత ఉత్సాహపరుస్తుంది. పరిశ్రమలు రావడం ద్వారా ఎక్కువ మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయి. పరిశ్రమలకు అనుమతులు ఇవ్వడం వరకే కాకుండా అవి ఉత్పత్తులు ప్రారంభించేవిధంగా ప్రభుత్వం ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నది. సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నది. ఇప్పటివరకు అనమతులు ఇచ్చినవాటిల్లో 70 శాతం వరకు ఉత్పత్తులు ప్రారంభమయ్యాయి. మరికొన్నింటిలో అతి త్వరలో ఉత్పత్తులు ప్రారంభం కానున్నాయి. అనుమతులు తీసుకున్న పరిశ్రమలకు వారం వ్యవధిలోనే భూ కేటాయింపులు జరుగుతున్నాయి. గరిష్ఠంగా రెండువారాలు పడుతున్నది. టీఎస్ఐపాస్ విధానాన్ని చూసి దేశంలోని ప్రముఖ పారిశ్రామికవేత్తలు స్పందిస్తున్నారు. అదానీ, వెల్‌స్పన్ లాంటి కంపెనీలు మన రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపిస్తున్నాయి. ఈవోడీబీలో కూడా రాష్ట్రం మొదటిస్థానంలో ఉండటం పెట్టుబడులను ఆకర్షించడానికి మరింత బలం చేకూరుస్తున్నది.

– ఈ వెంకటనర్సింహారెడ్డి, ఎండీ, టీఎస్ఐఐసీ

టీఎస్ఐపాస్ అత్యద్భుతం



తెలంగాణ రాష్ట్రం తీసుకొచ్చిన టీఎస్ఐపాస్ పారిశ్రామిక విధానం దేశంలోనే అత్యద్భుతమైనది. మా కంపెనీ ఉత్తరాఖండ్‌లో పరిశ్రమ స్థాపించాలనుకుంటే అనుమతులు రావడానికి నెలల సమయం పట్టింది. కానీ ఇక్కడ తక్కువ వ్యవధిలోనే అనుమతులు రావడమే కాకుండా ఉత్పత్తి ప్రారంభం చేయగలుగుతున్నామంటే ఇక్కడి ప్రభుత్వం తీసుకొచ్చిన టీఎస్ఐపాస్ విధానం కారణం. రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడులు పెట్టడానికి వస్తున్నవారిపట్ల చూపిస్తున్న స్పందన చాలా బాగుంది.

– రాజేశ్ అగర్వాల్, ఎండీ, మైక్రోమ్యాక్స్

ప్రభుత్వ స్పందన బాగుంది..



మా కంపెనీకి ముంబయి తరువాత దేశంలో మరో ప్రాంతంలో కార్యాలయం ఏర్పాటుచేయాలని నిర్ణయించాం. దీనికోసం దేశంలోని పలు పట్టణాలను అన్వేషించాం. వీటిల్లో నాలుగింటిని ఖరారు చేశాం. వాటిల్లో తుదిగా హైదరాబాద్ వైపు మొగ్గు చూపాం. ఇక్కడ ప్రభుత్వ స్పందన, విధానాలు, ఇక్కడి మౌలిక వసతులు, మానవ వనరులు మమ్మల్ని ఎంతగానో ఆకర్షించాయి.

– రంజిత్ సహాని, ఎండీ, నోవార్టిస్

బిగ్ బజార్ భారీ షాపింగ్ ఫెస్టివల్



హైదరాబాద్: దేశీయ రిటైల్ మార్కెట్ దిగ్గజం బిగ్ బజార్.. భారీ షాపింగ్ ఫెస్టివల్‌ను ప్రారంభిస్తున్నది. 'సబ్సే సస్తే 5 దిన్' పేరిట ఈ నెల 24 నుంచి 28 వరకు ఐదు రోజులపాటు సాగే ఈ కార్యక్రమంలో భాగంగా కొనుగోలుదారులకు పెద్ద ఎత్తున డిస్కౌంట్లను ప్రకటించింది. రూ.5,000 షాపింగ్‌పై రూ.1,000 క్యాష్‌బ్యాక్, రూ.2,500 షాపింగ్‌పై రూ.500 క్యాష్‌బ్యాక్ ఆఫర్లను ఇస్తున్నది. ఈ క్యాష్‌బ్యాక్‌లను తమ ఫ్యూచర్ పే ఈ-వాలెట్‌లో అందుకుంటారని ఆదివారం ఓ ప్రకటనలో బిగ్ బజార్ తెలియజేసింది. గృహోపకరణాలు, ఎలక్ట్రానిక్స్, ఫ్యాషన్ దుస్తులు, పాదరక్షలు, ఆట బొమ్మలు, వంట సామాగ్రి, గృహాలంకరణ వస్తువులు, లగేజ్‌వేర్, ఆహార పదార్థాలు ఇలా ఎన్నో రకాల ఉత్పత్తులపై ఆకర్షణీయమైన రాయితీలను అందిస్తున్నట్లు బిగ్ బజార్ సీఈవో సదాశివ్ నాయక్ వివరించారు.

'మహిళల భాగస్వామ్యంతో జీడీపీ పరుగులు'

న్యూఢిల్లీ: భారత కార్మిక శక్తిలో పురుషులకు ఏమాత్రం తీసిపోని విధంగా మహిళల భాగస్వామ్యం పెరుగుతుండటం స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) 27 శాతం మేరకు బలపడేందుకు దోహదం చేస్తుందని ఐఎంఎఫ్ (అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ) చీఫ్ క్రిస్టీన్ లాగార్డ్, నార్వే ప్రధాన మంత్రి ఎర్నా సోల్బెర్గ్ పేర్కొన్నారు. స్విట్జర్లాండ్‌లోని దావోస్ పట్టణంలో సోమవారం ప్రారంభం అవుతున్న ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) వార్షిక శిఖరాగ్ర సదస్సుకు ముందు సంయుక్తంగా ప్రచురించిన పత్రంలో వారు ఈ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ పత్రాన్ని డబ్ల్యూఈఎఫ్ ప్రచురించింది. ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సహా 70 దేశాల ప్రభుత్వాధినేతలు ఈ సదస్సులో పాల్గొననున్నారు.

చైనాను దాటేస్తుంది

ఈ ఏడాది వృద్ధిదాయక ఆర్థిక వ్యవస్థ భారతే: సాంక్టమ్ నివేదిక



న్యూఢిల్లీ, జనవరి 21: ఈ ఏడాది అత్యంత వృద్ధిదాయక ఆర్థిక వ్యవస్థగా చైనాను భారత్ అధిగమించనున్నదని, బలమైన దీర్ఘకాలిక వృద్ధి అవకాశాలను కలిగి ఉన్న భారత్.. ప్రస్తుతం సంస్కరణాత్మక ఆర్థిక వ్యవస్థగా కనిపిస్తున్నదని సాంక్టమ్ వెల్త్ మేనేజ్‌మెంట్ నివేదిక తెలిపింది. ఈ క్రమంలోనే ప్రపంచ ఆర్థిక వ్యవస్థల్లో అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా ఈసారి చైనాను భారత్ వెనకకు నెడుతుందన్న విశ్వాసాన్ని సదరు నివేదిక వ్యక్తం చేసింది. 2-3 శాతం జీడీపీ లక్ష్యంతో మిగతా దేశాలు ముందుకెళ్తున్న వేళ.. భారత్ మాత్రం 7.5 శాతం వృద్ధిరేటును దాటాలన్న టార్గెట్ పెట్టుకోవడాన్ని స్వాగతించింది.

ఆసియాలో భారత్, ఇండోనేషియాకే ఎక్కువ లబ్ధి

ఆర్థిక సంస్కరణల ప్రయోజనాలను ఆసరాగా చేసుకుని ఆసియాలో ఈ ఏడాది భారత్, ఇండోనేషియా మాత్రమే అభివృద్ధి పథంలో వేగవంతంగా ముందుకు సాగుతాయని బీఎంఐ రిసెర్చ్ (ఫిచ్ గ్రూపు సంస్థ) తన నివేదికలో స్పష్టం చేసింది. భారత్, ఇండోనేషియా మినహా ఆసియాలోని ఇతర దేశాలన్నింటిలో ఈ ఏడాది స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధిరేటు స్వల్పంగా మందగిస్తుందని ఆ నివేదిక పేర్కొన్నది. '2017లో ఆసియా-పసిఫిక్ ప్రాంతంలోని 14 దేశాలకుగాను 10 దేశాల జీడీపీ వాస్తవ వృద్ధి గణాంకాలు మెరుగ్గా ఉన్నాయి. వీటిలో భారత్, ఇండోనేషియా మాత్రమే 2018లో అదే ధోరణితో ముందుకు సాగే అవకాశం ఉందని మేము భావిస్తున్నాం' అని బీఎంఐ రిసెర్చ్ స్పష్టం చేసింది. వస్తు, సేవల పన్ను (జీఎస్టీ)ను అమలులోకి తీసుకురావడం, అభివృద్ధికి ఊతమిచ్చే సంస్కరణలను చేపట్టడం భారత్‌కు ఎంతగానో లాభిస్తుందని, అలాగే దేశంలోని ప్రభుత్వ రంగ బ్యాంకులకు మూలధనాన్ని సమకూర్చాలన్న ప్రణాళికతో రానున్న రోజుల్లో పెట్టుబడులు, ఆర్థిక కార్యకలాపాలు మరింత ఊపందుకోవడం ఖాయమని బీఎంఐ రిసెర్చ్ అభిప్రాయపడింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2017-18)లో 6.4 శాతంగా నమోదవుతుందని భావిస్తున్న భారత వాస్తవిక జీడీపీ వృద్ధిరేటు వచ్చే ఆర్థిక సంవత్సరంలో 6.7 శాతానికి చేరుకుంటుందని బీఎంఐ రిసెర్చ్ అంచనా వేసింది. 2014లోనే అధికార పగ్గాలు చేపట్టిన భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ఇండోనేషియా అధ్యక్షుడు జొకోవీ విడోడో ఇద్దరూ ఉద్ధండులేనని, సంస్కరణల పట్ల వీరిద్దరూ ముందుచూపు ఉన్నవారేనని, అందుకే పెట్టుబడిదారులకు అనుకూలమైన విధానాలకు మున్ముందు కూడా వారు తమ తమ అజెండాలో పెద్దపీట వేయడం ఖాయంగా కనిపిస్తున్నదని, అయితే అంతర్జాతీయ మార్కెట్లలో పెరుగుతున్న చమురు ధరలు భారత్, ఇండోనేషియాకు తీవ్రమైన సవాళ్లను విసిరే అవకాశం ఉందని బీఎంఐ రిసెర్చ్ అభిప్రాయపడింది.

వచ్చే ఆర్థిక సంవత్సరంలో 45 మిలియన్ టన్నుల ఉత్పత్తి లక్ష్యం

ఎన్ఎండీసీ సీఎండీ బైజేంద్ర కుమార్ వెల్లడి

హైదరాబాద్, జనవరి 21: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 35 మిలియన్ టన్నుల ఇనుప ఖనిజాన్ని ఉత్పత్తి చేయగలమని అంచనా వేస్తున్న ప్రభుత్వ రంగ సంస్థ ఎన్ఎండీసీ (నేషనల్ మైనింగ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) వచ్చే ఆర్థిక సంవత్సరం (2018-19)లో 45 మిలియన్ టన్నుల ఖనిజాన్ని ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నది. గత ఆర్థిక సంవత్సరంలో తాము 34.5 మిలియన్ టన్నుల ఇనుప ఖనిజాన్ని ఉత్పత్తి చేశామని, ఈ ఏడాది తొలి రెండు త్రైమాసికాల్లో పరిస్థితులు బాగానే ఉన్నప్పటికీ వర్షాల వలన రైల్వే లైన్లు దెబ్బతినడంతో మూడో త్రైమాసికంలో కొన్ని ఇబ్బందులు ఎదురయ్యాయని, ఈ ఇబ్బందుల నుంచి బయటపడేందుకు ఒకటిన్నర నెలల సమయం పట్టిందని, ప్రస్తుతం పరిస్థితులు, ఉత్పత్తి కార్యకలాపాలు మెరుగుపడ్డాయని ఎన్ఎండీసీ సీఎండీ ఎన్ బైజేంద్ర కుమార్ పీటీఐ వార్తా సంస్థకు వివరించారు. 'ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 37 మిలియన్ టన్నుల ఇనుప ఖనిజాన్ని ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నాం. అయితే మూడో త్రైమాసికంలో ఎదురైన ఇబ్బందుల వలన మేము లక్ష్య సాధనలో స్వల్పంగా వెనుకబడి 35 మిలియన్ టన్నుల ఖనిజాన్ని ఉత్పత్తి చేయగలమని భావిస్తున్నాం. వచ్చే ఆర్థిక సంవత్సరంలో కనీసం 43 మిలియన్ టన్నుల నుంచి 45 మిలియన్ టన్నుల ఖనిజాన్ని ఉత్పత్తి చేయడంతో పాటు 2022 నాటికి ఈ ఉత్పత్తిని 67 మిలియన్ టన్నులకు పెంచుకోవాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నాం' అని ఆయన చెప్పారు.

పన్ను శ్లాబుల్లో కోత?

ఆదాయం పన్ను రేట్లలోనూ మార్పులకు అవకాశం

బడ్జెట్‌పై ట్యాక్స్ కన్సల్టెంట్ ఈవై ముందస్తు సర్వే



న్యూఢిల్లీ, జనవరి 21:

రాబోయే బడ్జెట్‌లో ఆదాయం పన్ను శ్లాబులు, రేట్లు తగ్గే అవకాశాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. వచ్చే ఏడాది ఎన్నికలు జరుగనున్న క్రమంలో మోదీ సర్కారుకు ఈసారి బడ్జెటే పూర్తికాల బడ్జెట్ అన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే వచ్చే బడ్జెట్ జనాకర్షక బడ్జెట్ అవుతుందన్న అంచనాలు సర్వత్రా వినిపిస్తుండగా, వ్యక్తిగత పన్ను చెల్లింపుదారులకు భారీగానే ఉపశమనం లభించగలదంటున్నది ట్యాక్స్ కన్సల్టెంట్ ఈవై. ఇండివిడ్యువల్ ట్యాక్స్ పేయర్లపై పన్ను భారం తగ్గేలా ఐటీ శ్లాబులు, రేట్లను కేంద్రం తగ్గించే వీలుందని ఈవై నిర్వహించిన ముందస్తు బడ్జెట్ సర్వే ఒకటి చెబుతున్నది. వివిధ సంస్థలకు చెందిన 150 మంది సీఎఫ్‌వోలు, ఆర్థిక, పన్ను సంబంధిత నిపుణుల అభిప్రాయాలతో కూడిన ఈ అధ్యయనంలో అత్యధికంగా 69 శాతం మంది ఆదాయం పన్ను మినహాయింపు పరిమితి పెరుగుతుందన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ఉద్యోగులపై పన్ను భారం తగ్గేలా చర్యలుంటాయన్న ఆశాభావాన్ని దాదాపు 59శాతం మంది వెలిబుచ్చారు. ఇక కార్పొరేట్ పన్ను రేటు 25 శాతానికి తగ్గగలదన్న నమ్మకాన్ని 48 శాతం మంది కనబరిచారు. అయితే సర్‌చార్జీ కొనసాగవచ్చన్నారు. ఏప్రిల్ 1 నుంచి మొదలయ్యే 2018-19 ఆర్థిక సంవత్సరానికిగాను ఫిబ్రవరి 1న పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్న విషయం తెలిసిందే.



కనీస ప్రత్యామ్నాయ పన్ను తొలగించాలి

ప్రత్యేక ఆర్థిక మండళ్ల (సెజ్)పై కనీస ప్రత్యామ్నాయ పన్నును తొలగించాలని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖకు వాణిజ్య మంత్రిత్వ శాఖ లేఖ రాసింది. ఎగుమతులు, ఉద్యోగ కల్పన దృష్ట్యా సెజ్‌ల్లోని పరిశ్రమలకు పన్ను ప్రోత్సాహకాలను కొనసాగించాలని కోరింది. గత ఆర్థిక సంవత్సరం (2016-17) బడ్జెట్‌లో కొత్త సెజ్‌లకు ఆదాయ పన్ను ప్రయోజనాలను జైట్లీ కల్పించారు. అయితే ఈ సెజ్‌ల్లో 2020 మార్చి 31లోగా కార్యకలాపాలను ప్రారంభించిన వాటికే ఈ లబ్ధి చేకూరుతుందని స్పష్టం చేశారు. ఈ క్రమంలో ఈసారి బడ్జెట్‌లోనూ ఉదారంగా స్పందించాలని ఆర్థిక శాఖకు వాణిజ్య శాఖ విజ్ఞప్తి చేసింది.

వ్యవసాయానికి ఉద్దీపనలివ్వాలి

ఇబ్బందుల్లో ఉన్న వ్యవసాయ రంగానికి రాబోయే బడ్జెట్‌లో ఉద్దీపనలతో చేయూతనందించాల్సిన అవసరం ఉన్నదని రేటింగ్ ఏజెన్సీ మూడీస్ అనుబంధ విభాగం ఐసీఆర్ఏ అభిప్రాయపడింది. ముఖ్యంగా నిధుల కొరతను ఎదుర్కొంటున్న ఎరువుల తయారీ సంస్థలకు నూతనోత్తేజాన్ని కలిగించాలన్నది. నీటిపారుదల, పంటల బీమా, వ్యవసాయ రుణాలు ఇలాంటి వాటిని మరింతగా మెరుగుపరుచాలన్నది. ఎరువుల పరిశ్రమకు మౌలిక సదుపాయాలను కల్పించాలని, రాయితీలను అందించాలని సూచించింది. యూరియా ఉత్పత్తిదారులకు రాయితీ బకాయిలను త్వరగా తీర్చడం వల్ల వారి ఆర్థిక సమస్యలను తీర్చినవారవుతారని ఓ నివేదికలో క్రెడిట్ రేటింగ్ ఏజెన్సీ ఐసీఆర్ఏ పేర్కొన్నది.

విద్యా రంగానికి నిధులు పెరుగాలి

వచ్చే బడ్జెట్‌లో విద్యా రంగానికి నిధుల కేటాయింపులు పెరుగాలని పారిశ్రామిక సంఘం అసోచామ్.. కేంద్రానికి సిఫార్సు చేసింది. ఉన్నత విద్యా సంస్థలకు కూడా జీఎస్టీ నుంచి ఉపశమనం కలిగించాలన్నది. ప్రాథమిక విద్యా సంస్థలకు జీఎస్టీ నుంచి మినహాయింపునిచ్చిన కేంద్ర ప్రభుత్వం.. ఉన్నత విద్యా సంస్థలకు మాత్రం 18 శాతం పన్ను విధించింది. దీంతో ఈ వివక్ష తగదని అరుణ్ జైట్లీకి రాసిన ఓ లేఖలో అసోచామ్ ప్రధాన కార్యదర్శి డీఎస్ రావత్ అభిప్రాయపడ్డారు. గతేడాది జూలై 1 నుంచి దేశవ్యాప్తంగా జీఎస్టీ అమలవుతున్న నేపథ్యంలో వస్తున్న మొట్టమొదటి కేంద్ర బడ్జెట్ ఇదే కావడంతో జీఎస్టీ ప్రభావిత రంగాలకు ఊరటనివ్వాలని రావత్ తన లేఖలో జైట్లీని కోరారు. చదువులు ఏ దశలోనూ ఎవరికీ భారం కాకూడదన్న ఆయన విద్య మోయలేని బరువైతే దేశానికి ఏమాత్రం శ్రేయస్కరం కాదన్నారు. ఈ క్రమంలోనే విద్యా రంగానికి ప్రభుత్వం నుంచి మరింత చేయూత అవసరమని, బడ్జెట్‌లో పెద్దపీట వేయాలన్నారు.

ద్రవ్యలోటుకు కళ్లెం వేయాల్సిందే



వచ్చే బడ్జెట్‌లో ద్రవ్యలోటుకు అరుణ్ జైట్లీ కళ్లెం వేయాల్సిన అవసరం ఉందని అమెరికాకు చెందిన ప్రముఖ ఆర్థికవేత్త టీఎన్ శ్రీనివాసన్ అభిప్రాయపడ్డారు. ద్రవ్యలోటు లక్ష్యాలను సాధించే ప్రయత్నాలు చేయాలన్నారు. ప్రాజెక్టులు సకాలంలో పూర్తయ్యే చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ ఆర్థిక సంవత్సరం (2017-18) ద్రవ్యలోటును జీడీపీలో 3.2 శాతానికి కట్టడి చేయాలని మోదీ సర్కారు లక్ష్యంగా పెట్టుకున్న సంగతి తెలిసిందే. ప్రభుత్వ ఆదాయ, వ్యయాల్లో వ్యత్యాసాన్నే ద్రవ్యలోటుగా పరిగణిస్తారు. కాగా, వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) అమలు, పాత పెద్ద నోట్ల రద్దు వంటి నిర్ణయాలకు ఉద్యోగాల నష్టానికి ఆర్థిక పరమైన సైద్ధాంతిక సంబంధాలేమీ లేవని శ్రీనివాసన్ వ్యాఖ్యానించారు.

వాటాల విక్రయానికి 36 సంస్థలు



వచ్చే బడ్జెట్‌లో ప్రభుత్వ రంగ సంస్థల్లో ప్రభుత్వ వాటాల ఉపసంహరణ లక్ష్యాన్ని భారీగా పెంచే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇందుకోసం ఇప్పటికే 36 సంస్థలను సిద్ధం చేసింది కేంద్రం. ఈ ఆర్థిక సంవత్సరం (2017-18)లో ఇప్పటివరకు పీఎస్‌యూల్లో వాటాల విక్రయం ద్వారా రూ.54,337 కోట్లు, వ్యూహాత్మక వాటాల అమ్మకంతో మరో రూ.15 వేల కోట్ల నిధులు ఖజానాకు సమకూరాయి. దీంతో నిర్దేశిత లక్ష్యం రూ.72,500 కోట్లకు దరిదాపుల్లోకి చేరుకున్నట్లైంది. ఈ క్రమంలో వచ్చే ఆర్థిక సంవత్సరం (2018-19)లో ఈ లక్ష్యాన్ని మరింత పెంచే అవకాశాలున్నాయని కేంద్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. దూసుకుపోతున్న ద్రవ్యలోటును కట్టడి చేయాలంటే వాటాల విక్రయం ఒక్కటే మార్గమని ఇటీవల జరిగిన ఆర్థికవేత్తల సమావేశంలో ప్రధానికి కూడా సదరు వర్గాలు సూచించాయి. కొత్తగా వాటాలు విక్రయించనున్న సంస్థల్లో పవన్ హన్స్, హెచ్ఎల్ఎల్ లైఫ్ కేర్, సెంట్రల్ ఎలక్ట్రానిక్స్, స్కూటర్ ఇండియా, డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఉన్నాయి.

అమెరికా తరహా వేదిక కావాలి

■ **నిరర్థక ఆస్తుల అమ్మకానికి ఆన్‌లైన్ వ్యవస్థ ఉండాలన్న ఆర్బీఐ**



ముంబై, జనవరి 21: నష్టాల్లో ఉన్న ఆస్తులను అమ్మేందుకు అమెరికా, దక్షిణ కొరియా మాదిరిగా మన దేశంలో కూడా ఆన్‌లైన్ ట్రేడింగ్ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని, తద్వారా వాటిని మెరుగైన ధరకు విక్రయించేందుకు, పారదర్శకతను పెంపొందించేందుకు వీలవుతుందని రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ) సూచించింది. దేశీయ బ్యాంకింగ్ రంగాన్ని పట్టిపీడిస్తున్న నిరర్థక ఆస్తులకు మార్కెట్‌లో మంచి ధరను రాబట్టుకునేందుకు ఆన్‌లైన్ ట్రేడింగ్ వ్యవస్థ దోహదం చేస్తుందని ఆర్బీఐ డిప్యూటీ గవర్నర్ విరల్ ఆచార్య అభిప్రాయపడ్డారు. దీనిని దృష్టిలో ఉంచుకుని మన దేశంలో కూడా ఇటువంటి వ్యవస్థను అభివృద్ధి చేసేందుకు సంబంధిత భాగస్వాములంతా ముందుకు రావాలని ఆయన సూచించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రెండో త్రైమాసికం ముగిసే నాటికి బ్యాంకింగ్ రంగంలోని మొత్తం మొండి బకాయిలు 10.2 శాతానికి పైగా పెరిగి రూ.10 లక్షల కోట్లు దాటడంతో ఆయన ఈ సూచన చేశారు. నిరర్థక ఆస్తులు గణనీయంగా పెరుగుతున్న క్రమంలో గత జూన్ నుంచి ఆర్బీఐ దాదాపు 40 అతిపెద్ద మొండి బకాయిదారులను గుర్తించి వారి వ్యవహారాన్ని డెట్ రికవరీ ట్రిబ్యునళ్లకు నివేదించాల్సిందిగా బ్యాంకులకు స్పష్టం చేసిన విషయం విదితమే. ఈ 40 బకాయిదారుల్లో ఎస్సార్ స్టీల్, భూషణ్ స్టీల్, భూషణ్ పవర్, ఆమ్టెక్ ఆటో, వీడియోకాన్ ఇండస్ట్రీస్, జేపీ ఇన్‌ఫ్రా తదితర సంస్థలు ఉన్నాయి. బ్యాంకుల్లో పేరుకుపోయిన మొత్తం రూ.10 లక్షల కోట్ల మొండి బకాయిల్లో ఈ 40 బకాయిదారుల మొత్తం వాటా దాదాపు 40 శాతానికి పైమాటే. ఈ ఏడాది మార్చి నాటికి ఈ బకాయిలు 10.8 శాతానికి, సెప్టెంబర్ చివరి నాటికి 11.1 శాతానికి పెరుగుతాయని ఇటీవల విడుదల చేసిన ఆర్థిక స్థిరత్వ నివేదికలో ఆర్బీఐ హెచ్చరించింది.

ఆన్‌లైన్‌లో 'యుద్ధం'

కత్తులు దూస్తున్న దిగ్గజాలు ■ ఏరులై పారుతున్న ఆఫర్లు

న్యూఢిల్లీ, జనవరి 21:



దేశంలోని ప్రముఖ ఈ-కామర్స్ సంస్థలైన అమెజాన్ ఇండియా, ఫ్లిప్‌కార్ట్ మధ్య మళ్లీ 'యుద్ధం' మొదలైంది. ఈ ఏడాది మొదటి మెగా సేల్స్‌ను ఆదివారం నుంచి ప్రారంభించిన ఈ రెండు సంస్థలు అనేక రకాల వస్తువులపై భారీ డిస్కౌంట్లతో వినియోగదారులను ఆకట్టుకునేందుకు కత్తులు దూసుకుంటున్నాయి. అమెజాన్ ప్రారంభించిన 'గ్రేట్ ఇండియన్ సేల్' ఈ నెల 24వ తేదీ వరకూ కొనసాగనుండగా, ఫ్లిప్‌కార్ట్ చేపట్టిన 'రిపబ్లిక్ డే సేల్' 23వ తేదీతోనే ముగియనున్నది. ప్రస్తుతం దేశంలోని చాలా మంది ప్రజలకు ఆన్‌లైన్‌లో షాపింగ్ చేయడం అలవాటుగా మారుతుండటంతో ఈ రెండు దిగ్గజ సంస్థలు ఈసారి గత ఎడిషన్ల కంటే భారీ స్థాయిలో ఆఫర్లు ప్రకటించి కొనుగోలుదారులను తమవైపు తిప్పుకునేందుకు నువ్వా-నేనా అన్నట్లు పోటీపడుతున్నాయి. ఈ పోటీలో అందరినీ ప్రధానంగా ఆకర్షిస్తున్నవి ఏమిటంటే..

మొబైల్ ఫోన్లు

మొబైల్ ఫోన్లపై ఈ రెండు సంస్థలు ప్రకటించిన భారీ డిస్కౌంట్లు కొనుగోలుదారులను విపరీతంగా ఊరిస్తున్నాయి. మార్కెట్లో 19,990 రూపాయల ధర పలుకుతున్న ఒప్పో ఎఫ్-3 స్మార్ట్‌ఫోన్ ధరను 'రిపబ్లిక్ డే సేల్'లో రూ.12 వేలకు తగ్గించిన ఫ్లిప్‌కార్ట్.. ఐఫోన్ 7ను రూ.40 వేల కంటే కొంచెం ఎక్కువ ధరకు అమ్ముతున్నది. అలాగే సాంసంగ్ గెలాక్సీ జె-3ప్రో స్మార్ట్‌ఫోన్ను ధరను రూ.1,500 తగ్గించింది. కాగా, ప్రైమ్ మెంబర్స్ కోసం ప్రత్యేకంగా శనివారం సాయంత్రమే 'గ్రేట్ ఇండియన్ సేల్'ను ప్రారంభించిన అమెజాన్ వివిధ బ్రాండ్ల ఫోన్ల ధరలను 35 శాతం మేరకు తగ్గించింది. సాంసంగ్ గెలాక్సీ ఆన్7 ప్రైమ్ స్మార్ట్‌ఫోన్‌ను దాదాపు రూ.13 వేలకు అమ్ముతున్న అమెజాన్.. ఎల్‌జీ జీ6, ఆసస్ జెన్‌ఫోన్ 3 లేజర్ స్మార్ట్‌ఫోన్ల ధరలను దాదాపు సగానికి సగం తగ్గించింది.

ఫ్యాషన్ అండ్ లైఫ్‌స్టైల్

దేశంలో ఫ్యాషన్ ఉత్పత్తులకు ఆదరణ రోజురోజుకూ పెరుగుతున్నప్పటికీ ఫ్లిప్‌కార్ట్ ఈ ఏడాది తొలి మెగా సేల్‌లో దుస్తులు, పాదరక్షలు, యాక్సెసరీస్‌పై మాత్రమే ఆఫర్లు ప్రకటించింది. వీటిలో మహిళల పాదరక్షలు, వెస్టర్న్ వేర్ (పాశ్చాత్య దుస్తులు), సన్‌గ్లాసెస్ లాంటి కొన్ని రకాల వస్తువులను 80 శాతం తక్కువ ధరలకు అందుబాటులోకి తీసుకొచ్చింది. అలాగే యారో, యూసీబీ తదితర బ్రాండ్లకు చెందిన పురుషుల దుస్తులను కనీసం 60 శాతం తక్కువ ధరలకు అమ్ముతున్న ఆ సంస్థ.. చిన్న పిల్లల దుస్తులతో పాటు సాంప్రదాయ దుస్తుల (ఎత్నిక్ వేర్)పై కూడా ఎంతో ఆకర్షణీయమైన ఆఫర్లను ప్రకటించింది. అయితే ఈ సెగ్మెంట్లలో తమ వ్యాపారాన్ని తగ్గించుకుంటున్నామన్న వాదనను ఫ్లిప్‌కార్ట్ తోసిపుచ్చుతోంది. మరోవైపు అమెజాన్ మహిళలతో పాటు పురుషుల దుస్తుల ధరలను 80 శాతం మేరకు, పాదరక్షలు, బ్యాగ్‌లు, వాలెట్లు, లగేజీ వస్తువుల ధరలను 70 శాతం మేరకు, ఆభరణాల ధరలను 90 శాతం మేరకు తగ్గించింది.

పెద్ద గృహోపకరణాలు



రిపబ్లిక్ డే సేల్‌లో టెలివిజన్ల లాంటి పెద్ద గృహోపకరణాలపై భారీ రాయితీలను ప్రకటించిన ఫ్లిప్‌కార్ట్ సంస్థ.. వీయూ బ్రాండ్‌కు చెందిన కొన్ని ఉత్పత్తులను ఏకంగా రూ.50 వేల వరకూ తగ్గించి అమ్ముతున్నది. సాంసంగ్, ఎల్‌జీ టీవీలపై ఆకర్షణీయమైన ఎక్స్ఛేంజ్ ఆఫర్లను ప్రకటించిన ఆ సంస్థ.. రూ.9 వేలలోపు ధరకు లభ్యమయ్యే ఫుల్లీ ఆటోమ్యాటిక్ వాషింగ్ మెషీన్లను, రూ.10 వేల లోపు ధరకు లభ్యమయ్యే రిఫ్రిజిరేటర్లను 'నో కాస్ట్ ఈఎంఐ'తో అందజేస్తున్నది. దీనికి పోటీగా వాషింగ్ మెషీన్ల ధరలను 35 శాతం మేరకు తగ్గించిన అమెజాన్.. రూ.13 వేలలోపు ధరకు 32 అంగుళాల బీపీఎల్ టీవీని, రూ.11 వేల ప్రారంభ ధరతో ఫ్రిజ్‌లను అందుబాటులోకి తెచ్చింది.

హోమ్ అండ్ డైనింగ్



మరోవైపు గృహాలంకరణ (హోమ్ ఫర్నిషింగ్ అండ్ ఇంప్రూవ్‌మెంట్) వస్తువులపై ఈ రెండు ఆన్‌లైన్ దిగ్గజాలు ఆకర్షణీయమైన రాయితీలను ప్రకటించాయి. ఫ్లిప్‌కార్ట్ దాదాపు 80 శాతం తక్కువ ధరకు సోఫాలను, 70 శాతం తక్కువ ధరకు బెడ్‌రూమ్ ఫర్నీచర్‌ను అందుబాటులోకి తీసుకురాగా, కిచెన్ అప్లయన్సెస్ (వంటగది వస్తువుల)ను దాదాపు 30 శాతం తక్కువ ధరకు అందుబాటులోకి తీసుకొచ్చిన అమెజాన్.. ప్రెస్టీజ్ ఇండక్షన్ కుక్‌టాప్‌ను సుమారు రూ.2,500కు, ప్రెస్టీజ్ రైస్ కుక్కర్, మిక్సర్ గ్రైండర్లను రూ.2 వేల లోపు ధరకు అమ్ముతున్నది.

ఒడిదుడుకులకు ఆస్కారం

న్యూఢిల్లీ, జనవరి 21:

మదుపరులపై అమెరికా సంక్షోభం, రాబోయే బడ్జెట్ల ప్రభావం

పెట్టుబడులను నిర్ణయించనున్న కార్పొరేట్ ఫలితాలు



దేశీయ స్టాక్ మార్కెట్లను ఈ వారం అనేకానేక అంశాలు ప్రభావితం చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. త్రైమాసిక ఆర్థిక ఫలితాలతోపాటు అమెరికా సంక్షోభం, రాబోయే బడ్జెట్, డెరివేటివ్ కాంట్రాక్టుల గడువు వంటివి ప్రధానంగా మదుపరుల పెట్టుబడులపై ప్రభావం చూపనుండగా, ఒడిదుడుకులకు ఆస్కారముందన్న అంచనాలు నిపుణుల నుంచి వ్యక్తమవుతున్నాయి. ఈ నెల ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ (ఎఫ్అండ్‌వో) గడువు గురువారంతో ముగియనుండగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2017-18) మూడో త్రైమాసికానికి (అక్టోబర్-డిసెంబర్)గాను యాక్సిస్ బ్యాంక్, మారుతి సుజుకీ, కెనరా బ్యాంక్, ఐడియా సెల్యులార్, కోల్ ఇండియా, డాక్టర్ రెడ్డీస్ లాబొరేటరీస్ తదితర సంస్థలు తమ ఆర్థిక ఫలితాలను ఈ వారమే ప్రకటించనున్నాయి. దీంతో వీటి ఆధారంగా మదుపరులు తమ పెట్టుబడులపై ఓ నిర్ణయానికి వచ్చే వీలుందని నిపుణులు ట్రేడింగ్ సరళిని విశ్లేషిస్తున్నారు. ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ సంస్థ హెచ్‌పీసీఎల్‌లో ప్రభుత్వానికి ఉన్న మొత్తం 51.11 శాతం వాటాను ప్రభుత్వ రంగ సహజవాయువు, చమురు అన్వేషణ, ఉత్పాదక దిగ్గజం ఓఎన్‌జీసీ కొనుగోలు చేస్తుండటం కూడా స్టాక్ మార్కెట్లను ప్రభావితం చేసేదేనని, సోమవారం దీనిపై మార్కెట్లు స్పందిస్తాయన్న అభిప్రాయాన్ని పలువురు విశ్లేషకులు వెలిబుచ్చుతున్నారు. ఈ నెలాఖరుకల్లా ముగిసిపోయే ఈ లావాదేవీలో సుమారు రూ.37,000 కోట్లతో హెచ్‌పీసీఎల్ వాటాను ఓఎన్‌జీసీ సొంతం చేసుకుంటున్నది. ఇక రాబోయే కేంద్ర బడ్జెట్‌కు కౌంట్‌డౌన్ మొదలు కావడంపైనా మదుపరులు సహజంగానే దృష్టి సారిస్తారని మార్కెట్ వర్గాలు అంటున్నాయి. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ఈ నెల 29న ప్రారంభం కానుండగా, ఇదేరోజు ఆర్థిక సర్వే వెలువడనున్నది. ఫిబ్రవరి 1న వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2018-19)గాను బడ్జెట్‌ను కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ ప్రవేశపెట్టనున్నారు. మరోవైపు అమెరికా సంక్షోభం కూడా భారత్‌సహా ప్రపంచ స్టాక్ మార్కెట్లను ఒడిదుడుకులకు గురిచేయవచ్చన్న సంకేతాలు వస్తున్నాయి. ప్రభుత్వ అవసరాలకు సంబంధించిన స్వల్పకాలిక నిధుల బిల్లు ను ట్రంప్ సర్కారు అక్కడి చట్ట సభల్లో ఆమోదింపజేసుకోలేకపోవడం.. అత్యవసర సేవలు మినహా, వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగుల వేతన రహిత సెలవులకు కారణమైంది. ఇక ఎప్పట్లాగే డాలర్‌తో పోల్చి తే రూపాయి మారకం విలువ, అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు, విదేశీ మదుపరుల పెట్టుబడులు, గ్లోబల్ స్టాక్ మార్కెట్ల తీరుతెన్నులు దేశీయ స్టాక్ మార్కెట్లను ప్రభావితం చేయనున్నాయి. గత వారం సెన్సెక్స్ 919.19 పాయింట్లు, నిఫ్టీ 213.45 పాయింట్లు లాభపడిన విషయం తెలిసిందే.

రూ.లక్ష కోట్లు పెరిగింది

మార్కెట్ విలువ ఆధారంగా టాప్-10 సంస్థల్లో ఆరింటి విలువ గత వారం ట్రేడింగ్‌లో రూ.లక్ష కోట్లకుపైగా ఎగిసింది. టీసీఎస్, హెచ్‌డీఎఫ్‌సీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఇన్ఫోసిస్, ఐటీసీ, ఎస్‌బీఐల్లోని మదుపరుల సంపద రూ.1,07,370.4 కోట్లు ఎగబాకింది. అత్యధికంగా టీసీఎస్ మార్కెట్ విలువ రూ.34,811.32 కోట్లు పుంజుకుంది. మరోవైపు రిలయన్స్ ఇండస్ట్రీస్, ఓఎన్‌జీసీ, మారుతి సుజుకీ, హిందుస్థాన్ యునీలివర్ సంస్థల మార్కెట్ విలువ దాదాపు రూ.26,000 కోట్లు హరించుకుపోయింది. రిలయన్స్ మార్కెట్ విలువ రూ.11,000 కోట్లు పడిపోయింది. అయినప్పటికీ టాప్-10 సంస్థల్లో రూ.5,88,642.81 కోట్లతో రిలయన్స్ ప్రథమ స్థానంలో కొనసాగుతుండగా, రూ. 5,65,624.13 కోట్లతో టీసీఎస్ రెండో స్థానంలో ఉన్నది.

5వ స్థానానికి చేరుతాయ్

ప్రపంచంలోనే ఐదో అతిపెద్ద స్టాక్ మార్కెట్లుగా ఈ ఏడాది భారతీయ స్టాక్ మార్కెట్లు నిలుస్తాయని సాంక్టమ్ వెల్త్ మేనేజ్‌మెంట్ నివేదిక అంచనా వేసింది. ప్రస్తుతం రికార్డు స్థాయి లాభాల్లో దేశీయ స్టాక్ మార్కెట్లు పరుగులు పెడుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే మున్ముందు మరింత దూకుడును ప్రదర్శిస్తాయన్న సదరు నివేదిక.. మీడియం టర్మ్‌లో నిఫ్టీ 11,200-11,500 స్థాయికి చేరవచ్చన్నది. ఇక స్టాక్ మార్కెట్లలోకి విదేశీ మదుపరుల ద్వారా వచ్చే దేశీయ మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడుల విలువ ఈ సంవత్సరం 15.3 బిలియన్ డాలర్లను తాకుతాయని అంచనా వేసింది.

రికార్డు స్థాయి ఐపీవోలు

ఈ ఆర్థిక సంవత్సరం (2017-18)లో ఇప్పటిదాకా వచ్చిన ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్ల (ఐపీవో) విలువ రికార్డు స్థాయిలో నమోదైంది. గడిచిన 9 నెలల్లో దేశీయ స్టాక్ మార్కెట్లలోకి కొత్తగా 122 సంస్థలు రాగా, రూ.71,500 కోట్ల నిధులను సమీకరించాయి. 2007-08లో ఐపీవోలు, ఫాలో ఆన్ పబ్లిక్ ఆఫర్ల (ఎఫ్‌పీవో) ద్వారా రూ.52,300 కోట్లు సేకరించగా, మళ్లీ ఆ తర్వాత ఇప్పుడే దాన్ని మించి ఐపీవోలు వచ్చాయి. ఈసారి బీమా కంపెనీల ఐపీవోల వాటానే సుమారు 60 శాతం ఉండగా, సెప్టెంబర్-నవంబర్లోనే రూ.52,000 కోట్ల ఐపీవోలుండటం గమనార్హం.

రూ.8,700 కోట్లు తెచ్చారు

ఈ నెలలో ఇప్పటిదాకా దేశీయ మార్కెట్లలోకి విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపరులు (ఎఫ్‌పీఐ) తెచ్చిన పెట్టుబడుల విలువ రూ.8,709 కోట్లుగా నమోదైంది. స్టాక్ మార్కెట్లలోకి రూ.5,769 కోట్లు రాగా, రుణ మార్కెట్లలోకి రూ.2,940 కోట్లు వచ్చాయి. కార్పొరేట్ సంస్థల ఆకర్షణీయ లాభాలే ఇందుకు కారణమని 5నాన్స్ సీఈవో దినేశ్ రోహిరా అన్నారు. గతేడాది అటు స్టాక్, ఇటు రుణ మార్కెట్లలోకి రూ.2 లక్షల కోట్ల పెట్టుబడులను ఎఫ్‌పీఐలు తీసుకొచ్చిన సంగతి తెలిసిందే.

ఎంఎఫ్‌లకు రిటైల్ మదుపరుల దన్ను

మ్యూచువల్ ఫండ్స్ (ఎంఎఫ్)పట్ల రిటైల్ మదుపరులు పెద్ద ఎత్తున ఆసక్తి కనబరుచడంతో గతేడాది మ్యూచువల్ ఫండ్ ఫోలియోల సంఖ్య 1.37 కోట్లు పెరిగింది. అంతకుముందు ఏడాదిలో 70 లక్షల మ్యూచువల్ ఫండ్ ఇన్వెస్టర్ అకౌంట్లు కొత్తగా చేరగా, 2017లో ఇవి దాదాపు రెట్టింపవడం గమనార్హం. 2016 డిసెంబర్ నాటికి 42 సంస్థల్లో 5 కోట్ల 28 లక్షల 20,155గా ఉన్న ఫోలియోలు.. 2017 డిసెంబర్ కల్లా 6 కోట్ల 64 లక్షల 86,373కు చేరాయని మార్కెట్ రెగ్యులేటర్ సెబీ తెలియజేసింది. ఈక్విటీ, బ్యాలెన్స్‌డ్ కేటగిరీల్లో కొత్త ఫోలియోలు అధికంగా పెరిగినట్లు చెప్పింది.

వైభవంగా భక్తరామదాసు జయంతి



భక్తరామదాసు ధ్యానమందిరంలో పూజలు చేస్తున్న మంత్రి తుమ్మల

నేలకొండపల్లి: భక్తరామదాసు నడయాడిన నేలకొండపల్లిని జాతీయ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలంలోని భక్తరామదాసు ధ్యాన మందిరంలో ఘనంగా జయంతి ఉత్సవాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాలను మంత్రి ప్రారంభించి, స్మృతి భవన్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ధ్యానమందిరంలో ప్రత్యేకంగా పూజలు చేసి మాట్లాడారు. భక్త రామదాసు జీవితం ఆదర్శప్రాయమని, భావి తరాలకు ఆ మహనీయుడి చరిత్ర తెలియాలనే ఉద్దేశంతోనే సీఎం కేసీఆర్ గతేడాది ధ్యానమందిరాన్ని పరిశీలించిన స్మృతి భవనం నిర్మాణంతో పాటు మందిర అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారని వివరించారు. అలాగే కొండపల్లిలో భక్తరామదాసు మందిరంతో పాటు చరిత్ర కల్గిన బౌద్ధస్తూపం ఉందని, దాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీచైర్‌పర్సన్ గడిపల్లి కవిత, సీఎం పీఆర్వో జ్వాల నర్సింహారావు, జిల్లా కలెక్టర్ లోకేశ్‌కుమార్, రాష్ట్ర బాషా సంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు. భద్రాద్రి రామాలయంలో కూడా భక్తరామదాసు జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. అనంతరం ఖమ్మం జిల్లా కొణిజర్లలో వైరా ఎమ్మెల్యే మదన్‌లాల్ అధ్యక్షతన జరిగిన నియోజకవర్గ టీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశంలో పాల్గొని మంత్రి మాట్లాడారు. కార్యక్రమంలో టీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తక్కెళ్లపల్లి రవీందర్, రాష్ట్ర కార్యదర్శి తాతామధు విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పిడమర్తి రవి తదితరులు పాల్గొన్నారు.

స్వల్పంగా పెరుగనున్న కనిష్ఠ ఉష్ణోగ్రతలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ : రాష్ట్రవ్యాప్తంగా సోమవారం నుంచి మూడు రోజులపాటు కనిష్ఠ ఉష్ణోగ్రతల్లో స్వల్ప పెరుగుదల నమోదయ్యే అవకాశం ఉన్నట్టు టీఎస్‌డీపీఎస్(తెలంగాణ స్టేట్ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ)నివేదిక వెల్లడించింది. చలిగాలుల తీవ్రత తగ్గడంతో కనిష్ఠ ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉన్నట్టు పేర్కొంది. గరిష్ఠ ఉష్ణోగ్రతలు సైతం స్వల్పంగా పెరిగి చాలా ప్రాంతాల్లో 30 డిగ్రీల నుంచి 34 డిగ్రీల మధ్య రికార్డు అయ్యే అవకాశం ఉన్నట్టువారు వివరించారు. గడిచిన 24 గంటల్లో పలు జిల్లాల్లో నమోదైన ఉష్ణోగ్రతలు పరిశీలిస్తే..రాష్ట్రవ్యాప్తంగా అత్యల్పంగా కొమురంభీం ఆసిఫాబాద్‌లో 5 డిగ్రీలు, గరిష్ఠ ఉష్ణోగ్రతల్లో కరీంనగర్‌లో అత్యధికంగా 35.9 డిగ్రీలుగా నమోదైంది.

చలి వణుకు

జిల్లా	గరిష్ఠం	కనిష్ఠం
కుమ్రంభీం ఆసిఫాబాద్	34.6	5.0
కామారెడ్డి	33.0	6.8
మంచిర్యాల	34.6	7.8
వికారాబాద్	34.9	7.9
ఆదిలాబాద్	32.9	8.0
రాజన్న సిరిసిల్ల	34.6	8.3
నిర్మల్	35.0	8.6
మేడ్చల్	33.3	8.7
సంగారెడ్డి	32.5	8.7
సిద్దిపేట	34.0	8.7
మెదక్	32.9	8.9
రంగారెడ్డి	34.6	9.0
నిజామాబాద్	34.6	9.1
మహబూబ్‌నగర్	34.6	9.2
జగిత్యాల	34.6	9.4
కరీంనగర్	35.9	10.1
జయశంకర్ భూపాలపల్లి	35.0	10.1
నాగర్‌కర్నూల్	32.8	10.2
పెద్దపల్లి	35.1	10.5
వరంగల్ అర్బన్	34.6	11.2
మహబూబాబాద్	35.2	11.4
భద్రాద్రి కొత్తగూడెం	34.9	11.5
యాదాద్రి భువనగిరి	34.6	11.5
వరంగల్ రూరల్	34.6	11.8
నల్లగొండ	34.9	12.1
జనగామ	34.9	12.3
హైదరాబాద్	35.0	12.5
జోగుళాంబ గద్వాల	32.8	13.1
ఖమ్మం	34.9	14.1
వనపర్తి	32.9	14.5
సూర్యాపేట	34.6	14.8



ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లో మాట్లాడుతున్న డీజీపీ మహేందర్‌రెడ్డి

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

- డీజీపీ మహేందర్‌రెడ్డి

ఉట్నూర్, నమస్తే తెలంగాణ: కొత్త టెక్నాలజీని ఉపయోగించుకుంటూ నేరాలను అదుపు చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఒకే వ్యవస్థను అమలు చేసేందుకు కృషి చేస్తున్నట్లు రాష్ట్ర డీజీపీ మహేందర్ రెడ్డి అన్నారు. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లోని కుమ్రంభీం ప్రాంగణంలోని సమావేశ మందిరంలో ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, నిర్మల్ జిల్లా పోలీస్ అధికారులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. అంతకుముందు రామగుండం కమిషనరేట్ నుంచి ఐజీ నాగిరెడ్డి, డీఐజీ ప్రమోద్ కుమార్‌తో కలిసి హెలిక్యాప్టర్ ద్వారా ఉట్నూర్ చేరుకున్నారు. ఆయనకు స్వాగతం పలికేందుకు వచ్చిన కలెక్టర్ దివ్య, ఎస్పీతో జిల్లా పరిస్థితులపై వివరాలు అడిగితెలుసుకున్నారు. పేదలు, మహిళలు నిర్భయంగా పోలీసు స్టేషన్లకు వచ్చి ఫిర్యాదు చేసే పరిస్థితులు కల్పిస్తున్నట్టు వివరించారు. సాంకేతికత ఆధారంగా నేరస్తులను గుర్తించడం ద్వారా పాత వారు మళ్లీ తప్పులు చేసే అవకాశం లేకుండా చూస్తామన్నారు.



భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన బారికేడ్లు

వసంత పంచమికి బాసర ముస్తాబు

- నేడు వేడుకలు.. భారీగా తరలిరానున్న భక్తులు


బాసర: బాసర శ్రీ జ్ఞాన సరస్వతీ ఆలయం వసంత పంచమి ఉత్సవాలకు ముస్తాబైంది. అమ్మవారి జన్మదినమైన వసంత పంచమి రోజున సోమవారం భక్తులు తమ చిన్నారులకు అక్షరశ్రీకారాలు జరిపించడానికి భారీగా తరలిరానున్నారు. డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి ఆదివారం రాత్రే బాసరకు చేరుకొన్నారు. ఉదయం అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి తన మనుమరాలి అక్షర శ్రీకార పూజలో పాల్గొంటారు. సుమారు 60వేలకు మందికి పైగా భక్తులు వచ్చే అవకాశముందని అధికారుల అంచనా వేస్తున్నారు. ఇందు కోసం ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. సోమవారం బాసర ఆలయానికి మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, ఎంపీలు జితేందర్‌రెడ్డి, జీ నగేశ్, ముథోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, ప్రముఖ విద్యా వేత్త చుక్కా రామయ్య తదితరులు రానున్నారు.



కొల్లాపూర్‌లో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

లక్ష్యసాధనకు పట్టుదలతో సాగాలి

కొల్లాపూర్ టౌన్: యువత ఉన్నత లక్ష్య సాధనకు పట్టుదలతో ముందుకు సాగాలని పంచాయతీరాజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పిలుపునిచ్చారు. ఆదివారం నాగర్‌కర్నూల్ కొల్లాపూర్ పట్టణంలోని స్టేడియం గ్రౌండ్‌లో పోలీసు శాఖ పోటీ పరీక్షల ఉచిత శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రజలంతా సంఘటిత శక్తితో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామని అన్నారు. 1969లో తెలంగాణ తొలిదశ ఉద్యమాన్ని అప్పట్లో కొందరు మధ్యలోనే వదిలేశారని అన్నారు. కేసీఆర్ అకుంఠిత దీక్ష, పట్టుదలతోనే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సాధ్యమైందన్నారు. ప్రణాళిక రూపకల్పన చేసుకొని లక్ష్యసాధన దిశగా ముందుకుసాగాలని యువతకు పిలుపునిచ్చారు.



తాండూర్‌లో గులాబీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి మహేందర్‌రెడ్డి

అభివృద్ధిని చూసే టీఆర్‌ఎస్‌లోకి

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసే వివిధ పార్టీల నుంచి భారీగా టీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. ఆదివారం కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట మండలం శ్రీరాములపల్లి, వీణవంక మండలం ఎల్బాక గ్రామానికి చెందిన టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు 100 మంది ఈటల జనసేన ఆధ్వర్యంలో టీఆర్‌ఎస్‌లో చేరారు. వికారాబాద్ జిల్లా పాత తాండూరుకు చెందిన యువకులు పెద్దఎత్తున ర్యాలీగా వచ్చి మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు. కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలం గుండ్లపల్లిలో మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ సమక్షంలో సుమారు 200 మంది, మంచిర్యాల జిల్లా సీసీసీ నస్పూర్‌లో 300మంది కాంట్రాక్ట్ కార్మికులు ఎమ్మెల్యే దివాకర్‌రావు సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు. కొత్తగూడెం జిల్లా పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సమక్షం లో మణుగూరులో 35 కుటుంబాలు టీఆర్‌ఎస్‌లో చేరాయి. యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరులో 20 మంది రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ మందుల సామేలు సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు. నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలం రాచూర్ తండాకు చెందిన దాదాపు 150 మంది ఎమ్మెల్సీ కశిరెడ్డి నారాయణరెడ్డి సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు.

తెలంగాణ పోలీస్ నంబర్ వన్

- మరో పదేండ్లు టీఆర్‌ఎస్‌దే అధికారం
- హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి

గోదావరిఖని,నమస్తే తెలంగాణ: తెలంగాణ పోలీస్ వ్యవస్థ దేశంలోనే నంబర్ వన్ స్థానంలో ఉందని హోం శాఖ మంత్రి నాయిని నర్సింహారెడ్డి పేర్కొన్నారు. గోదావరిఖనిలో ఆదివారం రామగుండం పోలీస్ కమిషనరేట్ నూతన కార్యాలయ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కొత్తగా ఏర్పడిన తెలంగాణలో శాంతి భద్రతల సమస్య తలెత్తుతుందని, అనేక విధాలుగా ప్రచారం జరిగినా.. సీఎం కేసీఆర్ కృషితో వాటన్నింటినీ వెనక్కినెట్టి తెలంగాణ పోలీస్ బెస్ట్ అనే విధంగా పనిచేస్తున్నామని చెప్పారు. ఈ విషయాన్ని స్వయంగా కేంద్ర హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అంగీకరించారని, తెలంగాణ పోలీస్ నంబర్ వన్‌గా ఉందని ప్రశంసించారని పేర్కొన్నారు. రూ.25కోట్లతో నిర్మించే రామగుండం కమిషనరేట్‌కు మొదటి విడుతగా రూ.15కోట్లు మంజూరు చేశామని, ఈ పనులను ఏప్రిల్ 2019 నాటికి పూర్తి చేస్తామన్నారు. తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో ముందుకు దూసుకుపోతుంటే ప్రతిపక్షాలు పనిగట్టుకొని టీఆర్‌ఎస్‌పై దుమ్మెత్తి పోస్తున్నాయని అ దుమ్ము తమకు అంటుకునే పరిస్థితి లేదని, మరో పదేండ్లు టీఆర్‌ఎస్ అధికారంలో కొనసాగుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అనంతరం డీజీపీ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర పోలీస్ వ్యవస్థ బలంగా ఉందన్నారు.

విమర్శకులే ప్రశంసిస్తున్నారు: ఈటల

తెలంగాణ ఉద్యమ సమయంలో టీఆర్‌ఎస్‌ను, అధినేత కేసీఆర్‌ను విమర్శించిన వారే నేడు తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ప్రశంసిస్తున్నారని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్ పేర్కొన్నారు. తెలుగు రాష్ర్టాల గవర్నర్ కాళేశ్వరం ప్రాజెక్టు పరిశీలనకు వచ్చి ఇది మానవ అద్భుతమని ప్రశంసించారన్నారు. ఇది తమకు ఎంతగానో సంతోషాన్నిచ్చిందన్నారు. తెలంగాణ రాష్ర్టాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసే సత్తా కేవలం కేసీఆర్‌కు మాత్రమే ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ చైర్మన్ సోమారపు సత్యనారాయణ, రాష్ట్ర పోలీస్ హౌసింగ్ బోర్డు చైర్మన్ కోలేటి దామోదర్, రాష్ట్ర పోలీస్ హౌసింగ్ బోర్డు ఎండీ మల్లారెడ్డి, సీఈ గోపాలకృష్ణ, పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, మంథని ఎమ్మెల్యే పుట్ట మధు, రామగుండం మేయర్ కొంకటి లక్ష్మీనారాయణ, ఐజీ నాగిరెడ్డి, డీఐజీ ప్రమోద్‌కుమార్, రామగుండం పోలీస్ కమిషనర్ విక్రమ్‌జిత్ దుగ్గల్ తదితరులు పాల్గొన్నారు.



పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో ఆదివారం పోలీస్ కమిషనరేట్ భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి, మంత్రి ఈటల రాజేందర్, డీజీపీ మహేందర్‌రెడ్డి



హన్మకొండలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దయాకర్‌రావు

సీఎం కేసీఆర్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

- వెలమ సహకార సంఘం క్యాలెండర్ ఆవిష్కరణలో ఎమ్మెల్యే ఎర్రబెల్లి

హన్మకొండ, నమస్తేతెలంగాణ: ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ప్రతి వెలమ కులస్థుడు ఆదర్శంగా తీసుకోవాలని పాలకుర్తి ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. వెలమ సహకారం సంఘం ట్రైసిటీస్ వారి ఆధ్వర్యంలో రూపొందించిన 2018 క్యాలెండర్‌ను ఆయన ఆదివారం హన్మకొండ హంటర్‌రోడ్‌లోని కాకతీయ గార్డెన్స్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ సమాజంలో వెలమ కులస్థులు సంఖ్యలో తక్కువగా ఉన్నప్పటికీ సేవాగుణంలో మిన్నగా ఉంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు పిన్నింటి వెంకటేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శి రవీందర్‌రావు, సోమేశ్వర్‌రావు, డాక్టర్ దయాకర్‌రావు, ఎన్ రవి, శివరామయ్య, జగన్‌మోహన్‌రావు, రఘుపతిరావు, గంగాధర్‌రావు, రామేశ్వర్‌రావు, ప్రకాశ్‌రావు, వెంకటేశ్వర్‌రావు, బాలకిషన్‌రావు, లక్ష్మణ్‌రావు, సురేందర్‌రావు, పద్మశ్రీ, గోపాల్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాడుతాం

- మహబూబ్‌నగర్ ఎంపీ జితేందర్‌రెడ్డి

మహబూబ్‌నగర్, విద్యావిభాగం: సీఎం కేసీఆర్ సూచనల మేరకు రాష్ట్ర సమస్యలపై పార్లమెంటులో పోరాడుతామని మహబూబ్‌నగర్ ఎంపీ జితేందర్‌రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్‌లో ఆదివారం నిర్వహించిన పీఆర్టీయూ రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అభివృద్ధిలో రాష్ర్టాన్ని అగ్రగామిగా నిలిపేందుకు సీఎం కేసీఆర్ అహర్నిశలూ కృషి చేస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్సీలు కాటేపల్లి జనార్దన్‌రెడ్డి, పూల రవీందర్ మాట్లాడుతూ సీపీఎస్, సీసీఈ విధానాలను రద్దు చేసేందుకు కేంద్రంపై ఒత్తిడి తెస్తామన్నారు. ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నట్టు చెప్పారు. మాజీ ఎమ్మెల్సీ మోహన్‌రెడ్డి, పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు సరోత్తంరెడ్డి, చెన్నకేశవరెడ్డి పాల్గొన్నారు.



మహబూబ్‌నగర్‌లో మాట్లాడుతున్న ఎంపీ జితేందర్‌రెడ్డి



వనపర్తి జిల్లా రేవల్లి గ్రామంలో పర్యటిస్తున్న నిరంజన్‌రెడ్డి

పండుగలా వ్యవసాయం

- రేవల్లి పల్లె నిద్రలో ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి

గోపాల్ పేట: ఎంజీకేఎల్ఐ ద్వారా చెరువులు, కుంటలు నిండుగా దర్శనమిస్తున్నాయని, నిరంతర విద్యుత్‌తో కరెంట్ దండిగా ఉంటున్నదని, దీంతో రైతులు వ్యవసాయాన్ని పండుగలా చేసుకుంటున్నారని ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి అన్నారు. శనివారం రాత్రి వనపర్తి జిల్లాలోని రేవల్లిలో నిరంజన్‌రెడ్డి బస చేసిన అనంతరం ఆదివారం ఉదయం గ్రామంలో తిరిగి స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంతవరకు వర్షాకాలంలో మాత్రమే చెరువులు, కుంటలు నిండి అలుగులు పారటం చూశామని, కానీ ఎంజీకేఎల్ఐ నుంచి నీళ్లు వచ్చాక యాసంగిలో కూడా చెరువులు, కుంటలు నిండి అలుగులు పారడం చూస్తున్నామని చెప్పారు. చెరువులు నిండుగా ఉండడంతో ఆయకట్టు రైతులు, నిరంతర కరెంటుతో బోరుబావుల రైతులు సంతోషంగా పంటలు సాగు చేసుకుంటున్నారన్నారు.

వైద్యశాఖలో 18 వేల పోస్టుల భర్తీ

రాష్ట్రంలో 40 డయాలసిస్ కేంద్రాలు.. ఆదిలాబాద్‌లో మంత్రి లక్ష్మారెడ్డి

ఆదిలాబాద్ / నమస్తే తెలంగాణ ప్రతినిధి ,నిర్మల్: రాష్ట్ర వ్యాప్తంగా వైద్య ఆరోగ్యశాఖలో ఖాళీగా ఉన్న 18 వేల పోస్టులను త్వరలో భర్తీ చేయనున్నట్టు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డి చెప్పారు. రెండు నెలల్లో ఈ ప్రక్రియను పూర్తి చేస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వ దవాఖానల్లో 40 డయాలసిస్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రిమ్స్‌లో, ఉట్నూర్ పీహెచ్‌సీలో కొత్తగా ఏర్పాటు చేసిన డయాలసిస్ కేంద్రాలు, చిన్నపిల్లల ఐసీయూ, సీటీస్కానింగ్, ఎక్స్‌రే యంత్రాలను ఆదివారం మంత్రి ప్రారంభించారు. అనంతరం రిమ్స్ అడిటోరియంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. డయాలసిస్ కేంద్రాల్లో దేశంలో ఎక్కడాలేని విధంగా అధునాతన పరికరాలతో పాటు ఫిల్టర్‌ను ఒకేసారి వినియోగించనున్నట్టు పేర్కొన్నారు. దీంతో రోగులకు మెరుగైన చికిత్స అందుతుందన్నారు. రాష్ట్రంలో సెమీ అటానమస్‌గా ఉన్న వైద్య కళాశాలల దవాఖానలకు స్వయం ప్రతిపత్తి కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. చికిత్సతో పాటు వ్యాధుల నివారణ ప్రాధాన్యం ఇస్తున్నామన్న మంత్రి గ్రామాల్లో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు, ఇమ్యూనైజేషన్, ప్రాథమిక దశలో వ్యాధుల గుర్తించి అవసరమైన చికిత్సలు అందజేస్తామన్నారు. ప్రభుత్వం తీసుకుంటున్న ముందస్తు చర్యల కారణంగా మన్యంలో పూర్తిగా మరణాలను నివారించామని, గతంలో కన్నా ప్రభుత్వ దవాఖానలకు చికిత్స కోసం వచ్చే వారి సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. అటవీశాఖ మంత్రి జోగు రామన్న మాట్లాడుతూ ప్రభుత్వం పేదలకు కార్పొరేట్ వైద్యసేవలను అందించేందుకు చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి లక్ష్మారెడ్డి ఆరు సార్లు జిల్లాలో పర్యటించి జిల్లాలోని వైద్యసేవలను సమీక్షించినట్టు చెప్పారు. దేవాదాయ న్యాయశాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడిన తర్వాత వైద్య ఆరోగ్య శాఖలో చాలా మార్పులు వచ్చినట్టు తెలిపారు. వైద్యులు సేవాభావంతో పనిచేసి పేదలకు మెరుగైన చికిత్సలు అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు, పాడి పరిశ్రమ అభివృద్ధి సంస్థ చైర్మన్ లోక భూమారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు మంత్రి లక్ష్మారెడ్డి నిర్మల్‌లో మంత్రి అల్లోల నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అన్ని జిల్లాల్లో వెల్‌నెస్ సెంటర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు.



ఆదిలాబాద్ రిమ్స్‌లో డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రులు లక్ష్మారెడ్డి, జోగు రామన్న, ఇంద్రకరణ్‌రెడ్డి

బ్రాహ్మణ సమాజాభివృద్ధికి ప్రత్యేక పథకాలు

నల్లగొండ కల్చరల్: తమ సమస్యలను వేరేవారికి చెప్పుకోలేని పరిస్థితిలో ఉన్న బ్రాహ్మణులకు గౌరవం తెచ్చేలా.. వారి అభ్యున్నతికి సీఎం కేసీఆర్ ప్రత్యేక పథకాలు ప్రవేశ పెట్టారని విద్యుత్ శాఖ మంత్రి జీ జగదీశ్‌రెడ్డి అన్నారు. వైదిక బ్రాహ్మణ సంఘం, అర్చక సంఘం ఆధ్వర్యంలో నల్లగొండలోని ఎస్‌బీఆర్ గార్డెన్స్‌లో ఆదివారం విళంబినామ సంవత్సర పంచాంగం ఆవిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత ధర్నాలు లేకుండా దరఖాస్తులతోనే సమస్యలు పరిష్కారమయ్యేలా సీఎం కేసీఆర్ ప్రత్యేక విజన్‌తో ముందుకెళ్తున్నారన్నారు. తెలంగాణ బ్రాహ్మణ పరిషత్ సభ్యులు చకిలం అనిల్‌కుమార్ మాట్లాడుతూ దేశంలో ఏ ప్రభుత్వమూ చేయని విధంగా బ్రాహ్మణులకు రూ. 100 కోట్ల బడ్జెట్‌తో కార్పొరేషన్ ఏర్పాటు చేసి విద్య, వైద్యం సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్న ఘనత టీఆర్‌ఎస్ ప్రభుత్వాని దన్నారు. వైదిక బ్రాహ్మణ, అర్చక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంగు భానుమూర్తి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ బ్రాహ్మణ పక్షపాతి అని కీర్తించారు. అనంతరం ప్రముఖ సిద్ధాంతి సుబ్రమణ్య శర్మ రచించిన విళంబినామ సంవత్సర పంచాంగాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీ గుత్తా సుఖేందర్ రెడ్డి, తెలంగాణ బ్రాహ్మణ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దౌలతాబాద్ వాసుదేవశర్మ, జిల్లా వైదిక బ్రాహ్మణ, అర్చక సంఘం అధ్యక్షులు గుదే లక్ష్మీనర్సయ్యశర్మ, పోతుల పాటి రామలింగేశ్వరశర్మ, టీఆర్‌ఎస్ నియోజకవర్గ అధ్యక్షుడు కంచర్ల భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నల్లగొండలో జరిగినసమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

మందుపాతరల కుట్ర భగ్నం

- మావోయిస్టు సెంట్రల్ కమిటీకి సహకరిస్తున్న ముగ్గురి అరెస్టు

భద్రాద్రికొత్తగూడెం జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ: మావోయిస్టు సెంట్రల్ కమిటీ నేతలు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సరిహద్దుల నుంచి ఛత్తీస్‌గఢ్‌లోని తమ స్థావరాలకు పేలుడు సామగ్రిని తరలించే కుట్రను భద్రాద్రికొత్తగూడెం జిల్లా పోలీసులు భగ్నం చేశారు. ఎస్పీ అంబర్ కిషోర్ ఝా వివరాలు వెల్లడించారు. సీపీఐ(ఎంఎల్)మావోయిస్టు సెంట్రల్ కమిటీ నేతలు చంద్రన్న, ఆనంద్, పాపారావు, మాదన్న, హరిభూషణ్, ఇద్దమయ్య, దామోదర్‌లు పోలీసులను, టార్గెట్ చేసుకున్న వ్యక్తులను మందుపాతరలు అమర్చి హతమార్చేందుకు రెండు రాష్ర్టాల నుంచి పేలుడు సామగ్రిని సమీకరిస్తున్నట్టు సమాచారం అందటంతో చర్ల, భద్రాచలం ప్రాంతాల్లో తనిఖీలు చేయగా ముగ్గురు వ్యక్తులు పట్టుబడ్డారని చెప్పారు. వారి నుంచి 51జిలిటెన్ స్టిక్స్, 130డిటోనేటర్లు, మందుపాతరలు పేల్చేందుకు వినియోగించే ఎలక్ట్రికల్ సామగ్రిని స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. మడివి సమ్మయ్య, ఓయం నంద, మీర్గమ్ అర్జున్‌లను అదుపులోకి తీసుకొని ప్రశ్నించగా మావోయిస్టులకు ఈ పేలుడు సామగ్రిని చేరవేస్తున్నట్టు అంగీకరించారన్నారు. వీరిపై కేసు నమోదు చేశామని వివరించారు.

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య



అంజిలప్ప(ఫైల్)

మహబూబ్‌నగర్ క్రైం: మహబూబ్‌నగర్‌లోని ఓ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం అర్ధరాత్రి చోటు చేసుకున్నది. టూటౌన్ సీఐ డీవీపీ రాజు కథనం ప్రకారం జిల్లాలోని మద్దూరు మండలం చింతల్‌దిన్నె గ్రామానికి చెందిన కే మల్లప్ప కుమారుడు అంజిలప్ప(16) మహబూబ్‌నగర్ పట్టణంలోని ప్రతిభ జూనియర్ కళాశాలలో ఇంటర్ బైపీసీ ఫస్టియర్ చదువుతున్నాడు. శనివారం స్టడీ అవర్స్ అనంతరం తన రూమ్‌కు వెళ్లిన అంజిలప్ప మధ్యరాత్రి గదిలోని సీలింగ్ రాడ్‌కు టవల్‌తో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకొన్నాడు. తోటి విద్యార్థులు గమనించి అధ్యాపకులకు సమాచారం అందించారు. ఈ కళాశాలలో చదువడం నాకిష్టం లేదని సూసైడ్ నోట్ రాసుకున్న పేపర్ విద్యార్థి జేబులో లభించింది. మా నాన్నకు ఎవరైనా ఫోన్ చేయండి.. అని రాసి ఉంది. కొద్దిరోజులుగా విద్యార్థి మానసిక పరిస్థితి సరిగ్గా లేదని, అందుకే ఆత్మహత్య చేసుకున్నాడని అంజిలప్ప తల్లిదండ్రులు, కళాశాల అధ్యాపకులు తెలిపారు. కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

కన్న బిడ్డనే చంపేశాడు

- నీళ్ల బకెట్‌లో ముంచి హత్య



ఉండవెల్లి: జోగుళాంబ గద్వాల జిల్లాలో ఘోరం జరిగింది. కన్నకూతురిని నీళ్ల బకెట్‌లో ముంచి చంపిన సంఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. ఉండవెల్లి మండలంలోని పుల్లూరుకు చెందిన విజయ్‌కుమార్, వెన్నెల భార్యాభర్తలు. రెండేండ్ల కిందట వివాహం కాగా, ఐదు నెలల కిందట పాప జన్మించింది. కాన్పు కోసం పుట్టింటికి వెళ్లిన వెన్నెల గత శనివారమే ఇక్కడికి వచ్చింది. ఆదివారం సాయంత్రం తన కూతురిని ఎత్తుకొని వెళ్లిన విజయ్‌కుమార్ ఇంటిముందు నీళ్లబకెట్‌లో ముంచడంతో ఊపిరాడక చనిపోయింది. చిన్నారి కన్నుమూయడంతో కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది.

ఆనంద్ గేమ్ డ్రా

విజ్క్ ఆన్ జీ (నెదర్లాండ్స్): భారత గ్రాండ్ మాస్టర్ విశ్వనాథన్ ఆనంద్.. టాటా స్టీల్ మాస్టర్స్ చెస్ టోర్నీలో మరో డ్రా నమోదు చేశాడు. ఆదివారం పీటర్ స్విడ్లెర్‌తో జరిగిన 8వ రౌండ్ గేమ్‌ను విషీ 27 ఎత్తుల వద్ద డ్రాగా ముగించాడు. ఈ రౌండ్ అనంతరం ఆనంద్ నాలుగున్నర పాయింట్లతో సంయుక్తంగా కొనసాగుతున్నాడు. భారత్‌కు చెందిన అనిష్ గిరి 32 ఎత్తులతో షాకిర్‌యార్‌పై గెలిచాడు.

ఓవరాల్ చాంపియన్ తెలంగాణ

కలెక్టరేట్: సీఎం కప్ జాతీయస్థాయి కరాటే పోటీల్లో ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను తెలంగాణ కైవసం చేసుకుంది. ఆదివారం ముగిసిన ఈ పోటీల్లో తెలంగాణ మొత్తం 222 పతకాలు సాధించి టాప్‌లో నిలిచింది. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ఆర్థిక, పౌరసరఫరాల శాఖ మంత్రి ఈటల రాజేందర్ విజేతలకు బహుమతులను అందజేశారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో రూ. 1.16 కోట్లతో నిర్మించిన యోగా, రెజ్లింగ్, బాక్సింగ్ హాళ్లను ప్రారంభించారు. రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత క్రమంలో నిధులు వెచ్చిస్తూ క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నదన్నారు. కార్యక్రమంలో జడ్పీ అధ్యక్షురాలు తుల ఉమ, స్థానిక శాసనసభ్యుడు గంగుల కమలాకర్, ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, జిల్లాకు చెందిన క్రీడల అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.



మెరిసిన యువీ, భజ్జీ

- కర్ణాటకపై పంజాబ్ 'సూపర్' విజయం
- సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 టోర్నీ


యువరాజ్

కోల్‌కతా: వయస్సు పెరుగుతున్నా..వన్నె తగ్గలేదని భారత సీనియర్ క్రికెటర్లు యువరాజ్‌సింగ్, హర్భజన్‌సింగ్ నిరూపించారు. జాతీయజట్టులోకి తిరిగి చోటు దక్కించుకోవడానికి శతవిధాల ప్రయత్నిస్తున్న యువీ, భజ్జీ..సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 టోర్నీ రూపంలో దొరికిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారు. టోర్నీలో భాగంగా కర్ణాటకతో ఆదివారం జరిగిన సూపర్‌లీగ్ రౌండ్ పోరులో తమ అనుభవాన్నంతా జోడిస్తూ పంజాబ్ ఉత్కంఠ విజయంలో భాగమయ్యారు. ఇరు జట్ల స్కోరు సమం కావడంతో విజేతను నిర్ణయించే సూపర్ ఓవర్లో యువీ, మణ్‌దీప్ సింగ్ కలిసి పంజాబ్ తరఫున 15 పరుగులు చేశారు. ఆ తర్వాత పంజాబ్ పేసర్ సిద్ధార్థ్ కౌల్ కట్టుదిట్టమైన బౌలింగ్‌తో కర్ణాటక 11 పరుగులకే పరిమితమైంది. మ్యాచ్ విషయానికొస్తే కర్ణాటక నిర్దేశించిన 159 పరుగుల లక్ష్యం కోసం బరిలోకి దిగిన పంజాబ్ నిర్ణీత ఓవర్లలో 9 వికెట్లకు 158 పరుగులు చేసింది. మణ్‌దీప్ సింగ్(45), కెప్టెన్ హర్భజన్‌సింగ్(33), యువీ(29) రాణించారు. ఆఖరి రెండోవర్లలో విజయానికి 14 పరుగులు అవసరమైన దశలో వెంటవెంటనే వికెట్లు కోల్పోవడం పంజాబ్ గెలుపు అవకాశాలను దెబ్బతీసింది. 20వ ఓవర్ ఆఖరి రెండు బంతుల్లో సందీప్ శర్మ ఆరు పరుగులు కొట్టడం ద్వారా మ్యాచ్ 'టై'గా ముగిసింది. శ్రీనాథ్ అరవింద్(4/32) నాలుగు వికెట్లతో రాణించాడు. తొలుత బల్తేజ్‌సింగ్(3/21), గోనీ(2/8) ధాటికి కర్ణాటక 158/7 స్కోరు చేసింది. జోషి(40 నాటౌట్), సీఎం గౌతమ్(36) ఆకట్టుకున్నారు. ముఖ్యంగా గోనీ(4-0-8-2) సూపర్ బౌలింగ్‌తో కర్ణాటక బ్యాట్స్‌మెన్‌ను కట్టడి చేశాడు. బ్యాటింగ్‌లో రాణించిన యువీ..ఫీల్డింగ్‌లోనూ అదరగొట్టాడు. రెండు కండ్లు చెదిరే క్యాచ్‌లతో మ్యాచ్‌ను మలుపుతిప్పాడు. మిగతా మ్యాచ్‌ల్లో తమిళనాడుపై ఢిల్లీ 8 వికెట్ల తేడాతో, జార్ఖండ్‌పై ముంబై 13 పరుగులతో విజయాలు నమోదు చేసుకున్నాయి.

తిషార ఆల్‌రౌండ్ షో

- జింబాబ్వేపై 5 వికెట్ల తేడాతో లంక గెలుపు
- ముక్కోణపు టోర్నీలో ఆశలు సజీవం


తిషార

ఢాకా: తిషార పెరెరా ఆల్‌రౌండ్ ప్రదర్శనతో శ్రీలంక జింబాబ్వేపై 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ముక్కోణపు వన్డే టోర్నీలో భాగంగా ఆదివారం ఇక్కడ జరిగిన మ్యాచ్‌లో జింబాబ్వే విసిరిన 199 పరుగుల లక్ష్యాన్ని శ్రీలంక 44.5 ఓవర్లలో (202/5) ఛేదించింది. తిషార (39 నాటౌట్), చండిమాల్ (38 నాటౌట్) లంకకు విజయాన్ని అందించి టోర్నీలో తమ అవకాశాలను సజీవంగా ఉంచారు. ఓపెనర్ కుశాల్ (49) శుభారంభం అందించినా..లంక మిడిలార్డర్ తడబడింది. ఒక దశలో 145 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి కష్టాల్లో ఉన్న లంకను చండిమాల్, తిషార జోడి 57 పరుగుల అజేయ భాగస్వామ్యంతో ఆదుకున్నది. 45వ ఓవర్ చివరి బంతికి తిషార సిక్సర్ బాది లాంఛనం పూర్తి చేశాడు. అంతకు ముందు బౌలింగ్‌లోనూ మెరిసిన తిషార (4/33) జింబాబ్వేను 198 (44 ఓవర్లలో) పరుగులకే కట్టడి చేయడంలో కీలక పాత్ర పోషించాడు. టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన జింబాబ్వేకు ఓపెనర్లు 44 పరుగుల భాగస్వామ్యం అందించగా....తిషార నలుగురు టాపార్డర్ బ్యాట్స్‌మెన్‌ను అవుట్ చేశాడు. టేలర్ (58) క్రీమర్ (34) ఫర్వాలేదనిపించారు. లంక బౌలర్లలో ఫెర్నాండో 3, సందకన్ 2 వికెట్లు పడగొట్టారు.



ఎదురులేని నాదల్

- క్వార్టర్‌ఫైనల్లోకి ప్రవేశం
- వోజ్నియాకి కూడా..
- ఆస్ట్రేలియన్ ఓపెన్

అంచనాలకు అనుగుణంగా రాణించిన టాప్‌సీడ్‌లు.. ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో మరో అడుగు ముందుకేశారు. దీంతో ఏడో రోజు ఎలాంటి సంచలనాలు నమోదుకాలేదు. స్పెయిన్ బుల్ రాఫెల్ నాదల్ జైత్రయాత్ర కొనసాగిస్తుండగా, ప్రపంచ రెండో ర్యాంకర్ వోజ్నియాకి క్వార్టర్స్ బెర్త్‌ను ఖాయం చేసుకుంది. కానీ భారత్ ఆటగాళ్లే మిశ్రమ ఫలితాలను నమోదు చేశారు.

మెల్‌బోర్న్: గాయం కారణంగా చాలా కాలం ఆటకు దూరంగా ఉన్న స్పెయిన్ స్టార్ రాఫెల్ నాదల్.. ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో క్వార్టర్‌ఫైనల్లోకి దూసుకెళ్లాడు. ఆదివారం జరిగిన పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో టాప్‌సీడ్ నాదల్ 6-3, 6-7(4/7), 6-3, 6-3 తేడాతో డీగో స్క్వార్ట్జ్‌మన్(అర్జెంటీనా)పై గెలిచాడు. టైటిల్ ఫేవరెట్‌గా బరిలోకి దిగిన ఈ స్పెయిన్ బుల్.. నాలుగు గంటల పోరాటంలో అద్భుతమైన ఆటతీరుతో ఆకట్టుకున్నాడు. దీంతో ఈ టోర్నీలో పదోసారి క్వార్టర్స్‌లోకి ప్రవేశించిన ఘనత సాధించాడు. తొలిసెట్‌ను 6-3తో దక్కించుకున్న నాదల్‌కు రెండోసెట్‌లో తీవ్ర ప్రతిఘటన ఎదురైంది. కండ్లు చెదిరే సర్వీస్‌కు తోడు ఫోర్‌హ్యాండ్ షాట్లతో చెలరేగిన డీగో.. టైబ్రేక్ ద్వారా రెండోసెట్‌ను చేజిక్కించుకున్నాడు. మూడోసెట్‌లోనూ డీగో స్ఫూర్తిదాయక పోరాటంతో 4-4తో స్కోరును సమం చేశాడు. ఈ దశలో బ్రేక్ పాయింట్‌ను కాచుకున్న నాదల్.. సెట్‌ను సొంతం చేసుకున్నాడు. ఇక నాలుగోసెట్‌లో ప్రత్యర్థి సర్వీస్‌ను రెండుసార్లు బ్రేక్ చేసి మ్యాచ్‌ను కైవసం చేసుకున్నాడు. మ్యాచ్ మొత్తం మీద నాదల్ 7 ఏస్‌లు సంధిస్తే.. డీగో 12 బాదాడు. ఇతర మ్యాచ్‌ల్లో దిమిత్రోవ్ (బల్గేరియా) 7-6 (7/3), 7-6 (7/4), 6-3, 6-3తో కిర్గియోస్ (ఆస్ట్రేలియా)పై గెలిచి క్వార్టర్స్‌లోకి ప్రవేశించారు.

సిలిచ్ @100

క్రొయేషియా టెన్నిస్ స్టార్ మారిన్ సిలిచ్ 100 గ్రాండ్‌స్లామ్ విజయాల రికార్డును అందుకున్నాడు. ప్రిక్వార్టర్స్‌లో సిలిచ్ 6-7 (2/7), 6-3, 7-6 (7/0), 7-6 (7/3) తేడాతో పాబ్లో కరెనో బుస్టా(స్పెయిన్)పై గెలువడం ద్వారా ఈ ఫీట్ అందుకున్నాడు. మ్యాచ్ మొత్తమ్మీద ఆధిపత్యం ప్రదర్శించిన సిలిచ్..బుస్టాను ఓడించి ముందంజ వేశాడు. గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో 11వ సారి క్వార్టర్స్ చేరడం ద్వారా తన దేశానికే చెందిన గోరాన్ ఇవాన్‌సెవిక్ రికార్డును సిలిచ్ సమం చేశాడు.

పేస్ జోడీ ఔట్

స్టార్ జోడీ లియాండర్‌పేస్, పురవ్ రాజా ప్రిక్వార్టర్స్‌లో తమ పోరాటాన్ని ముగించగా, తిమియా బాబోస్‌తో కలిసి రోహన్ బోపన్న మరింత ముందంజ వేశాడు. పురుషుల డబుల్స్ ప్రిక్వార్టర్స్‌లో భారత ద్వయం పేస్, రాజ 1-6, 2-6 తేడాతో కొలంబియా జోడీ కాబల్, రాబర్ట్ ఫరాహ్ చేతిలో ఓడింది. అన్‌సీడెడ్‌గా బరిలోకి దిగిన పేస్, పురవ్ జంట..ఏ దశలోనూ ప్రత్యర్థికి పోటీనివ్వలేకపోయింది. మెల్‌బోర్న్ పార్క్‌లో గంటా తొమ్మిది నిమిషాల పాటు జరిగిన ఏకపక్ష పోరులో పేస్, పురవ్ ఐదు బ్రేక్‌పాయింట్లను నిలబెట్టుకోవడంలో విఫలమైంది. మరోవైపు కాబల్, ఫరాహ్ జోడీ మాత్రం పదింటిలో నాలుగింటిని పాయింట్లుగా మలుచుకుంది. దీంతో పాటు రెండుసార్లు భారత ద్వయం సర్వీస్‌ను బ్రేక్ చేసి మ్యాచ్‌ను కైవసం చేసుకుంది. మ్యాచ్ మొత్తమ్మీద పేస్, పురవ్ ఐదు అనవసర తప్పిదాలకు పాల్పడగా, కొలంబియా జోడీ మూడుకే పరిమితమైంది. మరో డబుల్స్ మ్యాచ్‌లో భారత్, హంగేరియా జోడీ రోహన్ బోపన్న, తిమియో బాబోస్..6-2, 6-4తో ఆస్ట్రేలియా జంట విన్నింగ్టన్, పెరెజ్‌పై విజయం సాధించి ప్రిక్వార్టర్స్‌లోకి ప్రవేశించింది.


వోజ్నియాకి

వోజ్నియాకి ముందుకు

మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో రెండోసీడ్ వోజ్నియాకి (డెన్మార్క్) 6-3, 6-0తో రెబరికోవా (స్లోవేకియా)పై గెలిచి క్వార్టర్స్ బెర్త్‌ను ఖాయం చేసుకుంది. తొలిసెట్‌లో రెండుసార్లు ప్రత్యర్థి సర్వీస్‌ను బ్రేక్ చేసిన వోజ్నియాకి.. రెండోసెట్‌లో మరింత దూకుడును చూపెట్టింది. 9 బ్రేక్ పాయింట్ అవకాశాల్లో ఐదింటిని కాచుకుని మ్యాచ్‌లో ముందుకుసాగింది. ఇతర మ్యాచ్‌ల్లో నాలుగోసీడ్ స్వితోలినా (ఉక్రెయిన్) 6-3, 6-0తో అలెర్టోవా (చెక్)పై, మార్టినెజ్ (బెల్జియం) 6-7 (7/5), 7-5తో మార్టిక్ (క్రొయేషియా)పై, నవారో (స్పెయిన్) 4-6, 6-4, 8-6తో కొంటావెంట్ (ఈస్టోనియా)పై గెలిచి క్వార్టర్స్‌లోకి అడుగుపెట్టింది.

కిర్గియోస్ నిష్క్రమణ

ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో లోకల్ స్టార్ నికో కిర్గియోస్ పోరాటం ముగిసింది. ఆదివారం ఆద్యంతం ఆసక్తికరంగా సాగిన ప్రిక్వార్టర్స్ పోరులో గ్రిగర్ దిమిత్రోవ్(బల్గేరియా) 7-6(7/3), 7-6(7/4), 4-6, 7-6(7/4) తేడాతో కిర్గియోస్‌పై విజయం సాధించాడు. మూడున్నర గంటల పాటు సాగిన పోరులో ఇద్దరు నువ్వానేనా అన్నరీతిలో తలపడ్డారు. మంగళవారం జరిగే క్వార్టర్స్‌లో కైల్ ఎడ్మండ్(ఇంగ్లండ్)తో దిమిత్రోవ్ తలపడుతాడు. గత నెలలో బ్రిస్బేన్ ఇంటర్నేషనల్ టోర్నీలో కిర్గియోస్ చేతిలో ఎదురైన ఓటమికి దిమిత్రోవ్ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ప్రతీకారం తీర్చుకున్నాడు. కిక్కిరిసిన స్టేడియంలో ఆసీస్ అభిమానుల ఆశలపై నీళ్లు చల్లుతూ మూడు సెట్లను దిమిత్రోవ్ బ్రేక్ పాయింట్ల ద్వారా దక్కించుకున్నాడు. డబుల్ ఫాల్ట్ ద్వారా తొలి సెట్‌ను చేజార్చుకున్న కిర్గియోస్..రెండో సెట్‌లోనూ తుదికంటా పోరాడాడు. అయితే చావోరేవో అయిన మూడో సెట్‌ను కైవసం చేసుకుని కిర్గియోస్ పోటీలో నిలిచాడు. దిమిత్రోవ్‌ను ఏస్‌లతో ఉక్కిరిబిక్కిరి చేశాడు. నాలుగో సెట్‌ను టైబ్రేక్ వరకు తీసుకొచ్చిన కిర్గియోస్ ఆఖర్లో అనవసర తప్పిదాలతో మూల్యం చెల్లించుకున్నాడు. మ్యాచ్ మొత్తమ్మీద కిర్గియోస్ 36 ఏస్‌లతో విరుచుకుపడితే..దిమిత్రోవ్ అందులో సగాని(16)కే పరిమితమయ్యాడు. విన్నర్లలోనూ కిర్గియోస్(76)దే దిమిత్రోవ్(64)కంటే పైచేయిగా నిలిచినా లాభం లేకపోయింది.

ప్రాక్టీస్.. ప్రాక్టీస్

- నెట్స్‌లో చెమటోడ్చిన భారత్
- వాండరర్స్ వికెట్‌ను పరిశీలించిన కోచ్, కెప్టెన్
- రహానేకు డబుల్ సెషన్





బావుమా ఔట్

దక్షిణాఫ్రికా బ్యాట్స్‌మన్ బావుమా మూడో టెస్టుకూ దూరమయ్యాడు. ఉంగరం వేలికి గాయమవడంతో ఇతనికి నాలుగు వారాల విశ్రాంతి అవసరమని జట్టు ఫిజియో తెలిపాడు. కేప్ కోబ్రాస్‌తో మ్యాచ్ సందర్భంగా బావుమా చేతి వేలికి గాయమైంది. అయితే ఇతని స్థానంలో ఎవరినీ తీసుకుంటున్నట్టు దక్షిణాఫ్రికా ప్రకటించలేదు. బావుమా గత రెండు టెస్టుల్లోనూ రిజర్వ్ బెంచ్‌కే పరిమితమయ్యాడు. మూడో టెస్టులోనూ ఇతను తుది జట్టులో ఉండకపోయేవాడని తెలుస్తుండగా... ఆల్‌రౌండర్ క్రిస్ మోరిస్‌ను తుది జట్టులోకి తీసుకుని ఒక బౌలర్‌ను తప్పించాలని ఆతిథ్య జట్టు భావిస్తున్నది.

జొహన్నెస్‌బర్గ్: వరుసగా రెండు టెస్టుల్లోనూ ఓడిన టీమ్ ఇండియాకు మూడో టెస్టులోనూ పేస్, బౌన్స్ పిచ్ స్వాగతం పలుకనున్నది. దక్షిణాఫ్రికా కెప్టెన్ డుప్లెసిస్ చెప్పినట్టుగా మనోళ్లను వణికించేందుకు పచ్చికతో కూడిన పిచ్ సిద్ధమైంది. ఈనెల 24 నుంచి జొహన్నెస్‌బర్గ్‌లోని వాండరర్స్ స్టేడియంలో చివరిదైన మూడో టెస్టు జరుగనుంది. ఈ నేపథ్యంలో టీమ్‌ఇండియా సారథి కోహ్లీ, కోచ్ రవిశాస్త్రి, బ్యాటింగ్ కోచ్ సంజయ్ బంగర్ వాండరర్స్ పిచ్‌ను పరిశీలించి అనంతరం ఆటగాళ్లతో నాలుగు గంటల పాటు సాధన చేయించారు. మూడో రోజుల విశ్రాంతి అనంతరం ప్రాక్టీస్‌కు దిగిన టీమ్‌ఇండియా ఆటగాళ్లంతా ముగ్గురు చొప్పున మూడు నెట్స్‌లో సాధన చేశారు. నెట్ బౌలర్లు నవ్‌దీప్ సైనీ, శార్దుల్ ఠాకూర్ తమదైన పేస్‌తో భారత బ్యాట్స్‌మెన్‌కు బంతులు సంధించారు. మొదటి నెట్‌లో పేస్ బౌలింగ్, రెండో నెట్‌లో స్పిన్ బౌలింగ్, మూడో నెట్‌లో త్రోడౌన్స్‌తో సాధన సాగింది. బ్యాటింగ్‌తో పాటు క్యాచింగ్ , ఫీల్డింగ్‌లో శ్రమించారు.

త్రిముఖ సాధన

ముందుగా మురళీ విజయ్, కేఎల్ రాహుల్, చతేశ్వర్ పుజార మూడు నెట్స్‌లో రొటేషన్ పద్ధతిలో బ్యాటింగ్ ప్రాక్టీస్ చేశారు. వీరికి సైనీ, శార్దుల్ బౌలింగ్ వేశారు. ఆ తర్వాత మెదటి నెట్‌లో ఇషాంత్, మహ్మద్, భువనేశ్వర్ బౌలింగ్‌లో సాధన చేయగా. రెండో నెట్‌లో అశ్విన్, జడేజా బౌలింగ్ చేశారు. ఇక మూడో నెట్‌లో బ్యాటింగ్ కోచ్ బంగర్ త్రో డౌన్స్ విసిరాడు. అయితే ఇషాంత్ బౌలింగ్‌లో రాహుల్‌కు గాయమైంది. లంబూ వేసిన బంతి రాహుల్ ఎడమ మోకాలికి కింది భాగంలో తగిలింది. దీంతో అతడికి ఫిజియో వెంటనే పెయిన్ కిల్లర్‌తో ఉపశమనం కలిగించాడు. ఆ తర్వాత మళ్లీ సాధన చేసిన రాహుల్.. ప్రాక్టీస్ అనంతరం ఐస్ ముక్కల సంచిని కాలికి కట్టుకుని కనిపించాడు.

తుది జట్టులో రహానే!

గత రెండు టెస్టుల్లోనూ చోటు దక్కని రహానే.. మూడో టెస్టులో ఆడుతాడన్న సంకేతాలు సాధన సందర్భంగా తేటతెల్లమయ్యాయి. రహానే రెండు సెషన్లలో బ్యాటింగ్ సాధన చేయడమే ఇందుకు నిదర్శనం. కోహ్లీ, పాండ్యా కూడా నెట్స్‌లో తీవ్రంగా సాధన చేశారు. ఆ తర్వాత రోహిత్, ధవన్, పార్థివ్ మూడు నెట్స్‌లో సాధన చేశారు. అనంతరం అశ్విన్, దినేశ్ కార్తీక్ నెట్స్‌లో బంతులను బాదేశారు. అందరూ బ్యాటింగ్ ప్రాక్టీస్ చేసిన తర్వాత కోహ్లీ, రహానే మరోసారి పేస్, స్పిన్ బౌలర్లను ఎదుర్కొన్నారు. రహానేకు బంగర్ చాలా సేపు త్రో డౌన్స్ విసిరాడు. ఇక స్థానిక బౌలర్లూ భారత బ్యాట్స్‌మెన్‌కు బౌలింగ్ చేశారు. రహానే గత ప్రాక్టీస్ సెషన్లలో కంటే ఈసారి ఎక్కువ సమయం బ్యాటింగ్ ప్రాక్టీస్ చేయడంతో వాండరర్స్ టెస్ట్‌లో ఇతడు తుది జట్టులో ఉండటం ఖాయమనిపిస్తున్నది.


పేస్, బౌన్స్ పక్కా..

ఆదివారంతో పోలిస్తే నేడు ఇక్కడ ఎండ తీవ్రత మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. జొహన్నెస్‌బర్గ్‌లో వేడి తీవ్రత ఎక్కువగా ఉన్నప్పటికీ పిచ్‌పై ఉన్న పచ్చిక ఎండిపోదని, ఇక్కడ నీటి సదుపాయం బాగానే ఉందని ప్రాక్టీస్ సెషన్ అనంతరం వాండరర్స్ పిచ్ క్యూరేటర్ బుత్యుయెల్ బుతెలెజి తెలిపాడు. పేస్, బౌన్స్ ఉంటుదని, స్పిన్‌కు ఏమాత్రం సహకరించదన్నాడు.



'కేసీఆర్ గోల్డ్‌కప్' విజేత శేకాపూర్

జహీరాబాద్: 'కేసీఆర్ గోల్డ్‌కప్' క్రికెట్ టోర్నమెంట్ టైటిల్‌ను శేకాపూర్ సీసీ జట్టు కైవసం చేసుకుంది. ఆదివారం బాగారెడ్డి స్టేడియంలో జరిగిన ఫైనల్లో శేకాపూర్ టీమ్ 6 వికెట్ల తేడాతో బీదర్ సీసీ జట్టుపై గెలిచింది. టాస్ గెలిచిన బీదర్ 20 ఓవర్లలో 113 పరుగులకు ఆలౌటైంది. తర్వాత శేకాపూర్ జట్టు 17 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 114 పరుగులు చేసి నెగ్గింది. విజేతగా నిలిచిన శేకాపూర్ జట్టుకు తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు, జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్, టీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎమ్మెల్సీ ఎండీ.ఫరీదుద్దీన్.. రూ. 2 లక్షల ప్రైజ్‌మనీతో పాటు ట్రోఫీని బహుకరించారు. రన్నరప్ బీదర్ సీసీకి రూ.1లక్ష చెక్‌తో పాటు షీల్డ్‌ను అందజేశారు. కార్యక్రమంలో జహీరాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ డీ లక్ష్మారెడ్డి, టీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కే మాణిక్‌రావు, సినీ నిర్మాత మాల్కాపురం శివకుమార్, టీఆర్‌ఎస్ నాయకులు షేక్ ఫరీదు, సుధీర్‌కుమార్‌తో పాటు టీఆర్‌ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



కరాటేలో గిన్నిస్ రికార్డు!

పటాన్‌చెరు: 30 నిమిషాల సమయం.. 295 మంది మార్షల్ ఆర్ట్స్ క్రీడాకారులు.. 2 లక్షల 65 వేల ఫుల్ కాంటాక్ట్ కిక్‌లతో.. కరాటేలో ప్రపంచ రికార్డును నెలకొల్పారు. మైత్రీ మైదానంలో జరిగిన ఈ క్రీడావిన్యాసాన్ని గిన్నిస్ రికార్డు ప్రతినిధులు పరిశీలించారు. ఇది ప్రపంచ రికార్డు అని హైరేంజ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ ప్రతినిధులు పేర్కొన్నారు. 8 నుంచి 50 ఏండ్ల మధ్య వయసుగల క్రీడాకారులు ఈ పోటీలో పాల్గొన్నారు. ఈ రికార్డును పూర్తిస్థాయిలో పరిశీలించిన తర్వాత గిన్నిస్‌బుక్‌లో నమోదు చేయనున్నారు. పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ ఈవెంట్ జరిగింది.


బట్లర్ (100*)

ఇంగ్లండ్‌దే వన్డే సిరీస్


- మూడో వన్డేలోనూ ఆసీస్ ఓటమి
- బట్లర్ సెంచరీ

సిడ్నీ: యాషెస్ సిరీస్ చేజార్చుకున్న ఇంగ్లండ్ జట్టు వన్డే సిరీస్ గెలిచి ప్రతీకారం తీర్చుకుంది. బట్లర్ (83 బంతుల్లో 100 నాటౌట్; 6 ఫోర్లు, 4 సిక్సర్లు) అజేయ సెంచరీతో చెలరేగడంతో.. ఆదివారం జరిగిన మూడో వన్డేలోనూ ఇంగ్లండ్ 16 పరుగుల తేడాతో ఆసీస్‌పై గెలిచింది. దీంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను మరో రెండు మిగిలి ఉండగానే 3-0తో కైవసం చేసుకుంది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ 50 ఓవర్లలో 6 వికెట్లకు 302 పరుగులు చేసింది. ఇన్నింగ్స్ ఆఖరి బంతికి సెంచరీ పూర్తి చేసిన బట్లర్ జట్టుకు భారీ స్కోరు అందించాడు. క్రిస్ వోక్స్ (53 నాటౌట్), మోర్గాన్ (41), బెయిర్‌స్టో (39) చెలరేగి ఆడారు. వోక్స్, బట్లర్ ఏడో వికెట్‌కు 11.5 ఓవర్లలో 113 పరుగులు జోడించారు. తర్వాత ఆస్ట్రేలియా 50 ఓవర్లలో 6 వికెట్లకు 286 పరుగులు మాత్రమే చేసింది. ఫించ్ (62), స్టొయినిస్ (56), మిచెల్ మార్ష్ (55), స్మిత్ (45) రాణించినా ప్రయోజనం లేకపోయింది. స్వల్ప వ్యవధిలో స్మిత్, మార్ష్ ఔట్‌కావడంతో ఆతిథ్య జట్టు లక్ష్యాన్ని ఛేదించలేకపోయింది.

మళ్లీ ఓడిన భారత్

తౌరంగ: భారత హాకీ జట్టు మరోసారి బెల్జియం చేతిలో ఓటమి చవిచూసింది. నాలుగు దేశాల ఇన్విటేషనల్ టోర్నమెంట్‌లో భాగంగా ఆదివారం ఇక్కడ జరిగిన ఫైనల్స్ తొలి లీగ్‌లో భారత్ 1-2తో బెల్జియం చేతిలో ఓడిపోయింది. ఉత్కంఠభరితంగా సాగిన ఈ మ్యాచ్‌లో బెల్జియం తరఫున టామ్‌బూన్ (4ని), సెబాస్టియన్ (36 ని) చెరో గోల్ చేయగా...మన్‌దీప్‌సింగ్ (19ని) భారత్‌కు ఏకైక గోల్ అందించాడు. బెల్జియం గోల్‌కీపర్ విన్సెంట్ అసమాన ప్రదర్శనతో భారత్‌ను గోల్స్ చేయకుండా అడ్డుకుని మ్యాచ్‌కే హైలైట్‌గా నిలిచాడు. ఆట మొదలైన కొద్ది సేపటికే బెల్జియం తొలి గోల్ చేసి మ్యాచ్‌పై పట్టుదొరికించుకున్నది. నాలుగో నిమిషంలోనే బెల్జియం ఆటగాడు బూన్ పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలిచాడు.

'మలేసియా మాస్టర్స్' విజేత అక్సెల్‌సన్



కౌలాలంపూర్: ప్రపంచ నంబర్‌వన్ బ్యాడ్మింటన్ ప్లేయర్ విక్టర్ అక్సెల్‌సన్.. మలేసియా మాస్టర్స్ టోర్నీ టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు. ఆదివారం జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో అక్సెల్‌సన్ (డెన్మార్క్) 21-13, 21-23, 21-18తో కెంటా నిషిమోటో (జపాన్)పై గెలిచాడు. మహిళల సింగిల్స్ టైటిల్ పోరులో ఇంతనోన్ రచనోక్ (థాయ్‌లాండ్) 21-16, 14-21, 24-22తో తై జు యింగ్ (తైపీ)పై గెలిచింది. పురుషుల డబుల్స్‌లో ఫజర్-రియాన్ (ఇండోనేసియా) 14-21, 24-22, 21-13తో షెమ్-వీ కియాంగ్ (మలేసియా)పై గెలిచారు.

భూమిపైకి నీటిని మోసుకొచ్చిన ఉల్కలు!



బోస్టన్: ఉల్కల ద్వారానే భూమిపైకి నీరు చేరిందని అమెరికా శాస్త్రవేత్తలు చెప్తున్నారు. మన సౌర మండలం ఏర్పడిన తొలి 20 లక్షల ఏండ్లలో భారీ ఉల్కలు భూమిని ఢీకొనడంతో నీరు వచ్చిచేరిందని మస్సాచూసెట్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి చెందిన శాస్త్రవేత్తల బృందం చెప్తున్నారు. దాదాపు 450 కోట్ల ఏండ్ల కిందట సౌరవ్యవస్థలో వివిధ రసాయనిక మూల ధాతువులు ఏర్పడ్డాయని చెప్పారు. ఆ సమయానికి భూమి ఇంకా పూర్తిస్థాయిలో గ్రహంగా మారలేదని, ఇప్పుడున్న పరిమాణంలో 20 శాతం మాత్రమే ఉన్నదని చెప్పారు. వివిధ ఉల్కలు భూమిని ఢీకొట్టడంతో కార్బన్, ఐరన్ వంటి రసాయన పదార్థాలు వచ్చి చేరాయన్నారు. ఆ సమయంలోనే నీటితో ఉన్న ఓ భారీ ఉల్క భూమిని ఢీకొట్టిందని చెప్పారు. ప్రస్తుతం భూమిపై ఉన్న నీటి పరిమాణంలో దాదాపు 20 శాతం నీటిని ఉల్క మోసుకొని వచ్చినట్టు అంచనా వేస్తున్నారు. ఆ తర్వాత ఉష్ణోగ్రతలు తగ్గిపోవడంతో హైడ్రోజన్ వాయువు ఐసోటోప్‌గా మారి ఆక్సిజన్‌తో చర్యజరిపి నీరుగా మారి భారీ స్థాయిలో నీరు ఏర్పడిందని చెప్పారు.

'ఈ-పచ్చబొట్టు'.. మీ రిమోట్!



బెర్లిన్, జనవరి 21: ఇంట్లోని టీవీ, ఏసీ తదితర ఎలక్ట్రానిక్ వస్తువులను నియంత్రించగలిగే ఎలక్ట్రానిక్ టాటూలను జర్మనీ శాస్త్రవేత్తలు రూపొందించారు. సెన్సార్లతో కూడిన అత్యంత పలుచని పొరను తయారు చేశారు. దీని మందం మూడు మైక్రాన్లు. దీనిని చేతిపై టాటూ(పచ్చబొట్టు)లా వేసుకుంటే దానిలోని సెన్సార్లు శరీర కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉంటాయి. చేతితో నిర్దేశిత సైగలు చేసినప్పుడు సెన్సార్లు వాటిని గుర్తించి డీకోడింగ్ చేసి వస్తువులను నియంత్రిస్తాయి. దీని సాయంతో భౌతిక వస్తువులతోపాటు కంప్యూటర్ల సాయంతో సృష్టించే వర్చువల్ ప్రోగ్రామ్‌లను సైతం నియంత్రించవచ్చని పరిశోధకులు చెప్తున్నారు.

బాంబు కాదు అశుద్ధం!

ఆకాశం నుంచి కిందపడిన పదార్థం.. ఆందోళనకు గురైన జనం

గుర్గావ్: ఒక్కసారిగా ఆకాశం నుంచి గుర్తుతెలియని పదార్థం పొలాల్లో పడటంతో గుర్గావ్ సమీపంలోని ఫజిల్పూర్ బాద్లీ వాసులు ఆందోళనకు గురయ్యారు. గ్రామానికి చెందిన రాజ్బీర్‌యాదవ్ తన చేనులో పనిచేస్తుండగా పెద్దబండరాయి లాంటిది ఆకాశం నుంచి బలంగా కింద పడింది. దీంతో అక్కడ గొయ్యి కూడా ఏర్పడింది. ఈ సమాచారం వేగంగా పాకడంతో వందల సంఖ్యలో గ్రామస్థులు గుమిగూడారు. అది చిన్నపాటి మిస్సైలా.. బాంబా లేక ఆకాశం నుంచి పడిన ఉల్కానా అని అర్థం కాక వారంతా ఆందోళనకు గురయ్యారు. ఆ తెల్లని రాయిలాంటి వస్తువుకు సంబంధించిన కొన్ని ముక్కలను ఇండ్లకు తీసుకెళ్లి దాచుకున్నారు. ఈ సమాచారం తెలుసుకున్న జిల్లా ఉన్నతాధికారులు ఓ బృందాన్ని అక్కడికి పంపారు. ఆకాశం నుంచి కిందపడిన సదరు పదార్థం బ్లూ ఐస్ అని, విమానాల్లో మరుగుదొడ్డి వ్యర్థాలను గడ్డకట్టించేందుకు దానిని ఉపయోగిస్తారని అధికారుల బృందం నిర్ధారించింది.

మహిళ అనుమతి లేకుండా శరీరాన్ని తాకరాదు

ఢిల్లీ కోర్టు ఆదేశం

న్యూఢిల్లీ: 'మహిళ శరీరం ఆమె సొంతం. దీనిపై ఆమెకు ప్రత్యేక హక్కులు ఉన్నాయి. మహిళ అనుమతి లేకుండా ఎవరైనా సరే ఆమె శరీరాన్ని తాకడానికి వీల్లేదు' అని ఢిల్లీ కోర్టు తెలిపింది. 2014లో ఢిల్లీలోని ముఖర్జీ నగర్‌లో 9 ఏండ్ల బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించిన ఉత్తర్‌ప్రదేశ్‌వాసి చావిరాం కేసు విచారణ సందర్భంగా కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. మహిళకు ఉండే వ్యక్తిగత గోప్యత హక్కును పురుషులు కాలరాస్తున్నారని న్యాయమూర్తి సీమ మైనీ పేర్కొన్నారు.



రెండో రోజుకు చేరిన అమెరికా షట్‌డౌన్

- ప్రతిష్టంభన కొనసాగితే సెనెట్ నిబంధనలు మార్చేస్తాం
- బెదిరింపులకు దిగిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్
- భారత్‌లో కాన్సులర్ విధులు యథాతథం

వాషింగ్టన్/ హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

అమెరికాలో ప్రభుత్వ కార్యాలయాల మూసివేతపై ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బెదిరింపులకు దిగారు. ప్రతిష్ఠంభన ఇలాగే కొనసాగితే సెనెట్ నిబంధనలను మార్చివేసేందుకు రిపబ్లికన్లు చర్యలు తీసుకుంటారని ఆదివారం ట్వీట్ చేశారు. అమెరికాలో ప్రభుత్వ కార్యాలయాల మూసివేత ఆదివారానికి రెండో రోజుకు చేరుకున్నది. ప్రస్తుతం సెనెట్‌లో అధికార రిపబ్లికన్ పార్టీకి స్వల్ప మెజారిటీ మాత్రమే ఉన్నది. ఏదైనా కీలక బిల్లు ఆమోదం పొందాలంటే సెనెట్‌లో 60 మంది సభ్యులు అనుకూలంగా ఓటేయాలని 'సూపర్ మెజారిటీ' నిబంధన ఉన్నది. పరిస్థితి ఇలాగే కొనసాగితే సాధారణ మెజారిటీ 51 ఓట్లతో దీర్ఘకాలిక బడ్జెట్ ఆమోదించేలా సెనెట్ నిబంధనలు మార్చేయాల్సి ఉంటుందన్నారు. దీని ప్రకారం రిపబ్లికన్లకు సుమారు 10 శాతం ఓట్లు తక్కువగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ద్రవ్య వినిమయ బిల్లు ఆమోదానికి సెనెట్ అడ్డు చెప్పడంతో ట్రంప్ డెమోక్రాట్లపై వ్యతిరేక ప్రచారానికి దిగారు. విదేశీయులు అక్రమంగా దేశంలోకి చొరబడినా తనిఖీ చేయొద్దని డెమోక్రాట్లు కోరుతున్నారని ట్రంప్ ఆరోపించారు. మరోవైపు అధికార రిపబ్లికన్లు, ప్రతిపక్ష డెమోక్రాట్లు పరస్పరం విమర్శలకు దిగారు. పరిస్థితి ఇలాగే సాగితే వచ్చే నవంబర్‌లో మధ్యంతర ఎన్నికలకు వెళ్లే అవకాశాలు కనిపిస్తున్నాయి. డెమోక్రాట్లు స్వల్పకాలిక బడ్జెట్ ఆమోదానికి కూడా సిద్ధంగా లేరని రిపబ్లికన్లు ఆరోపిస్తున్నారు. ఇమ్మిగ్రేషన్, అమెరికా డ్రీమర్ల పట్ల అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వైఖరిని డెమోక్రాట్లు వ్యతిరేకిస్తుండటంవల్లే ఈ ప్రతిష్ఠంభనకు దారి తీసింది. ఇదిలా ఉండగా అమెరికా ప్రభుత్వంలో సాంకేతిక సమస్యలతో ప్రభుత్వ కార్యాలయాలు మూతపడినా.. తమ కార్యకలాపాలు యథావిధిగా జరుగుతాయని హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ తెలిపింది. వీసా, తదితర సేవల కోసం దరఖాస్తు చేసుకున్నవారు నిర్దేశిత సమయంలో కాన్సులేట్ కార్యాలయానికి హాజరు కావాలని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. న్యూఢిల్లీలోని అమెరికా రాయబార కార్యాలయం కూడా కాన్సులర్ సేవలు యథాతథంగా జరుగుతాయని తెలిపింది. ఇదిలా ఉండగా ద్రవ్య వినిమయ బిల్లు ఆమోదానికి తగు చర్యలు తీసుకునేందుకు ఇరు పక్షాలు ప్రయత్నాలు చేపట్టాయి. తాజా ప్రభుత్వ కార్యాలయాల మూసివేతతో ఫెడరల్ కార్యాలయాల సిబ్బంది వేతనాలు లేకుండానే ఇండ్ల వద్ద నుంచే విధులు నిర్వర్తిస్తున్నారు. రిపబ్లికన్ సెనెటర్ మిచ్ మైక్ కన్నేల్ స్పందిస్తూ సోమవారం ఉదయం లోగా ప్రతిష్ఠంభనకు తెర దించేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. 1990 నుంచి ఇప్పటి వరకు అమెరికాలో ప్రభుత్వ కార్యాలయాలు నాలుగుసార్లు మూతపడ్డాయి.

సయీద్‌పై చర్యల సమీక్ష కోసం

25, 26న పాక్‌కు ఐరాస బృందం

ఇస్లామాబాద్, జనవరి 21: ముంబై ఉగ్రదాడి సూత్రధారి హఫీజ్ సయీద్, ఆయన ఆధ్వర్యంలోని ఉగ్రవాద సంస్థలపై పాకిస్థాన్ చర్యలు తీసుకుంటుందా? లేదా? అన్న అంశాన్ని పరిశీలించేందుకు ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి (యూఎన్‌ఎస్సీ) ఆంక్షల అమలు కమిటీ దృష్టి సారించింది. ఈ నెల 25, 26 తేదీల్లో పాకిస్థాన్‌లో పర్యటించనున్నది. ఉగ్రవాదం అణచివేతకు పాక్ చర్యలు తీసుకోవడం లేదని అమెరికా, భారత్ ఫిర్యాదు చేయడంతోపాటు పరిస్థితిని అంచనా వేసేందుకు యూఎన్‌ఎస్సీ ఆంక్షల కమిటీ పాక్‌లో పర్యటించనున్నదని డాన్ ఒక వార్తా కథనం ప్రచురించింది.

సుప్రీం కేసుల కేటాయింపులో రోస్టర్ విధానం!

న్యూఢిల్లీ, జనవరి 21: సున్నితమైన అంశాలపై దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు, కీలక కేసులను సీనియర్ న్యాయమూర్తుల సారథ్యంలోని బెంచ్‌లకు కేటాయించే విషయమై వచ్చిన సూచనలను సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రా పరిశీలిస్తున్నారు. ఈ క్రమంలో రోస్టర్ విధానం తెరపైకి వచ్చింది. మరింత పారదర్శకంగా కేసుల కేటాయింపు ప్రక్రియ అమలు చేసేందుకు త్వరలో సీజేఐ నిర్ణయం తీసుకుంటారని ఆయన సన్నిహిత వర్గాలు తెలిపాయి. ఇటీవల పలు అంశాలను ప్రస్తావిస్తూ సుప్రీంకోర్టు సీనియర్ న్యాయమూర్తులు సీజేఐపై ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. న్యాయమూర్తులు, సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ ప్రతినిధులతో చర్చించిన తర్వాత కేసుల కేటాయింపునకు స్పష్టమైన రోస్టర్ విధానాన్ని అమలులోకి తేవాలని సీజేఐ నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం.

శత్రువులను విడిచిపెట్టేది లేదు: రాజ్‌నాథ్



లక్నో, జనవరి 21: భారత్ తన శత్రువులపై దాడి చేస్తుందని.. ఆ దాడి స్వదేశంలోగానీ, విదేశంలోగానీ ఎక్కడైనా సరే శత్రులవులను మాత్రం విడిచిపెట్టేదిలేదని కేంద్ర హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. ఇటీవల భారత సైనికులు పాక్ భూభాగంలోకి చొరబడి ముగ్గురు ఆ దేశ సైనికులను హతమార్చడం, వారి స్థావరాన్ని ధ్వంసం చేయడాన్ని పరోక్షంగా ప్రస్తావిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఆదివారం లక్నో పర్యటనలో భాగంగా ఆయన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సరిహద్దు వెంట పాక్ కవ్వింపు చర్యలను ఎట్టిపరిస్థితుల్లో సహించేది లేదని చెప్పారు. ఐదు నెలల కిందట పాకిస్థాన్ సైనికులు 17 మంది భారత జవాన్లను హతమార్చారని, ఈ విషయాన్ని ప్రధాని మోదీ చాలా సీరియస్‌గా తీసుకున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలోనే భారత బలగాలు పాక్ భూభాగంలోకి చొరబడి ఉగ్రవాదులను హతమార్చారని పేర్కొన్నారు. 'భారత్ శక్తిమంతమైన దేశమని ప్రపంచానికి తెలుసు. అలాంటప్పుడు తన సైనికులను చంపుతుంటే చూస్తూ ఊరుకోదు. శత్రువులను కచ్చితంగా అంతమొందిస్తుంది' అని రాజ్‌నాథ్ పేర్కొన్నారు.

మోదీ సామాజిక శాస్త్రవేత్త


రాష్ట్రపతి కోవింద్

అహ్మదాబాద్: మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం అంతరిక్ష శాస్త్రవేత్త అయితే, ప్రధాని మోదీ సామాజిక శాస్త్రవేత్త అని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అభివర్ణించారు. గుజరాత్ యూనివర్సిటీ 66వ స్నాతకోత్సవంలో ఆయన మాట్లాడారు. 21వ శతాబ్దంలో యువత అవకాశాలను అందిపుచ్చుకోవడానికి ప్రధాని మోదీ పలు కార్యక్రమాలను చేపడుతున్నారని తెలిపారు. దేశాభివృద్ధిలో యువత భాగస్వామ్యం కావాలని, మోదీని స్ఫూర్తిగా తీసుకొని జీవితంలో ఎదగాలని కోవింద్ సూచించారు.



కాలుష్యంతోనే 'బ్లడ్ మూన్'

బెంగళూరు, జనవరి 21: అంతరిక్షంలో ఈ నెల 31వ తేదీన ఓ అరుదైన ఘటన చోటుచేసుకోబోతున్నదని నాసా ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నెల 31వ తేదీన సూపర్‌మూన్, బ్లూమూన్‌తోపాటు సంపూర్ణ చంద్రగ్రహణం ఏర్పడనున్నది. గ్రహణ సమయంలో చంద్రుడు పూర్తి ఎరుపు రంగులో కనిపిస్తాడని నాసా తెలిపింది. అందుకే దీనిని 'సూపర్ బ్లడ్‌మూన్' అని కూడా పిలుస్తుంటారు. నిజానికి గ్రహణం సమయంలో చంద్రుడు ఎరుపు రంగులోకి మారడని, వాతావరణ కాలుష్యం కారణంగా కాంతి ఎరుపు రంగులోకి మారుతుందని బెంగళూరులోని జవహర్‌లాల్ నెహ్రూ ప్లానిటోరియం సీనియర్ సైంటిఫిక్ ఆఫీసర్ మధుసూదన్ పేర్కొన్నారు. వాతావరణంలో పేరుకుపోయిన దుమ్ము, ధూళి కారణంగా కాంతి వక్రీభవనం చెంది ఎరుపు రంగులో కనిపిస్తుందన్నారు. కాలుష్యం ఎక్కువగా ఉన్నచోట, సూపర్‌మూన్ సమయంలో మరింత ముదురురంగులో కనిపిస్తుందని వివరించారు. సూపర్‌మూన్ రోజున గ్రహణం ఏర్పడటాన్ని భారతీయులు ఎప్పుడో గుర్తించారని, క్రీ.శ 576లో ఆర్యభట్ట నమోదు చేశారని చెప్పారు. అమెరికావాసులకు 150 ఏండ్ల తర్వాత బ్లడ్‌మూన్ కనిపిస్తున్నదని, భారత్‌లో 1963, 1982లో బ్లడ్‌మూన్ కనిపించిందని చెప్పారు.



'ఆర్‌బీఐ'లో మేనేజర్లు

బెంగళూరులోని భారతీయ రిజర్వ్ బ్యాంక్ నోట్ ముద్రణ్ ప్రైవేట్ లిమిటెడ్ వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ మేనేజర్, పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:

బీఆర్‌బీఎన్‌ఎమ్‌పీఎల్ అనేది రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సంపూర్ణ యాజమాన్య అనుబంధ సంస్థ. దీన్ని 1995 ఫిబ్రవరి 3న ఆర్‌బీఐ ఏర్పాటుచేసింది.

- మొత్తం పోస్టుల సంఖ్య-7
- అసిస్టెంట్ మేనేజర్ (ఇంక్ మ్యానుఫాక్చరింగ్ యూనిట్)-4 పోస్టులు
- **అర్హత:** బ్యాచిలర్ డిగ్రీ (కెమికల్ ఇంజినీరింగ్/పాలీమర్ సైన్స్ అండ్ టెక్నాలజీ/కెమిస్ట్రీ) లేదా డిప్లొమా ఇన్ కెమికల్ ఇంజినీరింగ్‌లో ఉత్తీర్ణత.
- అసిస్టెంట్ మేనేజర్ (రాజభాష)-3 పోస్టులు
- **అర్హత:** మాస్టర్ డిగ్రీ (హిందీ/హిందీ ట్రాన్స్‌లేషన్)లో ఉత్తీర్ణత. డిగ్రీ స్థాయిలో ఇంగ్లిష్ సబ్జెక్టును చదివి ఉండాలి.
- **ఎంపిక:** పర్సనల్ ఇంటర్వ్యూ
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో
- **చివరి తేదీ:** ఫిబ్రవరి 19
- **వెబ్‌సైట్:** www.brbnmpl.co.in

నిట్‌లో ప్రొఫెసర్లు



మణిపూర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్) వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 22 (ప్రొఫెసర్-8, అసోసియేట్/అసిస్టెంట్-14)
- **విభాగాలు:** సివిల్ ఇంజినీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్, మెకానికల్ ఇంజినీరింగ్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్, సెంట్రల్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఫెసిలిటీస్
- **అర్హతలు:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఇంజినీరింగ్, సైన్స్‌లో పీహెచ్‌డీ లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణత. సంబంధిత విభాగంలో అనుభవం ఉండాలి.
- **అప్లికేషన్ ఫీజు:** రూ. 1000/-, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ అభ్యర్థులకు రూ. 500/-
- **ఎంపిక:** ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్‌లో
- **చివరితేదీ:** జనవరి 30
- **వెబ్‌సైట్:** www.nitmanipur.ac.in

ఎన్‌టీపీసీలో

ఎగ్జిక్యూటివ్ ట్రెయినీలు

- ఇంజినీరింగ్ అభ్యర్థులకు అవకాశం
- ఉద్యోగ భద్రత, మంచి జీత భత్యాలు
- గేట్-2018 స్కోర్ + గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక
- చివరితేదీ: జనవరి 31

నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎన్‌టీపీసీ) వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న ఇంజినీరింగ్ ఎగ్జిక్యూటివ్ ట్రెయినీల భర్తీకి అర్హులైన ఇంజినీరింగ్ అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:

ఎన్‌టీపీసీ విద్యుత్ ఉత్పత్తి, పంపిణీ, సహజ వాయువు అన్వేషణ, ఉత్పత్తి, రవాణా చేస్తుంది. దేశ వ్యాప్తంగా 49 ఎన్‌టీపీసీ స్టేషన్లు ఉన్నాయి.



- **పోస్టు పేరు:** ఇంజినీరింగ్ ఎగ్జిక్యూటివ్ ట్రెయినీ
- **పనిచేసే ప్రదేశం:** దేశ వ్యాప్తంగా
- **మొత్తం ఖాళీలు:** 150 పోస్టులు
- **ఎగ్జిక్యూటివ్ ట్రెయినీ విభాగాల వారీగా :**
- ఎలక్ట్రికల్-35 పోస్టులు (జనరల్-20, ఓబీసీ-6, ఎస్సీ-4, ఎస్టీ-5)
- **అర్హత:** ఎలక్ట్రికల్, ఎలక్ట్రికల్ & ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్, ఇన్‌స్ట్రుమెంటేషన్ & కంట్రోల్, పవర్ సిస్టమ్ & హై వోల్టేజ్, పవర్ ఎలక్ట్రానిక్స్, పవర్ ఇంజినీరింగ్‌లో 65 శాతం మార్కులతో ఏఎమ్‌ఐఈ/ఇంజినీరింగ్ డిగ్రీ ఉత్తీర్ణత.
- మెకానికల్-55 పోస్టులు (జనరల్-34, ఓబీసీ-11, ఎస్సీ-6, ఎస్టీ-4)
- **అర్హత:** మెకానికల్, ప్రొడక్షన్, ఇండస్ట్రియల్ ఇంజినీరింగ్, ప్రొడక్షన్ అండ్ ఇండస్ట్రియల్ ఇంజినీరింగ్, థర్మల్, మెకానికల్ & ఆటోమేషన్, పవర్ ఇంజినీరింగ్‌లో 65 శాతం మార్కులతో ఏఎమ్‌ఐఈ/ఇంజినీరింగ్ డిగ్రీ ఉత్తీర్ణత.
- మైనింగ్ - 20 పోస్టులు (జనరల్-9, ఓబీసీ-4, ఎస్సీ-4, ఎస్టీ-3)
- **అర్హత:** మైనింగ్ ఇంజినీరింగ్‌లో 65 శాతం మార్కులతో ఏఎమ్‌ఐఈ/ఇంజినీరింగ్ డిగ్రీ ఉత్తీర్ణత.
- ఎలక్ట్రానిక్స్ & ఇన్‌స్ట్రుమెంటేషన్ - 40 పోస్టులు (జనరల్-21, ఓబీసీ-9, ఎస్సీ-4, ఎస్టీ-3)
- **అర్హత:** ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ & టెలికమ్యూనికేషన్, ఎలక్ట్రానిక్స్ & పవర్, పవర్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ & కమ్యూనికేషన్, ఎలక్ట్రికల్ & ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ ఇన్‌స్ట్రుమెంటేషన్ & కంట్రోల్ ఇంజినీరింగ్‌లో 65 శాతం మార్కులతో ఏఎమ్‌ఐఈ/ఇంజినీరింగ్ డిగ్రీ ఉత్తీర్ణత.
- **పే స్కేల్:** రూ. 24,900-3%-50,500/-ఇతర అలవెన్స్‌లు ఉంటాయి
- **వయస్సు:** 2018 జనవరి 31 నాటికి 27 ఏండ్లకు మించరాదు.
- **ఎంపిక:** గేట్ - 2018 స్కోర్ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసి అభ్యర్థులను గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేస్తారు.
- గేట్ స్కోర్‌కు 85 శాతం, గ్రూప్ డిస్కషన్‌కు 5 శాతం, ఇంటర్వ్యూకు 10 శాతం వెయిటేజీ ఇచ్చి తుది ఫలితాలు ప్రకటిస్తారు.
- **అప్లికేషన్ ఫీజు:** రూ.150/-, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ, ఎక్స్‌సర్వీస్‌మెన్ అభ్యర్థులకు ఫీజు లేదు.
- **ప్రొబేషన్ పీరియడ్:** ఏడాదిపాటు ఉంటుంది. ఈ ట్రెయినింగ్‌లో ప్రతిభ ఆధారంగా దేశంలో ఏక్కడైనా పోస్టింగ్ ఇస్తారు.

- **దరఖాస్తు:** ఆన్‌లైన్ ద్వారా. ఈ- మెయిల్ ఐడీ, మొబైల్ నంబర్‌తోపాటు గేట్ 2018 రిజిస్ట్రేషన్ నంబర్ ఎంటర్ చేయాలి.
- **దరఖాస్తులకు చివరి తేదీ :** జనవరి 31
- **వెబ్‌సైట్ :** www.ntpccareers.net

ఐవోసీఎల్‌లో జూనియర్ ఆపరేటర్లు

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐవోసీఎల్) వెస్టర్న్ రీజియన్ పరిధిలో ఖాళీగా ఉన్న జూనియర్ ఆపరేటర్ (నాన్ ఎగ్జిక్యూటివ్) పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ దేశంలోని ఫార్చ్యూన్ గ్లోబల్ 500 కంపెనీల్లో అతిపెద్ద వాణిజ్య సంస్థ.

- మొత్తం ఖాళీల సంఖ్య: 10 పోస్టులు
- **పోస్టు పేరు:** జూనియర్ ఆపరేటర్ (ఏవియేషన్)
- **అర్హత:** హయ్యర్ సెకండరీ లేదా ఇంటర్‌లో 45 శాతం (ఎస్సీ, ఎస్టీ 40 శాతం) మార్కులతో ఉత్తీర్ణత. వినియోగంలో ఉన్న హెవీ వెహికిల్ డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలి. సంబంధిత రంగంలో ఏడాదిపాటు అనుభవం ఉండాలి.
- **వయస్సు:** 18 నుంచి 26 ఏండ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు ఐదేండ్లు, ఓబీసీలకు మూడేండ్లు, పీహెచ్‌సీలకు పదేండ్ల వరకు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- **పే స్కేల్ :** రూ. 10,500-24,500/-
- **ఎంపిక:** రాతపరీక్ష, స్కిల్ టెస్ట్, స్కిల్ ప్రొఫిషియెన్సీ ఫిజికల్ టెస్ట్ ద్వారా. రాత పరీక్షలో సంస్థ నిర్ణయించిన కనీస అర్హత మార్కులను సాధించాలి.
- **రాతపరీక్ష:** ఆబ్జెక్టివ్ విధానంలో మొత్తం 100 మార్కులకు ఉంటుంది. జనరల్ ఆప్టిట్యూడ్ అండ్ క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్-40, రీజనింగ్ ఎబిలిటీస్-40, బేసిక్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ స్కిల్స్-20 అంశాల నుంచి ప్రశ్నలు వస్తాయి. సమయం 90 ని.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **దరఖాస్తులకు చివరితేదీ:** ఫిబ్రవరి 7
- **రాతపరీక్ష తేదీ:** ఫిబ్రవరి 25
- **వెబ్‌సైట్:** https://www.iocl.com

ఎన్‌ఐఆర్‌డీపీఆర్‌లో

హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీరాజ్ (ఎన్‌ఐఆర్‌డీపీఆర్) ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నది.

వివరాలు:

ఎన్‌ఐఆర్‌డీ అనేది గ్రామీణ అభివృద్ధి, పరిశోధన కోసం హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లో ఏర్పాటు చేశారు.

- అసిస్టెంట్ డైరెక్టర్ (ఫైనాన్స్)-1, ప్రాజెక్ట్ ఆఫీసర్ (అకౌంట్స్)-5, జావా డెవలపర్-1, సిస్టమ్ అడ్మినిస్ట్రేటర్ (లైనక్స్)-1, పీహెచ్‌పీ డెవలపర్స్-2, యూఐ డెవలపర్-1, జావా కమ్ మొబైల్ డెవలపర్-1, బిహేవియర్ చేంజ్ కమ్యూనికేషన్ స్పెషలిస్ట్-1, కంటెన్ట్ మేనేజర్-1, గ్రాఫిక్ డిజైనర్-1, మీడియా ప్లానింగ్ మేనేజర్-1, కన్సల్టెంట్ (ఫైనాన్స్)-1
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో
- **వెబ్‌సైట్:** www.nird.org.in

విద్య, ఉద్యోగ సమాచారం

'ఆయుర్వేద'లో 37 ఖాళీలు

న్యూఢిల్లీలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేద వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న టీచింగ్, అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:



- మొత్తం పోస్టుల సంఖ్య: 37
- టీచింగ్ ఖాళీల సంఖ్య: 12 (ప్రొఫెసర్-5, అసోసియేట్ ప్రొఫెసర్-6, అసిస్టెంట్ ప్రొఫెసర్-1)
- అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్‌ల సంఖ్య: 25
- జాయింట్ డైరెక్టర్-1, ఫైనాన్స్ అడ్వైజర్-1, ప్రిన్సిపాల్ ప్రైవేట్ సెక్రటరీ-1, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్-1, కంప్యూటర్ ప్రోగ్రామర్-1, సీనియర్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్-1, స్టోర్ ఆఫీసర్-1, అకౌంట్స్ ఆఫీసర్-1, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్-1, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్-1, ఫార్మసీ మేనేజర్-1, అసిస్టెంట్ నర్సింగ్ సూపరింటెండెంట్-1, అసిస్టెంట్ స్టోర్ ఆఫీసర్-1, సెక్యూరిటీ ఆఫీసర్-1, ల్యాబ్ టెక్నీషియన్-2, టెక్నికల్ అసిస్టెంట్-8, జూనియర్ ఇంజినీర్ (మెయింటేనెన్స్)-1
- **అర్హత:** సంబంధిత ఆయుర్వేద విభాగంలో మాస్టర్ డిగ్రీలో ఉత్తీర్ణత. ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులకు ఐదేండ్ల అనుభవం ఉండాలి. మిగతా పోస్టులకు వేర్వేరు అర్హతలు ఉన్నాయి.
- **ఎంపిక:** రాతపరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో. దరఖాస్తులను పూర్తిగా నింపి, సంబంధిత పర్సనల్ అధికారికి పంపాలి.
- **చిరునామా:** The Director, All India Instittute of Ayurveda (AIIA) Gautampuri, Sarita Vihar, mathura Road, New Delhi-110076
- **చివరితేదీ:** ఎంప్లాయ్‌మెంట్ న్యూస్ (జనవరి 20-26) వెలువడిన తేదీ నుంచి 21 రోజుల్లోగా దరఖాస్తులను పంపించాలి.
- **వెబ్‌సైట్:** www. aiia.co.in

అక్వాకల్చర్‌లో ట్రెయినీలు

తమిళనాడులోని రాజీవ్ గాంధీ సెంటర్ ఫర్ అక్వాకల్చర్ (ఆర్‌జీసీఏ) వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న ట్రెయినీ (స్పెషల్ డ్రైవ్-ఎస్సీ/ఎస్టీ) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.



వివరాలు:

ఆర్‌జీసీఏ అనేది మెరైన్ ప్రొడక్ట్స్ ఎక్స్‌పోర్ట్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలో పనిచేస్తున్న సంస్థ.

- మొత్తం పోస్టుల సంఖ్య: 35
- విభాగాలవారీగా ఖాళీలు:
- ట్రెయినీ టెక్నికల్ -25
- **అర్హత:** గ్రాడ్యుయేషన్ (సైన్స్, అక్వాకల్చర్)లో ఉత్తీర్ణత.
- ట్రెయినీ ఎలక్ట్రీషియన్ -6
- **అర్హత:** ఎలక్ట్రికల్, మెకానికల్ ఇంజినీరింగ్‌లో డిప్లొమా లేదా ఐటీఐలో ఉత్తీర్ణత.
- ట్రెయినీ సిస్టమ్ అనలిస్ట్-1
- **అర్హత:** కంప్యూటర్ సైన్స్, కంప్యూటర్ అప్లికేషన్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో బ్యాచిలర్ డిగ్రీలో ఉత్తీర్ణత.
- ట్రెయినీ ఇంజినీర్ (సివిల్, ఎలక్ట్రికల్) -3
- **అర్హత:** సివిల్, ఎలక్ట్రికల్, మెకానికల్ ఇంజినీరింగ్‌లో డిప్లొమా లేదా ఐటీఐలో ఉత్తీర్ణత.
- **పే స్కేల్:** రూ. 18,000/- (కన్సాలిడేటెడ్ పే)
- **ఎంపిక:** ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఈ మెయిల్ (rgcaho@gmail.com) ద్వారా ఫిబ్రవరి 8 తేదీలోగా పంపాలి.
- **ఇంటర్వ్యూ తేదీ:** ఫిబ్రవరి 9
- **వెబ్‌సైట్:** www.rgca.org.in